బుధవారం
31•7•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 36
• పేజీలు: 16 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

SHRIRAM City
MONEY WHEN YOU NEED IT MOST
SHRIRAM CITY UNION FINANCE
₹50,00,000 వరకు
మీ ప్రస్తుత వ్యాపార అభివృద్ధి కొరకు రుణాలు
సంప్రదించండి
040 -30915112
లేదా ఏదేని శ్రీరామ్ బ్రాంచిని
www.shriramcity.in



మంగళవారం ముచ్చింతల్‌లోని తన ఆశ్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శాలువాతో సత్కరిస్తున్న త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి. చిత్రంలో ఎంపీ సంతోష్‌కుమార్, మైహోం అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు కూడా ఉన్నారు.



మంగళవారం నిండుకుండలా మారిన జూరాల ప్రాజెక్టు



మంగళవారం కడెం ప్రాజెక్టు వరదగేట్ల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

# కరువుతీరా నీళ్లు

## గోదావరి, కృష్ణానదుల్లో జలకళ

**ప్రాజెక్టులకు పెరుగుతున్న ప్రవాహాలు.. జూరాలకు లక్ష క్యూసెక్కులకుపైగా ఇన్‌ఫ్లో**

**దిగువకు 25వేల క్యూసెక్కుల విడుదల.. రెండురోజుల్లో శ్రీశైలం జలాశయానికి రాక**



మంగళవారం నందిమేడారం పంప్‌హౌస్‌లోని ఐదో నంబర్ మోటర్ ఆన్ చేయడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి బయటకు వస్తున్న జలాలు

## నందిమేడారంలో పొంగిన గంగ

ఐదో మోటర్ వెట్‌రన్ సక్సెస్

డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకిన జలాలు

15కల్లా మిడ్‌మానేరుకు: ఈఎన్సీ వెంకటేశ్వర్లు

3

### కాళేశ్వరం వద్ద గంగమ్మ ఉగ్రరూపం

**మేడిగడ్డ వద్ద రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహం**

**దిగువకు 4.10 లక్షల క్యూసెక్కులు విడుదల**

**కన్నెపల్లి, అన్నారం పంప్‌హౌస్‌లో మోటర్లు బంద్**

**వర్షాలు తగ్గగానే మళ్లీ ఎత్తిపోతలు మొదలు**

### మరో మూడ్రోజులు వర్షాలు

**ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో అల్పపీడనం**

**కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనాలు**

**చురుకుగా కదులుతున్న రుతుపవనాలు**

**ఆగస్టు 4న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం**

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి**

**బరాజ్‌లలో నిల్వలు**

| | |
|---|---|
| మేడిగడ్డ | 7.20 టీఎంసీలు |
| అన్నారం | 8.34 టీఎంసీలు |
| సుందిల్ల | 5.52 టీఎంసీలు |

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిన్నటిదాకా కరువు ఛాయలు! నేడు భవిష్యత్తుపై ఆశలు! ఇప్పటిదాకా వట్టిపోయి కళావిహీనంగా కనిపించిన ప్రాజెక్టులు! ఇప్పుడు చినుకు చినుకు కలిసి.. వరదగా మారి రిజర్వాయర్లలోకి ప్రవేశిస్తున్న జలాలు! మొన్నటిదాకా బండలు తేలిన గంగమ్మ నదీగర్భం! ఇప్పుడు ప్రాణహిత నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు మోటర్లు ఎత్తిపోసిన నీటితో సజీవ జలప్రవంతిగా దర్శనమిస్తున్న అపూర్వ జలదృశ్యాలు! ప్రాజెక్టుల గేట్లు తెరుచుకుని దుంకుతున్న నీళ్లు! గత మూడునాలుగు రోజులుగా ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లతోపాటు.. రాష్ట్రంలో విస్తారంగా కురుస్తున్న వర్షాలతో దృశ్యం మారిపోతున్నది. గోదావరి పరవళ్లకు కృష్ణమ్మ ప్రవాహాలు తోడవుతుండటంతో తెలంగాణలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొన్నది. నిన్నటిదాకా నిరాశ నింపిన కృష్ణమ్మ.. కర్ణాటక ఆనకట్టలను దాటుకుని.. జూరాలకు చేరుకున్నది. అక్కడినుంచి శ్రీశైలం జలాశయానికి పయనమైంది. రెండురోజుల వ్యవధిలో శ్రీశైలాన్ని కృష్ణమ్మ పలుకరించనున్నది. మరోవైపు ఇప్పటిదాకా గరిష్ఠంగా 20వేల క్యూసెక్కుల ప్రవాహాలనే చూసిన మేడిగడ్డ.. ఇప్పుడు ఏకంగా రెండు లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని ఆస్వాదిస్తున్నది. ఇంద్రావతి ఉధృతి కూడా పెరుగటంతో పేరూరు వద్ద ప్రవాహం రెండున్నర లక్షల క్యూసెక్కులను దాటింది. వాటికిపైన కడెం ప్రాజెక్టు గర్జిస్తున్నది. కడెం- ఎల్లంపల్లి మధ్యలోకూడా వరద తోడవటంతో ఎల్లంపల్లి జలాశయానికి నీరు చేరుకుంటున్నది. రెండు ప్రధాన నదులకుతోడు తెలంగాణలోని వాగులు వంకలు ఉరకలేస్తుండటంతో అన్ని ముఖ్యమైన ప్రాజెక్టులు క్రమంగా జలకళను సంతరించుకుంటున్నాయి. దీనికితోడు రానున్న మూడ్రోజుల్లో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తేలికపాటినుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ విభాగం అందించిన తీపి కబురుతో రైతన్న మది సంతోషంతో నిండిపోయింది. తెలంగాణతోపాటు ఎగువన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ లలో కూడా రానున్న 48 గంటల

మిగతా 8వ పేజీలో

# యాదాద్రిలో మహా సుదర్శనయాగం

**వంద ఎకరాల యజ్ఞవాటికలో నిర్వహణకు సీఎం కేసీఆర్ నిర్ణయం**

**ముచ్చింతల్‌లో ఆశ్రమానికి వెళ్లి త్రిదండి చినజీయర్‌స్వామితో చర్చలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** యాదాద్రిలో త్వరలో మహా సుదర్శనయాగాన్ని నిర్వహించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నిర్ణయించారు. మంగళవారం ఆయన హైదరాబాద్ శివారులోని ముచ్చింతల్‌లో త్రిదండి శ్రీమన్నారాయణ చినజీయర్‌స్వామి ఆశ్రమానికి వెళ్లి ఈ యాగం నిర్వహణ, ఏర్పాట్లపై చర్చించారు. యాదాద్రిలో 100 ఎకరాల యజ్ఞవాటికలో 1,048 యజ్ఞగుండాలతో ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. మూడువేల మంది రుత్విక్కు లు, మరో మూడువేల మంది సహాయకులతో ఈ మహాయాగాన్ని వైభవంగా నిర్వహించాలని సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి నిర్ణయించారు. భారత్‌లోనివే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైష్ణవ పీఠాలు, బద్రీనాథ్, శ్రీరంగం, పూరి జగన్నాథ్, తిరుపతి లాంటి మహాక్షేత్రాల నుంచి మతాధిపతులను, కేంద్ర ప్రభుత్వ పెద్దలను, అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గవర్నర్లు, మంత్రులను, అన్ని సంప్రదాయాలకు చెందిన మతాల గురువులను ఈ యాగానికి ఆహ్వానించనున్నారు. ఈ యాగానికి లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశమున్నందున వారికి విస్తృతమైన ఏర్పాట్లుచేసే అంశంపై కూడా సీఎం కేసీఆర్, చినజీయర్‌స్వామి చర్చించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌ను చినజీయర్‌స్వామి ఆశీర్వదించారు. శాలువాతో సత్కరించి, రామానుజులవారి విగ్రహాన్ని బహూకరించారు. సీఎం కేసీఆర్‌తోపాటు ఎంపీ సంతోష్ కుమార్‌ను కూడా చినజీయర్‌స్వామి ఆశీర్వదించారు. సీఎం కేసీఆర్ వచ్చినప్పుడు 'మైహోం' సంస్థ అధినేత జూపల్లి రామేశ్వర్‌రావు తదితరులు కూడా ఆశ్రమంలో ఉన్నా రు. వారు కూడా చినజీయర్‌స్వామిని కలిశారు.



రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం గుర్రంగూడలో అర్బన్ ఫారెస్ట్ పార్కు 'సంజీవని'ని ప్రారంభించి సైక్లింగ్ చేస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

## వానల దన్నుతో ముమ్మరంగా హరితహారం

**రాష్ట్రమంతటా కొనసాగించాలని కలెక్టర్లకు సీఎస్ జోషి ఆదేశం**

**సామాజిక బాధ్యతతో అందరూ భాగస్థులవ్వాలని పిలుపు**

**సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

4

## కేఫ్ కాఫీ డే అధినేత సిద్ధార్థ అదృశ్యం

**నేత్రావతి నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టుగా సమాచారం**

**ముమ్మరంగా గాలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్**

11




కర్ణాటక మాజీ సీఎం ఎస్‌ఎం కృష్ణ అల్లుడు సిద్ధార్థ

# ట్రిపుల్ తలాక్‌కు చెల్లు

## వివాదాస్పద బిల్లుకు పార్లమెంట్ ఆమోదం.. మోదీ సర్కారుకు భారీవిజయం

**రాజ్యసభలో గట్టెక్కిన బిల్లు ▪ అనుకూలంగా 99, వ్యతిరేకంగా 88 ఓట్లు**

**బిల్లుకు మద్దతునిచ్చిన బీజేడీ ▪ వాకౌట్ చేసిన మిత్రపక్షాలు జేడీయూ, అన్నాడీఎంకే**

**కలిసొచ్చిన విపక్ష సభ్యుల గైర్హాజరు ▪ మధ్యయుగాలనాటి ఆచారం చెత్తబుట్టలో పడిందన్న మోదీ**

**ముస్లింలపై జరుగుతున్న అనేక దాడుల్లో ఇదొకటి: అసదుద్దీన్ ఒవైసీ**



రాజ్యసభలో ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందిన తర్వాత విజయసంకేతం చూపుతున్న కేంద్రమంత్రి రవిశంకర్ ప్రసాద్

**న్యూఢిల్లీ, జూలై 30:** నరేంద్రమోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వివాదాస్పద ట్రిపుల్ తలాక్ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించింది. ఏకకాలంలో మూడుసార్లు తలాక్ చెప్పడం ద్వారా విడాకులిచ్చే పద్ధతిని క్రిమినల్ నేరంగా పరిగణించే ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు-2019కు మంగళవారం రాజ్యసభ అంగీకారం తెలిపింది. బీజేడీ మద్దతుగా నిలువడం, మిత్రపక్షాలు జేడీయూ, అన్నాడీఎంకే వాకౌట్ చేయడం, పలువురు విపక్ష సభ్యుల గైర్హాజరు నేపథ్యంలో ప్రతిపక్షాల ఆధిక్యత ఉన్న పెద్దల సభలో అధికార బీజేపీ సునాయాసంగా గట్టెక్కింది. గతవారమే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలుపగా, తాజాగా రాజ్యసభ కూడా అంగీకారం తెలిపింది. బిల్లుకు అనుకూలంగా 99, వ్యతిరేకంగా 88 ఓట్లు వచ్చాయి. రాజ్యసభలో అధికార ఎన్డీయేకు తగినంత సంఖ్యాబలం లేకపోయినప్పటికీ విపక్ష కాంగ్రెస్, ఎస్పీ, బీఎస్పీకి చెందిన పలువురు సభ్యులతోపాటు టీఆర్‌ఎస్‌కు చెందిన ఆరుగురు సభ్యులు, వైసీపీకి చెందిన ఇద్దరు సభ్యుల గైర్హాజరు కలిసొచ్చింది. రాష్ట్రపతి రామ్‌నాథ్‌కోవింద్

మిగతా 5వ పేజీలో

**ఆగస్టు 13 నుంచి 22 వరకు**

## ఎడ్‌సెట్ కౌన్సెలింగ్

**13 నుంచి 20 వరకు సర్టిఫికెట్ల పరిశీలన**

**14 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక**

**ఆగస్టు 5న కౌన్సెలింగ్ నోటిఫికేషన్ విడుదల**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఆగస్టు 13 నుంచి 22 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్టు ఎడ్‌సెట్-2019 కౌన్సెలింగ్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు చెప్పారు. కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఆగస్టు ఐదున విడుదలచేస్తామని తెలిపారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో ఎడ్‌సెట్ అడ్మిషన్ కమిటీ సమావేశమై.. కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఖరారుచేసిందని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 13 నుంచి 20 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అదేనెల 14 నుంచి 22 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఉంటుందని రమేశ్‌బాబు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌లో పాల్గొనడానికి సాధారణ విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.800, ఎస్సీ, ఎస్టీలకు 500 ఫీజుగా నిర్ణయించామని తెలిపారు. పూర్తి వివరాల కోసం http://edcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

**ఆగస్టు 13 నుంచి**

## పీఈసెట్ కౌన్సెలింగ్

**షెడ్యూల్ ఖరారుచేసిన అడ్మిషన్ కమిటీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ఆగస్టు 13 నుంచి పీఈసెట్-2019 కౌన్సెలింగ్ ప్రారంభించనున్నట్టు కౌన్సెలింగ్ అడ్మిషన్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లో అడ్మిషన్స్ కమిటీ సమావేశమై షెడ్యూల్‌ను ఖరారుచేసిందని తెలిపారు. పీఈసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఆగస్టు ఆరోతేదీన విడుదల చేస్తామని తెలిపారు. ఆగస్టు 13 నుంచి 16 వరకు సర్టిఫికెట్ల పరిశీలన, అదేనెల 14 నుంచి 17 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. అందుకోసం రాష్ట్రవ్యాప్తంగా రెండు సహాయకేంద్రాలను ఏర్పాటుచేశామని చెప్పారు. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ఫీజు రూ.800గా, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 500గా నిర్ణయించామని తెలిపారు. పూర్తి వివరాలకు http://peccet.tsche.ac.in వెబ్‌సైట్‌ను చూడాలని కోరారు.




**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 314.00 | రంగారెడ్డి | 314.00 |
| మెదక్ | 314.00 | కరీంనగర్ | 317.00 |
| వరంగల్ | 317.00 | చిల్లర ధర | 3.74 |

**ధర్మగంట**

## లావుణి పట్టాలు లాక్కున్నారు

**గిరిజనుల పట్టాలు రద్దుచేసిన రెవెన్యూ అధికారులు**

**మహబూబ్‌నగర్ జిల్లా కొత్తచెల్కతండా గిరిజన రైతుల ఆవేదన**

'కొండ నాలుకకు మందేస్తే.. ఉన్న నాలుక ఊడింది' అన్న చందంగా ఉన్నది నవాబ్‌పేట రెవెన్యూ అధికారుల తీరు. ఏండ్లుగా సాగుచేసుకుంటున్న భూమికి సంబంధించి పట్టాలు సరిచేస్తామని చెప్పి.. ఉన్న పట్టాలను ఊడబీకారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న, తండ్రుల పేరిట ఉన్న భూములను కొడుకులకు పట్టా చేయకుండా వేధిస్తున్నారు. సర్వేనంబర్‌లో భూమి అధికంగా ఉన్నదంటూ.. పట్టాలో ఉన్నదానికి, కాస్తులో ఉన్నభూమికి మధ్యఉన్న తేడాలను సరిచేస్తామంటూ ఏడాదిన్నరకాలంగా సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. తమపేర పట్టా చేయడంతోపాటు, కొత్త పాస్ పుస్తకం అందజేయాలని కోరుతూ మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తీగల్‌పల్లి పంచాయతీ కొత్తచెల్క తండాకు చెందిన గిరిజనులు ధర్మగంటను ఆశ్రయించారు.

9

### అచ్చంపేటపట్టిలో జేసీ విచారణ

'ఎకరం రూ.20 వేలకే..!' కథనానికి స్పందన





మంగళవారం కాంగ్రెస్ నేత ముఖేశ్‌గౌడ్ అంతిమయాత్ర దృశ్యం.. గౌరవ సూచకంగా గాలిలోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

## ముఖేశ్‌గౌడ్‌కు అంతిమ వీడ్కోలు

**అంతిమయాత్రకు భారీగా తరలిన ప్రజలు.. నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు**

**అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి**

2

## నేడు దేశవ్యాప్తంగా వైద్యుల సమ్మె

**జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఐఎంఏ పిలుపు**

5



హైదరాబాద్ శివారు ముచ్చింతల్‌లోని చినజీయర్‌స్వామి ఆశ్రమానికి మంగళవారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతోపాటు వెళ్లిన ఎంపీ సంతోష్‌కుమార్‌కు ఆశీస్సులు అందజేస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి

## గజ్వేల్ ఏరియా దవాఖానకు 51 పోస్టులు

- అనుమతిస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ద్వారా తెలంగాణ వైద్యవిధాన పరిషత్ కమిషనర్ పరిధిలోని గజ్వేల్ ఏరియా దవాఖానకు 51 పోస్టులను అనుమతిస్తూ ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కే రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. కాంట్రాక్టు పద్ధతిన 10 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, ఔట్ సోర్సింగ్ విధానంలో 41 ఇతర క్యాటగిరీ పోస్టులను భర్తీచేయాలని ఉత్తర్వులో సూచించారు. ఔట్ సోర్సింగ్‌లో స్టాఫ్‌నర్స్ 18, ఏఎన్‌ఎం నాలుగు, ఫార్మసిస్ట్ గ్రేడ్-2 మూడు, ల్యాబ్ టెక్నీషియన్ మూడు, రేడియోగ్రాఫర్ ఒకటి, డార్క్‌రూమ్ అసిస్టెంట్ ఒకటి, ల్యాబ్ అటెండెంట్, థియేటర్ అసిస్టెంట్, ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వో రెండు చొప్పున, మూడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి అనుమతిచ్చారు.

## గ్రూప్-2 ఇంటర్వ్యూ అర్హులకు ప్రత్యేక శిక్షణ

గిరిజన సంక్షేమశాఖ దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌పీఎస్సీ నిర్వహించే గ్రూప్-2 ఇంటర్వ్యూలకు అర్హత సాధించిన గిరిజన అభ్యర్థులకు ప్రత్యే క శిక్షణ ఇవ్వనున్నట్టు గిరిజన సంక్షేమశాఖ కమిషనర్ క్రిస్టినా ఝడ్ చోంగ్తూ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు బుధవారం వరకు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక ప్రక్రియను ఆగస్టు ఒకటి నుంచి ఐదు వరకు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

## వైద్య, కార్మికశాఖల్లో పదోన్నతులు

22 మంది అధికారుల ప్రమోషన్‌కు డీపీసీ ఆమోదం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్యఆరోగ్య, కార్మికశాఖల్లో 22 మంది అధికారుల పదోన్నతులకు డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) ఆమోదం తెలిపింది. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు అజయ్‌మిశ్రా, సురేశ్ చందా, అధర్‌సిన్హాలతో కూడిన కమిటీ మంగళవారం సచివాలయంలో సమావేశమైంది. కార్మికశాఖకు చెందిన డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్, వైద్య ఆరోగ్యశాఖలో ఇద్దరు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్లు, ఏడుగురు పాథాలజీ ప్రొఫెసర్లు, ఇద్దరు మైక్రోబయాలజీ ప్రొఫెసర్లు, జనరల్ సర్జరీ ప్రొఫెసర్ ఒకరు, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ ఒకరు, డెర్మటాలజీ ప్రొఫెసర్ ఒకరు, ఫిజియాలజీ ప్రొఫెసర్లు ఇద్దరు, ఎస్పీఎం ప్రొఫెసర్లు ఇద్దరు, పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ ఒకరు, టీబీ అండ్ సీడీ ప్రొఫెసర్ ఒకరు, పీడియాట్రిక్ సర్జన్ ఒకరికి పదోన్నతులు ఇవ్వడానికి డీపీసీ ఆమోదం తెలిపింది.



## 'ఆసరా' పింఛన్ల పంపిణీ దాదాపు పూర్తి

- ఇప్పటివరకు 92% మందికి సొమ్ము పంపిణీ
- నగదు ఇబ్బందుల వల్ల కొన్నిచోట్ల ఆలస్యం
- లబ్ధిదారులకు వచ్చేవారం మరో పింఛన్



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో 'ఆసరా' లబ్ధిదారులకు రెట్టింపైన పింఛన్ల సొమ్ము పంపిణీ దాదాపుగా పూర్తయింది. ఈ నెల 22 నుంచి ప్రారంభమైన ఈ పంపిణీ కార్యక్రమం.. మంగళవారం నాటికి 92 శాతం పూర్తయింది. రాష్ట్రంలోని 38.99 లక్షల మంది 'ఆసరా' లబ్ధిదారుల పింఛన్ సొమ్మును సీఎం కేసీఆర్ రెట్టింపు చేసిన విషయం విదితమే. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఈ నెల 20 నుంచి ఈ పింఛన్ల మంజూరు పత్రాలను పండుగ వాతావరణంలో పంపిణీచేయడంతో ఈ నెల 22 నుంచి బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ మొదలైంది. లబ్ధిదారుల్లో ఎక్కువ మందికి బ్యాంకుల ద్వారా, కొంతమందికి పోస్టాఫీసుల ద్వారా, 256 మందికి నేరుగా పింఛన్ల సొమ్మును అందజేశారు. ఇప్పటివరకు బ్యాంకుల ద్వారా 97 శాతం, పోస్టాఫీసుల ద్వారా 90 శాతం, మొత్తంమీద 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని, కొన్నిచోట్ల నగదు ఇబ్బందుల కారణంగా లబ్ధిదారులకు సొమ్ము పంపిణీ ఆలస్యమవుతున్నదని అధికారులు తెలిపారు. ఈ నెలలో రెండు (మే, జూన్ నెలల) పింఛన్లను అందుకొని సంబురాల్లో మునిగిపోయిన 'ఆసరా' లబ్ధిదారులకు వారం రోజుల్లో జూలై నెల పింఛన్ సొమ్ము కూడా అందనున్నది. యూసీలను సమర్పించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం జూలై పింఛన్లను విడుదల చేయనున్నది. 'ఆసరా' పింఛన్లతో జీవనం సాగిస్తున్న అభాగ్యులకు సొమ్ము పంపిణీలో ఇబ్బందులు తలెత్తకూడదన్న భావనతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించిన విషయం తెలిసిందే.

# కేంద్రానిది రహస్య ఎజెండా

- విద్యపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలి
- రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం ఊరికే నిధులు ఇవ్వడంలేదు
- జాతీయ విద్యావిధానం ముసాయిదాలో స్పష్టత లేదు
- ఎన్‌ఈపీ-2019పై చర్చలో విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్
- త్వరలో విద్యావిధానంపై వర్క్‌షాప్ నిర్వహిస్తామని వెల్లడి




మంగళవారం హైదరాబాద్‌లోని అస్కిలో ఎన్‌ఈపీ ముసాయిదాపై నిర్వహించిన చర్చలో ప్రసంగిస్తున్న విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్సీలు రఘోత్తంరెడ్డి, నర్సిరెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమ గురుకులాల సొసైటీ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్ కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్రప్రభుత్వం రూపొందించిన జాతీయ విద్యావిధానం(ఎన్‌ఈపీ)-2019 ముసాయిదాలో స్పష్టత లేదని, ఇందులో కుట్రలు చేసే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి అనుమానం వ్యక్తంచేశారు. దీని వెనుక రహస్య ఎజెండా దాగి ఉన్నదని, విద్యావిధానం ప్రగతిశీలకంగా ఉండాలే తప్ప ప్రమాదకరంగా ఉండకూడదని సూచించారు. విద్యావిధానంపై రాష్ట్రాలకు స్వేచ్ఛ ఉండాలని, కానీ కేంద్రానికి ఆ ఉద్దేశం ఉన్నట్టుగా కనిపించడం లేదని చెప్పారు. విద్యను వికేంద్రీకరణ నుంచి కేంద్రీకరణ దిశగా తీసుకువెళ్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఎన్‌ఈపీ ముసాయిదాపై విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని అస్కిలో నిర్వహించిన చర్చకు జగదీశ్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీల్లో పరిశోధనలు చేయడానికైనా ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థిలో శాస్త్రీయ దృక్పథం ఉండాలని, కానీ నైపుణ్యాలు పెంచడానికే ప్రాధాన్యం ఇవ్వాలనడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రాథమిక విద్యలో విద్యార్థికి చదువు రావాలంటే, ఉపాధ్యాయులకు నైపుణ్యాలు ఉండాలని.. అప్పుడు విద్యార్థులకూ అబ్బుతాయన్నారు. ఫలితంగా ఉన్నత విద్యాభ్యాసం తర్వాత విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు ప్రాథమిక విద్యస్థాయిలోనే పునాది పడుతుందని చెప్పారు. అంతేకాని పిల్లలంతా రెంచ్‌లు పట్టుకోవాలనడం సమంజసం కాదని విమర్శించారు. చదువు జీతం కోసమే కాదని, జీవితం కోసమనే విషయాన్ని విస్మరించవద్దని చెప్పారు. ప్రాథమిక విద్యావిధానాన్ని బలోపేతం చేయకుండా ఉన్నతవిద్యను బలోపేతం చేస్తే ఫలితాలు రావని అభిప్రాయపడ్డారు.

### కేంద్ర, రాష్ట్రాల పాత్రపై చర్చ జరుగాలి

విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసం కలిగించేలా విద్యావిధానం ఉండాలని, కానీ ఎన్‌ఈపీ ముసాయిదా దీనికి భిన్నంగా ఉన్నదని మంత్రి జగదీశ్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. విద్యపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర ఏమిటనే విషయంపైనా చర్చ జరుగాలని కోరారు. రాష్ట్రాల సంస్కృతి, సంప్రదాయాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. రాష్ట్రాలకు కేంద్రం ఊరికే నిధులు ఇవ్వడం లేదని, రాష్ట్రాల నుంచి సెస్సు వసూలు చేస్తున్నదని గుర్తుచేశారు. కేంద్రంలో ఒకరు ఒక విధానాన్ని అమలుచేస్తే.. మరొకరు రద్దుచేసి, కొత్తది అమలుచేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రం నిర్ణయాలను రాష్ట్రాలపై బలవంతంగా రుద్దే ప్రయత్నం జరుగుతున్నదని, మోడల్ స్కూల్ విధానం ఒక ఉదాహరణ అని వివరించారు. దీనిపై సమగ్రంగా చర్చ జరుగాల్సి ఉందని, అందుకోసమే ఎన్‌ఈపీ డ్రాఫ్ట్‌పై అభిప్రాయాలు పంపడానికి నెలరోజులు గడువు కోరామని తెలిపారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జాతీయ విద్యావిధానం ఉండాలని కోరారు. అందరి ఆకాంక్షలకు అనుగుణంగానే రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సంక్షేమరంగానికి పెద్దపీట వేశారని తెలిపారు. తర్వాత వ్యవసాయ రంగంపై దృష్టి పెట్టి సాగునీటి ప్రాజెక్టులు నిర్మించారని పేర్కొన్నారు. ఇప్పుడు విద్య, వైద్యంపై దృష్టి పెట్టారని.. త్వరలో విద్యావిధానంపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్టు మంత్రి తెలిపారు.

### ఎన్‌ఈపీపై విద్యావంతుల అసంతృప్తి

కొత్తసీసాలో పాత సారా అన్నట్టుగా ఎన్‌ఈపీ ఉన్నదని బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. విద్యావిధానంలో రాష్ట్రాలకు స్వయంప్రతిపత్తిపై ప్రస్తావన లేదని అసంతృప్తి వ్యక్తంచేశారు. నిధుల కేటాయింపులపై ప్రస్తావన చేయకుండా ఎన్‌ఈపీని తీసుకురావడంలో అర్థంలేదని ఎమ్మెల్సీ నర్సిరెడ్డి అభిప్రాయపడ్డారు. జాతీయసమైక్యత దెబ్బతినకుండా విద్యావిధానం ఉండాలని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి సూచించారు. ప్రీప్రైమరీ విద్యను, ప్రాథమికవిద్యను అనుసంధానం చేస్తే డ్రాపౌట్స్ తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. జాతీయ విద్యావిధానం వస్తే ఉన్నత విద్యాకాలేజీలకు అఫిలియేషన్ విధానం ఉండదని, అన్నీ అటానమస్ కాలేజీలు వస్తాయని ఉన్నత విద్యామండలి సభ్యుడు ఓఆర్‌రెడ్డి చెప్పారు. కానీ ఇది సాధ్యం కాదన్నారు. విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి, ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి, వైస్‌చైర్మన్ లింబాద్రి, వెంకటరమణ, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్, ఎస్సీ సంక్షేమ గురుకులాల సొసైటీ సెక్రటరీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఇంటర్మీడియట్ విద్యాశాఖ కమిషనర్ ఏ అశోక్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్, సీనియర్ ప్రొఫెసర్లు, మేధావులు, టీచర్లు, విద్యార్థినులు ఎన్‌ఈపీపైచర్చలో పాల్గొని అభిప్రాయాలు వ్యక్తంచేశారు.

## సీఎస్‌ఆర్ వెబ్‌పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి జగదీశ్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖకు చెందిన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్‌ఆర్) వెబ్‌పోర్టల్‌ను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. బంజారాహిల్స్‌లోని 'అస్కి'లో మంగళవారం జరిగిన ఒక కార్యక్రమంలో మంత్రి ఆ పోర్టల్‌ను ప్రారంభించారు. ప్రభుత్వం పాఠశాలలను బలోపేతం చేసే క్రమంలో వసతి సదుపాయాలు, నాణ్యమైన విద్య అందించడానికి కార్పొరేట్ సంస్థల నుంచి సహాయాన్ని కోరుతున్నామని పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్ రెడ్డి తెలిపారు. వ్యక్తిగతంగా, సంస్థలు, పరిశ్రమల నుంచి విరాళాలు కోరుతున్నామని విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్, సైన్స్ ల్యాబ్, మరుగుదొడ్లు, వంటగది, తాగునీరు, ప్రహరీ, అదనపు తరగతి గదులు, విద్యుచ్ఛక్తి, బెంచీల వంటి సదుపాయాలు ఏర్పాటుచేయడానికి విరాళాలను స్వీకరిస్తామని తెలిపారు. విరాళాలు ఇచ్చిన దాతల వివరాలు కూడా పబ్లిక్ డొమైన్‌లో ఉంచుతామని, ఈ విరాళాల కోసం ప్రత్యేకంగా ఒక బ్యాంకు ఖాతాను తెరిచామని చెప్పారు.

## చట్టాల అనుసంధానంతో సమస్యలు అనేకం

- వాటిని ఎలా పరిష్కరిస్తారు?
- లోక్‌సభలో టీఆర్‌ఎస్‌పక్షనేత నామా నాగేశ్వరరావు ప్రశ్న



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కార్మికులకు చెందిన నాలుగు కీలక చట్టాలను అనుసంధానిస్తే తలెత్తే సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పాలని లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్షనేత నామా నాగేశ్వరరావు కేంద్రప్రభుత్వాన్ని కోరారు. వేతనాల చెల్లింపు చట్టం, కనీస వేతనచట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమానవేతనాల చట్టాలను అనుసంధానిస్తూ ఒకటే బిల్లును తీసుకువచ్చే అంశంపై మంగళవారం లోక్‌సభలో ఆయన మాట్లాడారు. వేర్వేరు స్వభావాలు కలిగిఉన్న ఈ నాలుగింటినీ అనుసంధానిస్తే అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నదని.. వాటిని ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఇండియన్ ఎయిర్‌లైన్స్, ఎయిర్ ఇండియాలను విలీనం చేశాక ఉద్యోగుల విషయంలో తలెత్తిన సమస్యలను పరిష్కరించడానికి నాలుగేండ్లకుపైగా పట్టిందని ఈ సందర్భంగా సభ దృష్టికి తీసుకొచ్చారు. అసంఘటిత రంగంలో పనిచేసేవారి బాగోగులకు ప్రాధాన్యమివ్వడం శుభపరిణామమన్నారు. కేంద్రప్రభుత్వ ఉద్యోగాలు ఎన్నో ఉన్నప్పటికీ కాంట్రాక్ట్ ఉద్యోగులను తీసుకోవడమెందుకని ప్రశ్నించారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం ప్రభుత్వం ఇచ్చేనిధులు కాంట్రాక్టర్ల నుంచి వారికి సరిపడా అందుతున్నాయో లేదో చూడాలన్నారు. తెలంగాణ ప్రభుతం సింగరేణి ఉద్యోగులకు పెద్దమొత్తంలో బోనస్ ఇస్తున్నదని, ఉద్యోగులకు ఇచ్చే బోనస్ మరింత ఉత్సాహంతో పనిచేసేలా ఉండాలని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని కోరారు. అలాగే కార్మికుల సలహా మండలిని ఏర్పాటుచేసి, రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

### ముహూర్తం

సూర్యోదయం: 5.59 గంటలకు

సూర్యాస్తమయం: 6.46 గంటలకు


వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, కృష్ణపక్షం, చతుర్దశి ఉదయం 11.59 వరకు, తదుపరి అమావాస్య, నక్షత్రం: పునర్వసు మధ్యాహ్నం 2.41 వరకు, తదుపరి పుష్యమి, అమృత ఘడియలు: మధ్యాహ్నం 12.30 నుంచి 2.06 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 12.22 నుంచి 1.58 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.57 నుంచి మధ్యాహ్నం 12.48 వరకు, వర్జ్యం: రాత్రి 9.52 నుంచి 11.28 వరకు.

## దళితులకు విదేశీ విద్యావకాశం

రేపు విద్యార్థుల ఎంపిక ప్రక్రియ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి దరఖాస్తుచేసుకున్న విద్యార్థుల ఎంపిక గురువారం (ఆగస్టు ఒకటి) నిర్వహించనున్నట్టు ఎస్సీ అభివృద్ధిశాఖ డైరెక్టర్ పీ కరుణాకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26న ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని, 52 మందికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటివరకు 442 మంది ఎస్సీ విద్యార్థులకు విదేశాల్లో చదువుకోనేందుకు రూ. 70 కోట్లు ఆర్థికసాయం అందించినట్టు కరుణాకర్ వివరించారు.

### లోకం పోకడ




హలో, యెడియూరప్పా.. నేను వాడగా మిగిలిన తలనొప్పి మాత్రలు, అమృతాంజనం పైసొరుగులోనే ఉంచాను.. చూసుకో!

### ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు జాబితాలు విడుదల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపు జాబితాలను విడుదలచేసినట్టు కాళోజీ వైద్య వర్సిటీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. క్యాటగిరీవారీగా కన్వీనర్ కోటా కింద రెండువిడుతల్లో కేటాయించిన సీట్ల వివరాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు www.knruhs.in, www.knruhs.telangana.gov.in వెబ్‌సైట్‌లో పరిశీలించుకోవచ్చని పేర్కొన్నది.



మంగళవారం జూరాల ప్రాజెక్టు వద్ద జాలర్లకు చిక్కిన చేపను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

## పాలమూరును సస్యశ్యామలం చేస్తాం

- త్వరితగతిన పాలమూరు-రంగారెడ్డి పూర్తి
- ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- జూరాల కుడికాల్వకు సాగునీరు విడుదల
- నెట్టెంపాడు ఫేజ్-1, 2 పంపులు ప్రారంభం

**జోగుళాంబ గద్వాల జిల్లా ప్రతినిధి/ ఆత్మకూరు, నమస్తే తెలంగాణ:** ఎగువ నుంచి వస్తున్న కృష్ణా జలాలతో ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జూరాలకు వచ్చే వరద నీటితో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని చెప్పారు. మంగళవారం ఆయన జూరాల ప్రాజెక్టు ఎన్టీఆర్ ఎడమకాల్వకు సాగునీటిని విడుదల చేయడంతోపాటు, నెట్టెంపాడు లిఫ్ట్‌ను ప్రారంభించారు. గుడ్డెందొడ్డి వద్ద ఫేజ్-1లో 750 కెపాసిటీ గల రెండు పంపులను ప్రారంభించారు. ఆయా చోట్ల మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి రైతాంగానికి సాగునీటిని అందిస్తున్నారని తెలిపారు. గడిచిన రెండు, మూడేండ్లుగా నెట్టెంపాడు ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 11టీఎంసీలను ఎత్తిపోసి రిజర్వాయర్లు, చెరువులను నింపుతున్నట్టు చెప్పారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో వలసలు వాపస్ వచ్చేలా ప్రాజెక్టులను తీర్చిదిద్దుతున్నామన్నారు. త్వరలోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి 100టీఎంసీల నీటిని అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, వీఎం అబ్రహం, జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, మాజీచైర్మన్ బండారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సాగుకు సన్నద్ధం కావాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి
- కడెం వరద గేట్లు ఎత్తి నీటివిడుదల



కడెం జలాశయం వద్ద నీటి విడుదల తర్వాత గంగకు పూలు సమర్పిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

**కడెం:** నిర్మల్ జిల్లాలో నిరంతరాయంగా కురుస్తున్న వర్షాలకు కడెం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకున్నదని, రైతులు సాగుకు సన్నద్ధం కావాలని దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం నిర్మల్ కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ శశిధర్ రాజ్, జెడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌తో కలిసి కడెం జలాశయాన్ని సందర్శించారు. వరదగేట్ల వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం ఆరుగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదలచేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మంగళవారం ఎగువ నుంచి 49,747 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కిందిప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. కడెం ఆయకట్టు పరిధిలో నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని ఏడు మండలాల రైతాంగానికి మేలుచేయడంతోపాటు, అదనంగా వచ్చే వరదనీటిని గేట్ల ద్వారా గోదావరి గుండా మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి జలాశయానికి తరలించనున్నట్టు తెలిపారు.

## ఉపసర్పంచ్‌లకు చెక్‌పవర్ ఉండాల్సిందే

- మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పాలమూరు ఉపసర్పంచ్‌ల వినతి



తమకు కూడా చెక్‌పవర్ ఇవ్వాలని కోరుతూ మంగళవారం మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆ జిల్లా ఉపసర్పంచ్‌లు

**మహబూబ్‌నగర్, నమస్తే తెలంగాణ:** తమకు చెక్‌పవర్ ఉంచాలని ఉపసర్పంచ్‌లు.. ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. మహబూబ్‌నగర్‌లో మంగళవారం లోని ఉపసర్పంచ్‌లు సమావేశమయ్యారు. అనంతరం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి తమ ఆవేదనను తెలియజేశారు. ఉపసర్పంచ్‌లకు చెక్‌పవర్ ఉంటుందని ఎన్నికలకంటే ముందు రాష్ట్రప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. గ్రామాభివృద్ధిలో తమకు ప్రాధాన్యం యథావిధిగా కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం చెప్పినట్టు ఉపసర్పంచ్‌లకు సర్పంచ్‌తో సమానంగా చెక్‌పవర్ కొనసాగించాలని మంత్రికి విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఆయాగ్రామాల ఉపసర్పంచ్‌లు శిరీష ప్రవీణ్ గౌడ్, గంగపురి, శ్రీనివాసులు, మధు, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ముఖేశ్‌గౌడ్‌కు కన్నీటివీడ్కోలు

- అంతిమయాత్రకు భారీగా తరలిన ప్రజలు
- నివాళులర్పించిన రాజకీయ ప్రముఖులు
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తి

**అబిడ్స్, నమస్తే తెలంగాణ:**



మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని గౌడ శ్మశానవాటికలో ముఖేశ్‌గౌడ్‌కు తలకొరివి పెడుతున్న పెద్ద కుమారుడు విక్రంగౌడ్



శ్మశానవాటిక వద్ద రోదిస్తున్న ముఖేశ్‌గౌడ్ కుటుంబసభ్యులు, బంధువులు

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత మూల ముఖేశ్‌గౌడ్ (60)కు అశ్రునయనాల మధ్య ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్ జేఆర్సీ కన్వెన్షన్‌హాల్ సమీపంలోని గౌడ శ్మశానవాటికలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖేశ్‌గౌడ్ అంతిమయాత్రను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముందుండి నడిపించారు. ముఖేశ్‌గౌడ్ పెద్దకుమారుడు విక్రంగౌడ్ దహన సంస్కారాలు నిర్వహించారు. సోమవారం కన్నుమూసిన ముఖేశ్‌గౌడ్ మృతదేహాన్ని మంగళవారం ఉదయం ప్రజల సందర్శనార్థం జూబ్లీహిల్స్‌లోని నివాసం నుంచి జాంబాగ్‌లోని కాంగ్రెస్ డివిజన్ కార్యాలయానికి, తర్వాత గాంధీభవన్‌కు తరలించారు. కడసారి ముఖేశ్‌గౌడ్‌ను చూసేందుకు అభిమానులు, పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పార్టీలకతీతంగా అందరితో సన్నిహితంగా మెలిగిన ముఖేశ్‌గౌడ్ లేరనే విషయాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. అంతిమయాత్ర దారిపొడవునా అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి కన్నీటితో వీడ్కోలు పలికారు. ముఖేశ్‌గౌడ్ పార్థివదేహానికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, పీసీసీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, టీ జీవన్‌రెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ కే స్వామిగౌడ్, మాజీ ఎంపీలు బూర నర్సయ్యగౌడ్, వీ హనుమంతరావు, అంజన్‌కుమార్‌యాదవ్, పొన్నం ప్రభాకర్, మల్లు రవి, మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, జే గీతారెడ్డి, రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు, సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు తీగల కృష్ణారెడ్డి, పీ విష్ణువర్ధన్‌రెడ్డితోపాటు పలు పార్టీల నాయకులు నివాళులర్పించారు.



సాత్నాల ప్రాజెక్టు ఒక గేటు ఎత్తి నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

## ఆదిలాబాద్ ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో

### సాత్నాలలో ఒక గేటు ఎత్తివేత

**ఆదిలాబాద్, నమస్తే తెలంగాణ ప్రతినిధి:** మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఆదిలాబాద్ జిల్లాలోని ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లో పెరిగింది. జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులోకి 1777.54 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో ఒక గేటును ఎత్తి నీటిని విడుదలచేశారు. తాంసి మండలం మత్తడి ప్రాజెక్టులోకి 191 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. సాత్నాల పూర్తిస్థాయి సామర్థ్యం 286.50 మీటర్లు (1.24 టీఎంసీలు). మత్తడి ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు (0.571 టీఎంసీల). గతేడాది కురిసిన వర్షాలతో సాత్నాల ప్రాజెక్టు 286.20 మీటర్ల నీటిమట్టానికి చేరుకొని పూర్తిస్థాయిలో నిండిపోగా.. మత్తడి ప్రాజెక్టు 277.25 మీటర్ల నీటి నిల్వతో నిండుకుండను తలపించింది.

## ఎల్లంపల్లిలోకి పెరుగుతున్న వరద



**అంతర్గాం:** గత నాలుగురోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఎల్లంపల్లి బరాజ్‌లోకి వరదనీరు పెరుగుతున్నది. మంగళవారం ఉదయం 8 గంటలకు 18,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, మధ్యాహ్నం 12 గంటల సమయానికి 30వేల క్యూసెక్కులకు పెరిగింది. సాయంత్రానికి తగ్గి, 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నదని ప్రాజెక్టు ఫ్లడ్ మానిటరింగ్ అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, గతేడాది ఇదే సమయానికి 13.556 టీఎంసీల నిల్వ ఉన్నది. ప్రస్తుతం 6.7052 టీఎంసీలుగా ఉన్నది. ప్రాజెక్టు నీటిమట్టం 148.00 మీటర్లకుగాను 141.47 మీటర్లకు చేరింది.



గోదావరి నదిలోకి కాళేశ్వర జలాలు చేరుకున్న సందర్భంగా మంగళవారం సాయంత్రం మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో గోదావరిహారతి కార్యక్రమం వైభవంగా జరిగింది. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ దేవనాథ జీయర్‌స్వామి సమక్షంలో స్థానిక విశ్వనాథాలయ వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోదావరి నదికి హారతి సమర్పించారు. అంతకుముందు పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు చేసిన వేదపండితులు, నాయకులు.. గోదావరి నదిలోని నీటి వద్దకు వెళ్లి పూలు, పసుపు, కుంకుమ, పంచామృతాలను సమర్పించారు. - మంచిర్యాల



# జూరాలకు జలకళ

- నారాయణపుర నుంచి లక్ష క్యూసెక్కుల వరద
- మూడు ఎత్తిపోతల పథకాలకు నీటి విడుదల
- పూజలుచేసి ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- జూరాల కుడి, ఎడమ కాల్వలకు పారుతున్న నీరు
- కరంట్ ఉత్పత్తితో శ్రీశైలంవైపు 21వేల క్యూసెక్కులు
- నేటి ఉదయం తెరుచుకోనున్న జూరాల గేట్లు
- ఆలస్యమైనా భారీ వరదతో రైతుల్లో హర్షాతిరేకాలు

**మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధి/ హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎట్టకేలకు జూరాల ప్రాజెక్టుకు జలకళ వచ్చింది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న భారీవర్షాలతో జూరాల ప్రాజెక్టుకు మంగళవారం సాయంత్రానికి సుమారు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ఆల్మట్టి నుంచి నారాయణపురకు, నారాయణపుర నుంచి దిగువకు భారీగానే వరద కొనసాగుతున్నది. సోమవారం సాయంత్రానికి రెండు టీఎంసీల నీటినిల్వతో ఉన్న జూరాల ప్రాజెక్టులో మంగళవారం సాయంత్రానికి నీటినిల్వ ఐదు టీఎంసీలు దాటింది. నీటినిల్వ మూడు టీఎంసీలు దాటగానే జూరాల మీద ఆధారపడిన నెట్టెంపాడు (1500 క్యూసెక్కులు), భీమా (1300), కోయిల్‌సాగర్ (315 క్యూసెక్కులు) ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదలచేశారు. జూరాల కుడి, ఎడమకాల్వలకు సైతం నీటివిడుదల ప్రారంభమైంది. మంత్రి వీ శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు ప్రాజెక్టులకు నీటిని విడుదలచేశారు. జూరాల ప్రాజెక్టులోని మూడు యూనిట్లలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ దిగువకు 21 వేల క్యూసెక్కులను వదులుతున్నారు. నారాయణపుర నుంచి నీటి ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో బుధవారం ఉదయం జూరాల క్రస్ట్‌గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదలచేస్తామని జూరాల ప్రాజెక్టు ఈఈ హెచ్‌టీ శ్రీధర్ తెలిపారు. బుధవారం ఉదయానికి సుమారు 1.2 లక్షల క్యూసెక్కుల వరద వస్తుందని ఆయన వివరించారు. జూరాల హైడల్ ప్రాజెక్టు ద్వారా ఆరు యూనిట్లలో కరంటు ఉత్పత్తి ప్రారంభిస్తే.. 48వేల క్యూసెక్కుల వరద దిగువకు వెళుతుంది. అయితే పైనుంచి లక్ష క్యూసెక్కులకుపైగా వరద వస్తుండటంతో బుధవారం ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 318.5 మీటర్లకు చేరుకునే అవకాశం ఉన్నది. 318.3 మీటర్ల స్థాయికి రాగానే గేట్లు తెరవాల్సి ఉంటుందని శ్రీధర్ వివరించారు.



వరదనీటితో నిండు కుండలా మారిన జూరాల ప్రాజెక్టు

### మరో రెండు రోజుల్లో శ్రీశైలానికి

తుంగభద్రకు కొన్నిరోజులుగా స్థిరంగా వరద కొనసాగుతున్నది. మంగళవారం 15 వేల క్యూసెక్కుల పైచిలుకు వరద వస్తుండగా.. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకునేందుకు ఇంకా 75 టీఎంసీలకు పైగా అవసరమున్నది. మరోవైపు సోమవారం ఉగ్రరూపం దాల్చిన ఉజ్జయిని మంగళవారం కాస్త తగ్గింది. అక్కడినుంచి 55 వేల క్యూసెక్కుల పైచిలుకు ప్రవాహం వస్తున్నది. ఆ జలాశయం పూర్తిస్థాయి నిల్వకు ఇంకా 55 టీఎంసీలు కావాల్సి ఉన్నందున ప్రధాన కృష్ణకు ఇప్పట్లో వరద వచ్చే అవకాశం లేదు. ఈ నేపథ్యంలో జూరాల నుంచి వచ్చే వరద మాత్రమే శ్రీశైలం జలాశయానికి జలకళను తేనున్నది. మంగళవారం సాయంత్రం నుంచి జూరాల అవుట్‌ఫ్లో పెరిగింది. జూరాల నుంచి శ్రీశైలం డ్యాం 179.27 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. అంటే జూరాల నీరు చేరుకోవటానికి కనీసం రెండున్నర రోజుల సమయం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఆగస్ట్ రెండో తేదీన కృష్ణాజలాలు శ్రీశైలం జలాశయాన్ని తాకే అవకాశముందని భావిస్తున్నారు. గతేడాది జూలై 20న కృష్ణాజలాలు శ్రీశైలాన్ని చేరగా.. ఈసారి దాదాపు 13-14 రోజులు ఆలస్యమవుతున్నది.

### అన్నదాతల్లో హర్షాతిరేకాలు

జూరాల ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. 318.3 మీటర్ల స్థాయిలో నీటినిల్వ 9.2 టీఎంసీలకు చేరుతుంది. సోమవారం రెండు టీఎంసీల నీటినిల్వతో ఉన్న జూరాల ప్రాజెక్టు... ఒకేరోజు డెడ్‌స్టోరేజీని దాటుకుని ప్రాజెక్టు పరిధిలోని అన్ని లిఫ్టులు, కాల్వలకు నీటిని అందించడంతోపాటు కరంటు ఉత్పత్తి కూడా ప్రారంభించడంతో పాలమూరు వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాలకు గత ఏడాదితో పోలిస్తే ఈసారి కాస్త ఆలస్యంగానే అయినా.. ఒక్కసారిగా లక్ష క్యూసెక్కులకు పైగా వరద వస్తుండటంతో రైతులు సంతోషంగా ఉన్నారు. బుధవారం క్రస్ట్‌గేట్లు ఎత్తనుండటంతో దిగువన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిధిలోని రైతులు ఉత్సాహంగా ఉన్నారు. ఇప్పటికే ఆయకట్టు పరిధిలోని రైతులు వరి నారుమడులు సిద్ధంచేసుకుని కృష్ణానీటికోసం ఎదురుచూస్తున్నారు.

## కడెం వరదగేట్ల ఎత్తివేత

**కడెం:** నిర్మల్ జిల్లా కడెం జలాశయానికి భారీగా వరదనీరు వచ్చి చేరుతున్నది. మంగళవారం ఎగువ నుంచి 15,535 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరడంతో అధికారులు అప్రమత్తమై 6, 9, 10 నంబర్ వరదగేట్లను ఎత్తి దిగువన గోదావరిలోకి నీటిని విడుదలచేశారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు (7.603 టీఎంసీలు). మంగళవారం సాయంత్రం ఏడు గంటల సమయానికి 694.100 అడుగులు (6.152 టీఎంసీల) వద్ద ఉన్నది.

### స్వర్ణ ప్రాజెక్టుకు వరద

నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని స్వర్ణ ప్రాజెక్టులోకి వరద చేరుతున్నది. ప్రాజెక్టు నీటిమట్టం 1183 అడుగులకుగాను 1177 అడుగులకు నీరు వచ్చిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 1.4847 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.766 టీఎంసీల నీరు ఉన్నది. ఇన్‌ఫ్లో 5800 క్యూసెక్కులుగా నమోదైంది.



స్వర్ణ ప్రాజెక్టులోకి 1176 అడుగులకు చేరిన వరదనీరు



మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 (4.46 టీఎంసీలు) అడుగులకుగాను ప్రస్తుతం 613 (0.20 టీఎంసీలు) అడుగుల నీటి మట్టం ఉన్నది. 270 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువకు నీటిని విడుదలచేయటం లేదు.



దేవాదుల వద్ద గోదావరి ప్రవాహం

## దేవాదుల వద్ద ఉప్పొంగిన గంగ

### వేగంగా పెరుగుతున్న గోదావరి

**ఏటూరునాగారం:** ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రతో పాటు రాష్ట్రంలోని ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో గంగమ్మ ఉగ్రరూపం దాల్చుతున్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రం 84 మీటర్లకు చేరుకున్నది. అంటే.. ఒక్క రోజులోనే ఆరు మీటర్లు పెరిగింది. రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 8.10 మీటర్లుగా నమోదైంది. తుపాకులగూడెం బరాజ్‌వద్ద కూడా గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో నిర్మాణ పనులు కొనసాగటం లేదు. ఇక వాజేడు మండలంలోని పేరూరు వద్ద మంగళవారం సాయంత్రం 6 గంటలకు గోదావరి నీటిమట్టం (12.18మీటర్లు) 40 అడుగులకు చేరుకున్నట్లు సీడబ్ల్యూసీ అధికారులు తెలిపారు. మంగపేట కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీకి చెందిన ఇన్‌టేక్‌వెల్ వద్ద సముద్రమట్టానికి 81.5 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవహిస్తున్నది. మంగపేట పుష్కరఘాట్ దగ్గర కూడా ప్రవాహం పెరిగింది.

# 1.90 లక్షల క్యూసెక్కులు

- కాళేశ్వరం ఘాట్ వద్ద గంగమ్మ పరవళ్లు
- మేడిగడ్డ బరాజ్‌లో 30 గేట్ల ఎత్తివేత
- 4.10 లక్షల క్యూసెక్కుల విడుదల

**మంథని, నమస్తే తెలంగాణ/ మంథని రూరల్/ అంతర్గాం/ కాళేశ్వరం/ మహదేవ్‌పూర్:** నిన్నమొన్నటిదాకా కాళేశ్వరం వద్ద వేల క్యూసెక్కులుగా ఉన్న ప్రవాహం ఒక్కసారిగా లక్షా 90వేల క్యూసెక్కులకు పెరిగింది. దీనితో మేడిగడ్డ బరాజ్ నిండుకుండను తలపిస్తున్నది. మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత వరద పోటెత్తుతుండటం, అన్నారం, సుందిల్ల బరాజ్‌లలోకి వివిధ వాగుల ద్వారా వరదనీరు చేరుకుంటుండటంతో కన్నెపల్లి, కాసిపేట పంప్‌హౌస్‌లలోని మోటర్లను ఆఫ్‌చేశారు. మేడిగడ్డకు భారీ ఇన్‌ఫ్లో ఉన్న నేపథ్యంలో బరాజ్ నుంచి దిగువకు 30 గేట్ల ద్వారా నీటిని విడుదలచేస్తున్నారు. కన్నెపల్లి పంప్‌హౌస్, అంతర్రాష్ట్ర వంతెన వద్ద గంగమ్మ ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తున్నది. గత నెల రోజులుగా ఆరు మోటర్ల ద్వారా ప్రాణహిత జలాలను అన్నారం బరాజ్‌కు ఎత్తిపోస్తున్నారు. సోమవారం కూడా 3, 4, 5, 6వ నంబరు మోటర్లు పనిచేశాయి. ఫలితంగా అన్నారం బరాజ్‌లో మంగళవారం సాయంత్రానికి నీటి నిల్వ 8.34 టీఎంసీలకు చేరుకున్నది. మరోవైపు అన్నారం పంప్‌హౌస్‌లో ఐదో నంబర్ మోటర్‌కు అధికారులు పదినిమిషాలపాటు వెట్‌రన్ విజయవంతంగా నిర్వహించారు.



మేడిగడ్డ ప్రాజెక్టు గేటు ద్వారా దిగువకు వెళుతున్న నీరు

### మేడిగడ్డలో 30 గేట్ల ఎత్తివేత

మేడిగడ్డ బరాజ్‌లోని 30 గేట్లను ప్రాజెక్టు ఇంజినీర్లు మంగళవారం ఎత్తివేశారు. మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత జలాలు భారీస్థాయిలో మేడిగడ్డ బరాజ్‌లోకి చేరుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉదయం 23 గేట్లు ఎత్తిన అధికారులు.. సాయంత్రానికి మరింత నీరు పెరుగటంతో మరో 7 గేట్లు ఎత్తారు. మొత్తం 85 గేట్లకుగాను.. 30 గేట్ల నుంచి సుమారుగా 4.10 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తున్నట్లు అధికారులు తెలిపారు. మంగళవారం బరాజ్‌లో 7.2 టీఎంసీల నీటినిల్వ ఉన్నది.

### నందిమేడారంలో వెట్‌రన్ సక్సెస్

**ధర్మారం:** కాళేశ్వరం ప్రాజెక్టు 6వ ప్యాకేజీలో భాగమైన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని అండర్‌టన్నెల్‌లోని పంప్‌హౌస్‌లో మంగళవారం ఐదో నంబర్ మోటర్‌కు విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు కే పెంటారెడ్డి తదితరులు 124.4 మెగావాట్ల మోటర్‌ను కంప్యూటర్ ద్వారా ప్రారంభించారు. నిర్దిష్ట సమయానికే వేగం పుంజుకొని నందిమేడారం సర్జ్‌పూల్ నుంచి నీటిని ఎత్తిపోయడంతో డెలివరీ సిస్టర్న్ నుంచి జలాలు అప్రోచ్ కాల్వద్వారా నందిమేడారం రిజర్వాయర్‌లోకి వెళ్లాయి.

## నందిమేడారంలో వెట్‌రన్ సక్సెస్

- ఐదో మోటర్‌తో నీటిఎత్తిపోత
- డెలివరీ సిస్టర్న్ నుంచి దుంకిన జలాలు

**ధర్మారం:** కాళేశ్వరం ప్రాజెక్టు 6వ ప్యాకేజీలో భాగమైన పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని అండర్‌టన్నెల్‌లోని పంప్‌హౌస్‌లో మంగళవారం ఐదో నంబర్ మోటర్‌కు విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించారు. తొలుత ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రాజెక్టు ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఎత్తిపోతల సలహాదారు కే పెంటారెడ్డి తదితరులు 124.4 మెగావాట్ల మోటర్‌ను కంప్యూటర్ ద్వారా ప్రారంభించారు. నిర్దిష్ట సమయానికే వేగం పుంజుకొని నందిమేడారం సర్జ్‌పూల్ నుంచి నీటిని ఎత్తిపోయడంతో ఉపరితలంలోని డెలివరీ సిస్టర్న్ నుంచి జలాలు దుంకాయి. అప్రోచ్ కాల్వద్వారా నందిమేడారం రిజర్వాయర్‌లోకి వెళ్లాయి.

**15 కల్లా మిడ్‌మానేరుకు నీళ్లు: ఈఎన్సీ వెంకటేశ్వర్లు**

నందిమేడారంలో ఐదో మోటర్ వెట్‌రన్ విజయవంతం కావడంపై ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తంచేశారు. నందిమేడారం భూగర్భ పంప్‌హౌస్‌లోని 1, 2, 3, 4 నంబర్ల మోటర్లకు గతంలోనే విజయవంతంగా వెట్‌రన్ నిర్వహించామని, ఇప్పుడు 5వ మోటర్ వెట్‌రన్ సక్సెస్‌కావడం ఆనందంగా ఉన్నదని చెప్పారు. లింక్-1లో భాగంగా మేడిగడ్డ నుంచి అన్నారం, సుందిల్ల బరాజ్‌లను విజయవంతంగా నింపుకొన్నామని, ఈ క్రమంలో ఎల్లంపల్లిలోకి ఎత్తిపోసేందుకు గోలివాడలోని సుందిల్ల పంప్‌హౌస్‌లోని మొదటి మోటర్ వెట్‌రన్‌కు సిద్ధమయ్యామని తెలిపారు. ఎల్లంపల్లి బరాజ్ నుంచి నందిమేడారం పంప్‌హౌస్‌కు ఆగస్టు 5లోగా నీటిని విడుదల చేసి, 15వ తేదీవరకు 7, 8వ ప్యాకేజీల ద్వారా మిడ్‌మానేరుకు నీటిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.


Estd: 2007
ACE Engineering College
Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH, Hyd.
GHATKESAR, Hyderabad (TS). Ph: 9133308533
Merit Scholarships
Few seats are available under B-Category in B.Tech EEE, Civil, Mechanical and ECE
Encouraging fees structure to merit students

| Branch | Rank up to 10,000 | Rank 10,001-15,000 | Rank 15,001-20,000 | Rank 20,001-25,000 | Rank 25,001 and above |
|---|---|---|---|---|---|
| CE, ME EEE, ECE | Rs. 42,000/- | Rs. 50,000/- | Rs. 60,000/- | Rs. 68,000/- | Rs. 82,000/- |

Note: Our College fee is Rs. 82000/- Separate Hostels for Boys and Girls in Campus
All interested candidates can reach college at the earliest and contact admission section. Mr. Vijay Kumar - 9912391169
POWERED BY : ACE ENGINEERING ACADEMY
India's Leading Coaching Centre for GATE/IES/PSUs



పత్రికా ప్రకటన
క్రెడిట్ సొసైటి సర్వసభ్య సమావేశం
అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్, గోదావరిఖని (Reg. No. 1037/TQ) యొక్క సర్వసభ్య సమావేశం తేది.8.8.2019 రోజున సాయంత్రం 4.00 గంటలకు ఆర్.సి.ఓ.ఎ క్లబ్, రామగుండం ఏరియా-1 నందు నిర్వహించబడును.
కావున క్రెడిట్ సొసైటి సభ్యులందరు విధిగా ఈ సర్వ సభ్య సమావేశానికి హాజరు కావాలని తెలియపరచడమైనది.
సెక్రటరీ,
అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ క్రెడిట్ సొసైటి లిమిటెడ్, గోదావరిఖని
తేది. 31.07.2019



क्षेत्रीय कार्यालय : तेलंगाना /రీజినల్ కార్యాలయం: తెలంగాణ
कर्मचारी राज्य बीमा निगम /కార్మిక రాజ్య బీమా సంస్థ
5-9-23, हिल फोर्ट रोड, हैदराबाद /హిల్‌ఫోర్ట్ రోడ్, ఆదర్శ్‌నగర్, హైదరాబాద్-500063
आइ.एस.ओ./ISO 9001:2015(क्यू.एम.एस./QMS)प्रमाणित कार्यालय/ ధృవీకృత కార్యాలయం
दूरभाष/ఫోన్:040-23232356,7,8 Fax:040-23235048 टोल फ्री 1800-425-2358
అద్దెపై వసతి కావలెను
ప్రాంతీయ కార్యాలయం ఇఎస్‌ఐ సంస్థ, తెలంగాణ వారు దాని బ్రాంచ్ కార్యాలయం రామగుండం కోసం ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్‌పై సుమారుగా 1000 చదరపు అడుగులు (కార్పెట్ ఏరియా) విస్తీర్ణం గల ఆవరణ అద్దెపై తీసుకోవాలని ఆసక్తి కనబరుస్తున్నారు.
ప్రదేశం: రామగుండం వద్ద ఎన్‌టిపిసి ఆవరణ సమీపాన. ఆసక్తి గల పార్టీలు సీల్డు కవరులో ప్రతి చదరపు అడుగు (కార్పెట్ ఏరియా) రేట్ కోట్ చేసి, దానిని పై చిరునామాలో అడిషినల్ కమిషనర్‌కు పంపాలి. దరఖాస్తు 07-08-2019న మధ్యాహ్నం 2.00 గంటలలోగా తప్పక చేరాలి. టెండరు తెరుచు తేది: 08-08-2019న మధ్యాహ్నం 3.00 గంటలకు. దరఖాస్తుదారు టెండరు తెరుచు సమయంలో హాజరు కావాల్సి ఉంటుంది.
టెండరు డాక్యుమెంట్ల వివరాలు వెబ్‌సైట్స్: www.eprocure.gov.in మరియు www.esic.nic.in/tendersపై చూసుకొనుటకు మరియు డౌన్‌లోడింగ్ కోసం లభిస్తాయి.
అడిషినల్ కమిషనర్ & రీజినల్ డైరెక్టర్


# పైన వెలవెల.. కింద గలగల

- ఎగువన గోదావరిలో బండరాళ్లు.. డెడ్‌స్టోరేజీలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు
- ఎంఎండీ, ఎల్ఎండీలదీ అదే దుస్థితి.. దిగువన నదీజలాల పరవళ్లు
- ఉరకలేస్తునన ప్రాణహిత జలాలు.. ఒడిసిపడుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు
- సుందిల్లదాకా ఎగువకు ప్రయాణం.. ఫలితాన్నిస్తున్న కేసీఆర్ దూరదృష్టి
- రుజువైన రీడిజైనింగ్ ఆవశ్యకత.. ఎత్తిపోతలతో ప్రతిపక్షాల నోళ్లు మూత

**కడపత్రి ప్రకాశ్‌రావు, నమస్తే తెలంగాణ, కరీంనగర్ ప్రధాన ప్రతినిధి:** ఒకటే నది.. రెండు భిన్న దృశ్యాలు! ఎగువన గంగమ్మ బండరాళ్లతో కునారిల్లుతుంటే.. దిగువన పరవళ్లు తొక్కుతున్నది! ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ డెడ్‌స్టోరేజీతో కళాహీనమైతే.. దిగువన మేడిగడ్డ దగ్గర జలకళ ఉట్టిపడుతున్నది! కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టకపోయి ఉంటే? వందల టీఎంసీలు సముద్రం పాలయ్యేవి. కండ్లముందే నీళ్లు పారుతున్నా.. చుక్కనీటికోసం తెలంగాణ దిక్కులు చూడాల్సివచ్చేది! కానీ.. కాళేశ్వరం పుణ్యమాని గరిష్ఠస్థాయిలో ప్రాణహిత నీటిని ఒడిసిపట్టడంతో అన్నారం బరాజ్‌కు, అక్కడి నుంచి సుందిల్ల బరాజ్‌కు నీరు గోదావరి నదీగర్భంలో ఎదురేగింది. ఎల్లంపల్లి జలాశయంలోకి దుంకేందుకు సన్నద్ధంగా ఉన్నది. తెలంగాణ జల వనరులపై సంపూర్ణ అవగాహన కలిగిన సీఎం కేసీఆర్ స్వయంగా రీడిజైన్ చేసిన కాళేశ్వరం ఆవశ్యకత.. ఇప్పుడు కండ్లముందు సాక్షాత్కరిస్తున్నది. విపక్షాల విమర్శలకు గట్టి సమాధానం చెప్తున్నది.

### కండ్లముందు నవోదయం

'గోదావరి నీటి ప్రవాహ పరిస్థితి మారింది. ఎస్సారెస్పీకి ఎగువన ఉన్న మహారాష్ట్ర వందల సంఖ్యలో బరాజ్‌లు కట్టడంవల్ల దిగువకు నీరు రావటంలేదు. ఫలితంగా ఉత్తర తెలంగాణ వరప్రదాయిని ఎస్సారెస్పీ మనుగడే ప్రశ్నార్థకంగా మారుతున్నది. ఈ నేపథ్యంలో భవిష్యత్‌తరాలకు ఇంద్రావతి, ప్రాణహిత నీళ్లే ఆధారం. వాటిని వినియోగించుకోవటం తప్ప మరో గత్యంతరం లేదు. ఆ నీటిని ఒడిసి పట్టి కోటి ఎకరాలకు నీళ్లు ఇచ్చితీరుతాం. ఇందులో భాగమే మా రీడిజైనింగ్'.. 2016 మార్చి 31న ప్రాజెక్టులపై అసెంబ్లీలో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా సీఎం కేసీఆర్ చెప్పిన మాటలు ఇవి. మేడిగడ్డ, తమ్మిడిహట్టి వద్ద 47 ఏండ్ల సగటు నీటి లెక్కలను చెప్తూ.. తమ్మిడిహట్టి వద్ద 1,144.8 టీఎంసీల సరాసరి నీటి లభ్యత ఉంటే కాళేశ్వరం వద్ద 1,651 టీఎంసీల లభ్యత ఉన్నదని, ఇంద్రావతి కలిసిన తర్వాత పేరూరు వద్ద లభ్యత 2,430 టీఎంసీలుగా ఉన్నదని గణాంకాలతో సహా వెల్లడించారు. గోదావరిలో ఇంద్రావతి కలిసిన తదుపరి తుపాకులగూడెం వద్ద బరాజ్ నిర్మిస్తే.. మేడిగడ్డ వద్ద భవిష్యత్‌లో ఎప్పుడైనా కొరత ఏర్పడినా ఇంద్రావతి నీటిని తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. ఇప్పుడు అవే మాటలు అక్షర సత్యాలవుతున్నాయి. ఈ పనేదో గత పాలకులు అప్పట్లోనే చేసి ఉంటే.. ఇన్ని దశాబ్దాల్లో లక్షల టీఎంసీలు వృథా అయి ఉండేవి కావు. లక్షల ఎకరాల భూములు బంగారాన్ని పండించేవి. కానీ.. ఆనాడు వారికి ఆ దార్శనికత కరువైంది. నేడు తెలంగాణ సోయి కలిగిన నేత సారథ్యంలో తెలంగాణ నవోదయాన్ని చవిచూస్తున్నది.



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

### పైన వెలవెల.. దిగువన గల గల

ఈ వర్షాకాలంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువనుంచి చుక్కనీరు రాలేదు. మహారాష్ట్రలో కురిసిన వర్షాలనీరు అక్కడి ప్రాజెక్టుల్లోనే బందీ అయింది. నిజానికి ఎస్సారెస్పీకి ఎగువన బాబ్లీ సహా అనే ప్రాజెక్టుల్లో నీళ్లు లేవు. ఈ పరిస్థితిలో ఎస్సారెస్పీకి వరదనీరు కల్లే. దీనితోపాటు మధ్యమానేరు, దిగువమానేరు నిండాలంటే 126 టీఎంసీలపైగా నీరు రావాలి. ఎగువ నుంచి అంత నీరు వచ్చే పరిస్థితులు మాత్రం కనిపించడం లేదు. కానీ.. దిగువన ప్రాణహిత జలాలతో గంగమ్మ పరవళ్లు తొక్కుతున్నది. మేడిగడ్డ వద్ద ఒడిసిపట్టే ప్రాణహిత జలాలే.. ఎగువన బండరాళ్లతో నిండి ఉన్న గోదావరి నదీగర్భాన్ని జలకళలాడించనున్నాయి.

### ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

**కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ:** ఎడారిలా మారిన ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద మొదలైంది. మూడురోజులుగా క్రమంగా పెరుగుతున్న ఇన్‌ఫ్లోతో రైతుల్లో ఒకింత ఆనందం నెలకొన్నది. ఎస్సారెస్పీకి గతేడాది ఆగస్టు మొదటివారానికిగానీ ఇన్‌ఫ్లో మొదలుకాలేదు. ఈసారి కూడా ఆలస్యంగా ఇన్‌ఫ్లో ప్రారంభమైంది. ఎస్సారెస్పీకి ఎగువన సుమారు 45 కిలోమీటర్ల వరకు వర్షాల ప్రభావం ఉన్నది. దీంతో ఈ నెల 27న చిన్నగా ప్రారంభమైన ఇన్‌ఫ్లో.. మంగళవారం ఉదయానికి 0.296 టీఎంసీకి పెరిగింది. గోదావరి వెంట చిన్న వాగులు, ఒర్రెల్లోని ప్రవాహం ప్రాజెక్టులోకి చేరుతున్నది. పాత ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎస్సారెస్పీలోకి ప్రవహించే గడ్డెన్న వాగులో పెరుగుతున్న వరద ఆశలు రేపుతున్నది. గడ్డెన్న వాగు మత్తడి నీటిమట్టం 1.2 మీటర్లు కాగా.. ప్రస్తుతం 0.2 మీటర్లకు చేరుకున్నది. వర్షాలు నాలుగైదురోజులు కొనసాగితే గడ్డెన్నవాగు వరద ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉన్నది. ఎగువన మహారాష్ట్రలో విష్ణుపురి, గైక్వాడ్, బాబ్లీ ప్రాజెక్టుల్లోకి ఇన్‌ఫ్లోనే లేదు. దీనితో వాటికి దిగువన గోదావరి పరివాహక ప్రాంతంలో కురిసే వర్షాలతోనే ఎస్సారెస్పీలోకి ఇన్‌ఫ్లో వస్తున్నదని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎస్సారెస్పీ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు, నిల్వ సామర్థ్యం 90 టీఎంసీలు కాగా.. మంగళవారం ఉదయానికి 1048 అడుగుల నీటిమట్టం, 5.6 టీఎంసీల నీటినిల్వ ఉన్నది.

## హరిత సంజీవని



రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండల పరిధిలోని గుర్రంగూడలో సంజీవని వనం పేరుతో ఏర్పాటుచేసిన అర్బన్ ఫారెస్ట్ పార్కును ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మంగళవారం ప్రారంభించారు. హరితహారంలో భాగంగా మొక్కలను నాటారు. హెచ్ఎండీఏ పరిధిలో 59 అర్బన్ ఫారెస్ట్ పార్కులను అభివృద్ధి చేస్తున్నామని, వీటిలో 17 పార్కులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్ మిశ్రా,పీసీసీఎఫ్ పీకేఝా, అటవీ అభివృద్ధి సంస్థ ఎండీ రఘువీర్, రంగారెడ్డి జేసీ ఎస్ హరీశ్, అటవీశాఖ అధికారులు పృథ్వీరాజ్, శోభ, మునీంద్ర, స్వర్గం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.
- నమస్తే తెలంగాణ, బడంగ్‌పేట

## జగిత్యాల జిల్లాలో 2.74 కోట్ల మొక్కల పెంపకం లక్ష్యం

- సమన్వయంతో హరితహారాన్ని విజయవంతం చేద్దాం
- రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపు

**జగిత్యాల రూరల్:** హరితహారంలో భాగంగా జగిత్యాల జిల్లాలో 2.74 కోట్ల మొక్కల పెంపకమే లక్ష్యంగా పనిచేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ సూచించారు. హరితహారం స్ఫూర్తిగా జిల్లాలో చేపట్టిన 'ముఖ్యమంత్రి స్వచ్ఛ హరిత మిషన్' కార్యక్రమంలో భాగంగా జగిత్యాల కలెక్టరేట్ ఆవరణ, కలెక్టర్ కార్యాలయ రోడ్డుకు ఇరువైపులా, సబ్‌స్టేషన్ ఆవరణలో మంత్రి ఈశ్వర్ మంగళవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని సీఎం కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టారన్నారు. అధికారులు, రాజకీయనాయకులు, యువజన, స్వచ్ఛంద సంస్థలు, యువత సమన్వయంతో పనిచేసి హరితహారాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, కలెక్టర్ శరత్, జాయింట్ కలెక్టర్ బేతి రాజేశం, ఆర్డీవో నరేందర్, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోక బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మంగళ వారం జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న మంత్రి కొప్పుల ఈశ్వర్. చిత్రంలో జెడ్పీ అధ్యక్షురాలు దావ వసంత, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ శరత్ తదితరులు ఉన్నారు.



హరిత చైతన్యం

# శామీర్‌పేటపై సీఎం ముద్ర

- పలుచోట్ల మొక్కలు నాటిన ముఖ్యమంత్రి కేసీఆర్
- ఏపుగా పెరిగి వృక్షాలుగా రూపాంతరం



2018 ఆగస్టు 1న మేడ్చల్ జిల్లా తుర్కపల్లి రాజీవ్ రహదారిపై మొక్క నాటి నీళ్లు పోస్తున్న సీఎం కేసీఆర్



మేడ్చల్ జిల్లా తుర్కపల్లి రాజీవ్ రహదారిపై సీఎం కేసీఆర్ నాటిన మొక్క ప్రస్తుతం ఏపుగా పెరిగిందిలా..

**శామీర్‌పేట:** తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో సీఎం కేసీఆర్ శామీర్‌పేటపై చెరగని ముద్రవేశారు. హరితహారం ప్రారంభం నుంచి శామీర్‌పేట మండలంలో పర్యటించిన ప్రతిసారి మొక్కలు నాటారు. 2015లో హరితహారం సందర్భంగా హకీంపేటలోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో, శామీర్‌పేట మండల కార్యాలయాల సముదాయంలో, తుర్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో మొక్కలు నాటారు. తిరిగి 2018 ఆగస్టు 1న తుర్కపల్లి గ్రామ ప్రధాన మార్గం(రాజీవ్ రహదారి)పై మొక్క నాటారు. సీఎం కేసీఆర్ నాటిన మొక్కలను అధికారులు సంరక్షిస్తున్నారు. అవి ఏపుగా పెరిగి ప్రస్తుతం వృక్షాలుగా మారుతున్నాయి.

# జీహెచ్ఎంసీ హరితయజ్ఞం!

- మూడేండ్లలో నాటిన మొక్కలు రెండు కోట్లు
- ఈ ఏడాది లక్ష్యం మరో మూడు కోట్ల మొక్కలు
- 47 ఖాళీస్థలాల్లో కొత్త పార్కుల అభివృద్ధికి ప్రణాళిక

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**



2018లో బీఎన్‌రెడ్డినగర్ -సాగర్‌రోడ్ సెంట్రల్ మీడియన్‌లో నాటిన మొక్కలు



2018లో వ్యవసాయ విశ్వవిద్యాలయం - వాల్ మార్ట్ రోడ్ సెంట్రల్ మీడియన్‌లో నాటిన మొక్కలు

కాంక్రీట్ జంగిల్‌లా మారిన రాష్ట్ర రాజధానిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచడంతోపాటు స్వచ్ఛమైన ప్రాణవాయువును అందించేందుకు జీహెచ్ఎంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్) హరితయజ్ఞం చేపట్టింది. సీఎం కేసీఆర్ దూరదృష్టితో అంకురార్పణ చేసిన హరితహారాన్ని ఉద్యమంలా కొనసాగిస్తున్నది. నగరంతోపాటు శివారుప్రాంతాల్లో గత మూడేండ్లలోనే రెండుకోట్ల మొక్కలు నాటడమే దీనికి నిదర్శనం. నగరంలోని వివిధ ప్రాంతాల్లో నాటిన మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పచ్చదనం ఉట్టిపడుతున్నది. శంషాబాద్‌లోని లక్ష్మిగూడ, నిమ్స్ దవాఖాన, వివిధ ప్రధాన రహదారుల్లోని సెంట్రల్ మీడియన్లలో నాటిన మొక్కలు పచ్చనిహారాన్ని తలపిస్తున్నాయి.

### ప్రతి వార్డుకూ రెండు లక్షల మొక్కలు

ఈ ఏడాది మరో మూడుకోట్ల మొక్కలు నాటేందుకు ప్రణాళిక కూడా సిద్ధమైంది. కోటి మొక్కలు జీహెచ్ఎంసీ వద్ద సిద్ధంగా ఉండగా, కోటిన్నర మొక్కలు జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డులకు చెందిన ఖాళీస్థలాల్లో ఏర్పాటుచేసిన నర్సరీల్లో పెంచుతున్నారు. మరో 70 లక్షల మొక్కలను పెంచడానికి హెచ్ఎండీఏ, హౌసింగ్‌బోర్డులకు చెందిన ఖాళీస్థలాలను ఎంపికచేశారు. ఈసారి జీహెచ్ఎంసీ పెంచుతున్న మొక్కల్లో వేప, జువ్వి, కానుగ, జమ్మితోపాటు సపోటా,మామిడి, అల్లనేరేడు, బాదం తదితర పండ్లమొక్కలతోపాటు ఔషధ మొక్కలు ఉన్నాయి. ఇండ్లకు పంపిణీ చేసే మొక్కల్లో వంకాయ, టమాటా, మునగ తదితర కూరగాయల మొక్కలు ఉన్నాయి. నగరంలో 13 లక్షలకుపైగా నివాసాలు ఉండగా, ఆస్తిపన్ను నంబర్ల ఆధారంగా ఇంటింటికీ మొక్కల పంపిణీ చేపట్టాలని నిర్ణయించారు. ఇప్పటికే సర్కిళ్లవారీగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించిన అధికారులు, బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ప్రతి వార్డుకు రెండు లక్షల మొక్కలు పంపిణీచేయాలని అధికారులు భావిస్తున్నారు.

### కొత్తగా పార్కుల అభివృద్ధి

గ్రేటర్‌లో మేజర్ పార్కులు 17 ఉండగా, మధ్య, చిన్నతరహా పార్కులు 873, ఇవికాకుండా 331 ట్రీ పార్కులు ఉన్నాయి. ఎక్కువశాతం పార్కులను కాలనీ సంక్షేమసంఘాలు నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది 47 ఖాళీస్థలాల్లో కొత్త పార్కులు అభివృద్ధి చేసేందుకు జీహెచ్ఎంసీ అధికారులు సిద్ధమవుతున్నారు. వివిధరకాల థీమ్‌లతో ఏర్పాటుచేసే ఈ పార్కులను హరితహారం పార్కులుగా పిలువనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 3,084ఖాళీ స్థలాల(1,727ఎకరాల విస్తీర్ణం)ను బల్దియా అధికారులు ఎంపికచేశారు. వీటితోపాటు 873 పార్కుల్లో అందుబాటులో ఉన్న 696 ఎకరాల ఖాళీస్థలాల్లోనూ మొక్కలు నాటాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలు జారీచేశారు. గ్రేటర్‌లోని ప్రభుత్వ, ప్రభుత్వరంగ సంస్థల కార్యాలయాల ఖాళీస్థలాల్లో ప్లాంటేషన్ చేపట్టనున్నారు. చెరువు గట్లు, వాకింగ్‌ట్రాక్‌లకు ఇరువైపులా, శ్మశాన వాటికలు తదితరచోట్ల కూడా మొక్కలు నాటాలని నిర్ణయించారు. రూ.17.75 కోట్లతో సూరారం, మాదన్నగూడ, నాదర్‌గుల్ బ్లాక్‌లలో అర్బన్ ఫారెస్ట్ పార్కులను కూడా అభివృద్ధిచేస్తున్నారు.

### గ్రీన్ కవరేజ్ పెంపే లక్ష్యం

రాష్ట్రంలో సగటున 24 శాతం గ్రీన్ కవర్ ఉన్నట్లు అధికారిక రికార్డులు చెప్తున్నాయి. హైదరాబాద్‌లో గత గణాంకాల ప్రకారం 17.5 శాతమే గ్రీన్ కవరేజ్ ఉన్నది. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 33 శాతం గ్రీన్‌కవర్ ఉండేలా పెద్దఎత్తున మొక్కలు నాటాలని అధికారులను సీఎం కేసీఆర్ తొలి విడుత హరితహారం సందర్భంగా ఆదేశించారు. హరితహారం పేరుతో పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమానికి కూడా శ్రీకారంచుట్టారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఇప్పటికే రెండు కోట్ల మొక్కలను జీహెచ్ఎంసీ నాటింది. 33 శాతం గ్రీన్ కవర్ సాధించాలనే లక్ష్యంతో ఈ ఏడాది మూడు కోట్ల మొక్కలునాటడమే లక్ష్యంగా పెట్టుకున్నది.

## బేసిన్‌లోని ఆయకట్టుకే ప్రాధాన్యం

- ముందుగానే ఇతర బేసిన్‌కు జలాల తరలింపు సహేతుకం కాదు
- తెలంగాణ తరపు సాక్షి ఘనశ్యాంఝా క్రాస్ ఎగ్జామినేషన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణాబేసిన్‌లో 36.45 లక్షల హెక్టార్ల ఆయకట్టులో 20 లక్షల హెక్టార్లకుపైగా భూములకు సాగునీటిని అందించకుండా.. ఇతర బేసిన్‌కు జలాల తరలింపు సహేతుకం కాదని తెలంగాణ తరపున సాక్షి ఘనశ్యాంఝా అన్నారు. జలసంబంధమైన సమర్థ నిర్వహణ ఆధారంగానే ఇరురాష్ట్రాలకు న్యాయబద్ధమైన వాటాలను నిర్ణయించాలన్నారు. ముఖ్యంగా రెండురాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులను పరిశీలిస్తే.. బేసిన్‌లోని 20 లక్షల హెక్టార్లకుపైగా భూములకు ఒక్క పంటకైనా సాగునీరు ఇవ్వాలనే పాలసీ డాక్యుమెంట్‌గానీ విజన్ డాక్యుమెంట్‌గానీ తనకు కనిపించలేదని తెలిపారు. తెలుగురాష్ట్రాల మధ్య కృష్ణాజలాల పంపిణీకిగాను కొనసాగుతున్న బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణలో భాగంగా రెండోరోజు మంగళవారం కూడా ఏపీ తరపు న్యాయవాదులు ఝాను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. ఇందులోభాగంగా 40 ప్రశ్నలు అడగ్గా.. ఆయన విపులంగా సమాధానమిచ్చారు. బేసిన్‌లోని సహేతుకమైన అవసరాలు తీరాకే అవతలి బేసిన్‌కు నీటిని తరలించాలన్నారు. ప్రధానంగా కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాంతానికి సరైన సాగునీటి సదుపాయం కల్పించకుండా ఇతర బేసిన్లకు తరలించడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని పునరుద్ఘాటించారు. కేసీ కెనాల్‌ను మొదట్లో కేవలం 10 టీఎంసీలతో 35వేల హెక్టార్ల ఆయకట్టుతో ప్రతిపాదించారని తెలిపారు. బేసిన్ అవతల ఆయకట్టుకు నీరిచ్చే ఎస్సార్బీసీ కాల్వకు బేసిన్ లోపలి వాడకం ద్వారా వచ్చిన పునరుత్పత్తి జలాలను కేటాయించి, బేసిన్‌లోని ప్రాజెక్టులకు నష్టం కలిగించారని చెప్పా రు. డెల్టాకు నిర్వచనం చెబుతూ.. డిస్ట్రిబ్యూటరీలతో ఉంటుంది తప్ప ఉపనదులతో ఉండదన్నారు. ఈ నేపథ్యంలో ట్రిబ్యునల్ సమ్మతితో కృష్ణా డెల్టా విస్తృతిపై సవరణ చేయాలని చెప్పారు. శ్రీశైలం వద్ద నీటిలభ్యత కృష్ణా బేసిన్ అవతలి ప్రాజెక్టులకు ప్రతిబంధకం అవుతుందేగానీ లోపలి ప్రాజెక్టులకు కాదని తెలిపారు.

# ప్రజలకు పచ్చని బహుమతి!

- అర్బన్ పార్కులు ఏర్పాటుచేస్తున్న ప్రభుత్వం
- స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదాన్ని పంచేలా ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి 31 అర్బన్‌పార్కులు
- మరో 16 పార్కుల్లో చకాచకా కొనసాగుతున్న పనులు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**



మేడ్చల్ జిల్లాలోని కండ్లకోయ ఆక్సిజన్ పార్కులో ట్రీ హౌస్

పట్టణ ప్రాంతాల్లో అడవులను తలపించే పచ్చనివనాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. హైదరాబాద్ శివార్లతో పాటు పట్టణప్రాంతాల్లో ఏర్పాటవుతున్న అర్బన్‌పార్కులు ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించే ఆక్సిజన్ కేంద్రాలుగా మారుతున్నాయి. ఆరోగ్యాన్నిచ్చే సంజీవనివనాలుగా భాసిల్లుతున్నాయి. ఒకప్పుడు పచ్చనితోటలకు, ఉద్యానవనాలకు నిలయమై భాగ్‌నగర్‌గా విలసిల్లిన భాగ్యనగరం మళ్లీ పచ్చనికళను సంతరించుకుంటుంది. హైదరాబాద్‌తోపాటు అన్ని పట్టణప్రాంతాల్లో ప్రజలకు స్వచ్ఛమైన గాలిని అందించేందుకు అర్బన్‌పార్కులను భారీగా ఏర్పాటుచేయాలని సీఎం కేసీఆర్ స్వయంగా ప్రణాళిక రచించారు. అర్బన్ పార్కుల ఏర్పాటుపై తరుచూ సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి ఎస్కేజోషి ఆధ్వర్యంలో కమిటీవేశారు. సీఎస్ నేతృత్వంలో అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలుచేపట్టి హైదరాబాద్‌లో చాలా అర్బన్‌పార్క్‌లను అందుబాటులోకి తీసుకొచ్చారు.

### మరో 46 పార్కుల ఏర్పాటుకు సన్నాహాలు

ఇప్పటికే హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) పరిధిలో 17, ఇతర పట్టణాల్లో 14.. మొత్తం 31 అర్బన్ ఫారెస్ట్ పార్కులు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. హెచ్ఎండీఏ పరిధిలోని 17 అర్బన్‌పార్కుల్లో అటవీశాఖ 16, అటవీ అభివృద్ధి సంస్థ ఒక పార్కును ఏర్పాటుచేశాయి. వివిధశాఖలు కలిసి మరో 16 పార్కులను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నాయి. ఇవి నవంబర్‌లోగా అందుబాటులోకి రానున్నాయి. ఇవేకాకుండా మరో 30 పార్కుల అభివృద్ధికి ప్రణాళిక సిద్ధమైంది. పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి.

### హెచ్ఎండీఏపై ప్రత్యేక దృష్టి

రాష్ట్రంలో మూడోవంతు జనాభా 7,228 చదరపు కిలోమీటర్లలో విస్తరించిన హెచ్ఎండీఏ పరిధిలో నివాసముంటుందని ఓ అంచనా. హెచ్ఎండీఏ పరిధిలో అర్బన్‌పార్కులను యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేస్తూనే మిగతా పట్టణాల్లో లంగ్‌స్పేస్‌లను అభివృద్ధిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం హెచ్ఎండీఏ పరిధిలోని ఫారెస్ట్‌బ్లాక్‌లలో ప్రజలకు ఉపయోగపడేలా ఉద్యానవనాలను ఏర్పాటు చేస్తున్నారు. హెచ్ఎండీఏ పరిధిలోని 129 ప్రాంతాల్లో 188 ఫారెస్ట్‌బ్లాక్‌లలో దాదాపు లక్షన్నర ఎకరాల అటవీభూమిని గుర్తించారు. జనావాసాలకు దగ్గరగా ఉన్న 59 ప్రాంతాల్లో అర్బన్‌పార్కు(లంగ్‌స్పేస్)లను ఏర్పాటుచేశారు. జనావాసాలకు దూరంగా ఉన్న 70 ఫారెస్ట్‌బ్లాక్‌లను కన్జర్వేషన్ బ్లాక్‌లుగా ఏర్పాటుచేస్తున్నారు. అర్బన్‌పార్కుల అభివృద్ధిలో అటవీశాఖ, హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ, టీఎస్ఎఫ్‌డీసీ, జీహెచ్ఎంసీ, మెట్రోరైలును భాగస్వాములను చేశారు.

### అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నాం

రంగారెడ్డి జిల్లా గుర్రంగూడ, శంషాబాద్ కొత్వాల్‌గూడలో, మేడ్చల్ జిల్లాలోని దూలపల్లి, కండ్లకోయ ఆక్సిజన్ పార్క్, నాగారం, మేడిపల్లి ప్రాంతాల్లో 17 లంగ్‌స్పేస్‌లు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. అర్బన్‌పార్కుల్లో వాకింగ్, పాత్‌వే, సైక్లింగ్‌ట్రాక్, పిల్లలు ఆడుకొనేందుకు చిల్డ్రన్‌కార్నర్స్‌ను తీర్చిదిద్దాం. యోగా, జిమ్ చేసుకోవడానికి, ప్రజలు కూర్చొనేందుకు భారీవృక్షాల కింద రచ్చబండలు ఏర్పాటుచేశాం. అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో అర్బన్‌పార్కులను నిర్మిస్తున్నాం.

**- ప్రశాంత్‌కుమార్ ఝా, అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్**




హరితహారంపై సీఎస్ ఎస్కేజోషి మంగళవారం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వివిధ జిల్లాల కలెక్టర్లు

# ముమ్మరంగా హరితహారం

- రాష్ట్రమంతటా కొనసాగించాలని కలెక్టర్లకు సీఎస్ జోషి ఆదేశం
- సామాజిక బాధ్యతతో అందరూ భాగస్థులవ్వాలని పిలుపు
- సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రమంతటా వర్షాలు విస్తృతంగా కురుస్తున్నందున హరితహారం కార్యక్రమం ముమ్మరంగా కొనసాగేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సామాజిక బాధ్యతతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజలు, కార్పొరేట్ కంపెనీలు, స్వచ్ఛంద సంస్థలు పెద్దసంఖ్యలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అన్ని జిల్లాలు, పట్టణ ప్రాంతాల్లో వివిధ సంస్థ లు, పరిశ్రమలు హరితహారంలో తమవంతు పాత్ర పోషించేలా చూడాలని, కార్పొరేట్ సంస్థలు సామాజిక బాధ్యత (సీఎస్సార్) కింద సోషల్ కార్పస్‌ఫండ్‌ను ఇచ్చేలా ప్రోత్సహించాలని కలెక్టర్లకు సీఎస్ సూచించారు. హరితహారంపై మంగళవారం ఆయన సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ప్రాంత భూములు, వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఎదిగే మొక్కలను నాటాలని, వాటి సంరక్షణకు ఉపాధిహామీ నిధులతో పర్యవేక్షకులను నియమించాలని తెలిపారు. చిన్న మొక్కలను నాటవద్దని, ఇప్పటికే కొంత ఎత్తు ఎదిగిన మొక్కలను నాటితేనే అవి బతికే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అటవీశాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌మిశ్రా సూచించారు. గుంతల తవ్వకం, మొక్కలు నాటడం వెంటవెంటనే జరిగితే వర్షాలను సద్వినియోగం చేసుకోవచ్చని ముఖ్యమంత్రి ఓఎస్డీ ప్రియాంకవర్గీస్ తెలిపారు. హరితహారం ద్వారా గత నాలుగు విడుతల్లో సాధించిన ఫలితాలపై ప్రజల నుంచి మంచి స్పందన కనిపిస్తున్నదని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకుసాగి హరితహారం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించాలని ఆమె సూచించారు. హరితహారంలో నాటిన ప్రతి మొక్కను జియోట్యాగింగ్ చేయాలని, వాటి సంరక్షణ బాధ్యతను కూడా సంబంధిత శాఖల అధికారులే పర్యవేక్షిస్తే మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ప్రశాంత్‌కుమార్‌ఝా అన్నారు.

### కొత్త ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమాలు

అన్ని మండలాలు, గ్రామాల్లోని కొత్త ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ సిబ్బందికి హరితహారంపై అవగాహన కల్పించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ తెలిపారు. ఈ నెల 31న పదవీ విరమణ చేస్తున్న అటవీశాఖ ప్రధాన సంరక్షణాధికారి ప్రశాంత్‌కుమార్‌ఝాను సీఎస్‌తోపాటు ఉన్నతాధికారులు, కలెక్టర్లు అభినందించారు. తెలంగాణలో గత మూడేండ్లుగా అడవుల సంరక్షణ, అర్బన్‌పార్కుల అభివృద్ధి కోసం ఝా అంకితభావంతో కృషిచేశారని, ఆయన నేతృత్వంలో అటవీశాఖ సమర్థంగా పనిచేసిందని అందరూ చప్పట్లతో శుభాకాంక్షలు తెలిపారు.

# హరితహారంలో సిద్దిపేట ఆదర్శం కావాలి

- ఇంటికో వేపచెట్టు నినాదంతో ముందుకెళ్లాలి
- ఎమ్మెల్యే హరీశ్‌రావు పిలుపు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** హరితహారంలో సిద్దిపేట నియోజకవర్గాన్ని రాష్ట్రానికే ఆదర్శంగా నిలుపాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు సూచించారు. పొలం గట్లపై మొక్కలునాటి సంరక్షించి పంటపొలాలను పచ్చలహారంగా మార్చాలన్నారు. ఇంటికో వేపచెట్టు నినాదంతో ముందుకెళ్లాలన్నారు. మంగళవారం సిద్దిపేటలో హరితహారంలో భాగంగా చేపట్టిన బండ్ అండ్ బ్లాంక్ ప్లాంటేషన్‌పై నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గ్రామంలోని అన్ని వర్గాల వారిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలన్నారు. మంచిగా పనిచేసి మొక్కలు నాటి సంరక్షించిన అధికారులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తామని ప్రకటించారు.




మంగళవారం సిద్దిపేటలో 'బండ్ అండ్ బ్లాంక్ ప్లాంటేషన్'పై సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

### బాలికల వసతిగృహం ఆకస్మిక తనిఖీ

జిల్లాకేంద్రంలోని బీసీ బాలికల వసతిగృహాన్ని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మతో కలిసి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా.. లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ఈడీ సరోజ తదితరులు ఉన్నారు.

# కమల్‌నాథ్ మేనల్లుడి బినామీ షేర్లు జప్తు

- రతుల్ పురికి చెందిన రూ.254 కోట్ల విలువైన షేర్లను అటాచ్ చేసిన ఐటీ
- వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంలో ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు


రతుల్ పురి

**న్యూఢిల్లీ, జూలై 30:** మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ మేనల్లుడు రతుల్ పురికి చెందిన రూ.254 కోట్ల విలువైన బినామీ షేర్లను ఆదాయపు పన్ను శాఖ అధికారులు మంగళవారం జప్తు చేశారు. వీవీఐపీ హెలికాప్టర్ల కుంభకోణంలో ఆయనకు విదేశాల నుంచి ముడుపులు ముట్టినట్లు ఆరోపణలున్నాయి. హిందూస్థాన్ పవర్ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్(హెచ్‌పీపీ) చైర్మన్ అయిన రతుల్ పురిపై వచ్చిన పన్ను ఎగవేత, మనీల్యాండరింగ్ ఆరోపణలపై ఐటీ శాఖతోపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) దర్యాప్తు చేస్తున్నాయి. అగస్టా వెస్ట్‌లాండ్ హెలికాప్టర్ల కుంభకోణంలో ప్రధాన నిందితుడైన రాకేశ్ సక్సేనాను దర్యాప్తు సంస్థలు ఇటీవల దుబాయ్ నుంచి భారత్‌కు రప్పించారు. ఆయనను ప్రశ్నించిన దర్యాప్తు సంస్థలు, ముడుపుల మళ్లింపులో రతుల్ పురి పాత్ర ఉన్నట్లు ఆరోపించాయి. రాకేశ్ సక్సేనాకు రతుల్ పురి తరుపున నిధులు అందాయని, షెల్ కంపెనీ ద్వారా వాటిని భారత్‌కు మళ్లించినట్లు పేర్కొన్నాయి.

### భార్య హత్య కేసులో..
### టెహ్రాన్ మాజీ మేయర్‌కు మరణశిక్ష

**టెహ్రాన్:** భార్య హత్య కేసులో దోషిగా తేలిన ఇరాన్ రాజధాని టెహ్రాన్ మాజీ మేయర్ మహమ్మద్ అలీ సజాఫీకి ఆ దేశానికి చెందిన ఓ కోర్టు మరణశిక్ష విధించింది. మార్చి నెలలో తన రెండో భార్య అయిన మిత్రా ఉస్తాద్‌ను సజాఫీ కాల్చి చంపాడు. ఆమె మృతదేహాన్ని బాత్‌రూంలో గుర్తించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. తానే హత్య చేసినట్లు విచారణలో సజాఫీ ఒప్పుకోవడంతో కోర్టు మరణశిక్ష విధించింది.

# టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలు రద్దు

- ఉత్తర్వులు జారీ చేసిన కర్ణాటక ప్రభుత్వం



**బెంగళూరు, జూలై 30:** కర్ణాటకలో కాంగ్రెస్ సీఎం సిద్దరామయ్య హయాంలో అధికారికంగా ప్రారంభించిన టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలను బీజేపీ ప్రభుత్వం రద్దు చేసింది. తొలి నుంచి ఈ వేడుకలను వ్యతిరేకిస్తున్న బీజేపీ.. యెడియూరప్ప నేతృత్వంలో అధికారంలోకి వచ్చిన మూడు రోజులకే రద్దు చేసింది. సీఎం యెడియూరప్ప విలేకరులతో మాట్లాడుతూ 'టిప్పు సుల్తాన్ జయంతి వేడుకల సందర్భంగా గతంలో ఘర్షణలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే బోపయ్య రాసిన లేఖపై క్యాబినెట్‌లో చర్చించాం. మళ్లీ అలాంటి ఘర్షణలు జరుగకుండా ఉండాలంటే వేడుకలను రద్దు చేయడమే ఉత్తమమని భావించాం. అందుకే టిప్పు సుల్తాన్ జయంతి వేడుకలను అధికారికంగా రద్దు చేశాం' అని తెలిపారు. 18వ శతాబ్దపు పాలకుడైన టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలను రద్దు చేయడం తగదని సిద్దరామయ్య తెలిపారు. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా పోరాడిన ఆయన గొప్ప దేశభక్తుడని పేర్కొన్నారు. 10 నవంబర్ 2015న తొలిసారి టిప్పుసుల్తాన్ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ సందర్భంగా జరిగిన ఘర్షణలో వీహెచ్‌పీ కార్యకర్త కుట్టప్ప మరణించారు.





# తప్పుడు యాడ్‌లపై కొరడా

- ప్రకటనలు తప్పుదోవ పట్టించేలా ఉంటే కఠిన చర్యలు
- వినియోగదారుల పరిరక్షణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- వివాదాల పరిష్కార ప్రక్రియ సరళతరం
- కేంద్రమంత్రి రాం విలాస్ పాశ్వాన్ వెల్లడి
- వినియోగదారులు హక్కులను బిల్లు కాలరాస్తుందన్న కాంగ్రెస్
- మెడికల్ లాబీకి కేంద్రం తలొగ్గింది: అసద్


రాం విలాస్ పాశ్వాన్

**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రకటనలు (యాడ్స్) తప్పుదోవ పట్టించేలా ఉంటే సంబంధిత ప్రకటనకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆహార, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి రాం విలాస్ పాశ్వాన్ తెలిపారు. అయితే ఆ యాడ్‌లను ప్రసారం చేసిన మీడియాపై చర్యలు ఉండబోవని స్పష్టం చేశారు. వినియోగదారుల హక్కులను బలోపేతం చేసేందుకు, త్వరితగతిన వివాదాల పరిష్కారానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసేందుకు ఉద్దేశించిన వినియోగదారుల పరిరక్షణ బిల్లు-2018కు మంగళవారం లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. వినియోగదారుల సమస్యల పరిష్కార ప్రక్రియను సరళతరం చేసే ఉద్దేశంతో ఈ బిల్లును తీసుకొచ్చినట్లు కేంద్ర మంత్రి పాశ్వాన్ తెలిపారు. వినియోగదారుల పరిరక్షణ చట్టం-1986 స్థానంలో ఈ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టింది. విపక్షాలు సూచించిన పలు సవరణలు వీగిపోయాయి. లోక్‌సభలో ఆమోదం పొందిన నేపథ్యంలో ఈ బిల్లు తదుపరి రాజ్యసభకు చేరనుంది. గతేడాది డిసెంబర్‌లో పెద్దల సభ ఈ బిల్లును ఆమోదించకపోవడంతో ఇది మురిగిపోయింది. దీంతో కేంద్రం మళ్లీ బిల్లును తీసుకొచ్చింది. దీని ప్రకారం వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్, ఫోరమ్‌లను జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయనున్నారు. అలాగే వినియోగదారుల హక్కుల పరిరక్షణ,





ప్రోత్సాహం, అమలు కోసం సెంట్రల్ కన్జ్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీని (సీసీపీఏని) ఏర్పాటుచేస్తారు. అక్రమ వాణిజ్య పద్ధతుల కారణంగా వినియోగదారులకు హాని జరుగకుండా సీసీపీఏ చర్యలు తీసుకుంటుంది. పాడైన ఉత్పత్తుల వల్ల, సేవా లోపం కారణంగా వినియోగదారులకు నష్టం/హాని వాటిల్లితే బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు బిల్లులో ప్రతిపాదనలు ఉన్నాయని పాశ్వాన్ వివరించారు. బిల్లుపై చర్చ సందర్భంగా బీజేపీ ఎంపీ రాజీవ్ ప్రతాప్ రూఢీ మాట్లాడుతూ.. కరెంట్ కోతలు, కాల్ డ్రాప్స్‌ను కూడా బిల్లు పరిధిలోకి తేవాలని సూచించారు.

**హక్కులను అణచివేస్తుంది: కాంగ్రెస్**

వినియోగదారుల పరిరక్షణ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించింది. ఇది వినియోగదారుల స్వేచ్ఛను నిరోధిస్తుందని, వారి హక్కులను అణచివేస్తుందని ఆ పార్టీ సభ్యుడు ఎంకే విష్ణు ప్రసాద్ విమర్శించారు. బిల్లులను స్టాండింగ్ కమిటీలకు పంపకుండా ప్రభుత్వం వాటిని ఆమోదింపజేసుకుంటున్నదని ఆరోపించారు. డీఎంకే సభ్యుడు వీరాస్వామి మాట్లాడుతూ.. ఈ బిల్లు వినియోగదారుల హక్కులను లాగేసుకుంటుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాలను శత్రువులుగా చూస్తున్నదని, విపక్షంలా చూడడం లేదని ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ప్రతిమా మండల్ మాట్లాడుతూ.. ఈ బిల్లు రాష్ట్రాల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. మరోవైపు జేడీయూ ఈ బిల్లుకు మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ ఎంపీ చందేశ్వర్ ప్రసాద్ మాట్లాడుతూ.. న్యాయవాదులతో సంబంధం లేకుండా వినియోగదారులు ఇంట్లో కూర్చొని ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు.

### వినియోగదారుల హక్కులను నీరు గారుస్తున్నారు: అసద్

**హైదరాబాద్,నమస్తే తెలంగాణ:** మెడికల్ లాబీ ఒత్తిడికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని, వినియోగదారుల హక్కులను నీరుగారుస్తున్నదని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఆరోపించారు. ఆరోగ్య సంరక్షణను ఎందుకు బిల్లు పరిధిలోకి తేలేదని ప్రశ్నించారు. వినియోగదారుల పరిరక్షణ బిల్లుపై లోక్‌సభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏయే సందర్భాల్లో ఏయే శిక్షలు విధిస్తారు? ఏ విధంగా వినియోగదారుల హక్కులను పరిరక్షిస్తారనే విషయాలు బిల్లులో అసందిగ్ధంగా ఉన్నాయని చెప్పారు. వైద్యపరంగా పొరపాట్లు జరిగితే బాధితులకు అందే పరిహారంపై, నిందితులకు శిక్షలపై స్పష్టత లేదన్నారు. ఎన్నికల సందర్భంగా కార్పొరేట్ కంపెనీల నుంచి బాండ్లు తీసుకున్న బీజేపీ ఆ వర్గాలకు లబ్ధిచేకూర్చేలా బిల్లును రూపొందించిందని ధ్వజమెత్తారు. ఈ బిల్లును తాను వ్యతిరేకిస్తున్నానన్నారు.



### మద్యం, గుట్కాలపై పరోక్ష ప్రకటనలను అడ్డుకోవాలి

- టీఆర్‌ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మద్యం, గుట్కా, సిగరెట్ ప్రకటనలపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ పకడ్బందీగా అమలు కావటం లేదని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి (టీఆర్‌ఎస్) అన్నారు. వాటి ప్రకటనలు పరోక్ష పద్ధతుల్లో యథేచ్ఛగా వెలువడుతున్నాయని చెప్పారు. వీటిని అరికట్టేందుకు చట్టంలో పటిష్ఠ నిబంధనలు తీసుకురావాలని కోరారు. మంగళవారం లోక్‌సభలో వినియోగదారుల భద్రత బిల్లుపై ఆయన మాట్లాడుతూ, 1986లో ఈ బిల్లు ప్రవేశపెట్టి.. 1991, 1995, 2002లో మూడు సార్లు సవరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఎన్ని సవరణలు తెచ్చినా వినియోగదారుల హక్కుల విషయంలో కంపెనీల మోసాలు ఆగటం లేదన్నారు. లోపాలు కలిగిన వస్తువుల సరఫరా విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. బ్యాంకింగ్ విషయంలోనూ వినియోగదారుల హక్కుల రక్షణకు అనుగుణంగా నిబంధనల్లో మార్పులు తేవాలన్నారు.

# కనీస వేతనం.. హక్కు!

- వేతన కోడ్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- ఈ బిల్లు చరిత్రాత్మకం: కేంద్ర కార్మిక మంత్రి సంతోష్ గాంగ్వార్
- కార్పొరేట్లకు మేలు చేసేందుకేనన్న కాంగ్రెస్

**న్యూఢిల్లీ, జూలై 30:** కార్మిక చట్టాల సంస్కరణ దిశగా కేంద్రం అడుగులేసింది. కార్మికులకు కనీస వేతనం ఖరారు చేసేందుకు ప్రతిపాదించిన వేతన కోడ్ బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. తద్వారా వేతనాల చెల్లింపుల్లో జాప్యం వంటి సమస్యల పరిష్కారానికి వీలవుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం వేతనాలు, బోనస్ తదితర చెల్లింపుల కోసం అమలు చేస్తున్న కనీస వేతనాల చట్టం, వేతనాల చెల్లింపు చట్టం, బోనస్ చెల్లింపు చట్టం, సమాన వేతన చట్టం స్థానంలో వేతన కోడ్ బిల్లు-2019ను తీసుకొచ్చినట్లు కేంద్ర కార్మికశాఖ సహాయ మంత్రి సంతోష్‌కుమార్ గాంగ్వార్ చెప్పారు. ఈ బిల్లు చట్టంగా మారితే సదరు నాలుగు చట్టాలు రద్దవుతాయి. ఈ బిల్లుతో 50 కోట్ల మంది కార్మికులకు లబ్ధి చేకూరుతుందని మంత్రి తెలిపారు. ఈ బిల్లు చరిత్రాత్మకం అని అభివర్ణించారు. ఈ బిల్లుకు మూజువాణి ఓటుతో లోక్‌సభ ఆమోదం తెలిపింది. 'గత లోక్‌సభలో స్టాండింగ్ కమిటీచేసిన 24 సిఫారసుల్లో 17 సిఫారసులను ప్రభుత్వం ఆమోదించింది. ఈ బిల్లు ప్రకారం కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతో కూడిన త్రైపాక్షిక కమిటీ కనీస వేతనాలను ఖరారు చేస్తుంది. దీంతో కనీస వేతనం ప్రతి కార్మికుడి హక్కుగా మారుతుంది' అని గంగ్వార్ తెలిపారు. చర్చలో కాంగ్రెస్ ఎంపీ కే సురేశ్ మాట్లాడుతూ ఈ బిల్లు కార్పొరేట్ సంస్థలకు మాత్రమే మేలుచేసేదిగా ఉందని, ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ బీఎంఎస్ కూడా ఆందోళన వ్యక్తం చేసిందన్నారు. ఎన్సీపీ సభ్యురాలు సుప్రియా సూలే మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్, ఎంటీఎన్‌ఎల్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడంలో విఫలమైన కేంద్రం.. వేతన కోడ్ బిల్లు తేవడం కంటితుడుపు చర్యేనన్నారు. టీడీపీ సభ్యుడు గల్లా జయదేవ్ మాట్లాడుతూ కనీస వేతనాలతో జాతీయ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఏ)ను అనుసంధానించాలని సూచించారు. 2017 ఆగస్టు 10న వేతనాల కోడ్ బిల్లును ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. దీనిని స్టాండింగ్ కమిటీకి సిఫారసు చేస్తూ 16వ లోక్‌సభ తీర్మానించింది. ఈ మేరకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ గతేడాది డిసెంబర్ 18న ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అయితే ఈలోగా గత లోక్‌సభ రద్దు కావడంతో బిల్లు మురిగిపోయింది.



**ప్రాచీన,** మధ్యయుగాల నాటి ఆచారం చివరకు చారిత్రక చెత్తబుట్టకు చేరుకుంది. ట్రిపుల్ తలాక్‌ను పార్లమెంట్ రద్దు చేసింది. ముస్లిం మహిళలకు జరుగుతున్న చారిత్రక అన్యాయాన్ని సరిచేసింది. లింగ సమానత్వం, సామాజిక న్యాయానికి విజయం లభించింది. ఈ రోజు భారత్ సంతోషిస్తుంది. ట్రిపుల్ తలాక్ ఆచారం వల్ల ఎన్నో ఇబ్బందులకు గురైన ముస్లిం మహిళల అసమాన ధైర్యానికి సెల్యూట్ చేయాల్సిన సందర్భం ఇది. ట్రిపుల్ తలాక్ రద్దుతో మహిళలకు సాధికారత చేకూరుతుంది. సమాజంలో వారికి గౌరవం లభిస్తుంది. బిల్లుకు మద్దతు తెలిపిన పార్టీలు, ఎంపీలకు కృతజ్ఞతలు.

-ప్రధాని నరేంద్రమోదీ



**కేంద్రంలో** ఎన్డీఏ సర్కారు వచ్చిన తర్వాత 2014 నుంచి ముస్లింల ఉనికిపై జరుగుతున్న అనేక దాడుల్లో ట్రిపుల్ తలాక్ బిల్లు అనేది కేవలం ఒక భాగం. మూకదాడులు, పోలీస్ అరాచకాలు, సామూహిక ఖైదు మమ్మల్ని కుంగదీయలేవు. రాజ్యాంగంపై ధృఢ విశ్వాసంతో.. అణచివేతలు, అన్యాయాలు, హక్కుల నిరాకరణకు వ్యతిరేకంగా మేం నిలబడుతాం. ముస్లిం మహిళలపై ఈ బిల్లు భారం మోపుతుంది. వారిని మరింత దారిద్ర్యంలోకి నెడుతుంది. చట్టాలు సమాజాన్ని సంస్కరించలేవు. ఒకవేళ అవి ఆ పనిచేసి ఉంటే.. లింగ నిర్ధారణ అబార్షన్లు, చిన్నారులపై వేధింపులు, వరకట్నం అనేవి గత చరిత్రగానే మిగిలిపోయేవి.

-అసదుద్దీన్ ఒవైసీ, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ

**తలాక్** చెప్పిన భర్తకు మూడేండ్ల జైలు శిక్ష విధించడం.. అతనికున్న చట్టబద్ధమైన హక్కుకు వ్యతిరేకం. జైలుకు వెళ్లిన భర్త భార్యకు ఏ విధంగా జీవనభృతి అందించగలడు? ఈ బిల్లును పునఃపరిశీలించాలని మంత్రిని కోరుతున్నా. మేం ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నాం.

-విజయసాయిరెడ్డి, వైఎస్సార్సీపీ ఎంపీ

## నేడు దేశవ్యాప్తంగా
# వైద్యుల సమ్మె



### జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా ఐఎంఏ పిలుపు

**న్యూఢిల్లీ, జూలై 30:** దేశవ్యాప్తంగా వైద్యులు బుధవారం సమ్మెబాట పట్టనున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) మంగళవారం ఈ మేరకు పిలుపునిచ్చింది. జాతీయ వైద్య కమిషన్ బిల్లుకు వ్యతిరేకంగా చేపడుతున్న నిరసనలు, నిరాహార దీక్షలకు సంఘీభావం తెలుపాలని వైద్యులు, వైద్య విద్యార్థులను కోరింది. దీంతో నేడు అన్ని దవాఖానల్లో సాధారణ వైద్య సేవలు నిలిచిపోనున్నాయి. అయితే అత్యవసర, ఐసీయూ వంటి సేవలకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని ఐఎంఏ తెలిపింది. మరోవైపు ఫెడరేషన్ రెసిడెంట్ డాక్టర్స్ అసోసియేషన్, ఎయిమ్స్ దవాఖానాల రెసిడెంట్ డాక్టర్స్ సంఘం బిల్లును నిరసిస్తూ నల్ల రిబ్బన్లు ధరించి బుధవారం విధులకు హాజరు కానున్నట్లు పేర్కొన్నాయి. భారతీయ వైద్య మండలి(ఎంసీఐ) స్థానంలో జాతీయ మెడికల్ కమిషన్ ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లును లోక్‌సభ సోమవారం ఆమోదించింది. సుమారు మూడు లక్షల మంది వైద్యులు, వైద్య విద్యార్థులు సభ్యులు కలిగిన ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సూచించిన సిఫార్సులుగాక వైద్య రంగానికి హానికలిగించేలా ఈ బిల్లులో నిబంధనలకు మార్పులు చేశారని ఆరోపించింది. పేదలు, విద్యార్థులు, ప్రజాస్వామ్యానికి ఈ బిల్లు వ్యతిరేకమని, తమ ఆందోళనలను కేంద్రం పట్టించుకోకపోతే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు శంతన్ సేన్ హెచ్చరించారు. బిల్లులోని సెక్షన్ 32 ప్రకారం 3.5 లక్షల మంది అర్హతలేని వైద్యేతర వ్యక్తులకు సమాజ ఆరోగ్యం పేరుతో లైసెన్సులు జారీ చేసే నిబంధన వైద్య ప్రమాణాలను దెబ్బతిస్తుందని, పేదల జీవితాలకు ప్రమాదకరంగా మారుతుందని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి ఆర్వీ అశోకన్ విమర్శించారు. సెక్షన్ 45 ప్రకారం జాతీయ వైద్య కమిషన్ విధులు, అధికారాల్లో కేంద్రానికి పెత్తనం కట్టబెట్టడాన్ని తప్పుపట్టారు. వైద్య రంగ స్వయంప్రతిపత్తి, ఆత్మగౌరవాన్ని ఈ బిల్లు దెబ్బతీసేలా ఉన్నదని ఎయిమ్స్ ఆర్డీఏ అధ్యక్షుడు అమరేందర్ సింగ్ మాలి, విద్యార్థి సంఘం అధ్యక్షుడు ముకుల్ కుమార్ ఆరోపించారు. పీజీ కోర్సుల ప్రవేశాలకు నిర్వహించే నీట్, సాధారణ కౌన్సెలింగ్‌తో పాటు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్(నెక్ట్స్)ను తప్పనిసరి చేయడం, డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేటు వైద్య కాలేజీల్లో 50 శాతం సీట్లకు ఫీజుల నియంత్రణ వంటి నిబంధనలను వారు తప్పుపట్టారు. రాజ్యసభలో బిల్లు ఆమోదం సందర్భంగా సవరణలు జరుగుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్‌కు సంజయ్ సింగ్ గుడ్‌బై

- ఆ పార్టీకి నాయకుడే లేడని విమర్శ
- బీజేపీలో చేరనున్నట్లు ప్రకటన

**న్యూఢిల్లీ, ముంబై, జూలై 30:** కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ కుటుంబానికి సన్నిహితుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ పార్టీకి రాజీనామా చేశారు. అలాగే రాజ్యసభ సభ్యత్వానికి కూడా రాజీనామా చేశారు. బుధవారం బీజేపీలో చేరనున్నట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఇంకా పాత సిద్ధాంతాలను పట్టుకొని వేలాడుతున్నదని, భవిష్యత్ గురించి ఆలోచించడం లేదని సంజయ్ సింగ్ విమర్శించారు. 'నేను తొందరపడి కాంగ్రెస్‌కు రాజీనామా చేయలేదు. అన్ని కోణాల్లో ఆలోచించే రాజీనామా చేశాను. కాంగ్రెస్‌కు నాయకుడు లేడు. నాయకుడిని ఎంపిక చేయడంలోనూ ఆ పార్టీ విఫలమవుతున్నది. పార్టీలో కనీసం మార్గనిర్దేశం చేసేవారే లేరు. కానీ ఈ రోజు దేశమంతా ప్రధాని మోదీ వెంట ఉన్నది. కాబట్టి నేను కూడా ఆయన వెంట నడుస్తాను' అని తెలిపారు. ప్రధాని మోదీ 'సబ్‌కా సాత్ సబ్‌కా వికాస్' అనే లక్ష్యంతో పనిచేస్తున్నారని, అందుకే బీజేపీలో చేరాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. కాగా సంజయ్ సింగ్ గతంలో బీజేపీలో ఉన్నారు. ఆ పార్టీ టికెట్‌పై ఎంపీగానూ గెలిచారు. తర్వాత ఆయన బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. మళ్లీ ఇప్పుడు బీజేపీలోకి వెళ్తున్నారు. సోనియా గాంధీ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం, రాహుల్ గాంధీ పాత నియోజకవర్గమైన అమేథీల్లో సంజయ్ సింగ్ ప్రభావం ఎక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలో ఈ రెండు నియోజకవర్గాల్లో పార్టీ పటిష్ఠానికి ఆయన ఉపయోగపడుతారని బీజేపీ భావిస్తున్నది.

**మహారాష్ట్రలో నలుగురు విపక్ష ఎమ్మెల్యేలు రాజీనామా.. బీజేపీలో చేరే అవకాశం**

మహారాష్ట్రలో ఎన్సీపీ, కాంగ్రెస్‌కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేశారు. త్వరలో ఈ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో వీరు రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకున్నది. రాజీనామా చేసిన వారిలో ఎన్సీపీ ఎమ్మెల్యేలు శివేంద్రసిన్హ్‌రాజే భోంస్లే (సతారా నియోజకవర్గం), వైభవ్ పిఛాడ్ (అకోలే), సందీప్ నైక్ (ఐరోలి), కాంగ్రెస్ ఎమ్మెల్యే కాళిదాస్ కోలాంబ్‌కర్ (నైగాన్) ఉన్నారు. వీరంతా బుధవారం బీజేపీలో చేరే అవకాశముంది.

# ట్రిపుల్ తలాక్‌కు చెల్లు


మొదటిపేజీ తరువాయి...


ఆమోదముద్ర వేసిన అనంతరం బిల్లు చట్టరూపం దాల్చనుంది. అలాగే గత ఫిబ్రవరి 21న జారీచేసిన ఆర్డినెన్స్ రద్దుకానుంది. కాగా, అంతకుముందు ఈ బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని విపక్షాలు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని రాజ్యసభ తిరస్కరించింది. విపక్షాల తీర్మానానికి అనుకూలంగా 84, వ్యతిరేకంగా 100 ఓట్లు వచ్చాయి. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందడంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ముస్లిం మహిళలకు జరిగిన 'చారిత్రక అన్యాయాన్ని' సరిచేశామని, ఇక ఈ ప్రాచీన, మధ్యయుగ ఆచారం చారిత్రక చెత్తబుట్టకే పరిమితమైందని ఆయన వ్యాఖ్యానించారు.

**బిల్లు గట్టెక్కిందిలా..**

రాజ్యసభలో మొత్తం 242 మంది సభ్యులు ఉండగా, ఎన్డీఏకు 107 మంది సభ్యుల బలముంది. సాధారణంగా బిల్లు ఆమోదానికి అవసరమైన మెజార్టీ మార్క్ 122 కాగా, ఎన్డీఏ మిత్రపక్షాలైన జేడీయూ(ఆరుగురు ఎంపీలు), అన్నాడీఎంకే (11 మంది) సభ్యులు వాకౌట్ చేయడంతో మెజార్టీ మార్క్ తగ్గింది. ఇది బీజేపీకి పరోక్షంగా లబ్ధి చేకూర్చింది. వివాదాస్పద ఆర్టీఐ సవరణ బిల్లు ఆమోదానికి కూడా గత వారం బీజేపీ ఇదే వ్యూహాన్ని అనుసరించింది. మరోవైపు, ఓటింగ్ సమయంలో సుమారు 20 మంది విపక్ష సభ్యులు గైర్హాజరు కావడం కూడా అధికార పక్షానికి కలిసొచ్చింది. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీల నుంచి ఐదుగురు చొప్పున గైర్హాజరయ్యారు. ఎన్సీపీకి చెందిన శరద్ పవార్, ప్రఫుల్ పటేల్ కూడా సభకు హాజరుకాలేదు. మరోవైపు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ నుంచి ఒక్కొక్కరు చొప్పున గైర్హాజరయ్యారు. అలాగే బిల్లును వ్యతిరేకిస్తున్న నామినేటెడ్ సభ్యుడు కేటీఎస్ తులసి కూడా సభకు హాజరుకాలేదు. ఒకవేళ విపక్ష సభ్యులందరూ హాజరై ఉంటే బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపే తీర్మానం ఆమోదం పొంది ఉండేదని పలు సభ్యులు వ్యాఖ్యానించారు. సభకు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ విప్ జారీ చేసిన నేపథ్యంలో.. గైర్హాజరైన సభ్యులు వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.


ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం పొందడంతో వారణాసిలో ముస్లింల సంబురాలు

**వారిని ఫుట్‌పాత్‌లపై వదిలేయలేం: రవిశంకర్**

ట్రిపుల్ తలాక్ బిల్లుపై సుమారు నాలుగు గంటలపాటు సభలో వాడీవేడీ చర్చ జరిగింది. అనంతరం కేంద్ర న్యాయ శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ చర్చకు సమాధానమిచ్చారు. వరకట్నం, బహుళ వివాహాల నిషేధిత చట్టాల్లో సంబంధిత హిందూ భర్తలకు జైలు శిక్షలు విధించేలా నిబంధలు ఉన్నాయని పేర్కొంటూ ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులిచ్చిన భర్తకు జైలు శిక్ష విధించడాన్ని ఆయన సమర్థించారు. వాట్సాప్ తదితర మార్గాల్లో తలాక్ చెప్పడం ద్వారా విడాకులకు గురైన బాధిత మహిళలను ఫుట్‌పాత్‌లపై వదిలేయలేమన్నారు. ఇప్పటికే 20కి పైగా ఇస్లామిక్ దేశాలు ట్రిపుల్ తలాక్‌పై నిషేధం విధించాయని గుర్తు చేశారు. బీజేపీ ముస్లిం వ్యతిరేకి అన్న ఆరోపణలపై ఆయన స్పందిస్తూ.. హిందూ వివాహ చట్టంలో గుంపగుత్తగా సంస్కరణలు తెచ్చినప్పుడు మతపరమైన అభ్యంతరాలను ఎందుకు లేవనెత్తలేదని నిలదీశారు. హిందూ మతానికి చెందిన వ్యక్తి మరో మహిళను వివాహమాడితే జైలు శిక్షలు పడేలా నిబంధనలు ఉన్నాయని గుర్తుచేశారు. ఆ సమయంలో బాధిత కుటుంబం ఎలా నడుస్తుందని ఏ ఒక్కరూ ఎందుకు ప్రశ్నించలేదన్నారు. ముస్లిం కమ్యూనిటీ నుంచి తమకు తక్కువ ఓట్లు రావొచ్చు కానీ, తాము వారిని సమాజంలో భాగంగానే చూస్తామని, సబ్‌కాసాత్, సబ్‌కావికాస్, సబ్‌కావిశ్వాస్ అన్నదే తమ నినాదమని పేర్కొన్నారు.

**ఓ వర్గాన్ని టార్గెట్ చేయకూడదు: కాంగ్రెస్**

విపక్ష నేత గులాం నబీ ఆజాద్ మాట్లాడుతూ.. ఒక మతాన్ని అంతం చేసేలా బిల్లును రూపొందించకూడదని పేర్కొన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన బిల్లును రూపొందించడం ద్వారా ప్రభుత్వం ఓ వర్గాన్ని టార్గెట్ చేయరాదని చెప్పారు. మహిళలకు సాధికారత కల్పించేలా చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత బిల్లు ముస్లింలను వేధించేలా దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నదని, దీనిపై సమీక్షించేందుకు పార్లమెంటరీ కమిటీకి పంపాలని విపక్షాలు డిమాండ్ చేశాయి.

### బిల్లు ఏం చెబుతున్నది?

మూడుసార్లు ట్రిపుల్ తలాక్ చెప్పడం లేదా రాయడం ద్వారా (వాట్సాప్, ఎస్ఎంఎస్, ఏ ఇతర ఎలక్ట్రానిక్ చాటింగ్ ద్వారానైనా) విడాకులు ఇవ్వడాన్ని క్రిమినల్ నేరంగా పరిగణిస్తారు. ట్రిపుల్ తలాక్ ద్వారా విడాకులు ఇచ్చిన భర్తకు ప్రతిపాదిత బిల్లు ప్రకారం మూడేండ్ల వరకు జైలు శిక్ష విధిస్తారు. వారెంట్ అవసరం లేకుండా నిందితుడిని అరెస్ట్ చేసేందుకు పోలీస్ అధికారులకు ఈ బిల్లు అధికారాలు కల్పిస్తున్నది. చట్టం దుర్వినియోగం కాకుండా చూసేందుకు బిల్లులో పలు నిబంధనలు పొందుపరిచారు. బాధిత భార్య లేదా ఆమె రక్త సంబంధీకులు ఫిర్యాదు చేస్తేనే కేసు నమోదుచేస్తారు. బాధిత మహిళను విచారించిన అనంతరం మెజిస్ట్రేట్ బెయిల్ ఇచ్చేందుకు వీలుంది. బాధిత మహిళ తనకు, తనపై ఆధారపడ్డ పిల్లల రక్షణ కోసం భరణం కోరేందుకు బిల్లులో అవకాశం కల్పించారు.

# సీబీఐకి ఉన్నావ్ కేసు

### అప్పగించిన కేంద్రసర్కార్

**న్యూఢిల్లీ/ లక్నో, జూలై 30:** ఉత్తర్‌ప్రదేశ్‌లోని రాయబరేలీ వద్ద ఉన్నావ్ లైంగిక దాడి బాధితురాలి కారు ప్రమాదం కేసును కేంద్రం సీబీఐకి అప్పగిస్తూ మంగళవారం నిర్ణయం తీసుకున్నది. బాధితురాలి కుటుంబం, విపక్షాల డిమాండ్ మేరకు యూపీ సర్కార్ సోమవారం రాత్రి ఈ కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కేంద్రానికి సిఫారసు చేసిన సంగతి తెలిసిందే. రెండు రోజుల క్రితం ఉత్తర్‌ప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఉన్నావ్ లైంగికదాడి బాధితురాలు లక్నో దవాఖానలో మృత్యువుతో పోరాడుతున్నారు. కాగా, విపక్షాలు బీజేపీపై విమర్శలు ఎక్కుబెట్టాయి. దేశ రాజధాని ఢిల్లీ, అటు యూపీ రాజధాని లక్నో నగరాల్లో ఆందోళన చేపట్టాయి. మంగళవారం లోక్‌సభ సమావేశం కాగానే విపక్షాలు ఆందోళనకు దిగాయి. 'మాకు న్యాయం కావాలి' అని నినదిస్తూ 30 మంది కాంగ్రెస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి సుమారు 40 నిమిషాలు ఆందోళన చేశారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ), బీఎస్పీ, డీఎంకే సభ నుంచి వాకౌట్‌చేశాయి. అంతకుముందు కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌదరి మాట్లాడుతూ ఉన్నావ్ ఘటన సిగ్గుచేటని, సభ్య సమాజానికే కళంకం అని అన్నారు. మరోవైపు బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ పార్లమెంట్ బయట విపక్షాలు ఆందోళన చేశాయి. కాగా, ఉన్నావ్ లైంగిక దాడి బాధితురాలు.. తమ కుటుంబానికి ముప్పు ఉన్నదంటూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి (సీజేఐ) లేఖ రాశారు.

# జనావాసాల్లో కూలిన పాక్ సైనిక విమానం

### 19 మంది మృతి.. పలువురికి గాయాలు

**ఇస్లామాబాద్, జూలై 30:** పాకిస్థాన్ సైన్యానికి చెందిన ఒక తేలికపాటి విమానం జనావాసాల్లో కూలింది. దీంతో 19 మంది మరణించారు. మృతుల్లో ఐదుగురు సైనిక సిబ్బంది కూడా ఉన్నారు. ఈ దుర్ఘటన మంగళవారం రావల్పిండిలోని మోరాకలు గ్రామంలో చోటుచేసుకుంది. పైలట్ల రోజువారీ శిక్షణలో భాగంగా విమానం గాలిలోకి ఎగిరింది. కొద్దిసేపటికే ఇండ్లపై కూలడంతో 14 మంది పౌరులు, ఇద్దరు పైలట్లు, ముగ్గురు విమాన సిబ్బంది మరణించారు. ఆరు ఇండ్లు ధ్వంసమయ్యాయి. విమానం ఒక్కసారిగా కూలడంతో భారీగా మంటలు చెలరేగి 12 మందికి గాయాలయ్యాయి. మంటలు పలు ఇండ్లకు కూడా అంటుకున్నాయి. విషయం తెలిసిన అగ్నిమాపక సిబ్బంది, సైనికులు రంగంలోకి దిగి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. గాయపడిన వారిని దవాఖానలకు తరలించారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.



కాంగ్రెస్ ఇంకా గతంలోనే ఉంటున్నది. భవిష్యత్తుపై దృష్టిలేదు. దేశం మోదీ వైపు ఉన్నది కనుక నేను కూడా ఆయన వైపు ఉన్నా. కాంగ్రెస్ పార్టీకి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసిన. బీజేపీలో చేరుతున్న.


**సంజయ్ సింగ్, అమేథీ రాజకీయ ప్రముఖుడు**

జమ్ము కశ్మీర్ రాష్ట్ర ప్రత్యేక హోదాకు సంబంధించి ఏ ప్రధాన నిర్ణయం తీసుకోలేదు. (సోషల్ మీడియాలో) ఎన్నో పుకార్లు వ్యాపిస్తున్నయి. ప్రజలు ఈ పుకార్లను నమ్మవద్దు. అంతా బాగానే ఉన్నది.

**సత్యపాల్ మాలిక్, జమ్ముకశ్మీర్ గవర్నర్**



**చరిత్రలో నేడు**



**1498**

మూడవ సముద్ర ప్రయాణంలో ట్రినిడాడ్ దీవిని కనుగొన్న కొలంబస్.

**1777**

కాంటినెంటల్ ఆర్మీ (అమెరికా స్వాతంత్ర్య సైన్యం) మేజర్ జనరల్‌గా నియమితుడైన మార్కిస్ డి లేఫయెట్.





**2006**

తన సోదరుడు రావుల్ కాస్ట్రోకు అధికారం అప్పగించిన ఫిడేల్ కాస్ట్రో.

న్యూయార్క్ రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుంచి లబ్ధి పొందే కాంట్రాక్టర్ల నుంచి గవర్నర్ ఆంఢ్ర్యూ కోమా మిలియన్ల కొద్దీ డాలర్ల చందాలు స్వీకరించారని వెల్లడైంది. ఒక్క గవర్నర్ మాత్రమే కాదు, శాసనసభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ సంస్థల నుంచి కాంట్రాక్టులు పొందేవారి నుంచి చందాలు స్వీకరించడం చట్టవిరుద్ధం కాదు. కానీ కొన్ని ఇతర రాష్ట్రాలలో మాత్రం ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే సంస్థల నుంచి చందాలు తీసుకోవడం నేరం. చట్టాలను సంస్కరిస్తామని గవర్నర్ కోమా అంటున్నారు. తాము లబ్ధి పొందే సంస్థల నుంచి చందాలు స్వీకరించబోనని ఆయన ప్రకటించాలె.

**ది న్యూయార్క్ టైమ్స్**

జూద గృహాలకు నేరస్థులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల ఆస్ట్రేలియా ప్రభుత్వం క్రౌన్ సంస్థ నడుపుతున్న ఈ జూద కేంద్రాలను నియంత్రించాలె. ఈ జూద గృహాలలో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. చైనా యాత్రికులు వీటి కోసం వస్తున్నారు. ఆస్ట్రేలియా ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తే జూదరులు మకావు, సింగపూర్ తదితర జూద కేంద్రాలకు పోతారని, క్రౌన్ ఆదాయంతో పాటు పన్నులు తగ్గిపోతాయనే వాదన ఉన్నది. కానీ ఈ కారణంగా ఆస్ట్రేలియాను నల్లధనాన్ని మార్చుకునే కేంద్రంగా మార్చడం భావ్యం కాదు. .

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# విషాహారం

మనిషి ఆరోగ్యం కోసం, మనుగడ కోసం ఆహారం తీసుకుంటాడు. ఆ తీసుకునే ఆహారమే విషతుల్యమైతే.. ఆరోగ్యమే కాదు, మనుగడకే ముప్పు ఏర్పడుతున్నది. పుష్టిగా ఎదుగటం కోసం, ఆరోగ్యకరమైన జీవనం కోసం తీసుకుంట్నున ఆహార పదార్థాలే విషతుల్యమైతే ఆరోగ్యం అటకెక్కి, చావుకు దగ్గరవుతారు. సరిగ్గా ఇప్పుడు దేశంలో ఇదే జరుగుతున్నదని మిలీనియం సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ ఫౌండేషన్ (ఎస్డీజీఎస్), థాట్ ఆర్బిటేజ్ అనే అధ్యయన సంస్థలు చెబుతున్నాయి. 'భారత్‌లో ఆహారం, నీటి కాలుష్యంతో పడే ఆర్థిక భారం' పేరుతో విడుదల చేసిన నివేదికలో మనం రోజూ తీసుకునే ఆహారం, తాగే నీరుతోనే ఎక్కువ రోగాలు వస్తున్నాయని తమ అధ్యయనంలో తేల్చిచెప్పాయి. గ్రామీణ ప్రాంతాలు మొదలు, నగరాల దాకా ప్రజల ఆహార అలవాట్లలో వచ్చిన మార్పుల కారణంగానే రోగాలు వస్తున్నాయని తెలుపటం గమనార్హం. మరోవైపు తాగునీరు హానికరమైన పదార్థాలతో కలుషితమైపోవటం కారణంగా మరింత ఎక్కువగా వ్యాధులు వస్తున్నాయని అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ కారణంగా ప్రజలు ఆరోగ్యం కోసం పెడుతున్న ఖర్చు నానాటికీ పెరిగిపోతున్నది. ఎస్డీజీఎస్ అధ్యయనం ప్రకారం కలుషిత ఆహారంతో వచ్చిన జబ్బులు నయం చేసుకోవటానికి 2016-17 సంవత్సరంలో సుమారు 33 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తేలింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే 2022 నాటికి 9.50 లక్షల కోట్ల రూపాయలు దవాఖానలకే పెట్టాల్సి వస్తుందని హెచ్చరించింది. మొత్తంగా చూస్తే మనిషి సాధిస్తున్న ఆధునికాభివృద్ధి మూలంగా మరింతగా సమస్యల విష వలయంలో చిక్కుకుపోతున్నాడు. ముఖ్యంగా ఆరోగ్యం విషయంలో ఆధునికాభివృద్ధి, జీవన విధానమే అంతులేని సమస్యలను తెచ్చిపెడుతున్నది.

ఆహార పంటల దిగుబడి కోసం, కూరగాయలు,ఆకుకూరల పంటలను చీడపీడల నుంచి సంరక్షించుకునేందుకు రైతులు విచక్షణారహితంగా రసాయనాలను వినియోగిస్తున్నారు. ఈ క్రిమి సంహారక మందులు, రసాయన ఎరువులతో ఉత్పత్తి అవుతున్న ఆహార పదార్థాలన్నీ కలుషితమవుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల్లో వినియోగిస్తున్న కూరగాయలను పరిశీలించినప్పుడు అంతర్గతంగా కూరగాయాల్లో, వాటిపైన కూడా ప్రమాదకరస్థాయిలో హానికరమైన రసాయనాల అవశేషాలున్నట్లు జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ (ఎన్ఐపీహెచ్ఎం) తెలిపింది. మార్కెట్లో దొరుకుతున్న 15 రకాల కూరగాయలపై హానికరమైన రసాయనాలున్నట్లు గుర్తించారు. ఇలాంటి విషతుల్యమైన ఆహార పదార్థాలను తీసుకోవటం వల్ల మనిషి ఆరోగ్యం పుంజుకునే బదులు మరింతగా కృషించిపోతున్నది. అనేకరకాల చర్మవ్యాధులు, శ్వాస సంబంధ వ్యాధులతోపాటు ప్రాణాంతకమైన క్యాన్సర్ లాంటి రోగాలు పెరిగిపోతున్నాయి. ఈ పరిస్థితి గ్రామాలతో పోలిస్తే నగరాల్లోనే తీవ్రంగా ఉంటున్నది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాల కు సమీప ప్రాంతాల్లో కాలుష్య జలాలను పంటల సాగుకు వినియోగించటం కూడా ప్రధాన సమస్యగా మారుతున్నది. మరోవైపు ఆహారాన్ని ఉత్పత్తి చేసే సంస్థలు కనీస నిబంధనలు, పరిశుభ్రతను పాటించకపోవటం ప్రధాన సమస్యగా ఉంటున్నది. విశాలభారత దేశంలో గుర్తింపు పొందిన ఆహార ఉత్పత్తి సంస్థలు 39 వేల పైచిలుకు మాత్రమే ఉన్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అనధికారికంగా ఏ ప్రమాణాలు పాటించని ఆహారోత్పత్తి సంస్థలు 23 లక్షలకు పైచిలుకు ఉన్నాయి. మరోవైపు అక్రమ లాభార్జనకు కల్తీ ఆహార పదార్థాలను తయారుచేయటం పెద్దఎత్తున సాగుతున్నది. ఇలాంటి పరిస్థితుల్లోంచే ఇవ్వాళ ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యాధిగ్రస్తుడై ఉంటున్నాడు.

> **తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామ గ్రామానికి రక్షిత మంచినీరు అందించే కార్యక్రమం ప్రజారోగ్యానికి ఎంతో ఊతమిచ్చేదే. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించటంతో పాటు ఆహారకల్తీని అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. వంటలకు ఉపయోగించే నూనెలతో పాటు, పసుపు, అల్లం. పప్పు, కారం, ఉప్పు లాంటి అత్యవసర పదార్థాల కల్తీని నిరోధించాలి. ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో కదిలి ఆహార కల్తీని అరికట్టాలి.**

దేశంలో ఇప్పటికీ రక్షిత మంచినీరుకు నోచుకోని ప్రజలు కోట్లాదిగా ఉన్నారు. దీనికితోడు భూగర్భ జలాల్లో ఫ్లోరిన్, ఆర్సెనిక్ లాంటివి మోతాదుకు మించి ఉండటం మూలంగా కూడా ప్రజలు రోగాలబారిన పడుతున్న స్థితి ఉన్నది. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాల్లోని 203 జిల్లాలు ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలుగా తీవ్ర సమస్యలను ఎదుర్కొంటున్నాయి. భూగర్భ జలాల్లో ఉండే సూక్ష్మ క్రిముల కారణంగా అనేక వ్యాధులు వస్తున్నాయి. జాండిస్, హెపటైటిస్ లాంటి వ్యాధులు సంక్రమించి ప్రజల ప్రాణాలను తోడేస్తున్నాయి. అయితే ప్రజలకు రక్షిత మంచినీరు అందించటం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుజల పథకం ద్వారా రక్షిత మంచినీరు అందితే పరిస్థితి మెరుగుపడే అవకాశాలున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం ద్వారా గ్రామ గ్రామానికి రక్షిత మంచినీరు అందించే కార్యక్రమం ప్రజారోగ్యానికి ఎంతో ఊతమిచ్చేదే. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించటంతో పాటు ఆహారకల్తీని అరికట్టాల్సిన ఆవశ్యకత ఎంతో ఉన్నది. వంటలకు ఉపయోగించే నూనెలతో పాటు, పసుపు, అల్లం. పప్పు, కారం, ఉప్పు లాంటి అత్యవసర పదార్థాల కల్తీని నిరోధించాలి. ప్రభుత్వ వ్యవస్థలు సమన్వయంతో కదిలి ఆహార కల్తీని అరికట్టాలి. ఆహార కల్తీని అరికట్టి, ఆహారపదార్థాలు కాలుష్యంతో విషతుల్యం కాకుండా చర్యలు తీసుకున్నప్పుడే మనిషి ఆరోగ్యానికి భరోసా లభిస్తుంది.

**జనగళం**

### సూచికల బోర్డులు పెట్టాలె

రాష్ట్రవ్యాప్తంగా చాలాచోట్ల రోడ్డుకు దగ్గర్లో, తక్కువ ఎత్తులో 11 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటం వల్ల విద్యుత్ ప్రమాదాలు జరుగుతున్నాయి. మనుషులు మూగ జీవాలు మృత్యువాత పడుతున్నారు. ఎంతోమంది చిన్నపిల్లలు ఆటలాడుకుంటూ పోయి కరెంట్ షాక్‌కు గురై గాయాలపాలవుతున్నారు. విద్యుత్ అధికారులు ఈ విషయమై ఆలోచించాలి. వానకాలంలో ట్రాన్స్‌ఫార్మర్ల దగ్గరినుంచి పోతే చాలు విద్యుత్ షాక్ వచ్చే అవకాశాలుంటాయి. కాబట్టి అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లను రోడ్డుకు దూరంలో, ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయాలి. ట్రాన్స్‌ఫార్మర్లున్న చోట ప్రమాద సూచికల బోర్డులను పెట్టించటమే కాకుండా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెను ఏర్పాటుచేయాలి.

**- ఎన్.కృష్ణతేజ, లక్ష్మీనగర్, కరీంనగర్**

### శుభపరిణామం

రాష్ట్రంలో శిశుమరణాలు సంఖ్య తగ్గిందని ఇటీవల కేంద్ర ఆరోగ్యశాఖ చేసిన అధ్యయనంలో వెల్లడైంది. ఇది శుభపరిణామం. మరణాల సంఖ్య 35 నుంచి 29 వరకు తగ్గుముఖం పట్టడం రాష్ట్ర ఆరోగ్యశాఖ పనితీరును తెలియజేస్తున్నది. గత ఐదేండ్లుగా ముఖ్యమంత్రి కేసీఆర్ వైద్యరంగంపై ప్రత్యేక దృష్టిసారించారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచడం, కేసీఆర్ కిట్ పథకం ప్రవేశపెట్టడం లాంటి వినూత్న పథకాల వల్లనే వైద్యరంగంలో మార్పులు చోటుచేసుకున్నాయనడంలో సందేహం లేదు.

**- బొల్లం రమాదేవి, అల్వాల్, హైదరాబాద్**

### కఠిన చర్యలు తీసుకోవాలె

హైదరాబాద్ నగరంలోని ప్రధాన హోటళ్లలో కూడా ఆహార కల్తీ జరుగుతున్నట్లు తెలుస్తున్నది. కల్తీ ఆహారంతో ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయి. కుళ్లిపోయిన మాంసం, వంటకాలకు కల్తీ నూనె వినియోగిస్తున్నారు. కాబట్టి సంబంధిత అధికారులు హోటళ్లపై తరచూ దాడులు చేయాలి. పరి శుభ్రతకు, స్వచ్ఛతకు పెద్దపీట వేయాలె. కల్తీకి పాల్పడుతున్న హోటళ్లను తక్షణమే సీజ్‌చేసి ప్రజారోగ్యాన్ని కాపాడాలె.

**- కొలిపాక రంజిత్ గౌడ్, పెద్ద సముద్రాల, సిద్దిపేట జిల్లా**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**డాక్టర్ అనభేరి రాజేశ్వర్‌రావు**

# ఆచరణాత్మక విద్య అవసరం

**ఈ నూతన విద్యావిధానం-2019లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్య అమలుకోసం, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలను 3 నుంచి 8 ఏండ్ల విద్యార్థుల ప్రయోజనార్థం గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రారంభించాలి. బోధనా సామాగ్రిని సమకూర్చాలి. నిష్ణాతులైన బోధకులను నియమించాలి.**

స్వాతంత్ర్యానంతరం మానవ వనరుల అభివృద్ధే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఇప్పటికీ కృషిచేస్తున్నాయి. అయినప్పటికీ దేశంలో నిరక్షరాస్యత ప్రధాన సమస్యగానే ఉన్నది. జాతీయస్థాయిలో విద్యారం గ అభివృద్ధి కోసం 1964 కొఠారీ అధ్యక్షతన రూపకల్పన చేసుకొని దాని అమలుకు ప్రభుత్వాలు కృషిచేశాయి. తదనంతరం ఆశించిన ఫలితాలు సాధించలేదు. దీంతో 1984లో నాటి మానవ వనరుల అభివృద్ధి శాఖా మాత్యులు పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో మరో విద్యా విధానం రూపకల్పనకు పునాది వేశారు. తర్వాత 1986లో 'జాతీయ విద్యా విధానం' గా ఏర్పడి మేధావుల సహకారంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడి గా విద్యారంగ అభివృద్ధి కోసం పాటుపడినాయి. నాటి జాతీయ విద్యా విధానంలో భాగంగా 'ఆపరేషన్ బ్లాక్ బోర్డు' పథకాన్ని ప్రవేశపెట్టారు. దేశంలోని అన్ని ఆవాసాల్లో బడీడు పిల్లల ప్రయోజనార్థం కిలోమీటరు పరిధిలో పాఠశాలలు ప్రారంభించి కనీసం ఇద్దరు ఉపాధ్యాయులతో బోధన, క్రీడా సామాగ్రిని, కళల ప్రోత్సాహానికి వాయిద్య పరికరాలను సమకూర్చాలన్నారు. శాశ్వత భవనాలు కనీసం రెండు శాశ్వత గదులతో నిర్మించాలన్నారు. గ్రామాల్లోని బడీడు పిల్లలందరికీ బీద, ధనిక తేడా లేకుండా అందరికీ చదువుకునే అవకాశం కల్పించాలన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయి ఉపాధ్యాయులందరికీ వృత్తిపూర్వ, వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలన్నారు. కృత్యాత్మక బోధనలో శిక్షణనిచ్చి, విద్యార్థి కేంద్రీకృత విద్యా విధానానికి దేశవ్యాప్తం గా పునాది వేసింది. అయితే నేటికీ ఆశించిన స్థాయిలో గుణాత్మక విద్య లేదు. విద్యార్థులందరిలో భాషా సామర్థ్యాలు, జీవన నైపుణ్యాలు లేవు. శాస్త్ర, సాంకేతిక రంగాభివృద్ధికి తగినట్లుగా విద్యార్థుల్లో, ఉపాధ్యాయుల్లో కంప్యూటర్ పరిజ్ఞానం లేవు. తరగతి గదిలో దృశ్య-శ్రవణ బోధన నిర్వహించలేదు. ప్రపంచస్థాయి విద్యాసంస్థలతో మన విద్యా సంస్థలు పోటీపడలేవు. విద్యార్థుల విజ్ఞానార్జన కేవలం జ్ఞానరంగానికే పరిమితమయ్యాయి. విషయ పరిజ్ఞానమంతా మౌఖికంగా కంఠస్థం చేయడం తప్ప విషయపరిజ్ఞానాన్ని నిత్యజీవితంలో ఉపయోగించుకునే సామర్థ్యాలు విద్యార్థుల్లో పెంపొందలేదు. ఇవన్నీ మనందరినీ ఆందోళనలకు గురిచేస్తున్న సమస్యలు.

నేడు కేంద్ర ప్రభుత్వం భవిష్యత్ నవ భారత నిర్మాణం కోసం 2020 నాటికి 26 ఏండ్లలోపు ఉన్న పౌరులను దృష్టిలో పెట్టుకున్నది. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని దేశ పౌరులందరూ దేశ ప్రగతిలో, ఆర్థికాభివృద్ధిలో భాస్వాములయ్యేందుకు, గుణాత్మక విద్యను అందించాలనుకుంటున్నది. విద్యార్థుల్లో జీవన నైపుణ్యాలను పెంచి శాస్త్ర, సాంకేతిక రంగాభివృద్ధికి తగినట్టుగా దేశంలోని మానవ, సాంకేతిక వనరులన్నింటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా ప్రోత్సాహాన్ని అందించాలనుకుంటున్నది. ఆర్థిక, వ్యవసాయ, పారిశ్రామికరంగాల అభివృద్ధిలో భాగస్వాములను చేసేందుకు మరో నూతన విద్యా విధానానికి రూపకల్పన చేయాలనే ఆలోచనతో ఇస్రో మాజీ ఛైర్మన్ ప్రొఫెసర్ కస్తూరి రంగన్ అధ్యక్షతన కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీ సూచించిన జాతీయ విద్యావిధానం ముసాయిదాను 1986 నాటి జాతీయ విద్యా విధానం తర్వాత మారిన పరిస్థితులకు అనుగుణంగా నూతన విద్యావిధానాన్ని తేవాలని కేంద్రం భావిస్తున్నది. .

దేశ పౌరుల వికాసానికి, సమాజ ప్రగతికి, మానవజాతి పురోగతికి తోడ్పడే సాధనం విద్య. విద్యా శక్తిని సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా సమర్థవంతంగా వినియోగించుకునేందుకే నూతన విద్యావిధానం-2019 ఆవిష్కృతమైంది. అందరికీ నాణ్యమైన విద్యను అందించడం ఈ జాతీయ విద్యావిధానం ప్రధాన లక్ష్యం. తద్వారా దేశాన్ని సుస్థిరమైన, శక్తివంతమైన జ్ఞాన సమాజంగా మార్చడానికి భారతీయ కేంద్రీకృత విద్యావ్యవస్థను రూపొందించడం. ఈ నూతన విద్యావిధానంలో ప్రధానంగా నాటి ఆపరేషన్ బ్లాక్ బోర్డు పథకం స్థానంలో పాఠశాల విద్యలో చాలా మార్పులు తీసుకొని వచ్చేందుకు కృషిచేయాలనుకుంటున్నది. మూడేండ్లు నిండిన పిల్లల్ని విద్యాసంస్థల్లో ప్రవేశం కల్పించడం కోసం పూర్వ ప్రాథమిక విద్యా సంస్థలను ఏర్పాటు చేయాలి. దేశవ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల అన్నింటిలో పూర్వ బాల్య సంరక్షణ విద్యాకేంద్రాలను ఏర్పర్చడం, ప్రవేశం కల్పించడం హర్షించదగినవి.

నూతన జాతీయ విద్యా విధానం అంగన్వాడీ కేంద్రాలను పాఠశాల విద్యలో భాగంగానే పరిగణించాలని సూచించింది. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం, మేధోపరమైన అభివృద్ధి ఆధారంగా పాఠశాల విద్యలో 5+3+3+4 విధానాన్ని ప్రవేశపెట్టాలని సూచించటం ముదావహం. పాఠశాల విద్యలోని వయస్సును నాలుగు దశలుగా విభజించాలి. ఆ మేరకు తరగతి గదులు ఏర్పా టుచేయడం అత్యవసరం. పునాది దశలో 3-8 ఏండ్ల వయస్సు పిల్లల కు మూడేండ్లు పూర్వ ప్రాథమిక బోధనాంశాలు కృత్యాత్మక బోధనలు ప్రవేశ్పెటి బోధించడం అవసరం. సంసిద్ధతా దశలో 8-11 ఏండ్ల వయ స్సు విద్యార్థులకు మూడు, నాలుగు, ఐదు తరగతుల పాఠ్యాంశాలను బోధించడం, మధ్య దశలో 11-14 వయస్సులో 6,7,8 తరగతుల పాఠ్యాంశాలు, వృత్తివిద్య కోర్సులను ప్రవేశపెట్టడం అవసరం. ద్వితీయ దశలో 14-18 సంవత్సరాల వయస్సులో 9-12 తరగతుల పాఠ్యాంశాలను బోధించటం, జాతీయస్థాయి పోటీ పరీక్షలకు, ప్రవేశపరీక్షలకు అనుగుణంగా విద్యార్థులకు, శిక్షణార్థులకు పాఠ్యాంశాల్లోని అంశాలన్నింటిపై సమగ్ర అవగాహన కల్పించడం, నైపుణ్యాలు పెంపొందించడం అత్యంతావశ్యకం. వృత్తివిద్యా కోర్సులను ప్రాథమిక స్థాయి నుంచి అమలుచేయాలి. పని అనుభవం, పని పట్ల గౌరవం పెంపొందించే కృత్యాలు పాఠశాలలో నిర్బంధంగా అమలుచేయాలి. తద్వారా పని పట్ల, వృత్తివిద్యా కోర్సుల పట్ల, శ్రామికుల శక్తి పట్ల, శ్రమ జీవుల పట్ల గౌరవభావం ప్రాథమికస్థా యి నుంచి పెంపొందుతుంది.

జాతీయ విద్యావిధానం-2019 ముసాయిదాలో పొందుపరిచిన విద్యాహక్కు చట్టం-2009 విస్తరణ హర్షించదగినది. ప్రస్తుత విద్యాహక్కు చట్టం 6 నుంచి 14 ఏండ్ల వయస్సు వారికే వర్తించేది. దీన్ని 3 నుంచి 18 ఏండ్ల వయస్సు వరకు విస్తరించి అమలుచేయాలని సూచించడం ప్రధానమైనది. ఉపయుక్తమైనది. దీనిద్వారా భవిష్యత్తులో అక్షరాస్యత గల సమాజంగా దేశం రూపొందే ఆస్కారం ఉన్నది. విద్యాబోధనలో మార్పులకు శ్రీకారం చుట్టి శాస్త్ర, సాంకేతికరంగాల అభివృద్ధికి తగినట్టు రూపొందించడం, నాణ్యతలేని బోధన అందించే విద్యాసంస్థలను మూసివేయాలని సూచన ఆహ్వానించదగినది. అలాగే ఈ నూతన విద్యా విధానంలో భాగంగా త్రిభాషా సూత్రం నిర్దిష్టంగా అమలుచేయాలని సూచించింది. ఇందులో హిందీయేతర రాష్ట్రాల్లోని పాఠశాల పాఠ్యాంశాల్లో హిందీ భాషను తప్పనిసరిచేసింది. హిందీయేతర రాష్ట్రాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దీంతో కేంద్రం ఆ అంశాన్ని తొలిగించింది. అయితే మన రాష్ట్రంలో త్రిభాషా సూత్రాన్ని అమలుచేస్తే మన విద్యార్థులందరికీ ప్రయోజనకరంగా ఉంటుంది.

ఈ నూతన విద్యావిధానం-2019లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాథమిక విద్య అమలుకోసం, పూర్వ ప్రాథమిక విద్యా కేంద్రాలను 3 నుంచి 8 ఏండ్ల విద్యార్థుల ప్రయోజనార్థం గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రారంభించాలి. బోధనా సామాగ్రిని సమకూర్చాలి. నిష్ణాతులైన బోధకులను నియమించాలి. ఆధునిక శాస్త్ర, సాంకేతిక రంగాభివృద్ధిని వినియోగించి బోధన కొనసాగించేలా ఉపాధ్యాయులను కార్యోన్ముఖులుగా చేయాలి. పాఠశాల విద్యలో పాఠ్యాంశాలను పిల్లలపై ఒత్తిడి తగ్గించే విధంగా మార్పులు చేయాలి. భవిష్యత్తులో పౌరులకు బోధించే పాఠ్యాంశాలు ప్రతి మనిషిని గౌరవించేలా, మానవీయ వ్యక్తులుగా తీర్చిదిద్దాలి. భవిష్యత్తులో దేశపౌరులందరూ కళలు, సంగీ తం, ఆటలు, యోగ, సమాజ సేవారంగాల్లో భాగస్వాములయ్యేట్లు నిజ జీవితంలో ఉపయోగపడే జీవననైపుణ్యాలు పెంపొందించాల్సిన బాధ్య త మన విద్యాసంస్థలది. నూతన విద్యా విధానం ముసాయిదాకు అనుగుణంగా ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, ఉపన్యాసకులకు నిరంతర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలి. దూరవిద్య విధానంలో నేటి శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని, పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు వినియోగించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారిని నిష్ణాతులుగా మార్చాలి.


> **నూతన విద్యా విధానం ముసాయిదాకు అనుగుణంగా ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు, ఉపన్యాసకుకలు నిరంతర ఉపాధ్యాయ శిక్షణా కార్యక్రమాలు రూపొందించాలి. దూరవిద్య విధానంలో దృశ్య, శ్రవణ పద్ధతిలో నేటి శాస్త్ర, సాంకేతికాభివృద్ధిని, పరిజ్ఞానాన్ని ఉపాధ్యాయులు వినియోగించేలా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి వారిని నిష్ణాతులుగా మార్చాలి.**

జాతీయ విద్యావిధానంలోని ఉన్నత విద్య అంతర్జాతీయాకరణ, దూరవిద్యలో నాణ్యత పెంచడం, అన్ని విద్యాస్థాయిల్లో సాంకేతికతను అనుసంధానించాలని పేర్కొన్నది. విద్యా ఫలితాల్లో లింగ, సామాజిక అసమానతలను తొలిగించాలన్నది. రాష్ట్రీయ శిక్షా ఆయోగ్ ఏర్పాటు చేయాలన్నది. నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్‌ను ఏర్పాటుచేయాలన్నది. యూజీసీని హయ్యర్ ఎడ్యుకేషన్‌గా మార్చాలని, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో మార్పులు చేసి, జీవన నైపుణ్యాల పెంపునకే ప్రాధాన్యం ఇచ్చింది. జాతీయ విద్యావిధానం ముసాయిదాకు అనుగుణంగా ఆచరణాత్మక కార్యక్రమాన్ని రూపొందించి అమలుచేయాలి.

**(వ్యాసకర్త: రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్, పాఠశాల విద్య)**

# సంపద పంపిణీలో సమతుల్యత

రాష్ట్రీయం



**బి.ఎస్.రాములు**

ప్రజాస్వామ్యంలో ప్రజల కోసమే ప్రభుత్వం, ప్రజా ప్రయోజనాలే అంతిమ లక్ష్యం. సామాజిక న్యాయం, సామాజిక మార్పు దిశగా ఒక్కొక్క దశలో, ఒక్కో సమయంలో ఒక్కోటి ప్రాధాన్యం వహిస్తుంది. కొత్తగా అధికారంలోకి వచ్చేవారు పరిపాలనా యంత్రాంగాన్ని, న్యాయవ్యవస్థను, సంస్కృతిని, సాహిత్యాన్ని, పన్నుల వ్యవస్థను, అభివృద్ధి సంక్షేమ పథకాలను పునర్నిర్వచిస్తుంటారు. పునర్నిర్మిస్తుంటారు. చరిత్రలో తమదైన ముద్ర వేస్తుంటారు. కొత్త మలుపులకు, మార్పులకు చరిత్రలో ప్రాధాన్యం దక్కుతుంది.

ఇటీవల రెవెన్యూ శాఖలోని అవినీతి, అక్రమాలపై ఫిర్యాదులు చూస్తూనే ఉన్నాం. ప్రభుత్వాలు ఎంత మంచి పాలసీలు చేసినా, ఆచరణలో ప్రభుత్వ సేవకుల సేవ, అవినీతి, దాష్టీకం, ప్రేమ, కరుణ అనుసరించి ఆయా ప్రభుత్వాల ఏలికలకు మంచిపేరు, చెడ్డపేరు వస్తుంది. అందువల్ల ఆయా అధికారపక్షాలకు ఇది కీలకాంశం అవుతున్నది. ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలు కోల్పోయిన ప్రతిష్ఠను తిరిగి పుంజుకుంటున్న దశలో కొన్నిశాఖల్లో పేరుకుపోయిన అవినీతి బట్టబయలు కావడం విశేషం. ఎకరానికి ఐదువేలు ఆర్థికసాయం అందించే ప్రక్రియతో దశాబ్దాల తరబడి జరిగిపోతున్న అన్యాయాలు అక్రమాలన్నీ బట్టబయలవుతున్నాయి. ఇదంతా ప్రజల మంచికే జరుగుతున్నది. రెవెన్యూ శాఖతో పాటు, భూములకు, ఆస్తులకు సంబంధించిన అన్నిశాఖల ప్రక్షాళన, పునర్నిర్మాణం, ఆవశ్యకతను ఇవి ముందుకుతెస్తున్నాయి.

పరిపాలనలో కాలానుగతంగా అనేక సంస్కరణలు అవసరమవుతుంటాయి. పరిపాలనా సంస్కరణలకు అనేక కారణాలు దోహదం చేస్తుంటాయి. గత అనుభవాలు, వర్తమాన అవసరాలు, భవిష్యత్ అవసరాల నుంచి గుణపాఠాలతో, పరిపాలనలో, ప్రభుత్వ శాఖలలో సంస్కరణలు, మార్పుచేర్పులు అనివార్యంగా ముందుకువస్తాయి. ఇలా ప్రభుత్వ యంత్రాంగం పరిపాలనలో, ఆయా ప్రభుత్వశాఖల్లో మార్పుచేర్పులు అవసరం అవుతుంటాయి.

కొన్ని సంస్కరణలు నూతన ఆవిష్కరణల వల్ల అవసరం అవుతుంటాయి. గత రెండు వందల ఏండ్లలో కొన్ని వందల ఆవిష్కరణలు జరిగాయి. అనేక నూతన చట్టాలు రూపొందాయి. రైల్వేల విస్తరణ కోసం భూ హక్కుల మీద, భూ సేకరణ గురించి అనేక చట్టాలొచ్చాయి. అలాగే ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల రీత్యా భూ సేకరణ, ఆస్తుల సేకరణ చేయడానికి ఎన్నో చట్టాలు వచ్చాయి. 2013లో భూములు, ఆస్తుల సేకరణకు మార్కెట్ విలువపై రెట్టింపు నుంచి నాలుగు రెట్ల దాకా కట్టించడానికి నూతన చట్టాలు రూపొందించడం గమనార్హం.

1947 నాటికి, నేటికి గత 70 ఏండ్ల కాలంలో ప్రభుత్వ యంత్రాంగం, రాజకీయవ్యవస్థ, న్యాయవ్యవస్థ పొందుతున్న సౌకర్యాలు, జీతభత్యాలు, సౌఖ్యాలు, ఉద్యోగ భద్రత, జీవనభద్రత ఎన్నో రెట్లు పెరుగుతూ వచ్చింది. నాకు తెలిసి 1967లో జూనియర్ అసిస్టెంట్‌కు, ఒక టీచర్‌కు రూ.96 నుంచి రూ.130 మధ్యన జీతం ఉండేది. కాలానుగుణంగా జీవన ప్రమాణాలు ఉండేట్లు జీతభత్యాలు ఇప్పుడెలా ఉన్నాయో తెలిసిందే.

ప్రజలకు ప్రభుత్వ యంత్రాంగానికి, న్యాయవ్యవస్థ, రాజకీయ, పారిశ్రామిక రంగాల్లో కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్య అంతరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. సంఘటిత శక్తులుగా, విద్యావంతులుగా, అధికారులుగా ఉన్నవారికి అనుకూలంగా సంపద పంపిణీ చేయబడుతున్నది. అదనపు ఉత్పత్తి, సంపద, సౌకర్యాలు, నూతన ఆవిష్కరణలు, ఆధునికతలు అన్నీ ఇలాంటి కొన్నివర్గాలకు సింహభాగం అందుతున్నాయి. వారు పొందగా మిగిలినదే ప్రజలకు చెందడం ఒక విషాదకరమైన వాస్తవం. ప్రభుత్వ ఆదాయంలో సింహభాగం ఒకట్రెండు శాతం గల ప్రభుత్వ యంత్రాంగం, జీతభత్యాలకు, పింఛన్లకు, సౌకర్యాలకు కేటాయించడం, దీనినే సూచిస్తున్నది. 30 నుంచి 40 శాతం దాకా బడ్జెట్ ఈ కొద్ది శాతానికి పోగా, మిగతా బడ్జెట్‌లో ప్రాజెక్టులకు, పరిశ్రమలకు పోవడం ప్రత్యక్షంగా ప్రజలకు విద్య, వైద్య, గృహవసతి, ఉపాధి కల్పన రంగాలకు మిగులుతున్నది చాలా తక్కువ. అందులోనే ప్రజలు అన్నీ సర్దుకోవాల్సి వస్తున్నది. తమగురించి మాత్రమే ఆలోచించే విద్యావంతులు, ఉద్యోగులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా, మేధావులుగా, నాయకులుగా ఆలోచించే తన కోసం తాను అనే దశ నుంచి ప్రజల కోసం తాము అనే దశకు మలుపు తిరిగినప్పుడే ఏ సమాజమైనా బాగుపడుతుంది. అలాకాకుండా, ప్రజల గురించి మాకెందుకు, తమ గురించి మాత్రమే ఆలోచించుకుంటాం. డిమాండ్ చేస్తాం. అందుకోవడం వల్ల తాత్కాలికంగా ప్రయోజనం పొందవచ్చేమో గానీ, దీర్ఘకాలికంగా అది వారికి కూడా నష్టం కలుగజేస్తుంది. జీతభత్యాలు, సౌకర్యాలు పెరిగి, పెరిగి ప్రభుత్వం విధిలేక ఇక ఉద్యోగులకు బదులుగా, తాత్కాలిక ప్రాతిపదికగా కాంట్రాక్ట్ ఉద్యోగులను, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తీసుకోవడం జరుగుతున్నది. జీతభత్యాలు, పింఛన్ల భారం పెరిగి పెరిగి, పింఛన్ జీతంలోంచి పొదుపు చేసుకునే విధానం ప్రవేశపెట్టబడిందనే విషయం చాలామందికి ఈపాటికి అర్థమయ్యే ఉంటుంది. జీతభత్యాల పెంపునకు, ప్రజల జీవన ప్రమాణాలకు మధ్య సమన్వయం సాధించాల్సిన అవసరం ఉన్నది.

పరిపాలనా సంస్కరణల వెనుక అనేక కోణాలు, తాత్విక దృక్పథాలు, తక్షణావసరాలు, భవిష్యత్ సమాజ నిర్మాణ లక్ష్యాలు కారణమవుతుంటాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త జిల్లాల ఏర్పాటు మొదలుకొని అనేక శాఖలను పునర్నిర్మించడం, నూతన శాఖలను, సంస్థలను ఏర్పాటుద్వారా దేశానికి దిక్సూచిగా నిలుస్తూ నూతన శఖాన్ని ప్రారంభించారు. ప్రజల జీవన ప్రమాణాలు పెరుగకుండా ప్రభుత్వ జీతభత్యాలు, పింఛన్లు, సౌకర్యాలు పెంచడం ప్రభుత్వానికి భారమే కాకుండా, ఉద్యోగుల పట్ల ప్రజల వ్యతిరేకతకు, కారణమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీతభత్యాలు, పింఛన్లకు ప్రజల జీవన ప్రమాణాలకు, ఆదాయాలకు మధ్య ఉండాల్సిన నిష్పత్తి గురించి జాతీయస్థాయిలో విస్తారంగా చర్చ జరుగాల్సిన సమయం ఆసన్నమైంది.

> **పరిపాలనలో కాలానుగతంగా అనేక సంస్కరణలు అవసరమవుతుంటాయి. పరిపాలనా సంస్కరణలకు అనేక కారణాలు దోహదం చేస్తుంటాయి. గత అనుభవాలు, వర్తమాన అవసరాలు, భవిష్యత్ అవసరాల నుంచి గుణపాఠాలతో, పరిపాలనలో, ప్రభుత్వ శాఖలలో సంస్కరణలు, మార్పుచేర్పులు అనివార్యంగా ముందుకువస్తాయి. ఇలా ప్రభుత్వ యం త్రాంగం పరిపాలనలో, ఆయా ప్రభుత్వశాఖల్లో మార్పుచేర్పులు అవసరం అవుతుంటాయి.**

**(వ్యాసకర్త: రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.



# అర్హులందరికీ డబుల్‌బెడ్రూం ఇండ్లు

- స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**బాన్సువాడ, నమస్తే తెలంగాణ:** అర్హులైన ప్రతిఒక్కరికీ డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇస్తామని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన కామారెడ్డి జిల్లా బాన్సువాడలోని సిద్దిగల్లీ, ఇస్లాంపూర, పోచమ్మగల్లీలో పర్యటించారు. ఆయాకాలనీల్లో స్థలం ఉండి డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించుకొనేందుకు ముందుకు వచ్చిన వారి నిర్మాణపనులకు భూమి పూజచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాన్సువాడ నియోజకవర్గంలో ఐదువేలఇండ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయని.. కొన్ని చోట్ల పూర్తి చేసి అర్హులైన పేదవారికి సొంతింటి కలను నెరవేర్చామని చెప్పారు. మిగతావి త్వరలోనే పూర్తి చేసి అర్హులకు అందజేస్తామన్నారు.

కామారెడ్డి జిల్లా పోచమ్మగల్లీలో డబుల్‌బెడ్రూం ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజచేస్తున్న స్పీకర్

## ఎడ్లబండిలోనే ప్రసవం





కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం సోమినికి చెందిన గర్భిణి శంకరమ్మ ఎడ్లబండిలో మగబిడ్డకు జన్మనిచ్చారు. శంకరమ్మకు మంగళవారం పురిటినొప్పులు రావడంతో కుటుంబసభ్యులు ఆమెను ఎడ్లబండిలో తీసుకొని బెజ్జూరు పీహెచ్‌సీకి బయలుదేరారు. సుస్మీర్ వాగుదాటుతుండగా మార్గమధ్యంలోనే ఆమె ప్రసవించారు. - బెజ్జూర్





కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు మండలం సలుగుపల్లి సమీపంలో కోతకు గురైన డబ్బా -బెజ్జూర్ రోడ్డు



మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం గంగారంలో వర్షానికి కూలిన ఇల్లు



కామారెడ్డి జిల్లా లింగంపేట మండలం నాగారం గ్రామ శివారులోని కాసులకత్త వద్ద పొంగిపొర్లుతున్న పెద్దవాగు

# వాగులకు జలకళ

## ఆదిలాబాద్, ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీగా వర్షాలు

- పొంగిపొర్లుతున్న వాగులు
- మత్తళ్లు దుంకుతున్న చెరువులు
- పలు గ్రామాలకు ఆగిన రాకపోకలు
- ఆదిలాబాద్ జిల్లాలో ఇల్లు కూలి వృద్ధుడి మృతి
- అత్యధికంగా నార్నూర్‌లో 14.04 సెం.మీ. వర్షపాతం

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రాష్ట్రంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మంగళవారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో భారీ వర్షం కురవగా ములుగు, కరీంనగర్ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. గత నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో చాలా జిల్లాల్లో వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. పలుచోట్ల రహదారుల పైనుంచి వరద పారుతుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. అక్కడక్కడ ఇండ్లు కూలాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఇల్లు కూలడంతో ఓ వృద్ధుడు మరణించాడు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలో 14.04 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

### రాకపోకలు బంద్..

ఆదిలాబాద్ జిల్లాలో మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మంగళవారం కూడా భారీ వర్షం కురిసింది. నార్నూర్, జైనథ్, బేల, ఇచ్చోడ, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఆదిలాబాద్, తాంసి, తలమడుగు, బజార్ హత్నూర్, బోథ్, నేరడిగొండలో భారీ వర్షం కురిసింది. ఉట్నూర్ మండలం వంకతుమ్మ, ఇచ్చోడ మండలం ముక్రా (కే), ఆదిలాబాద్ మండలం బంగారిగూడ వాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంద్రవెల్లి మండలం త్రివేణి సంగమం చెరువులోని నీరు మత్తడి దూకుతుండగా స్థానికులు చేపలు పట్టుకుంటున్నారు. ఉట్నూర్ మండలం మత్తడి చెరువు, గుడిహత్నూర్ మండలం శంభుగూడ చెరువుల్లోగా భారీగా చేరగా మత్తడి దూకుతున్నాయి. జైనథ్ మండలం గిమ్మ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి కిందకి వర్షం నీరు చేరింది. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహంతో నేరడిగొండ మండలం కుంటాల, బోథ్ మండలం పొచ్చర, బజార్‌హత్నూర్ మండలం కనకాయి జలపాతాలు జలకళను సంతరించుకున్నాయి. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని వాఘాపూర్‌లో ఇంటిగోడ కూలడంతో ఓ వృద్ధుడు మరణించాడు. జిల్లా సగటు వర్షపాతం 10.81 సెంటీమీటర్లు నమోదైంది. కాగా జిల్లాలోని నార్నూర్ మండలంలో 14.04 సెం.మీ., జైనథ్ మండలంలో 13.8 సెం.మీ., ఇచ్చోడ మండలంలో 136.6 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది.



ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో పొంగి ప్రవహిస్తున్న ముక్రా (కే) వాగు

### నిండుగా పారుతున్న వాగులు..

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో ఐదు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి వానలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. పెంచికల్‌పేట్ మండలం ఎల్లూరులో ఓ ఇల్లు, ఓ పాక కూలిపోయాయి. కుమ్రంభీం, వట్టి వాగుల్లోకి భారీగా వరద చేరుతుండటంతో పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరువలో ఉన్నది. దహెగాంలోని ఎర్రవాగుతోపాటు పెంచికల్‌పేట్ మండలంలోని పెద్దవాగు, బొక్కివాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఎల్లూరు చెరువు మత్తడి వద్ద మత్స్యకారులు చేపలు పడుతున్నారు. చింతలమానేపల్లి మండలంలోని దిండ వాగు, రుద్రాపూర్ వాగు, బాలాజీ అనుకోడ వాగులు నిండుగా ప్రవహిస్తున్నాయి. కాగజ్‌నగర్‌లోని చింతగూడకోయవాగులో నీటి ప్రవాహం పెరగడంతో రాకపోకలకు ఆటంకం కలిగింది. బెజ్జూర్ మండలంలో కుకుడ వాగు పొంగడంతో ఎనిమిది గ్రామాలకు రవాణా నిలిచిపోయింది. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు కట్ట తెగిపోయింది.

### నీటి వనరులకు జలకళ..

కరీంనగర్ జిల్లాలో ఐదు రోజులుగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఐదురోజులుగా ముసురు పట్టుకున్నది. మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోటపల్లి మండలం అర్జునగుట్ట వద్ద ప్రాణహిత ఉధృతంగా ప్రవహిస్తున్నది. నెన్నెల మండలం గంగారంలో మంగళవారం ఓ పెంకుటిల్లు కూలింది. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షం, వరద నీరు వచ్చి చేరుతున్నది. జగిత్యాల జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో ఆయా గ్రామాల్లో చెరువులు, కుంటలు, వాగులకు వరద నీరు చేరుతున్నది. కడెం ప్రాజెక్ట్ నుంచి వచ్చే నీటితోపాటు ఒర్రెలు, వాగుల ద్వారా వరద నీరు గోదావరిలోకి చేరుతుండటంతో కమ్మునూర్ గోదావరి ప్రవాహం పెరిగింది.

### నిజామాబాద్‌లో ముసురు..

నిజామాబాద్ జిల్లాలో ముసురు పట్టింది. నందిపేట మండలంలోని తల్వేద వాగు పొంగి ప్రవహించింది. వాగు నుంచి చౌడమ్మకొండూర్ మీదుగా గోదావరిలోకి వరద కొనసాగుతున్నది. ఉమ్మెడ వద్ద గోదావరి నదిలోకి స్వల్పంగా వరద వచ్చింది. బోధన్ మండలంలోని లంగ్డాపూర్, మొండి, పసుపు వాగులు పారుతున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. గాంధారి మండలంలోని కాటేవాడి చెరువు మత్తడి దుంకింది. లింగంపేట మండలం పెద్దవాగు జలకళను సంతరించుకుంది. నల్లగొండ, మెదక్ జిల్లాల్లో జల్లులు కురిశాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో ముసురు పట్టుకున్నది.



వరదల కారణంగా మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలోని ఓ నదిలో కొట్టుకుపోతున్న పశువులు

### ఉధృతంగా మొర్రేడువాగు..

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి.పాల్వంచ మండలంలోని కిన్నెరసాని రిజర్వాయర్‌లో 389.9 అడుగులకు నీటిమట్టం చేరింది. పర్ణశాల నారచీరెల ప్రాంతంలో సీతమ్మవాగు పొంగి ప్రవహిస్తున్నది. కొత్తగూడెం పట్టణంలోని, పాల్వంచలోని మొర్రేడువాగుల్లోకి భారీగా నీరు చేరింది. ములుగు జిల్లాలో నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలు కాస్త తగ్గుముఖం పట్టాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు ఓ మోస్తరు వర్షం పడింది. వెంకటాపురం(నూగూరు) మండలంలో మధ్యాహ్నం గంట సేపు భారీ వర్షం కురిసింది. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, తాడ్వాయి, కన్నాయిగూడెం, గోవిందరావుపేట, వెంకటాపూర్, ములుగు మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండగా మంగళవారం తెరిపినిచ్చింది.



పెద్దపల్లి జిల్లా రామగుండం పట్టణంలోని పెద్దచెరువు నుంచి వచ్చే నీటితో అంతర్గాం మండలం పెద్దంపేటలో దుంకుతున్న మత్తడి



ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడలో వాగు పొంగడంతో నిలిచిన రాకపోకలు



వర్షాలు కురుస్తుండటంతో నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి శివారులో మంగళవారం వరినాట్లు వేస్తున్న కూలీలు



కామారెడ్డి జిల్లా బిచ్కుందలో దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ శోభ

# ఆరోగ్యతెలంగాణే కేసీఆర్ లక్ష్యం

- మంత్రి ఈటల రాజేందర్
- కామారెడ్డి జిల్లా బిచ్కుందలో దవాఖాన ప్రారంభం

**బిచ్కుంద:** దేశంలో ఎక్కడాలేని విధంగా ఇంటింటికీ నల్లా కనెక్షన్లు అందిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సాధించిందని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుందలో రూ. 5 కోట్ల వ్యయంతో నిర్మించిన 30 పడకల దవాఖానను రోడ్లుభవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఆరోగ్యతెలంగాణ చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని చెప్పారు. ఏ ఒక్క ఆడబిడ్డ బిందె పట్టుకొని నీళ్లకోసం తిరుగకుండా తాగునీరు అందించడంకోసమే మిషన్‌భగీరథ పథకం తీసుకొచ్చామని చెప్పారు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేయడానికి కాళేశ్వరం ప్రాజెక్టును విజయవంతంగా పూర్తిచేశామని చెప్పారు. రోడ్ల కోసం టీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ. కోట్ల నిధులను వెచ్చిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే, కామారెడ్డి జడ్పీ చైర్మన్ దఫేదార్ శోభ, నిజామాబాద్ జడ్పీ చైర్మన్ విఠల్‌రావు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.





వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని అంబేద్కర్‌భవన్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు జ్ఞాపిక అందజేస్తున్న పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు

# పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**సిద్ధార్థనగర్ (వరంగల్ అర్బన్):** పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషిచేస్తానని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం వరంగల్ నగరం హన్మకొండలోని అంబేద్కర్‌భవన్‌లో పెండ్యాల బ్రహ్మయ్య అధ్యక్షతన తెలంగాణ అల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వరంగల్ అర్బన్ జిల్లా 3వ మహాసభలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న దయాకర్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలను ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘాల జేఏసీ చైర్మన్ కే లక్ష్మయ్య, రాష్ట్ర అధ్యక్షుడు పాలకుర్తి కృష్ణమూర్తి, జేఏసీ జనరల్ సెక్రటరీ శుభాకర్‌రావు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారాం, వాసిరెడ్డి వీరభద్రం, నర్సింహాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న హుండీ ఆదాయం 1.26 కోట్లు

**వేములవాడ కల్చరల్:** దక్షిణ కాశీగా ప్రసిద్ధిచెందిన వేములవాడ పార్వతీ రాజరాజేశ్వరస్వామివారి ఆలయానికి హుండీల ద్వారా రూ. కోటి 26 లక్షల 92 వేల 452ల ఆదాయం సమకూరింది. ఈ మేరకు ఆలయ ఈవో కృష్ణవేణి వెల్లడించారు. ఆలయ ఓపెన్‌స్లాబ్‌పై దేవస్థానానికి సంబంధించిన హుండీలను మంగళవారం లెక్కించారు. అందులో భాగంగా హుండీల ద్వారా బంగారం 248 గ్రాములు, వెండి 13 కిలో గ్రాములు సమకూరినట్టు ఈవోతెలిపారు. ఇది కేవలం 30రోజుల ఆదాయమేనని ఆమె వివరించారు.

# అనంతసాగర్‌లో చిరుత సంచారం!

**కులకచర్ల:** చిరుత సంచారంలో వికారాబాద్ జిల్లా కులకచర్ల మండలం అనంతసాగర్ గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. సోమవారం రాత్రి అనంతసాగర్‌కు చెందిన నర్సరీ నిర్వాహకుడు రైతు అనంతయ్య తన పొలంలో బర్రె దూడను కట్టేసి ఇంటికి రాగా చిరుత దూడను కట్టేసిన చోటే చంపి తిన్నదని తెలిపారు. గతంలో ఇలాంటి సంఘటనలు చాలా సార్లు చోటు చేసుకున్నాయని ఈ విష యం అటవీశాఖ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని మంగళ వారం కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మండలి డిప్యూటీ చైర్మన్ నేతి విద్యాసాగర్, పరకాల, చేవెళ్ల, ఉప్పల్ ఎమ్మెల్యేలు చల్లా ధర్మారెడ్డి, కాలె యాదయ్య, బేతి సుభాశ్‌రెడ్డి, ఐడీసీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. వనపర్తిలోని మంత్రి నిరంజన్‌రెడ్డి నివాసానికి వెళ్లి ఆయన తల్లి తారకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వనపర్తి, నమస్తే తెలంగాణ

# అనుమానంతో అంతమొందించాడు

- భార్యను గొంతు కోసి చంపిన భర్త

**మరిపెడ, నమస్తేతెలంగాణ:** అనుమానంతో భార్యను గొంతుకోసి చంపిన ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం బేతలపాడు శివారు ఠాక్యతండాకు చెందిన సేవాలాల్‌కు మరిపెడ మండలం ధరావత్ తండాకు కస్తూరి(30)కి ఆరేండ్ల క్రితం వివాహమైంది. వీరికి ఓ పాప, బాబు ఉన్నారు. రెండేండ్లుగా సేవాలాల్ కస్తూరిపై అనుమానం పెంచుకొని చిత్రహింసలకు గురి చేస్తుండటంతో ఆమె రెండు నెలలుగా పుట్టింట్లో ఉంటూ మరిపెడలోని క్లినిక్‌లో పనిచేస్తున్నది. మంగళవారం సేవాలాల్ క్లినిక్ వద్దకు వచ్చి అందరు చూస్తుండగానే కత్తితో కస్తూరి గొంతుకోసి చంపాడు. పోలీసులు వెంటాడి నిందితుడిని పట్టుకున్నట్టు సమాచారం.



కస్తూరి (ఫైల్)

# రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు దుర్మరణం

## నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఘటనలు

**నెట్‌వర్క్ నమస్తే తెలంగాణ:** నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన చినపంగు చిన్నస్వామి(55), అతడి అల్లుడు పోలె రాంబాబు(32) ద్విచక్రవాహనంపై రామచంద్రాపురం నుంచి గడ్డిపల్లికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. తాడ్వాయి గ్రామానికి చెందిన వీరమల్ల ఉపేందర్ (28).. మునగాల నుంచి తాడ్వాయి వెళ్తుండగా కారు ఢీకొట్టింది ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. నల్లగొండ జిల్లా వేములపల్లి మండలం బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన పుట్ట శ్రీను(33) ద్విచక్ర వాహనంపై శెట్టిపాలెం శివారులో రోడ్డు దాటుతుండగా వెనుకనుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీను దుర్మరణం చెందాడు. శ్రీనుకు భార్య రేణుక, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నల్లగొండ శ్రీనగర్‌కాలనీకి చెందిన బొప్పని నరేశ్(32), పానగల్‌కు చెందిన పల్లపు అనిల్‌రాజు(37) స్నేహితులు. వీరిద్దరూ సోమవారం రాత్రి 10.30 గంటలకు కారులో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తుండగా.. ప్రధానరహదారిపై లెపసీ కాలనీ సమీపంలో కారు అదుపుతప్పి పల్టీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు.ఆలస్యంగా సమాచారం అందుకున్న పోలీసులు వీరిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందారు.

# కంబాలపల్లిలో ఎలుగుబంటి హల్‌చల్

**చందంపేట:** నల్లగొండ జిల్లా చందంపేట మండలం కంబాలపల్లి అటవీప్రాంతంలో ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. మంగళవారం కంబాలపల్లికి చెందిన గోనుగుంట్ల కృష్ణ గొర్రెలు మేపడానికి వెళ్లగా ఎలుగుబంటి దాడిచేసి గాయపరిచింది. తీవ్రగాయాలు కావడంతో స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కాగా ఎలుగుబంటి మూడ్రోజుల వ్యవధిలోనే ముగ్గురుపై దాడిచేసింది.కంబాలపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాఘవేందర్ సిబ్బందితో కలిసి అడవులో ఎలుగుబంటికోసం గాలిస్తున్నారు.

# ఎండుమిర్చి @ 14,200

## ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో రికార్డు ధర

**ఖమ్మం వ్యవసాయం:** ఖమ్మం వ్యవసాయమార్కెట్‌లో ఏసీ రకం మిర్చి పంటకు రికార్డుస్థాయిలో క్వింటాలకు రూ. 14,200 ధర పలికింది. ఒక్కరోజులోనే క్వింటాలుకు రూ. 800 ధర పెరుగడంతో పంటను శీతల గిడ్డంగుల్లో నిల్వ ఉంచుకున్న రైతులు, వ్యాపారులకు కలిసి వచ్చింది. శుక్రవారం జరిగిన జెండాపాటలో ఏసీ రకం మిర్చి పంటకు క్వింటాలుకు రూ. 13,400 ధర పలుకగా.. మంగళవారం భారీగా పెరిగింది.

# పుట్టినరోజు వేడుకలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం
- సంగారెడ్డి జిల్లాలో ఘటన

**జిన్నారం:** పుట్టినరోజు నాడే ఓ విద్యార్థి రోడ్డు ప్రమాదంలో దుర్మరరణం చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లా గండిమైసమ్మకు చెందిన నైనకంటి సాయిరాంరెడ్డి (21) మంగళవారం తన జన్మదినం సందర్భంగా గండిమైసమ్మ నుంచి సుమారు 20 మంది స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనాలపై సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం షేర్‌ఖాన్‌పల్లి సమీపంలోని పలుగు పోచమ్మ ఆలయానికి వెళ్లాడు. విందుపూర్తయిన అనంతరం సాయిరాంరెడ్డి తన స్నేహితుడు గల్లా సాయితో కలిసి జిన్నారం వెళ్లాడు. తిరిగి పలుగు పోచమ్మ ఆలయానికి వెళ్తుండగా నర్రెగూడ సమీపంలో బైక్ కల్వర్టును ఢీకొట్టడంతో సాయిరాంరెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. గల్లా సాయి తలకు తీవ్రగాయాలు కాగా అతడిని స్థానికులు సమీపంలోని దవాఖానకు తీసుకెళ్లి చికిత్సనందిస్తున్నారు. సాయిరాంరెడ్డి గండిమైసమ్మలోని హోలీమేరీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తుజరుపుతున్నారు.

# అల్లం పదవీకాలం పొడిగిస్తూ ఉత్తర్వులు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ పదవీకాలం ఏడాది పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. ఆయన పదవీకాలం జూన్ 30 నాటికి ముగిసింది. దీంతో 2020 జూన్ 30 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి అరవింద్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. అల్లం నారాయణ పదవీకాలం పొడిగించడంపై తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్- హెచ్ 143, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీలు ఒక ప్రకటనలో హర్షం ప్రకటించాయి. పదవీ కాలం పొడిగించడం హర్షణీయమని టీయూడబ్ల్యూజే కోశాధికారి మారుతీసాగర్, టీఈఎంజేయూ (తెంజూ) రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ ఇస్మాయిల్, ప్రధాన కార్యదర్శి ఏ రమణకుమార్, కోశాధికారి పాండురంగారెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు పీ యోగానంద్, వై నవీన్‌కుమార్ పేర్కొన్నారు. పదవీకాలాన్ని పొడిగించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కృతజ్ఞతలు చెప్పారు. ఈ సందర్భంగా వారు అల్లం నారాయణను కలిసి అభినందనలు తెలిపారు.

## ఆరున కృష్ణాబోర్డు భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తాజా నీటి సంవత్సరంలో కృష్ణాప్రాజెక్టులకు ఎగువన ఇన్‌ఫ్లోలు భారీగా నమోదవుతున్న దరిమిలా మరి కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులకు జలకళ రానున్నది. ఈ నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య జలాల పంపిణీపై నిర్ణయాలు తీసుకోవడంతోపాటు ఇన్‌ఫ్లోలపై చర్చించేందుకు ఆగస్టు ఆరున సమావేశం కావాలని కృష్ణానదీ యాజమాన్య బోర్డు నిర్ణయించింది. ఈ మేరకు రెండు రాష్ట్రాలకు సమాచారం పంపారు.

# విచ్చలవిడిగా గ్లైఫోసెట్ వినియోగం

- నిషేధాన్ని తుంగలో తొక్కుతున్న వ్యాపారులు, వ్యవసాయాధికారులు
- తూతూమంత్రపు దాడులతో సరిపెడుతున్న టాస్క్‌ఫోర్స్ బృందాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మానవాళికి, పర్యావరణానికి తీవ్రహాని కలిగించే గ్లైఫోసెట్‌పై నిషేధం ఉన్నప్పటికీ వినియోగం యథేచ్ఛగా కొనసాగుతున్నది. గడ్డిమందు పేరుతో అమ్ముతున్న దీనిపై రైతులకు సరైన అవగాహనలేక విరివిగా ఉపయోగిస్తుండటంతో విలువైన వ్యవసాయ భూములు సారాన్ని కోల్పోవడంతోపాటు ప్రజలు క్యాన్సర్ వ్యాధి బారినపడే ప్రమాదం ఉన్నది. గత రెండేండ్ల నుంచి దీని వినియోగం విపరీతంగా పెరుగడంతో భూమి, గాలి, నీరు, పంటలు విషమయమవుతున్నాయి. గ్లైఫోసెట్‌ను వాడిన రైతులు, వ్యవసాయకూలీల మూత్రంలో కూడా దాని అవశేషాలు బయటపడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. గతేడాది టాస్క్‌ఫోర్స్ బృందాలు నామమాత్రపు దాడుల్లోనే 75 వేల లీటర్ల గ్లైఫోసెట్ పట్టుబడగా.. తాజాగా మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో రూ.85 లక్షల విలువచేసే 16 వేల లీటర్ల గ్లైఫోసెట్ పట్టుబడింది. గ్లైఫోసెట్ మందు విక్రయాలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్ బృందాల్లో పోలీసులు, వ్యవసాయాధికారులు సభ్యులుగా ఉన్నప్పటికీ దాని అమ్మకాలను నియంత్రించలేకపోతున్నారు. ఉనికిని చాటుకునేందుకే ఈ బృందాలు అడపాదడపా నామమాత్రపు దాడులు నిర్వహిస్తున్నాయని, అయితే డీలర్లపై కేసులు పెట్టడం, వారి లైసెన్సులను రద్దుచేయడం వంటి చర్యలు చేపట్టకపోగా.. పట్టుబడిన గ్లైఫోసెట్ మందును తిరిగి వారికే అప్పగిస్తున్నాయన్న ఆరోపణలువినిపిస్తున్నాయి.



## బీటెక్ కోర్సుల్లో రైతుకోటా సీట్లకు కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీటెక్ ఎంపీసీ స్ట్రీమ్ కోర్సుల్లో రైతుకోటా ప్రవేశాలకు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయం పరీక్షల కేంద్రంలో నిర్వహించిన ఈ కౌన్సెలింగ్ ద్వారా బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, ఫుడ్ టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించారు. తెలంగాణ ఎంసెట్-2019లో ర్యాంకులు పొంది, గత నోటిఫికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకొన్నవారు మాత్రమే హాజరయ్యారు. డీన్ డాక్టర్ సదాశివరావు కౌన్సెలింగ్ ప్రారంభించారు. పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

## బీసీ స్టడీ సర్కిల్ సివిల్స్ శిక్షణకు 4న అర్హత పరీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ బీసీ స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ముందస్తు శిక్షణకు అర్హత పరీక్షను ఆగస్టు నాలుగున నిర్వహిస్తున్నట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ బాలాచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి హాల్ టికెట్లను studycircles.cgg.gov.in ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని, 6302427521 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

# పంటల డాటా ఇవ్వండి

- ఏఈవోలపై వర్చువల్ మానిటరింగ్ చేయండి
- సమీక్షలో కలెక్టర్లకు సీఎస్ ఎస్కే జోషి సూచన
- 99 శాతం వర్షాధార పంటలు సాగయ్యాయి: పార్థసారథి
- ఆగస్టు 15 నాటికి టాయిలెట్లు పూర్తిచేయాలి: వికాస్‌రాజ్



సచివాలయం నుంచి కలెక్టర్లతో సమీక్ష జరుపుతున్న సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో ముఖ్యకార్యదర్శులు అజయ్‌మిశ్రా, రాజేశ్వర్‌తివారి, రామకృష్ణారావు, పార్థసారథి, సోమేశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయ శాఖ విస్తరణాధికారులు (ఏఈవో) గ్రామాల వారీగా, రైతులవారీగా ప్రతిరోజు వేసిన పంటల వివరాలను ట్యాబ్‌ల ద్వారా ఎప్పటికప్పుడు అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల అధికారులతో కలిసి వాతావరణ పరిస్థితులు, పెన్షన్ల పంపిణీ, 2021 జనాభా లెక్కల సేకరణ, స్వచ్ఛభారత్ మిషన్ తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఏఈవోలపై వర్చువల్ మానిటరింగ్ చేయాలన్నారు. రైతులవారీగా వ్యవసాయశాఖ డాటా సేకరణ ప్రతి సీజన్లో డైనమిక్‌గా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి మాట్లాడుతూ.. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వర్షాధార పంటలు 99 శాతం మేర సాగయ్యాయన్నారు. మేజర్ ప్రాజెక్టులు, చెరువుల్లో నీరు చేరితే వరి పంట సాగు పెరుగుతుందని చెప్పారు. రైతులు, పంటలవారీగా ఏఈవోలు ప్రతి సీజన్‌లో విస్తీర్ణం డాటాను సేకరించడం వలన కనిష్ఠ అమ్మకపు ధర (ఎమ్మెస్పీ) అమలు, ఆన్‌లైన్ చెల్లింపులు, విపత్తు ఉపశమనం వంటి అంశాల్లో వినియోగించుకోవచ్చని తెలిపారు. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో కొన్ని మండలాల్లో పరిస్థితి మెరుగైందని చెప్పారు.

### అక్టోబర్ 1 నుంచి కొత్త ఎక్సైజ్ పాలసీ

జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధర్‌సిన్హా మాట్లాడుతూ.. 2021 జనగణనకు సంబంధించి గ్రామ, పట్టణ రిజిస్ట్రార్లను పంపడంతోపాటు పట్టణ సముదాయాల వివరాలను పంపాలన్నారు. వరంగల్ అర్బన్, మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాల్లో 2021 జనాభా లెక్కల ప్రీటెస్ట్ నిర్వహణకు సూచనలు పంపామని, ఎన్యుమరేటర్ల ఎంపిక, శిక్షణ పూర్తిచేయడంతోపాటు ఇండ్ల వివరాలను ఇంటింటివారీగా తనిఖీ చేపట్టాల్సి ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్ మాట్లాడుతూ.. మిగిలిపోయిన టాయిలెట్ల నిర్మాణ పనులను ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి ఓడీఎఫ్‌గా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రూర్బన్‌కు సంబంధించి ప్రత్యేకంగా సమీక్షించాలని, భూకేటాయింపులను పూర్తిచేసి మౌలిక నిర్మాణ రంగ పనుల్ని చేపట్టాలన్నారు. క్లిష్టమైన తేడాలుంటే వాటికి సంబంధించి పరిపాలన అనుమతులు ఇచ్చే పనులు చేపట్టాలని సూచించారు. టాయిలెట్ల నిర్మాణం, మంచినీటి సరఫరా, ఘనవ్యర్థాల నిర్వహణ, వీధి దీపాలు, ఎల్పీజీ మంజూరు, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాల్ని ప్రాధాన్యంతో చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమాచారాన్ని ఈ-పంచాయత్ సాఫ్ట్‌వేర్‌లో నిక్షిప్తం చేయాలని చెప్పారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారులతో ప్రత్యేక సమావేశం జరిపి సమీక్షించాలని చెప్పారు.

### బ్లాక్‌స్పాట్లకు మరమ్మతులు

రహదారులు, భవనాలశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ మాట్లాడుతూ.. జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశాల్ని నిర్వహించి మినిట్స్ పంపాలని జిల్లా కలెక్టర్లను కోరారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఆర్‌అండ్‌బీ, పోలీసు, రవాణాశాఖల అధికారులతో కూడిన కమిటీని ప్రమాదస్థలం వద్దకు పంపి పరిస్థితిని అంచనా వేయడంతోపాటు బ్లాక్‌స్పాట్లను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద హరితహారం కోసం రూ.ఏడు కోట్ల నిధుల్ని సమకూర్చుకొన్న మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డిని ఉన్నతాధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అజయ్‌మిశ్రా, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రాజేశ్వర్‌తివారి, ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, పంచాయతీరాజ్ కమిషనర్ నీతూకుమారి, వ్యవసాయ శాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా, ప్రొటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్, సీఎం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, సెర్ప్ సీఈవో పౌసమిబసు తదితరులు పాల్గొన్నారు.

## టీఆర్‌ఎస్‌కు జితేందర్‌రెడ్డి నమ్మకద్రోహం

- సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి ఆగ్రహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ నమ్మకంతో లోక్‌సభలో టీఆర్‌ఎస్ ఫ్లోర్‌లీడర్ పదవి ఇస్తే జితేందర్‌రెడ్డి ద్రోహం చేశారని సాట్స్ చైర్మన్ అల్లీపురం వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. పార్టీలో ఉండి బీజేపీకి కోవర్టుగా వ్యవహరించారని మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. టీఆర్‌ఎస్ మీద, సీఎం కేసీఆర్ మీద అవాకులు చెవాకులు పేలితే ఊరుకోమని హెచ్చరించారు.

## ఎర్రమంజిల్‌పై కొనసాగిన వాదనలు

- విచారణ నేటికి వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నూతన అసెంబ్లీ నిర్మాణం, ఎర్రమంజిల్ కూల్చివేత అంశంపై హైకోర్టులో మంగళవారం వాదనలు కొనసాగాయి. డెక్కన్ ఆర్కియాలజికల్ అండ్ కల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ తమ వాదనలు వినిపించింది. హెచ్‌ఎండీఏ-2031 మాస్టర్‌ప్లాన్‌లో ఎర్రమంజిల్ హెరిటేజ్ సైట్‌గానే కొనసాగుతున్నదని పేర్కొన్నారు. వాదనలను నమోదు చేసుకున్న ధర్మాసనం.. విచారణను బుధవారానికి వాయిదావేసింది.

## నేటినుంచి ఎంసెట్ ఫార్మసీ కౌన్సెలింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం కౌన్సెలింగ్ బుధవారం నుంచి ప్రారంభం కానున్నది. గురువారం స్లాట్ బుకింగ్, ఆగస్టు రెండు, మూడు తేదీల్లో సర్టిఫికెట్ల పరిశీలన, రెండు నుంచి నాలుగో తేదీ వరకు వెబ్‌ఆప్షన్ల ఎంపిక ఉంటుందని అడ్మిషన్ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. ఆగస్టు ఆరున సీట్లు కేటాయిస్తామని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## జేసీ వ్యాఖ్యలపై ఢిల్లీ హైకోర్టులో విచారణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఒక్కో అభ్యర్థి రూ.50 కోట్లకు తగ్గకుండా ఖర్చుపెట్టారని టీడీపీ నేత జేసీ దివాకర్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టింది. జేసీ వ్యాఖ్యలు ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు రావ ని కేంద్ర ఎన్నికల సంఘం కోర్టుకు నివేదించింది. ఆయన అభ్యర్థిగా లేకున్నా.. తన కుమారుడు పవన్ కోసం ఖర్చు పెట్టినట్టు జేసీ చెప్పారని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. దీంతో ప్రతివాదిగా జేసీ దివాకర్‌రెడ్డికి బదులు ఆయన కుమారుడు పవన్ పేరును చేర్చాలని ధర్మాసనం స్పష్టంచేసింది. నాలుగువారాల్లోపు సవరించిన పిటిషన్ దాఖలు చేయాలని పిటిషనర్‌కు సూచించింది.



రాంపూర్ పంప్‌హౌస్ పనులను పరిశీలిస్తున్న సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్

# గడువులోగా పూర్తవ్వాలి

- 5 నాటికి నీటి పంపింగ్‌కు మోటర్లు సిద్ధం చేయాలి
- సీఎంవో ప్రత్యేక కార్యదర్శి స్మితా సబర్వాల్


**మల్యాల / ఇబ్రహీంపట్నం/ ధర్మారం:** నిర్దేశించిన గడువులోగా ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిర్మిస్తున్న పంప్‌హౌస్‌ల నిర్మాణాలను పూర్తిచేయాలని సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ ఆదేశించారు. మంగళవారం జగిత్యాల జిల్లాలోని మల్యాల మండలం రాంపూర్, ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేట వద్ద నిర్మిస్తున్న పంప్‌హౌస్‌ల పనులు, పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ శివారులో అండర్‌టన్నెల్‌ను ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఎంవో ఓఎస్డీ శ్రీధర్‌దేశ్‌పాండేతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాంపూర్ పంప్‌హౌస్‌లో 8 మోటర్లకు గాను.. నాలుగు మోటర్ల బిగింపు పూర్తయిందని, ఐదో మోటరును మరో రెండ్రోజుల్లో పూర్తిస్థాయిలో బిగించి ట్రయల్ రన్ నిర్వహించాలని సూచించారు. షిఫ్టులవారీగా లేబర్ల సంఖ్యను పెంచి సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తయ్యేలా చూడాలని ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. ఆగస్టు 5 నాటికి పంప్‌హౌస్‌ల ద్వారా 0.6 టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాట్లుచేయాలని, కరీంనగర్ జిల్లా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని సర్జ్‌పూల్‌ను ప్రారంభిస్తే.. నేరుగా వరద కాలువలోకి నీరు చేరుతుందని తెలిపారు. పంప్‌హౌస్‌లు పూర్తయితే ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి కేసీఆర్ రానున్నారని చెప్పారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రతి నిమిషం కీలకమని, పనుల్లో విరామం లేకుండా షిఫ్టులవారీగా చేపట్టాలని ఏజెన్సీ ప్రతినిధులకు సూచించారు. ఆమె వెంట రిటైర్డ్ సీఈ, నవయుగ డైరెక్టర్ వెంకటరామారావు, ఎస్ఈ శ్రీకాంత్‌రావు, ఈఈ సుధాకిరణ్, ప్రాజెక్టు మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డీఈఈలు తదితరులున్నారు.


తెలంగాణ ప్రభుత్వం
సూపరింటెండింగ్ ఇంజినీర్ కార్యాలయం, TUFIDC, యూనిట్-IV, రామగుండం
NIT No. 31/SE/TUFIDC/NRL/UNIT-IV/2019-20, ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 27-07-2019.
**పని పేరు:** ఖానాపూర్ టౌన్‌లో BT రోడ్ వెడల్పు చేయుట ద్వారా అభివృద్ధి చేయుట, సైడ్ డ్రెయిన్‌ల నిర్మాణం, ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నుండి సాయిబాబా దేవాలయం వైపుగా మరియు తెలంగాణ విగ్రహం నుండి మస్కాపూర్ కల్వర్ట్ వైపుగా సెంట్రల్ లైటింగ్ మొ॥వి ఏర్పాటు చేయుట (Tufidc క్రింద). ECV: రూ. 1500.00 లక్షలు. బిడ్ దాఖలు ప్రారంభ & ముగింపు తేది: 31-07-2019 నుండి 21-08-2019న మ. 3.00 గం. సాంకేతిక బిడ్ తెరుచు తేది: 21-08-2019న మ. 3.30 గం. ధర బిడ్ తెరచుట: 21-08-2019న సా. 4.00 గం. తదుపరి వివరాల కొరకు https://tender.telangana.gov.in దర్శించండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్, TUFIDC, యూనిట్-IV, రామగుండం మున్సిపల్ కార్పొరేషన్
DIPR RO.No. 763-DP/CL/ADVT/1/2019-20, Dt: 30-07-2019

తెలంగాణ ప్రభుత్వం
కార్యనిర్వాహక ఇంజినీర్ పంచాయతీరాజ్ డివిజన్, బాన్సువాడ వారి కార్యాలయము, కామారెడ్డి జిల్లా
టెండరు ప్రకటన
టెండరు నోటీస్ నం.T1/02/2019-20 తేది: 24-07-2019
పంచాయతీరాజ్ డివిజన్ బాన్సువాడ ద్వారా యస్.సి.డి.డి., రూర్బన్ మరియు టి.డి.డి. నిధులకు సంబంధించిన (09) పనులను చేపట్టుటకు గాను రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లను ఆహ్వానించనైనది. మొత్తం పనుల సంఖ్య: 09, అంచనా విలువ: 63.00 లక్షలు, అప్లికేషన్ చేయుటకు చివరి తేది: 09-08-2019, టెండరు షెడ్యూళ్ళు జారీ చేయు తేది: 13-08-2019 నుండి, టెండర్లు స్వీకరించు తేది: 14-08-2019 సా. 3.00గం.ల వరకు, టెండర్లు తెరుచు తేది: 14-08-2019, సా.3.30గం.కు. ఇతర వివరములు మరియు టెండర్ నియమములు కార్యనిర్వాహక ఇంజినీర్, పంచాయతీరాజ్ డివిజన్ బాన్సువాడ, రీజినల్ ఆఫీసర్, పంచాయతీ రాజ్ నిజామాబాద్, డి.ఇ.ఇ. పి.ఆర్, బాన్సువాడ, మద్నూర్ మరియు పిట్లం కార్యాలయంలో ప్రదర్శించబడిన టెండర్ నోటీసులలో లభ్యమగును.
సం/- కార్యనిర్వాహక ఇంజనీర్, పంచాయతీరాజ్ డివిజన్, బాన్సువాడ
DIPR RO. No. 769-DP/CL/Advt/1/2019-20, Dt: 30/07/2019


# ఉత్తమ సేవల కోసం శిక్షణ

- టెక్నాలజీ వాడకంపై డీఎస్పీ నుంచి ఎస్‌హెచ్‌వో వరకు తరగతులు
- తొలి విడుతగా 116 మంది డీఎస్పీలకు శిక్షణ



డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో పోలీస్ అధికారులకు కొనసాగుతున్న ప్రత్యేక శిక్షణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర పౌరులకు ఏకరీతి పోలీస్ సేవలందించే లక్ష్యంతో పోలీస్‌శాఖలో పలు సంస్కరణలు తీసుకువస్తున్నారు. రాజధాని హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ జిల్లాలోని మారుమూల పోలీస్‌స్టేషన్ వరకు అన్నింటా ఒకే విధమైన సేవలందించాలన్న లక్ష్యాన్ని నిర్దేశించిన డీజీపీ ఎం మహేందర్‌రెడ్డి.. అందుకు అనుగుణంగా సిబ్బందికి అంతర్గత శిక్షణపై దృష్టి పెడుతున్నారు. నేర పరిశోధన, నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, ప్రజాహిత పోలీసింగ్‌తో పౌరులకు మరింత చేరువయ్యేలా, వారిలో భరోసా పెంచేలా తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారు. డీజీపీ కార్యాలయంలోని లెర్నింగ్ సెంటర్‌లో ఇందుకోసం రెండురోజుల ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. విధులకు ఆటంకం కలుగకుండా బ్యాచులుగా విభజించి, ఒక్కో బ్యాచులో 35 మంది చొప్పున ఉండేలా చూస్తున్నారు. అనుభవజ్ఞులైన అధికారులు, పోలీస్ ఐటీ అప్లికేషన్స్ వాడకంలో నిపుణులతో సూచనలు ఇప్పిస్తున్నారు. తొలివిడుతగా మంగళవారం రాష్ట్రంలోని 116 మంది డీఎస్పీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. టీఎస్ కాప్ సహా అన్నిరకాల సాంకేతిక పరిజ్ఞానం వాడకంతో రోజువారీ విధులను ఏవిధంగా సులభతరం, పారదర్శకం చేసుకోవచ్చనే అంశాలపై సూచనలిస్తున్నారు. సైబర్‌క్రైం, పెరుగుతున్న నేరాలు, వాటిని అరికట్టడం, ఆయా కేసుల పరిశోధనలో అనుసరించాల్సి వ్యూహాలను తెలియజేస్తున్నారు.

# కరువుతీరా నీళ్లు

మొదటిపేజీ తరువాయి...

వ్యవధిలో భారీవర్షాలు కురుస్తాయన్న సంకేతాలతో రాష్ట్రంలోని ప్రాజెక్టులకు నిండు భరోసా ఏర్పడింది. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో పొలం పనులు ప్రారంభంకాగా, మరిన్ని ప్రాంతాల్లో రైతులు పొలంబాట పట్టారు.

### మరో మూడ్రోజులు వర్షాలు

రాగల మూడ్రోజుల వరకు రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వానలు, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తూర్పు మధ్యప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మంగళవారం ఉదయం అల్పపీడనం ఏర్పడిందని, దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తువరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని తెలిపింది. మరోవైపు దక్షిణ గుజరాత్, దానిని ఆనుకుని ఉన్న ఉత్తర మహారాష్ట్ర, ఒడిశా, తూర్పు మధ్య ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా కూడా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని పేర్కొన్నది. ఈశాన్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాల్లో వచ్చేనెల 4న మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. అల్పపీడనం, ఉపరితల ఆవర్తనాల ప్రభావంతో రుతుపవనాలు చురుకుగా కదిలి రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

### గ్రేటర్ హైదరాబాద్‌లో నేడు, రేపు భారీ వానలు


**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** గ్రేటర్ హైదరాబాద్‌లో నాలుగు రోజులుగా ఓ మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడుతున్నాయి. గాలిలో తేమశాతం అధికంగా ఉండటం, రుతుపవనాలు చురుకుగా కదులుతున్నందున గ్రేటర్‌లో బుధ, గురువారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. మంగళవారం రాజేంద్రనగర్, పాతబస్తీ, మెహిదీపట్నం, సరూర్‌నగర్, నాగోల్, హయత్‌నగర్, ఉప్పల్, శామీర్‌పేట, మహేశ్వరం, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, అమీర్‌పేట, కార్వాన్, మేడ్చల్, మల్కాజిగిరి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో వర్షం పడిందని చెప్పారు. శేరిలింగపల్లిలో 12.8 మి.మీ., కుత్బుల్లాపూర్‌లో 9.8 మి.మీ., అల్వాల్, తిరుమలగిరిలో 3.3 మి.మీ., మల్కాజిగిరిలో 2.5 మి.మీ., కూకట్‌పల్లిలో 2.3 మి.మీ., పటాన్‌చెరులో 0.5 మి.మీ. వర్షం కురిసిందని వెల్లడించారు. నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 25.5 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 21.8 డిగ్రీలు, గాలిలో తేమ 86 శాతంగా నమోదైందని అధికారులు తెలిపారు.

**కృష్ణా, గోదావరి బేసిన్లలోని ముఖ్యమైన రిజర్వాయర్ల నీటి మట్టాలు**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1,705.00 | 1,703.41 | 129.72 | 121.27 | 1,16,000 | 1,63,342 |
| నారాయణపుర | 1,615.00 | 1,615.00 | 37.64 | 34.21 | 1,16,703 | 1,23,000 |
| జూరాల | 1,045.00 | 1,036.64 | 9.66 | 5.409 | 90,000 | 25,341 |
| తుంగభద్ర | 1,633.00 | 1,604.35 | 100.86 | 25.60 | 15,281 | 1,788 |
| శ్రీశైలం | 885.00 | 804.10 | 215.81 | 31.04 | 84 | 84 |
| నాగార్జునసాగర్ | 590.00 | 506.90 | 312.05 | 126.47 | 0 | 0 |
| సింగూరు | 1,717.93 | 1,670.28 | 29.91 | 0.44 | 15 | 15 |
| నిజాంసాగర్ | 1,405.00 | 1,367.74 | 17.80 | 0.11 | 43 | 11 |
| శ్రీరాంసాగర్ | 1,091.00 | 1,048.90 | 90.31 | 5.61 | 1,254 | 226 |
| లోయర్‌మానేరు | 920.00 | 881.10 | 24.07 | 3.33 | 609 | 204 |
| కడెం | 700.00 | 694.28 | 7.60 | 6.19 | 29,810 | 8,800 |
| ఎల్లంపల్లి | 485.56 | 464.24 | 20.18 | 6.75 | 11,278 | - |

### తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు
## గట్టికొప్పల రాంరెడ్డి కన్నుమూత

**మన్సూరాబాద్/ మిర్యాలగూడ రూరల్:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, సీపీఎం సీనియర్ నాయకుడు గట్టికొప్పుల రాంరెడ్డి (90) మంగళవారం ఉదయం కన్నుమూశారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబసభ్యులు ఐదురోజుల క్రితం హైదరాబాద్‌లోని కామినేని దవాఖానలో చేర్పించారు. చికిత్సపొందుతూ మంగళవారం ఉదయం 11:40 గంటలకు తుదిశ్వాస విడిచారు. మిర్యాలగూడ మండలం తడకమల్లకు చెందిన రాంరెడ్డికి భార్య వరమ్మ, కూతుళ్లు వనజాత, శ్రీదేవి, రమాదేవి, సరళ, కుమారుడు వినాయక్‌రెడ్డి ఉన్నారు. మేనమామ లక్ష్మీనర్సింహారెడ్డి స్ఫూర్తితో విద్యార్థిదశలోనే రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొ న్న రాంరెడ్డి.. అండర్ గ్రౌండ్‌లోకి వెళ్లిన నేతలకు కొరియర్‌గా పనిచేశారు. నల్లగొండకు చెందిన భీంరెడ్డి నర్సింహారెడ్డి, మల్లు వెంకటనర్సింహారెడ్డి, మల్లు స్వరాజ్యంతో కలిసి పోరాటంలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే రజాకార్లకు పట్టుబడి చిత్రహింసలకు గురయ్యారు. తొలి దశలో ముల్కపట్నం గ్రామ సర్పంచ్‌గా పనిచేసిన ఆయన.. ముల్కపట్నం నుంచి విడిపోయి గ్రామ పంచాయతీగా ఏర్పడిన తడకమళ్లకు 1959 నుంచి 1995 వరకు ఏకంగా 36 ఏండ్లపాటు సర్పంచ్‌గా ఉన్నారు. సీపీఎం మిర్యాలగూడ డివిజన్ కార్యదర్శిగా, నల్లగొండ జిల్లా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. రాంరెడ్డి అంత్యక్రియలను తడకమల్లలో బుధవారం నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. కే జానారెడ్డి, చెరుపల్లి సీతారాములు, జిల్లా సీపీఎం కార్యదర్శి ఎం సుధాకర్‌రెడ్డి, మల్లు లక్ష్మి తదితరులు కామినేనిలో రాంరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు.



గట్టికొప్పల రాంరెడ్డి (ఫైల్)



ప్రభుత్వ ఉత్తర్వులు చూపుతున్న ఓయూ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు

## బయోటెక్నాలజీ ఇంజినీరింగ్‌కు బైపీసీ విద్యార్థులు అర్హులే

**ఉస్మానియా యూనివర్సిటీ:** బైపీసీ గ్రూప్‌తో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులు బీటెక్ బయోటెక్నాలజీ చదివేందుకు అర్హులేనని పలువురు అధ్యాపకులు స్పష్టంచేశారు. బీటెక్ చదివేందుకు బైపీసీ విద్యార్థులు మ్యాథమెటిక్స్ బ్రిడ్జి కోర్సు పూర్తిచేయాల్సిన అవసరంలేదని చెప్పారు. దీనికి సంబంధించిన ఉత్తర్వులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జనార్దన్‌రెడ్డి, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ ఇప్పటికే జారీచేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉత్తర్వులను అధ్యాపకులు మీడియాకు చూపించారు. ఉస్మానియా యూనివర్సిటీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఓయూ టెక్నాలజీ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ రాజారావు, డాక్టర్ ఏ రవీందర్, జేఎన్టీయూ అధ్యాపకుడు డాక్టర్ ఎల్ సైదానాయక్, సీబీఐటీ బయోటెక్నాలజీ విభాగం హెడ్ డాక్టర్ రాజశ్రీ, శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డైరెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు మాట్లాడారు. ఇంటర్‌లో బయాలజీ చదివిన విద్యార్థులు 2019-20లో బీటెక్ బయోటెక్నాలజీ చదివేందుకు అర్హులని చెప్పారు.

## శ్రీ వేంకటేశ్వర ఫార్మసీ కాలేజీలో స్పాట్ అడ్మిషన్లు

**హైదరాబాద్:** మాదాపూర్‌లోని శ్రీ వేంకటేశ్వర ఫార్మసీ కళాశాలలో 2019-20 విద్యాసంవత్సరానికిగాను స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నట్టు కాలేజీ యాజమాన్యం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అడ్మిషన్ల కోసం అర్హులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో ఆగస్టు పదో తేదీలోపు కళాశాలలో సంప్రదించాలని పేర్కొన్నది. పూర్తి వివరాల కోసం 9885195165,9966991548 నంబర్లకు ఫోన్‌చేయవచ్చని సూచించింది.

# నేడు ప్రైవేటు హాస్పిటళ్ల బంద్

- ఎన్ఎంసీ బిల్లును వ్యతిరేకిస్తూ ఐఎంఏ రాష్ట్రశాఖ పిలుపు

**హైదరాబాద్/ఖైరతాబాద్, నమస్తే తెలంగాణ:** కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) బిల్లును వ్యతిరేకిస్తూ బుధవారం రాష్ట్రంలోని అన్ని ప్రైవేటు హాస్పిటళ్ల బంద్‌కు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్రశాఖ పిలుపునిచ్చింది. వైద్య విద్యార్థులను అయోమయానికి గురిచేసేలా ఉన్న బిల్లును రద్దు చేయాలని దేశవ్యాప్త బంద్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర క్యాదర్శి సంజీవ్‌సింగ్‌యాదవ్ చెప్పారు. బుధవారం ఉదయం 6 నుంచి గురువారం ఉదయం 6 గంటల వరకు సాధారణ వైద్యసేవలు నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం సభ్యులు శివలింగం, నిమ్స్ రెసిడెంట్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


**జూనియర్ డాక్టర్లు సైతం..**

ఎన్ఎంసీ బిల్‌ను వ్యతిరేకిస్తూ వైద్యసేవల బంద్‌లో పాల్గొంటామని తెలంగాణ జూనియర్ డాక్టర్ల జేఏసీ చైర్మన్ పీఎస్ విజయేందర్‌గౌడ్, కన్వీనర్ గుంగులోతు సంజయ్, కార్యదర్శి జీ నాగార్జునగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ వైద్యసేవలు నిలిపేస్తామన్నారు.

# సోని కిడ్నాప్ కథ సుఖాంతం

- పోలీసుల అదుపులో నిందితుడు రవిశంకర్!

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** బీఫార్మసీ విద్యార్థిని సోని కిడ్నాప్ కథ సుఖాంతమైంది. హైదరాబాద్ శివారులో వారంక్రితం కిడ్నాపైన సోని మంగళవారం ఉదయం ఎంజీబీఎస్‌లో ప్రత్యక్షమైంది. కిడ్నాప్ వెనుక మిస్టరీ మాత్రం వీడాల్సి ఉన్నది. సోనిని కిడ్నాప్ చేసినట్టు అనుమానిస్తున్న రవిశంకర్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలులో అక్కడి పోలీసుల సాయంతో అదుపులోకి తీసుకొని.. హైదరాబాద్‌లోని రహస్య ప్రదేశంలో విచారణ చేస్తున్నట్టు సమాచారం. తన కుమార్తెను రవిశంకర్ కిడ్నాప్ చేశాడని యాదయ్య అనే టీస్టాల్ నిర్వాహకుడు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశాడు. మంగళవారం ఉదయం ఎంజీబీఎస్‌లో సోనిని గుర్తించిన స్నేహితురాలు మౌనిక యాదయ్యకు సమాచారం ఇచ్చింది. వారంపాటు సోనిని రవిశంకర్ ఎక్కడెక్కడికి తీసుకెళ్లాడు, ఎందుకు తీసుకెళ్లాడు, కారు ఎక్కడి నుంచి చోరీ చేశాడు, సోనిని ఎందుకు కిడ్నాప్ చేయాల్సి వచ్చింది, ఒంగోలులో ఎందుకు వదిలేశాడు.. ఇలా అనేక ప్రశ్నలకు పోలీసులు జవాబులు రాబట్టాల్సి ఉన్నది. సోనిని మహిళా పోలీసులు విచారించినప్పటికీ ఆశించిన సమాచారం రాలేదని తెలుస్తున్నది. కిడ్నాపర్ రవిశంకర్ సమాచారం ఇస్తే రూ.లక్ష బహుమతి ఇస్తామని రాచకొండ పోలీసులు ప్రకటించిన విషయం తెలిసిందే.



కిడ్నాపర్, ఉపయోగించిన కారు

నమస్తే తెలంగాణ

# ధర్మగంట

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No. 9346979997

dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE





నల్లగొండ జిల్లా చందంపేట తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం రికార్డులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్

## అచ్చంపేటపట్టిలో జేసీ విచారణ

- 'ఎకరం రూ.20 వేలకే..!' కథనానికి స్పందన
- 250 ఎకరాల ప్రభుత్వ భూమి మాయంపై నివేదిక ఇవ్వాలని దేవరకొండ ఆర్డీవోకు జేసీ ఆదేశం

**చందంపేట:** 'ఎకరం రూ.20 వేలకే..!' శీర్షికన మంగళవారం ధర్మగంటలో ప్రచురితమైన కథనానికి నల్లగొండ జిల్లా జాయింట్ కలెక్టర్ చంద్రశేఖర్ స్పందించారు. దేవరకొండ ఆర్డీవో లింగ్యానాయక్‌తో కలిసి మంగళవారం చందంపేట తాసిల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అచ్చంపేటపట్టి గ్రామంలో సర్వే నంబర్ 50లోని 250 ఎకరాల ప్రభుత్వ భూమిని హాంఫట్ చేశారనే విషయంపై రికార్డులను పరిశీలించి ఆక్రమణ వ్యవహారంపై విచారణకు ఆదేశించారు. అక్రమంగా పట్టా పొందినవారి వివరాలు పరిశీలించి వాటిని రద్దు చేస్తామన్నారు. బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకుంటామని జేసీ చెప్పారు. అచ్చంపేట పట్టి (గట్టుకింది తండా)కి సంబంధించిన గత 20 ఏండ్ల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. 250 ఎకరాల భూమి ఎవరి పేర్లపై పట్టాలయ్యాయి. గత రికార్డుల ప్రకారం పేర్లు, ప్రస్తుత కంప్యూటర్ పహాణీ ప్రకారం రికార్డులను పరిశీలించి సర్వేనంబర్ 50లో ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించి పూర్తి నివేదికను సమర్పించాలని ఆర్డీవో లింగ్యానాయక్‌ను జేసీ ఆదేశించారు. సర్వేయర్లతో మ్యాప్ ఆధారంగా భూమిని పరిశీలించి 50 సర్వే నంబర్‌లో ప్రభుత్వ భూమి ఎన్ని ఎకరాలు ఉన్నదో, పట్టా ఎన్ని ఎకరాలు అయిందో పూర్తి వివరాలతో నివేదిక తయారుచేయాలని సూచించారు. తాసిల్దార్ కార్యాలయానికి వచ్చిన జేసీకి వివిధ గ్రామాల రైతులు.. తమకు రైతుబంధు, పాస్‌పుస్తకాలు అందలేదని వినతిపత్రాలు అందజేశారు. వాటిని పరిశీలించినవారిలో దేవరకొండ డివిజన్ సర్వేయర్ వంశీ, లక్ష్మణ్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, వీఆర్వో యాదయ్య ఉన్నారు.

ధర్మగంట నమస్తే ఎఫెక్ట్ DHARMA GANTA

## భూమిని కాజేస్తున్నారని..

- మహిళా రైతు ఆత్మహత్యాయత్నం
- భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ ఎదుట ఘటన



ప్రభుత్వ ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న భీమపోగు సీతమ్మ

**కొత్తగూడెం, నమస్తే తెలంగాణ:** పసుపు కుంకుమ కింద తండ్రి ఇచ్చిన భూమిని రెవెన్యూ అధికారులు ఇతరుల పేరిట పట్టా చేస్తున్నారని ఓ మహిళా రైతు మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కేసు కోర్టులో ఉన్నప్పటికీ అధికారులు వేరేవారికి పట్టా చేసేందుకు సిద్ధమయ్యారంటూ ఆవేదనతో పురుగుమందు తాగారు. జూలూరుపాడు మండలానికి చెందిన భీమపోగు సీతమ్మకు తండ్రి పుల్లయ్య సర్వేనంబర్ 180లోని 1.21 ఎకరాల భూమిని పసుపు కుంకుమ కింద ఇచ్చారు. ఇప్పటివరకు ఆ భూమి సీతమ్మ సాగుచేస్తున్నారు. జూలూరుపాడు తాసిల్దార్, వీఆర్వో కుమ్మక్కై వేరే వ్యక్తి పేరును పహాణీలోకి ఎక్కించారు. దీనిపై ఇరువర్గాలు కోర్టులో కేసు వేసుకున్నాయి. సమస్యను కోర్టు పరిష్కరించకముందే రెవెన్యూ అధికారులు వేరేవ్యక్తికి పట్టా చేసేందుకు సిద్ధమయ్యారు. ఇదేమిటని ప్రశ్నిస్తే 'నీకు.. ఆ భూమికి ఎలాంటి సంబంధం లేదు' అని జూలూరుపాడు తాసిల్దార్ అంటున్నారని ఆవేదనతో సీతమ్మ కలెక్టరేట్ ఎదుట పురుగుమందు తాగారు. చుట్టుపక్కలవారు గుర్తించి 108లో ప్రభుత్వ ఏరియా దవాఖానకు తరలించారు. జాయింట్ కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు, తాసిల్దార్.. ఏరియా దవాఖానకు వెళ్లి బాధితురాలి పరిస్థితిని తెలుసుకున్నారు. న్యాయంచేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయంపై సీతమ్మ కుమారుడు తమ వద్ద ఉన్న డాక్యుమెంట్లను, గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఇచ్చిన వినతి పత్రాన్ని, పసుపు కుంకుమ కింద ఇచ్చిన భూమి అగ్రిమెంట్ పత్రాలను అధికారులకు చూపించారు.

## రికార్డులు మార్చేశారు

- రెవెన్యూ అధికారుల అండతో ఇష్టారాజ్యం
- 15 గుంటల భూమికి డాక్యుమెంట్ల సృష్టి
- 'ధర్మగంట'ను ఆశ్రయించిన మహబూబ్‌నగర్ జిల్లా రైతు మల్లేశ్వరి



తన పిల్లలతో మ్యాకల మల్లేశ్వరి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రెవెన్యూ అధికారులు, పోలీసుల అండతో కబ్జాదారులు ఓ రైతు కుటుంబంపై ప్రతాపం చూపుతున్నారు. వారికి ఉన్న భూమిలో నుంచి 15 గుంటలను వదిలేయాలని బెదిరిస్తున్నారు. రాజాపూర్ మండలం చెన్నవెల్లి గ్రామంలోని సర్వే నంబర్ 130/ఇలో ఐదెకరాల భూమి మ్యాకల నాగయ్య పేరు మీద ఉండేది. 2015లో ఆయన తన కుమారుడు మ్యాకల మల్లయ్య పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. మల్లయ్యకు పట్టా కూడా ఇచ్చారు. చాలా ఏండ్లనుంచి మల్లయ్య, మల్లేశ్వరి దంపతులు ఇందులో సాగుచేసుకుంటున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది సాగు పనులు మొదలుపెట్టారు. ఆ భూమికి దిగువన ఉన్నవాళ్లు రోడ్డు కోసం మల్లయ్యకు తెలియకుండానే ఆయన పొలాన్ని ట్రాక్టర్‌తో తొక్కించారు. ప్రశ్నించిన మల్లయ్యపై దాడిచేశారని ఆయన భార్య మల్లేశ్వరి తెలిపారు. సమస్యను తాసిల్దార్‌కు విన్నవించి, పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదని చెప్పారు. వివాదం నడుస్తుండగానే.. రోడ్డు వేసేందుకు ప్రయత్నిస్తున్నవారితో రెవెన్యూ అధికారులు కుమ్మక్కయ్యారు. వారి పేరిట రికార్డులను మార్చేశారు. ఐదెకరాల భూమిలో రోడ్డు కోసం తవ్విన 15 గుంటల భూమిని మ్యాకల మల్లయ్య నుంచి కాసా లక్ష్మమ్మ కొన్నట్టు డాక్యుమెంట్లను సృష్టించారు. సర్వేనంబర్ 130కి బై నంబర్లు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మ్యాకల మల్లయ్యకు చెందిన 5 ఎకరాల భూమిలోనే తమ 15 గుంటల భూమి ఉన్నదని కాసా లక్ష్మమ్మ భర్త కాసా మల్లయ్య దౌర్జన్యానికి దిగుతున్నారని మల్లేశ్వరి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

### సర్వేచేసి తేలుస్తాం

పొజిషన్‌లో ఎవరున్నారనేది అనవసరం. డాక్యుమెంట్లను పరిశీలించి కాసా లక్ష్మమ్మ పేరు మీద చేశాను. రోడ్డు వివాదం గురించి మాకు తెలియదు. సర్వేకు దరఖాస్తు పెట్టారు. సర్వేచేసి సరిహద్దులు నిర్ణయిస్తాం. ఆ వివాదాస్పద భూమి ఏ సర్వే నంబర్లలో ఉందో తేలుతుంది.

- నర్సింగరావు, తాసిల్దార్, రాజాపూర్

# లావుణి పట్టాలు లాక్కున్నారు!

## గిరిజనుల పట్టాలు రద్దుచేసిన రెవెన్యూ అధికారులు

- ఏండ్లుగా సాగుచేసుకుంటున్న భూములు వెనక్కు
- కార్యాలయాల చుట్టూ తిరిగినా కనికరించని అధికారులు
- మహబూబ్‌నగర్ జిల్లా కొత్తచెల్క తండా గిరిజన రైతుల ఆవేదన

**నవాబ్‌పేట:**

మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం తీగల్‌పల్లి పంచాయతీ కొత్తచెల్కతండాలో భూమిలేని తొమ్మిది మంది గిరిజనులకు 1954లో సర్వేనంబర్ 135 లోని 60 ఎకరాల ప్రభుత్వభూమిని పంపిణీచేసింది. తండాకు చెందిన పుల్యా, బాల్యా, గోప్యా, లాల్యా, భీమ్లా, రాంసింగ్, ధర్మా, గోర్యా, బక్కలాల్యాకు అప్పటి ప్రభుత్వం లావుణి పట్టాలు అందజేసింది. అప్పటినుంచి వారి కుటుంబాలు ఆ భూములను సాగుచేసుకుంటూ జీవిస్తున్నాయి. 1995లో ప్రభుత్వం ఈ తొమ్మిదిమంది రైతులు, వారి వారసులకు పట్టాలు చేసి పాస్‌పుస్తకాలు పంపిణీ చేసింది. పాస్‌పుస్తకాలను బ్యాంకుల్లో పెట్టి పలు మార్లు పంటరుణాలు తీసుకోవడంతోపాటు, వివిధ ప్రభుత్వ పథకాలను పొందారు. కాగా, గతేడాది ప్రభుత్వం నూతనంగా చేపట్టిన భూప్రక్షాళనలో రెవెన్యూ అధికారులు గిరిజనుల పట్టాలను తొలగించారు. సర్వేనంబర్ 135లో 60 ఎకరాల భూమిలో.. సంబంధం లేని వ్యక్తులకే 29 ఎకరాల్లో పట్టాలు ఉన్నాయని.. అసలు రైతుల పేర్లపై లేవనే సాకుతో ఉన్న పట్టాలను అధికారులు రద్దుచేశారు. అదేతండాకు చెందిన లాల్యా, బాల్యా, వాల్యాతోపాటు మరి కొంతమంది రైతులకు చెందిన సుమారు 29 ఎకరాల పట్టాలను రద్దుచేశారు. పట్టాదారులు గతంలోనే చనిపోవడంతో.. వారి కుమారులు నర్సింగ్‌నాయక్, తౌర్యానాయక్, బక్క రాములు, లాల్యా, రుక్కాలి తదితరులు తొలగించిన భూమిని పట్టా చేసి ఇవ్వాలంటూ ఏడాది కాలంగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఆన్‌లైన్‌లో తొలగించిన భూమిని రెండునెలల్లో సరి చేసి కొత్త పాస్‌పుస్తకాలు అందజేస్తామని చెప్పిన అధికారులు.. నేటికీ ఇవ్వలేదు. కనీసం సర్వే కూడా చేపట్టకపోవడంతో గిరిజన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్న పట్టాలు రద్దు చేయడం, కొత్త పాస్‌పుస్తకాలు ఇవ్వకపోవడంతో రైతుబంధు, రైతుబీమాతో పాటు వివిధ ప్రభుత్వ పథకాలకు నోచుకోవడం లేదని వాపోతున్నారు.



ప్రభుత్వం అందజేసిన పాత పట్టాబుక్కులను చూపుతున్న బాధిత గిరిజన రైతులు

### త్వరలోనే సర్వే చేపడుతాం

తీగల్‌పల్లి గ్రామ శివారులోని కొత్తచెల్క తండాకు చెందిన రైతుల పట్టాలను సర్వే నంబర్‌లో భూమి అధికంగా ఉన్నదంటూ తొలగించారు. గతంలోనే ఈ తొలగింపు జరిగింది. తీగల్‌పల్లి శివారులోని 135 సర్వే నంబర్‌లో చాలా ప్రభుత్వ భూమి ఉన్నది. వెంటనే సర్వే చేపట్టి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటా.

- రాజునాయక్, తాసిల్దార్, నవాబ్‌పేట

### సర్వేకు వస్తామని రావడం లేదు

కొత్తచెల్కతండాలోని 135 సర్వేనంబర్‌లోని భూమిని సర్వేచేసి.. సరిచేస్తామని చెప్తున్న అధికారులు ఏడాది గడిచినా సర్వే చేయడానికి రావడంలేదు. నాకు 2 ఎకరాల 20 గుంటల భూమి పట్టా కావాల్సి ఉన్నది. వీఆర్వోను ఎప్పుడు కలిసినా పైఅధికారులకు చెప్తానంటూ కాలం వెళ్లదీస్తున్నారు. మా తాతల కాలం నుంచి ఇదే భూమిపై బతికాం. ఇప్పుడు రైతుబంధు, బీమా, రుణాలు రావడం లేదు. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి మాకు భూమిని పట్టాచేసి న్యాయం చేయాలి.

- నర్సింగ్‌నాయక్, కొత్తచెల్కతండా, నవాబ్‌పేట

### ప్రజావాణిలో ఫిర్యాదుచేసినా ఫలితం లేదు

మా భూమి పట్టా రద్దుచేశారని.. వెంటనే పట్టాచేసి ఇవ్వాలని గతంలో పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా.. అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదు. నలభై ఏండ్ల నుంచి అదే భూమిలో పంట సాగుచేస్తున్నాం. మా మామ పేరున ఉన్న భూమిని నా పేరున చేయాలని గతంలో వేడుకున్నా. నా భర్త చనిపోవడంతో నా పేరుపైనే పట్టా చేయాలని కోరా. కానీ అప్పుడూ.. ఇప్పుడూ అంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

- లాల్యా, కొత్తచెల్కతండా, నవాబ్‌పేట

## పన్నెండు గుంటల కోసం ప్రదక్షిణలు

- ఒకే కుటుంబానికి చెందిన పాస్‌పుస్తకాల్లో ఆరు గుంటల చొప్పున మాయం
- ఏడాది కాలంగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న గిరిజనులు
- తప్పులు సరిచేయకపోవడంతో రైతుబంధుకు దూరం

**పిట్లం:** పట్టా ఉండి ఏండ్ల తరబడి కాస్తులో ఉన్నప్పటికీ కొత్త పాస్‌పుస్తకాల్లో 12 గుంటల భూమి మాయమయింది. ఒకే కుటుంబానికి చెందిన, ఒకే సర్వే నంబర్‌లోని భూమిని అధికారులు ఆరు గుంటల చొప్పున మాయం చేశారు. ఏడాది కాలంగా పాస్‌పుస్తకాల్లో తప్పులు సరిచేయకపోవడంతో గిరిజన రైతులు రైతుబంధుకు దూరమవుతున్నారు. తమకు న్యాయం చేయాలంటూ హలావత్ దేవ్లీబాయి, ఆమె కొడుకు హలావత్ కిషన్ ధర్మగంటను ఆశ్రయించారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన దేవ్లీబాయి 1997, 2012 సంవత్సరాల్లో అవుసుల నారాయణ, శేషాద్రి, అంజయ్య వద్ద 140 సర్వేనంబర్‌లో 6.04 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. కుటుంబసభ్యుల వాటాల్లో భాగంగా 140/అ1లో దేవ్లీబాయి 1.38 ఎకరాలు, 140/ఆ లో కిషన్ 1.38 ఎకరాలు పట్టా చేయించుకున్నారు. ఇద్దరి పేరిట ఉన్న పాత పుస్తకాల్లో 1.38 ఎకరాల చొప్పున నమోదుచేశారు. అనంతరం భూప్రక్షాళనలో భాగంగా పంపిణీ చేసిన కొత్త పాస్‌పుస్తకాల్లో అధికారులు ఇద్దరికీ 1.32 ఎకరాల చొప్పున మాత్రమే నమోదు చేశారు. దేవ్లీబాయికి మొదటి విడుత రైతుబంధు చెక్కు మాత్రమే అందగా.. రెండు విడుతల్లో డబ్బులు జమకాలేదు. కాగా, గతంలోనే పాస్‌పుస్తకం రాగా.. కార్యాలయం చుట్టూ తిప్పించుకున్న అధికారులు కొద్ది రోజుల క్రితమే తనకు పాస్‌పుస్తకం ఇచ్చారని కిషన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాస్‌పుస్తకం ఆలస్యంగా ఇవ్వడంతోపాటు, ఆరు గుంటల భూమిని తక్కువగా నమోదు చేశారని చెప్పారు. దీంతో తనకు మూడు విడుతల రైతుబంధుకు దూరమయ్యానని వాపోయారు. ఈ విషయంపై తాసిల్, ఆర్డీవో కార్యాలయాల చుట్టూ తిరిగినా 12 గుంటల భూమిని నేటికీ నూతన పాస్‌పుస్తకాల్లో నమోదు చేయలేదని తల్లీకొడుకు ఆరోపించారు. ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు మాత్రం రేపు, మాపు అంటూ కాలం వెల్లదీస్తున్నారని తమగోడు వెల్లబోసుకున్నారు.

### అధికారులు చొరవ తీసుకోవాలి



అధికారుల నిర్లక్ష్యంతో 6 గుంటల భూమి పట్టా పాసుపుస్తకంలో నమోదు కాలేదు. దీంతో రైతుబంధు రావడం లేదు. ఏడాది కాలంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండాపోయింది. ఉన్నతాధికారులు చొరవ తీసుకుని నూతన పాస్‌పుస్తకంలో 6 గుంటల భూమిని నమోదు చేయాలి.

-దేవ్లీబాయి, పోతిరెడ్డిపల్లి తండా

### పాస్‌పుస్తకంలో భూమి తగ్గింది



రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో 6 గుంటల భూమి తగ్గింది. దీంతో రైతుబంధు రాకుండా నష్టపోయాం. కార్యాలయాల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేదు. ప్రజావాణిలో సైతం ఫిర్యాదు చేశాం.

-హలావత్ కిషన్, పోతిరెడ్డిపల్లితండా

## కనికరం లేని అధికారులు

- పట్టాకోసం రూ.25 వేలు తీసుకుని ఏడాదిన్నరగా తిప్పుతుండ్రు
- ముచ్కూర్ గ్రామ రైతు ములుగు రాజన్న ఆవేదన



ముచ్కూర్ గ్రామ రైతు ములుగు రాజన్న

**భీమ్‌గల్:** నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం ముచ్కూర్ గ్రామానికి చెందిన రైతు బురెడి రాజయ్య నుంచి అదే గ్రామానికి చెందిన ములుగు భూమయ్య.. సర్వేనంబర్ 583/ఈ లో 2002 లో 1.20 ఎకరాల భూమిని కొన్నారు. భూ రికార్డుల ప్రక్షాళన కార్యక్రమంలో భాగంగా ఆ భూమిని తన పేరిట మార్చాలని భీమ్‌గల్ తాసిల్దార్‌కు దరఖాస్తుచేసుకొన్నారు. ఆ పని చేసిపెట్టడానికి మధ్యవర్తి ద్వారా వీఆర్వోకు రూ.25 వేలు సమర్పించుకున్నారు. కానీ, పట్టా చేయవలసిన వీఆర్వో వీరి భూమిని అదే గ్రామానికి చెందిన ఇతర రైతుల పేరిట మార్చారు. జరిగిన తప్పును సరిదిద్దాలని వందల సార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని భూమయ్య కొడుకు రాజన్న ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ దిగులుతోనే తన తండ్రి కొద్దిరోజుల క్రితం చనిపోగా.. అంత్యక్రియలకు దుబాయ్ నుంచి వచ్చిన రాజన్న.. భూమి పట్టాకోసం వీఆర్వో చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నానని చెప్పారు. తన తండ్రి నుంచి లంచం తీసుకున్నప్పటికీ పట్టాచేయకుండా తిప్పించుకొంటున్నారన్నారు. దుబాయ్‌లో తాను పనిచేస్తున్న కంపెనీ ఇచ్చిన సెలవు గడువు ముగిసిపోనున్నదని.. ఈలోగా తన భూమిని తన పేరిట పట్టాచేయాలని అధికారులను రాజన్న వేడుకొంటున్నారు. వీఆర్వో మాత్రం రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఎవరి పేరిట ఉన్నాయో వారికే పట్టాచేసి ఇచ్చామని తెలిపారు. గ్రామస్థులు మాత్రం కాస్తులో భూమయ్య కుటుంబీకులే ఉన్నారని చెప్తున్నారు. ఇదే వీఆర్వోపై ఇటీవల పిప్రి గ్రామంలో పలువురి నుంచి డబ్బులు తీసుకుని పట్టాలు చేశారన్న ఆరోపణలు.. జిల్లా స్థాయి అధికారుల దృష్టికి వెళ్లడంతో గ్రామంలో పాస్ పుస్తకాలను నిలిపి వేయించారు.

# ఆ పొరపాటును సరిదిద్దేదెవరు?

- వ్యవసాయేతర భూమిగా సాగుభూమి మార్పు
- చేసిన తప్పును సరిచేయకుండా నిర్లక్ష్యం
- రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపం
- రిజిస్ట్రార్‌కు లేఖరాసి చేతులుదులుపుకున్న తాసిల్దార్
- సంస్థాన్ నారాయణపురంలో 47మంది రైతుల అగచాట్లు

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఒక్క సంతకంతో తప్పు చేశారు. పొరపాటు చేశామని గుర్తించారు. కానీ దానిని సరిదిద్దేందుకు మాత్రం నిబంధనలను సాకుగా చూపుతున్నారు. కిందిస్థాయిలో తప్పుచేసి.. పైనుంచి ప్రొసీడింగ్స్ రావాలంటూ కాలయాపన చేస్తున్నారు. ఇటు రెవెన్యూ, అటు రిజిస్ట్రేషన్ శాఖల మధ్య సమన్వయలోపంతో 47 మంది రైతుల అగచాట్లు తీరడం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం రాచకొండ రెవెన్యూ పరిధిలో 20 ఏండ్ల క్రితం రియల్‌ఎస్టేట్ సంస్థలు లేఅవుట్లు చేశాయి. ఈ సందర్భంగా రెవెన్యూ పరిధిలో 1,080 ఎకరాల వరకు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చారు. ఈ సందర్భంగా రియల్‌ఎస్టేట్ సంస్థలు దరఖాస్తు పెట్టుకున్న మేరకు పరిమితం కాకుండా.. సర్వే నంబర్లలో ఉన్న మొత్తం భూమి వ్యవసాయేతరభూమిగా పేర్కొంటూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు సమాచారాన్ని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్లశాఖకు సమర్పించింది. దీంతో ఆ భూముల రిజిస్ట్రేషన్ విలువ ఏకంగా రూ.14.52 లక్షలకు పెరిగిపోయింది. రాచకొండ పరిధిలోని 43 సర్వేనంబర్‌లోని భూమినంతటినీ ఇలాగే మార్చడంతో ఆ నంబర్‌లోని భూమిలో వ్యవసాయం చేసుకుంటున్న 47 మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కుటుంబ అవసరాల నిమిత్తం భూమిని అమ్ముకోవాలంటే రిజిస్ట్రేషన్ ఫీజులు అధికంగా ఉన్నాయనే భయంతో కొనుగోలుదారులు ఎవరూ ముందుకు రావడం లేదు. ఒకవేళ అమ్మినా ఐటీ అధికారులు ఎక్కడ దాడులు చేస్తారోనని భయపడుతున్నారు. ఈ వ్యవహారంపై




సంస్థాన్ నారాయణపురంలో ఓ రైతుకు మంజూరు చేసిన పాస్‌పుస్తకం

'ఒక్క పొరపాటు.. 47 మందికి అగచాట్లు' శీర్షికన 'నమస్తే తెలంగాణ' ధర్మగంట ద్వారా గతంలోనే వెలుగులోకి తీసుకొచ్చింది.

### చేతులు దులిపేసుకున్న తాసిల్దార్

ఈ కథనానికి స్పందించి, సాగుభూమిని వ్యవసాయేతర భూమిగా రాసినది నిజమేనంటూ సంస్థాన్ నారాయణపురం తాసిల్దార్ వీ దయాకర్‌రెడ్డి అంగీకరించారు. సర్వేనంబర్ 43లోని పూర్తి విస్తీర్ణం వ్యవసాయేతరం కాదని లేఖ నం.బి/ 1127/2019, 3.5.2019 ద్వారా చౌటుప్పల్ సబ్‌రిజిస్ట్రార్‌కు రాశారు. సర్వేనంబర్‌లోని మొత్తం 151.23 ఎకరాల్లో 69.17 ఎకరాలు వ్యవసాయేతర, 50.21 ఎకరాలు సాగు భూమిగా గుర్తించాలంటూ కోరారు. ఈ లేఖను చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ అంగీకరించట్లేదు. నల్లగొండ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ప్రొసీడింగ్స్ వస్తేనే పరిగణనలోకి తీసుకుంటామంటున్నారు. రైతులు జిల్లా రిజిస్ట్రార్‌ను కలిస్తే తమకు సంబంధం లేదని, రిజిస్ట్రేషన్లశాఖ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఉత్తర్వులు ఇస్తారని.. అక్కడకు వెళ్లాలని సలహాఇచ్చారు. తాసిల్దార్‌ను కలిస్తే.. రిజిస్ట్రార్‌కు లెటర్ ఇచ్చానని.. ఇంకా ఏమైనా ఉంటే ఆర్డీవో, జేసీ, కలెక్టర్‌ను కలవాలంటూ సూచిస్తున్నారు. తప్పు చేసిన రెవెన్యూ అధికారులు సవరించిన రికార్డులను రిజిస్ట్రేషన్‌శాఖకు పంపించాల్సిన బాధ్యత లేదా అని బాధితులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్‌శాఖల అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఇబ్బందులు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

### రికార్డులు మార్చకుండా ఇబ్బందులు



తప్పుచేసింది అధికారులు. కానీ, శిక్ష మాకు విధిస్తున్నారు. చేసిన పొరపాటును సరిదిద్దకుండా తప్పించుకుంటున్నారు. నారాయణపురం, చౌటుప్పల్, నల్లగొండ చుట్టూ తిరుగుతు న్నాం. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ శాఖలో రికార్డులను సరిదిద్దలేదు. సాధారణ రైతును రిజిస్ట్రేషన్లశాఖ ఐజీ దగ్గరికి వెళ్లమనడం సమంజసమేనా? తప్పును గుర్తించాక.. సవరించేందుకు ఆంక్షలు పెడితే ఎట్లా?

- పాశం అనంతరెడ్డి, రైతు

### వాళ్లవి సాగు భూములే

రాచకొండలో సర్వే నంబర్ 43 లో కొంత సాగుభూమి ఉన్నదని గుర్తించినం. ఈ మేరకు లేఖను చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్‌కు రాశాం. అయితే, అక్కడి అధికారులు ఆ శాఖ ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రావాలని చెప్తున్నారు. ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

- వీ దయాకర్‌రెడ్డి, తాసిల్దార్, సంస్థాన్‌నారాయణపురం, యాదాద్రి జిల్లా

**పీకేఎల్‌లో నేడు**

హర్యానా X జైపూర్ -7.30గం.
యు ముంబా X యూపీ యోధా -8.30గం.
స్టార్ స్పోర్ట్స్‌లో

# పృథ్వీ షాపై నిషేధం

- డోప్ టెస్ట్‌లో విఫలమవడంతో వేటు
- నిషేధిత దగ్గు మందు తీసుకోవడమే కారణం



**న్యూఢిల్లీ :** తెలియక చేసిన ఓ చిన్న తప్పిదం వల్ల యువ కెరటం, ఓపెనర్ పృథ్వీ షాకు ఊహించని ఎదురు దెబ్బ తగిలింది. డోపింగ్ టెస్ట్‌లో విఫలమైన కారణంగా అతడిపై భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) ఎనిమిది నెలల నిషేధం విధించింది. ఈ ఏడాది మార్చి 16న మొదలైన ఈ నిషేధ పరిమితి నవంబర్ 15తో ముగియనుంది. ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీ సందర్భంగా ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఇండోర్‌లో డోపింగ్ టెస్ట్ నిమిత్తం ఆటగాళ్ల శాంపిల్స్ సేకరించారు. పృథ్వీషా టెర్బుటాలిన్ అనే నిషేధిత ద్రవాన్ని తీసుకున్నట్టు ఆ పరీక్షల్లో తేలడంతో నిషేధం విధిస్తున్నట్టు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. 'డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించిన కారణంగా పృథ్వీషాపై నిషేధం విధిస్తున్నాం. అతడు టెర్బుటాలిన్ అనే నిషేధిత పదార్థం సేవించాడు. సాధారణంగా దగ్గు తగ్గేందుకు తీసుకునే సిరప్‌లో ఇది ఉంటుంది' అని బీసీసీఐ ఓ ప్రకటనలో తెలిపింది. నవంబర్ 15 వరకు నిషేధం ఉండడంతో సొంతగడ్డపై జరిగే బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా సిరీస్‌లకు పృథ్వీ షా దూరం కానున్నాడు. గాయంతో బాధపడుతుండటంతో మరో మూడు రోజుల్లో ప్రారంభం కానున్న వెస్టిండీస్ పర్యటనకు ఈ యువ ఆటగాడిని పరిగణించలేదు. గతేడాది అక్టోబర్‌లో విండీస్‌తో జరిగిన టెస్ట్ ద్వారా 18 ఏండ్ల వయసులో పృథ్వీ షా అరంగేట్రం చేశాడు.

**క్రికెటే నా జీవితం**

నిషేధం వార్త తెలుసుకున్న తర్వాత పృథ్వీ షా ట్విట్టర్ ద్వారా భావోద్వేగపూరిత లేఖ విడుదల చేశాడు. జలుబు, దగ్గు తగ్గాలని ప్రోటోకాల్ పాటించకుండా సిరప్ వేసుకోవడమే తప్పిందని అందులో పేర్కొన్నాడు. 'నా తలరాతను నేను అంగీకరిస్తా. గతంలో అయిన గాయానికి చికిత్స తీసుకుంటున్న తరుణంలో ఈ వార్త నన్ను కుదిపేసింది. గాయం నుంచి కోలుకుంటున్న తరుణంలో క్రికెట్ ఆడాలన్న ఆత్రుతతో ఎలాంటి ప్రోటోకాల్ పాటించకుండా, జాగ్రత్తలు తీసుకోకుండా ముస్తాక్ అలీ ట్రోఫీ సమయంలో దగ్గు, జలుబుకు సిరప్ తాగా. క్రీడాకారులు ఏ చిన్న ఔషధం తీసుకోవాలన్నా ఎంతో జాగ్రత్తగా ఉండాలని, ప్రోటోకాల్ పాటించాలని ఇప్పుడు తెలిసొచ్చింది. దీన్ని గుర్తుంచుకొని భవిష్యత్తులో ముందుకు సాగుతా. క్రికెట్టే నా జీవితం. ముంబై జట్టు, టీమ్ ఇండియాకు ఆడడం కన్నా నాకు మరో గర్వకారణమైన విషయం లేదు. నేను మరింత వేగంగా, బలంగా ముందుకొస్తా' అని పృథ్వీ పేర్కొన్నాడు.

## వేణుగోపాలరావు వీడ్కోలు



క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తెలుగు ఆటగాడు

**ముంబై:** భారత మాజీ ప్లేయర్, ఒకప్పటి ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్ యాలక వేణుగోపాల్ రావు క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్‌లకు గుడ్‌బై చెప్తున్నట్లు మంగళవారం ప్రకటించాడు. 2005లో తొలిసారి టీమ్‌ఇండియా తరఫున ఆడిన వేణుగోపాల్ రావు కెరీర్‌లో మొత్తం 16 వన్డేలాడాడు. 'ఆంధ్రప్రదేశ్ రంజీ టీమ్ మాజీ కెప్టెన్, భారత మాజీ ప్లేయర్ వేణుగోపాల రావు క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్‌ల నుంచి తప్పుకున్నాడు' అని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నానికి చెందిన 37 ఏండ్ల వేణు 16 వన్డేల్లో దేశానికి ప్రాతినిధ్యం వహించి 218 పరుగులు చేశాడు. 121 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన అతడు 7081 రన్స్ చేశాడు.

## మెయిన్ 'డ్రా'కు సౌరభ్, ఉత్తేజిత

థాయ్‌లాండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ


సౌరభ్ వర్మ

**బ్యాంకాక్:** థాయ్‌లాండ్ ఓపెన్ మెయిన్ 'డ్రా'కు భారత షట్లర్లు సౌరభ్ వర్మ, చుక్కా సాయి ఉత్తేజిత రావు అర్హత సాధించారు. మంగళవారమిక్కడ జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో వారు విజయం సాధించారు. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో సౌరభ్ వర్మ 21-18,21-19తో కంథావట్(థాయ్‌లాండ్)పై.. రెండో రౌండ్‌లో 11-21, 21-14, 21-18తో జావ్ జే క్వి (చైనా)పై గెలిచి ప్రధాన టోర్నీకి దూసుకొచ్చాడు. మహిళల సింగిల్స్‌లో ఉత్తేజిత రావు 16-21, 21-14, 21-19 తేడాతో టామ్ బ్రిటెనీ(కెనడా)ని ఓడించి మెయిన్‌డ్రాకు అర్హత సాధించింది.

**సాత్విక్ జోడీ ముందడుగు**

పురుషుల డబుల్స్ తొలి రౌండ్ లో సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి-చిరాగ్ శెట్టి జంట 21-11, 24-26, 21-11తో మన దేశానికే చెందిన మను అత్రి-బి.సుమిత్ రెడ్డి ద్వయాన్ని ఓడించి రెండో రౌండ్‌లో ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో అశ్వినీ పొన్నప్ప-ఎన్.సిక్కిరెడ్డి జోడీ 7-21, 13-21 తేడాతో చైనా ద్వయం లీ వెన్ మీ, జెంగ్ యూ చేతిలో పరాజయం పాలైంది.

**నేడు బరిలోకి స్టార్ ప్లేయర్లు**

బుధవారం జరిగే తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత స్టార్ షట్లర్లు బరిలోకి దిగనున్నారు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్, కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్ కోర్టులో అడుగుపెట్టనున్నారు.

# అర్థరహితం



- కెప్టెన్, కోచ్‌కు భయపడుతున్నామన్నది అవాస్తవం
- సెలక్టర్లకు అంతర్జాతీయ అనుభవం కొలమానం కాదు
- సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్

మునుపెన్నడూ లేని విధంగా.. ప్రస్తుత క్రికెట్ జట్టు సెలక్షన్ కమిటీ విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొంటున్నది. గవాస్కర్ సహా కొందరు మాజీలు సెలక్టర్లను ఏకిపారేస్తున్నారు. కమిటీలోని ఐదుగురు సభ్యుల అంతర్జాతీయ అనుభవాన్ని వేలెత్తి చూపుతున్నారు. ఈ నేపథ్యంలో విమర్శలు, వివాదాలపై చీఫ్ సెలక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ స్పందించాడు. సెలక్టర్లకు అంతర్జాతీయ అనుభవం కొలమానమే కాదని, ఎక్కువ మ్యాచ్‌లు ఆడితే ఆట గురించి ఎక్కువ తెలుస్తుందనే వాదన అర్థరహితమని కొట్టిపారేశాడు.

**న్యూఢిల్లీ:** గత కొన్ని రోజులుగా టీమ్‌ఇండియా సెలక్షన్ చుట్టూ ముసురుతున్న వివాదానికి జాతీయ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్ తెరదించే ప్రయత్నం చేశాడు. అంతర్జాతీయ అనుభవాన్ని పక్కనపెట్టి తాము అమలు చేసిన విధానాలను చూడాలని సూచించాడు. బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాక తామెవరికీ భయపడాల్సిన అవసరం లేదని పేర్కొన్నాడు. అలాగే ఇతర దేశాల సెలక్టర్ల అనుభవాన్ని ఆయన ఉదహరించారు. మాజీల విమర్శలు, ఆటగాళ్ల ఎంపిక, నిర్ణయాలతో పాటు తమ హయాంలో టీమ్‌ఇండియా సాధించిన విజయాలు, ఘనతలతో పాటు తదితర అంశాలపై ఎమ్మెస్కే ఇచ్చిన వివరణ ఆయన మాటల్లోనే..

**కావాల్సినంత అనుభవం ఉంది**

ప్రస్తుత సెలక్షన్ కమిటీలో ఉన్న సభ్యులు విభిన్న ఫార్మాట్లలో ఆడినవారే. కమిటీ ఏర్పడినప్పుడు దీనిని కూడా పరిగణలోకి తీసుకున్నారు. అంతర్జాతీయ మ్యాచ్‌లను మినహాయిస్తే.. మేమంతా మొత్తం 477 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడాం. అలాగే మేం సెలక్టర్లుగా 200కంటే ఎక్కువ ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లను దగ్గరుండి చూశాం. ఆటగాళ్లుగా, సెలక్టర్లుగా మా అనుభవం గురించి పట్టించుకోరా? మా అనుభవం సరైన టాలెంట్‌ను గుర్తించడానికి, ఆటగాళ్లను ఎంపిక చేయడానికి సరిపోదని అనుకుంటున్నారా.

### వాళ్లు ఆడిన మ్యాచ్‌లెన్ని..?

అంతర్జాతీయ అనుభవం గురించి మాట్లాడే ముందు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. ఇంగ్లండ్ జాతీయ జట్టు చీఫ్ సెలక్టర్ ఎడ్ స్మిత్ కేవలం మూడు టెస్ట్ మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. ఆస్ట్రేలియా జట్టు సెలక్షన్ కమిటీకి దశాబ్దానికి పైగా(మధ్యలో రెండేళ్ల విరామం) చీఫ్ సెలక్టర్‌గా కొనసాగుతున్న ట్రెవర్ హాన్స్ అనుభవం 7 టెస్టులే. 128టెస్టులు, 244 వన్డేలు ఆడిన మార్క్‌వా, 87టెస్టులు, 74 వన్డేలు ఆడిన గ్రెగ్ చాపెల్ లాంటి గొప్ప ఆటగాళ్లు ప్రస్తుతం హాన్స్ కింద పని చేస్తున్నారు.

**అంతర్జాతీయ అనుభవం లెక్కకాదు**

16 ఏండ్ల వయసున్న సచిన్ టెండూల్కర్‌ను జాతీయ జట్టులోకి తీసుకొచ్చిన.. దివంగత సెలక్టర్ రాజ్‌సింగ్ దుంగార్పూర్‌కు ఒక్క అంతర్జాతీయ టెస్టు ఆడిన అనుభవం కూడా లేదు. ఒకవేళ అనుభవం లేని కారణంగా ఆయన ఆ పదవిలో లేకపోతే... క్రికెట్ ఆణిముత్యమైన సచిన్ గురించి అంత త్వరగా ప్రపంచానికి తెలిసేది కాదేమో. కేవలం అంతర్జాతీయ మ్యాచ్‌లే లెక్కఅయితే, ఎన్నో ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన మాజీ క్రికెటర్లు సెలక్టర్లు కావాలని కలలు కూడా కనలేరు. టాలెంట్‌ను గుర్తించేందుకు అంతర్జాతీయ మ్యాచ్‌ల అనుభవం అసలు కొలమానమే కాదు.

**ఆ వ్యాఖ్యలు దురదృష్టకరం**

మేం దిగ్గజ క్రికెటర్లను గౌరవిస్తాం. వారు వ్యక్తం చేసే ప్రతి అభిప్రాయాన్ని శ్రద్ధగా, మనస్ఫూర్తిగా స్వీకరిస్తాం. వారి సూచనలను పాటిస్తాం. కొన్ని వాఖ్యలు (గావస్కర్ విమర్శలనుద్దేశిస్తూ) మాత్రం దురదృష్టకరం. అయితే ఇలాంటి వ్యాఖ్యలు మమ్మల్ని బాధించడం కంటే ఇంకా రాటుదేలుస్తాయి. అవి సెలెక్షన్ కమిటీని మరింత నిబద్ధతతో పని చేసేలా చేస్తాయి.

**విజయాలు, ఘనతలు.. చాలా ఉన్నాయి**

మా కమిటీ సభ్యులం దేశంలోని అన్ని ప్రాంతాలు తిరిగి.. దేశవాళీ క్రికెట్ సహా మరిన్ని టోర్నీల ద్వారా ప్రతిభావంతులను గుర్తించాం, గుర్తిస్తున్నాం. అర్హులైన ఆటగాళ్లను భారత్-ఏకు ఎంపిక చేస్తున్నాం. అక్కడ రాణిస్తే సీనియర్ జట్టులో చోటు కల్పిస్తున్నాం. మా హయాంలో టీమ్‌ఇండియా అపూర్వ విజయాలు సాధించింది. 13 టెస్టు సిరీస్‌ల్లో 11 గెలిచి... టెస్టు ర్యాంకింగ్స్ గత మూడేళ్లుగా అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది. వన్డేల్లో 80శాతం విజయాలు దక్కాయి. ప్రపంచకప్ సెమీఫైనల్‌కు ముందు కూడా వన్డేల్లో అగ్రస్థానాన నిలిచాం. రెండు ఆసియా కప్పులు గెలిచాం (2016, 18). భారత్-ఏ కూడా అద్భుతమైన విజయాలతో దూసుకెళుతున్నది. మొత్తం 35మంది కొత్త ఆటగాళ్లను సీనియర్ జట్టులో మూడు ఫార్మాట్లలో తీసుకున్నాం. సరిపడా బెంచ్ బలాన్ని పెంచాం.

**బెదిరింపులు నిజం కాదు..**

టీమ్‌ఇండియా కెప్టెన్ కోహ్లీ, కోచ్ రవిశాస్త్రి, మేనేజ్‌మెంట్‌కు భయపడిపోయి నిర్ణయాలు తీసుకుంటున్నామనేది అబద్ధం. మాకూ చాలా కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. మమ్మల్ని వారెప్పుడూ బెదిరించేలా మాట్లాడలేదు. కొన్నిసార్లు మా మధ్యా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవడం సహజమే. అందరి లక్ష్యం టీమ్‌ఇండియా, దేశం ప్రయోజనాలను కాపాడడమే. ఎక్కువ క్రికెట్ ఆడిన వారికి ఆటపై ఎక్కువ పరిజ్ఞానం, శక్తి ఉంటాయని కొందరు అనుకుంటుంటారు.. కానీ అది ఎంత మాత్రం నిజం కాదు.

**గర్వంగా వైదొలుగుతాం..**

జాతీయ జట్టు ఎంపిక అధికారాలను వేరే కమిటీకి అప్పగించాలన్నా సంతోషంగా అంగీకరిస్తాం. అద్భుతమైన విజయాలను అందుకున్నందుకు.. భవిష్యత్తు కోసం మంచి నిర్ణయాలు తీసుకున్నామన్న గర్వంతో వైదొలుగుతాం.

**అనుభవం.. 13 టెస్టులే..**

ప్రస్తుత సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెస్కే ప్రసాద్ ఉండగా... సభ్యులుగా మాజీ క్రికెటర్లు దేవంగ్ గాంధీ, శారన్‌దీప్ సింగ్, జతిన్ పరాన్‌జపే, గగన్ ఖోడా ఉన్నారు. సెప్టెంబర్ 2016లో ఈ కమిటీ నియామకమైంది. ఆ సెలెక్షన్ కమిటీకి 13 అంతర్జాతీయ టెస్టు మ్యాచ్‌లు ఆడిన అనుభవం మాత్రం ఉంది. అందులో ఎమ్మెస్కేనే ఆరు మ్యాచ్‌లు ఆడగా.. పరాన్‌జపే, గగన్ ఖోడా ఒక్కటి కూడా ఆడలేదు. అయితే ఫస్ట్‌క్లాస్‌లో మాత్రం అందరూ కలిపి 477 మ్యాచ్‌లు ఆడారు.

### గవాస్కర్ అభిప్రాయంతో విభేదిస్తున్నా

వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో టీమ్‌ఇండియా ఓటమి అనంతరం సెలక్షన్ కమిటీపై లిటిల్ మాస్టర్ సునీల్ గవాస్కర్ చేసిన వాఖ్యలను మాజీ క్రికెటర్, ప్రస్తుత వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ మర్యాద పూర్వకంగా తప్పుపట్టాడు. ప్రపంచకప్ సెమీఫైనల్లో భారత్ ఓటమి అనంతరం ఎలాంటి సమీక్ష జరపకుండానే విరాట్ కోహ్లీని విండీస్ టూర్‌కు మూడు ఫార్మాట్లలో కెప్టెన్‌గా ప్రకటించడంపై గవాస్కర్ ధ్వజమెత్తాడు. దీనిపై మంజ్రేకర్ స్పందిస్తూ.. 'గవాస్కర్ అభిప్రాయంతో విభేదిస్తున్నాను. ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ప్రదర్శన మరీ అంత దారుణంగా ఏమీ లేదు. లీగ్ దశలో తొమ్మిది మ్యాచ్‌ల్లో ఏడింట గెలిచి కేవలం రెండు మాత్రమే ఓడింది. సెమీఫైనల్లోనూ చాలా కొద్ది తేడాతోనే పరాజయం పాలైంది. ఇక్కడ సెలక్టర్ల అనుభవం కన్నా వారి సమగ్రత చాలా ముఖ్యం'అని ట్విట్టర్ ద్వారా తెలిపాడు.


మంజ్రేకర్

### గుడ్డిబాతులా సెలక్షన్ కమిటీ..



ప్రపంచకప్ తర్వాత కెప్టెన్ ఎంపికపై ఎలాంటి సమావేశం నిర్వహించకపోవడం పట్ల సెలక్షన్ కమిటీ తీరుపై దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ మండిపడ్డాడు. సారథిగా కోహ్లీ నియామకం ప్రపంచకప్‌తో ముగుస్తుందని, కానీ తిరిగి నియమించేందుకు సమావేశం నిర్వహించకుండానే ఎలా కొనసాగిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. అలాగే ఎన్నో అంచనాలు ఉన్న జట్టు ఫైనల్‌కు చేరలేకపోయినా... కోహ్లీని కనీసం వివరణ అడిగే ధైర్యం కూడా సెలక్షన్ కమిటీ చేయలేకపోయిందన్నాడు. కమిటీ సభ్యుల్లో స్థాయికి తగ్గవారు ఎవరూ లేరని, అందుకే వారికి ఆటగాళ్లను నిలదీసే దమ్ము లేదని అభిప్రాయపడ్డాడు. సెలక్షన్ కమిటీ సభ్యులు గుడ్డిబాతుల్లా దార్శనికత లేకుండా వ్యవహరిస్తున్నారని ఘాటైన వ్యాఖ్యలు చేశాడు.

## ప్రీక్వార్టర్స్‌లో ప్రజ్నేశ్



**లాస్ కబోస్ (మెక్సికో):** భారత నంబర్ వన్ టెన్నిస్ ఆటగాడు ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఏటీపీ టూర్ టోర్నమెంట్‌లో అదరగొట్టాడు. మెక్సికో వేదికగా జరుగుతున్న లాస్ కబోస్ టోర్నమెంట్‌లో ప్రజ్నేశ్ తనకంటే మెరుగైన ర్యాంకు ప్రత్యర్థిపై విజయం సాధించాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 90వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 6-4, 1-6, 6-2తో ప్రపంచ 67వ ర్యాంకర్ జాన్ మిల్‌మన్ (ఆస్ట్రేలియా)ను ఓడించి ప్రీక్వార్టర్స్‌కు అర్హత సాధించాడు. గంటా 49 నిమిషాల పాటు సాగిన పోరులో ప్రజ్నేశ్ 6 ఏస్‌లు సంధించి 2 డబుల్ ఫాల్ట్స్ చేశాడు. రెండో సెట్ కోల్పోయినా నిరాశ చెందకుండా నిర్ణయాత్మక సెట్‌లో కీలక సమయాల్లో పాయింట్లు కొల్లగొట్టి గెలుపొందాడు. ప్రీక్వార్టర్స్‌లో గుణేశ్వరన్ ప్రపంచ 28వ ర్యాంకర్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)తో తలపడనున్నాడు. మరోవైపు ఇదే టోర్నీ పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ జీవన్ నెండుజెళియాన్-పూరవ్ రాజ 3-6, 3-6తో లూకాస్ పోలీ-గ్రెగోరియా బార్రెర్ జంట చేతిలో ఓడి నిష్క్రమించింది.

## షూటింగ్ తొలగించడం సబబు కాదు

కామన్వెల్త్ గేమ్స్‌పై రెజ్లర్ సాక్షి మాలిక్ వ్యాఖ్య




**నోయిడా:** కామన్వెల్త్ క్రీడల నుంచి షూటింగ్‌ను తొలిగించడం సరైన నిర్ణయం కాదని.. కానీ దానికి బదులుగా భారత్.. గేమ్స్‌ను బహిష్కరించడం కూడా మంచిది కాదని స్టార్ రెజ్లర్, ఒలింపిక్ పతక విజేత సాక్షి మాలిక్ అభిప్రాయపడింది. 2022 (బర్మింగ్‌హామ్)లో జరుగనున్న కామన్వెల్త్ గేమ్స్ నుంచి షూటింగ్‌ను తప్పించడంతో భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) క్రీడలను బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించుకుంది. ఈ అంశంపై ప్రభుత్వం నుంచి ఆమోదం కోసం వేచి చూస్తున్న నేపథ్యంలో సాక్షి మాట్లాడుతూ.. 'మనం బాయ్‌కాట్ చేయడం సబబు కాదు. క్రీడల్లో తిరిగి షూటింగ్‌ను పొందుపరిస్తే.. అంతా కలిసి బర్మింగ్‌హామ్‌లో సత్తాచాటొచ్చు. ఈ అంశంపై ఐఓఏ తీసుకునే నిర్ణయమే అంతిమం. ఒక ఈవెంట్‌ను ఇలా తొలగించడం కరెక్ట్ కాదు. గత కొన్నేండ్లుగా మన షూటర్లు చక్కటి ప్రతిభ కనబరుస్తున్నారు'అని సాక్షి వివరించింది. హర్యానా రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు ఇచ్చే నగదు ప్రోత్సాహకాల్లో కోత విధించడాన్ని కూడా ఆమె తప్పుపట్టింది.

## మెప్పించడం వదిలేశాకే మెరుగయ్యా


బెన్ స్టోక్స్

**లండన్:** అందర్నీ మెప్పించాలనే భావన పక్కన పెట్టాకే విజయాలు దరి చేరాయని ఇంగ్లండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ అభిప్రాయపడ్డాడు. ఇటీవల జరిగిన వన్డే ప్రపంచకప్‌ను ఇంగ్లండ్ సొంతం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించిన స్టోక్స్ అదే తరహాలో యాషెస్ సిరీస్‌లోనూ సత్తాచాటాలని తహతహలాడుతున్నాడు. 'లోకాన్ని మెప్పించడం పక్కనపెట్టేశా. ఎందుకంటే అది నన్ను పతనం దిశగా నడిపించింది. అనుభవం అన్నింటికన్నా గొప్ప విషయం. పరిపక్వత సాధిస్తున్నా కొద్ది మెరుగవుతామనే విషయాన్ని అర్థం చేసుకున్నా. యాషెస్ సిరీస్ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని స్టోక్స్ పేర్కొన్నాడు.

## భద్రతనిస్తానంటే వెళ్తాం..!

**న్యూఢిల్లీ:** సుదీర్ఘ విరామం అనంతరం డేవిస్‌కప్ ఆడేందుకు పాకిస్థాన్ వెళ్లనున్న భారత టెన్నిస్ ఆటగాళ్లు పటిష్ఠ భద్రత కోరడంపై అఖిల భారత టెన్నిస్ సంఘం (ఐటా) సానుకూలంగా స్పందించింది. టెన్నిస్ వరల్డ్‌కప్‌లో భాగంగా ఈ ఏడాది సెప్టెంబర్‌లో ఇస్లామాబాద్ వేదికగా భారత్, పాకిస్థాన్‌తో తలపడాల్సి ఉంది. అయితే పుల్వామా ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఒకవేళ పాకిస్థాన్‌తో పోరుకు నిరాకరిస్తే అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మన జట్టుపై నిషేధం విధించే అవకాశం ఉండటంతో భారత ఆటగాళ్లు పాక్‌తో ఆడేందుకు సన్నద్ధమయ్యారు. ఇందుకు తగ్గట్లే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ నుంచి అనుమతి కూడా లభించింది.

## పదేండ్లలో పురోగతి సాధించాం




భారత ఫుట్‌బాల్ కెప్టెన్ సునీల్ ఛెత్రీ

**న్యూఢిల్లీ:** దశాబ్ద కాలంగా భారత ఫుట్‌బాల్ పురోగతి సాధిస్తూ వస్తున్నదని జట్టు సారథి సునీల్ ఛెత్రీ వెల్లడించాడు. ఫుట్‌బాల్‌లో మెరుగ్గా ఉన్న ఆసియా దేశాలతో పోల్చుకుంటే ఇంకా వెనుకే ఉన్నా.. మూలాల నుంచి అభివృద్ధి ప్రారంభమైందని ఈ స్టార్ ప్లేయర్ అభిప్రాయపడ్డాడు. 'మూలాలు మాత్రమే కాదు ఓవరాల్‌గా భారత ఫుట్‌బాల్ పురోగతి బాగుంది. కానీ ఆసియా టాప్-10లో ప్రవేశించడానికి కూడా మన జట్టు ఇంకా దూరంలో ఉండడమే బాధిస్తున్నది. మనం ఎంత త్వరితగతిన అభివృద్ధి చెందుతున్నామనే విషయాన్ని పక్కన పెడితే.. ఇతర ఆసియా దేశాలతో పోల్చుకుంటే అది చాలా తక్కువే అని చెప్పాలి. ప్రతిభను గుర్తించడంతోనే సరిపెట్టుకుంటే కాదు. వారికి మౌలిక వసతులు కల్పించాలి. మనం ఇంకా వాటికి దూరంగానే ఉన్నాం. గత పదేండ్లతో పోల్చుకుంటే అభివృద్ధి సాధించామనేది నిజమే.. కానీ గమ్యం ఇంకా చాలా దూరంలో ఉంది. మనం సాధించినదానికి అభినందనలు తెలుపుకోవడం పక్కనపెట్టి.. కఠోరంగా శ్రమించాలి. ప్రతిభను వెలికితీయడంలోనూ ఆలస్యం చేయకూడదు. పదకొండేండ్ల పిల్లాడికి.. 14 ఏండ్ల బాలుడికి మధ్య చాలా వ్యత్యాసం ఉంటుంది. అందుకే ముందే గుర్తించి సరైన దిశానిర్దేశం చేస్తే ఫలితాలు ఇంకా మెరుగ్గా ఉంటాయి. 130 కోట్ల మంది జనాభాలో టాలెంట్‌కు లోటు ఉందనడం హాస్యాస్పదమే అవుతుంది. ఇటీవల భారత అండర్ -17 జట్టు ఆటగాళ్లు చక్కటి ప్రదర్శన చేస్తున్నారు'. అని ఛెత్రీ వివరించాడు.

## స్క్వాష్ ప్లేయర్లకు నిరాశ

**న్యూఢిల్లీ:** భారత స్క్వాష్ రాకెట్ ఫెడరేషన్(ఎస్ఆర్ఎఫ్ఐ) చేసిన ఓ తప్పిదం పురుషుల జాతీయ జట్టు పాలిట శాపంగా మారింది. ఈ ఏడాది డిసెంబర్‌లో వాషింగ్టన్ వేదికగా జరగాల్సిన ప్రపంచ స్క్వాష్ చాంపియన్‌షిప్‌నకు దూరం చేసింది. టోర్నీకి వెళ్లేందుకు కావాల్సిన అనుమతులను స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయ్) నుంచి తీసుకోవడంలో ఎస్ఆర్ఎఫ్ఐ విఫలమైంది. ఈ కారణంగా చాంపియన్‌షిప్‌నకు భారత్ దూరమైంది. 'సాయ్‌ను ఎస్ఆర్ఎఫ్ఐ కలవలేకపోయింది. జట్టును కూడా రిజిస్టర్ చేయలేదు. అందుకే అనుమతి లభించలేదు. యంత్రాంగం తప్పిదం వల్ల ఆటగాళ్లు నష్టపోవడం బాధాకరం'అని ఓ అధికారి చెప్పారు.

## ఫ్రీగా ఆడేందుకు రెడీ

**హరారే:** దేశంలో క్రికెట్‌ను బతికించుకునేందుకు ఐసీసీ ఈవెంట్‌లలో ఉచితంగా ఆడేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని జింబాబ్వే క్రికెటర్లు అంటున్నారు. ప్రభుత్వ జోక్యం కారణంగా ఇటీవల జింబాబ్వే క్రికెట్ బోర్డుపై ఐసీసీ నిషేధం విధించిన విషయం తెలిసిందే. అయితే వచ్చే ఏడాది జరుగనున్న టీ20 వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో ఆడేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఆ జట్టు ఆటగాళ్లు అంటున్నారు. 'మేం ఉచితంగా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాం. ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌లో డబ్బు తీసుకోకుండానే ఆడతాం'అని జట్టులోని సీనియర్ సభ్యుడు తెలిపాడు.

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 37,397 | 11,085 |
| ↓289 | ↓104 |

ముడి చమురు (బ్రెంట్) ↑64.68 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 35,880 |
| 22 క్యారెట్లు | 35,710 |
| వెండి (కిలో) | 42,050 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.10 | 71.60 |
| యూరో | 73.20 | 79.70 |
| బహ్రెయిన్ దినార్ | 173.20 | 187.20 |
| కువైట్ దినార్ | 216.40 | 228.40 |
| సౌదీ రియాల్ | 17.30 | 19.10 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.50 |

## యూబీఐ వడ్డీరేట్ల తగ్గింపు

**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రభుత్వరంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ)..మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ లెండింగ్ రేటు(ఎంసీఎల్ఆర్)ను 20 బేసిస్ పాయింట్లు తగ్గిస్తున్నట్లు మంగళవారం ప్రకటించింది. తగ్గించిన వడ్డీరేట్లు గురువారం(ఆగస్టు 1) నుంచి అమలులోకి రానున్నాయి. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఏడాది కాలపరిమితి కలిగిన రుణాలపై వడ్డీరేటు 8.55 శాతం నుంచి 8.50 శాతానికి తగ్గనున్నది.

# కాఫీ కింగ్ మిస్సింగ్

## కేఫ్ కాఫీ డే అధినేత వీజీ సిద్ధార్థ అదృశ్యం • ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు



### ఆత్మహత్య చేసుకోవచ్చన్న అనుమానాలు

**మంగళూరు/బెంగళూరు/న్యూఢిల్లీ, జూలై 30:**

కేఫ్ కాఫీ డే (సీసీడీ) వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ కనిపించడం లేదు. సోమవారం సాయంత్రం అదృశ్యమైన సిద్ధార్థ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్నది. నేత్రావతి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారా? అన్న కోణంలో పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎస్‌ఎం కృష్ణ అల్లుడై (కూతురు భర్త)న సిద్ధార్థ మిస్సింగ్ కేసు.. ఇప్పుడు అటు వ్యాపార వర్గాల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. 60 ఏండ్ల సిద్ధార్థ.. కర్ణాటకలోని చిక్మగలూరు జిల్లాలో జన్మించారు. ఈయన కుటుంబం దాదాపు 140 ఏండ్లుగా కాఫీ తోటల వ్యాపారంలో ఉండటం.. సిద్ధార్థను అదే వ్యాపారంలోకి తీసుకెళ్లింది. ఈ క్రమంలోనే ఇండియన్ కాఫీ కింగ్‌గా పేరు తెచ్చుకున్నారు. ఆసియాలోనే అతిపెద్ద కాఫీ ఎస్టేట్ యజమానిగా సిద్ధార్థ నిలిచారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం సక్లేశ్‌పూర్‌కు వెళ్దామని బయలుదేరిన సిద్ధార్థ.. నేత్రావతి నది సమీపంలో కనిపించకుండాపోయారు. మరోవైపు ఎస్‌ఎం కృష్ణ నివాసానికి ప్రముఖుల రాక పెరిగింది. కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి, మాజీ ప్రధానమంత్రి హెచ్‌డీ దేవేగౌడలతోపాటు కాంగ్రెస్, బీజేపీ నేతలు కృష్ణను పరామర్శించారు. కాగా, కర్ణాటకలోని ప్రభుత్వం ఓవైపు సిద్ధార్థ కోసం అన్వేషణ సాగిస్తుండగా, మరోవైపు ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరుపాలని కుమారస్వామి డిమాండ్ చేస్తున్నారు.

**రూ.6,500 కోట్లకు చేరిన అప్పు..**

కేఫ్ కాఫీ డే ప్రమోటర్ వీజీ సిద్ధార్థ అప్పులు కూడా బాగానే ఉన్నాయి. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను ఆయన అప్పు రూ. 6,547.38 కోట్లకు పెరిగాయి. అంతక్రితం ఏడాది ఉన్న అప్పులతో పోలిస్తే 64 శాతం అధికం. డిసెంబర్ 2018తో ముగిసిన త్రైమాసికానికిగాను కంపెనీ కన్సాలిడేటెడ్ రూ. 996.51 కోట్ల ఆదాయంపై రూ.73.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఐటీ సంస్థ మైండ్‌ట్రీలో ఉన్న 22 శాతం వాటాను విక్రయించడంతో ఆయనకు రూ.3,269 కోట్ల నగదు నిల్వలు వచ్చాయి. కాగా, 2015-16 నుంచి 2017-18 వరకు సిద్ధార్థ, ఆయన భార్య మాళవిక ఎలాంటి వేతనం తీసుకోకపోవడం గమనార్హం.

**బాధాకరం: కేకేఆర్, హెచ్‌డీఎఫ్‌సీ**

సిద్ధార్థ అదృశ్యం బాధాకరమని గ్లోబల్ దిగ్గజం కేకేఆర్ తెలిపింది. ఆయన క్షేమంగా రావాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నది. కేఫ్ కాఫీ డేలో కేకేఆర్‌కు 6 శాతానికిపైగా వాటాలున్నాయి. మరోవైపు హెచ్‌డీఎఫ్‌సీ సైతం ఆందోళనను వ్యక్తం చేసింది. అయితే రుణదాతల వేధింపులతో మనస్తాపం చెందినట్లు సిద్ధార్థ లేఖలో పేర్కొన్న నేపథ్యంలో ఆ సంస్థకు ఎలాంటి బకాయిలు లేవని హెచ్‌డీఎఫ్‌సీ స్పష్టం చేసింది. టంగ్లిన్ డెవలప్‌మెంట్స్‌కు బెంగళూరులోని తమ గ్లోబల్ విలేజ్ టెక్ పార్క్ కోసం లీజ్ రెంటల్ డిస్కౌంటింగ్ లోన్లు ఇచ్చామని, ఈ ఏడాది జనవరిలోనే అవి తీర్చేశారని పేర్కొన్నది. ఇదిలా ఉంటే కంపెనీ షేరు కుదేలైంది. కంపెనీ షేరు ధర 19.99 శాతం పతనం చెంది రూ.154.05 వద్ద ముగిసింది.



ఎస్‌ఎం కృష్ణను పరామర్శిస్తున్న కర్ణాటక మాజీ సీఎం సిద్దరామయ్య, మాజీ స్పీకర్ రమేశ్‌కుమార్

## పరిస్థితిని సమీక్షిస్తున్నాం: కాఫీ డే

**సంస్థ** అధిపతి సిద్ధార్థ అదృశ్యం.. తదనంతర పరిణామాల మధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని కేఫ్ కాఫీ డే స్పష్టం చేసింది. మంగళవారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమైన కాఫీ డే బోర్డు డైరెక్టర్లు.. పరిస్థితిని సమీక్షించారు. సిద్ధార్థ సంతకంతో ఆయన రాసిన లేఖనూ పరిశీలించారు. కాగా, ఈ ప్రభావం వ్యాపార కార్యకలాపాలపై పడకుండా చర్యలు తీసుకుంటున్నామని బోర్డు పేర్కొన్నది. సిద్ధార్థ ఆచూకీని కనుగొనాలని విజ్ఞప్తి చేసింది. అధికారులకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపింది.

### మినిట్ టూ మినిట్..

**ఉదయం 7 గంటలు-** సిద్ధార్థ అదృశ్యమైన సంగతి తెలిసి కర్నాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప ఎస్‌ఎం కృష్ణ నివాసానికి చేరుకున్నారు.

**7:30-** సిద్ధార్థ కోసం అన్వేషణ మొదలైంది. నేత్రావతి నదిలో గత ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు.

**8:30-** దక్షిణ కన్నడ జిల్లా పోలీసులు సిద్ధార్థ కోసం అనుమానిత ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు ప్రారంభించారు.

**8:40-** నదిపైనున్న వంతెన వద్ద జాగిలాలు సిద్ధార్థ ఆనవాళ్లను గుర్తించాయి. వంతెనపై నుంచి సిద్ధార్థ నదిలో దూకి ఉంటారని పోలీసులు అనుమానించారు.

**8:43-** 'సక్లేశ్‌పూర్‌కు వెళ్తున్నానని నిన్న బెంగళూరు నుంచి సిద్ధార్థ కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో డ్రైవర్‌కు మంగళూరు వైపు వెళ్లాలని చెప్పారు. నేత్రావతి నది వంతెన రాగానే సిద్ధార్థ కారులో నుంచి దిగారు. ముందుకు వెళ్లి కారు ఆపు అంటూ డ్రైవర్‌కు సూచించారు' అని మంగళూరు పోలీస్ కమిషనర్ పాటిల్ తెలిపారు.

**8:45-** చివరగా తన ఫోన్‌లో 56 సెకండ్లపాటు సీసీడీ సీఎఫ్‌వోతో సిద్ధార్థ మాట్లాడినట్లు తెలిసింది. తన ఎస్టేట్‌లో చెట్లను నరుకవద్దని కోరారు. ఈ సమయంలో సిద్ధార్థ గొంతునుబట్టి ఆయన తీవ్ర మనస్థాపంలో ఉన్నట్లు తెలుస్తున్నది. స్థానిక జాలర్లతోనూ నేత్రావతి నదిలో వెతికిస్తున్నట్లు పాటిల్ తెలిపారు. సోమవారం రాత్రే సిద్ధార్థ కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడినట్లు చెప్పారు.

**9:15-** గాలింపు చర్యలు ముమ్మరం. 200 మందికిపైగా పోలీసులు,ఈతగాళ్లు, 25 బోట్లు, శునకాలతో వెతుకులాట.

**9:40-** సీసీడీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లనుద్దేశించి సిద్ధార్థ రాసిన లేఖ వెలుగుచూసింది.

**11:15-** భారీ వర్షంతో గాలింపు చర్యలు ఆగిపోయాయి. నేత్రావతి నది నేరుగా సముద్రంలో కలుస్తుంది.

**11:35-** గాలింపు చర్యల్లో 8 బృందాలున్నాయని, కోస్ట్ గార్డ్, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది, హోం గార్డ్, అగ్నిమాపక దళాలు అన్వేషిస్తున్నాయని, నేవీ సాయాన్నీ కోరినట్లు దక్షిణ కన్నడ జిల్లా పోలీస్ కమిషనర్ శశికాంత్ సెంథిల్ వెల్లడించారు.

**మధ్యాహ్నం 1:25-**సిద్ధార్థ మొబైల్ ఫోన్ నుంచి చివరి కాల్ నది సమీపంలో నుంచే వెళ్లిందని పోలీసులు చెప్పారు.

**1:40-** రంగంలోకి ఎయిర్ కుషన్ వెహికిల్ (హెచ్-198).

## డ్రైవర్ ఏమంటున్నాడు?

**సిద్ధార్థ** అదృశ్యం నేపథ్యంలో చివరిదాకా ఆయన వెంటే ఉన్న కారు డ్రైవర్ బసవరాజ్ పాటిల్.. ఈ కేసులో కీలకంగా మారారు. మంగళవారం ఉదయం పోలీసులతో మాట్లాడుతూ వంతెనపై కారు ఆపి సిద్ధార్థ దిగారని, ఆ తర్వాత తనను కాస్త ముందుకు వెళ్లి, వేచి ఉండమని చెప్పారని తెలిపారు. గత మూడేండ్లుగా సిద్ధార్థ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పిన పాటిల్.. సోమవారం ఉదయం 8 గంటలకు బెంగళూరులోని సిద్ధార్థ నివాసానికి వెళ్లానని, అక్కడి నుంచి విఠల్ మాల్యా కార్యాలయానికి వెళ్లి.. 11 గంటలకల్లా తిరిగి ఇంటికి వచ్చామని వివరించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు సక్లేశ్‌పూర్‌కు వెళ్దామని చెప్పడంతో ఇన్నోవాలో బయలుదేరామని, అయితే మధ్యలో మంగళూరుకు వెళ్లమని సూచించడంతో ఆ దిశగా కారును తిప్పానని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే వంతెన వద్దకు కారు చేరగానే ఆపి సిద్ధార్థ దిగారని, వంతెన చివరకు వెళ్లి ఆగితే.. నడుచుకుంటూ తాను వస్తానని చెప్పారని పాటిల్ పోలీసులకు వివరించారు. రాత్రి 8 గంటలు అవుతుండగా.. సిద్ధార్థకు తాను ఫోన్ చేశానని, అయితే స్విచాఫ్ అని వస్తుండటంతో వెంటనే ఆయన కుమారుడికి ఫోన్ చేశానని తెలిపారు. ఆయన కాల్ చేసినా స్విచాఫ్ వచ్చిందని, దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

## వేధించలేదు: ఐటీ శాఖ

**తనను** ఐటీ శాఖ వేధింపులకు గురిచేసిందన్న సిద్ధార్థ ఆరోపణల్ని ఆదాయం పన్ను శాఖ ఖండించింది. గతంలో ఆయన నివాసాలు, కార్యాలయాలపై జరిపిన దాడుల్లో తన వద్ద నల్లధనం ఉన్నట్లు అంగీకరించారని పేర్కొన్నది. మంగళవారం వెలుగుచూసిన లేఖలో ఐటీ మాజీ డీజీ పెద్ద ఎత్తున వేధించారంటూ సిద్ధార్థ ఆరోపించారు. దీనిపై ఐటీ శాఖ పైవిధంగా స్పందించింది. మైండ్‌ట్రీలోని వాటా అమ్మకంతో సిద్ధార్థకు రూ.3,200 కోట్లు వచ్చాయని, కనీస ప్రత్యామ్నాయ పన్ను (మ్యాట్)గా రూ.300 కోట్లు చెల్లించాల్సి ఉండగా, కేవలం రూ.46 కోట్లు చెల్లించాడన్నది. మరోవైపు లేఖలోని సిద్ధార్థ సంతకం.. తమ వద్దనున్న సంతకం ఒకటిగా లేదన్నది. సిద్ధార్థ వ్యవహారంలో ఈడీ విచారణ చాలా తక్కువని ఆ శాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.



### నదిలో దూకాడు..

**నేత్రావతి** నదిలో దూకి సిద్ధార్థ ఆత్మహత్యకు పాల్పడ్డాడా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తున్నది. సోమవారం సాయంత్రం నుంచి సిద్ధార్థ జాడ తెలియని పరిస్థితుల్లో.. నేత్రావతి నదిపైనున్న వంతెనపై దిగారని కారు డ్రైవర్ చెబుతున్న నేపథ్యంలో నదిలో చేపలు పట్టుకునే ఓ జాలరి వ్యాఖ్యలు సిద్ధార్థ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చన్న అనుమానాల్ని రేకెత్తిస్తున్నాయి. 'సోమవారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో ఓ వ్యక్తి వంతెనపై నుంచి నదిలోకి దూకినట్లు నేను గమనించాను' అంటూ స్థానిక జాలరి ఒకరు చెప్పారు. చిన్న పడవలో నుంచి తాను దీన్ని గమనించానని, దూకిన చోటు కు చేరేందుకు ప్రయత్నించినా.. సకాలంలో వెళ్లలేకపోయానని మంగళవారం సాయంత్రం సదరు జాలరి పేర్కొన్నాడు.

## 'నేను వ్యాపారిగా విఫలమయ్యాను'

**కేఫ్** కాఫీ డే ఉద్యోగులు, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లనుద్దేశించి సిద్ధార్థ రాసిన ఓ లేఖ వెలుగులోకి వచ్చింది. ఈ లేఖ ఆయనే రాశారా? అన్నదానిపై ఇప్పటికిప్పుడు స్పష్టత లేకున్నా.. ఇది ఆయన లెటర్‌హెడ్‌తో ఉండటం, దానిపై సంతకం కూడా ఉండటం సిద్ధార్థే రాశారన్న దానికి బలం చేకూరుస్తున్నది. కాగా, అందులో తాను ఓ వ్యాపారిగా విఫలమయ్యానని సిద్ధార్థ పేర్కొనడం గమనార్హం. '37 ఏండ్లుగా కష్టపడుతూ వ్యాపారాన్ని విస్తరించాను. నేరుగా 30 వేల ఉద్యోగాలను సృష్టించాను. అనుబంధ సంస్థలను నెలకొల్పడమేగాక, ఇతర రంగాల్లోకీ ప్రవేశించాను. ముఖ్యంగా టెక్నాలజీ కంపెనీ ద్వారా 20 వేల ఉద్యోగాలను ఇచ్చాను. ఇలా ఎంత శ్రమించినా.. ఓ లాభదాయక వ్యాపార సామ్రాజ్యాన్ని స్థాపించడంలో మాత్రం విఫలమయ్యాను' అన్నారు. 'నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నేను నిలబెట్టుకోలేకపోయాను. నన్ను క్షమించండి' అంటూ విజ్ఞప్తి చేశారు. ప్రతీ తప్పు బాధ్యత తనదేనన్న సిద్ధార్థ.. వ్యాపారాన్ని ఆపవద్దని, కొత్త యాజమాన్యంతో నడిపించాలని కోరారు. సిద్ధార్థ లేఖ ఆధారంగా అప్పులిచ్చిన వారి నుంచి వేధింపులు ఎక్కువైనట్లు తెలుస్తున్నది. షేర్ల బైబ్యాక్‌కు తనను ప్రైవేట్ ఈక్విటీ భాగస్వాములు బలవంతపెడుతున్నారని తెలిపిన ఆయన వాటిని భరించలేకపోయానని చెప్పారు. అయినప్పటికీ ఓ స్నేహితుడి నుంచి పెద్ద మొత్తంలో నగదు తీసుకుని 6 నెలల కింద ఓ లావాదేవీని కొంతమేర పూర్తిచేసినట్లు చెప్పారు. ఇతర రుణదాతల నుంచీ వేధింపులు పెరిగాయని, అందుకే చనిపోతున్నానని పేర్కొన్నారు. ముఖ్యంగా ఐటీ శాఖ మాజీ డీజీ నుంచి తీవ్ర వేధింపులను ఎదుర్కొన్నానని, మైండ్‌ట్రీ డీల్‌ను అడ్డుకుంటానని, ఆ తర్వాత కాఫీ డే షేర్లనూ నష్టాలపాలు చేస్తానని బెదిరించినట్లు చెప్పారు. ఈ పరిణామాలు నగదు కొరతకు దారితీసినట్లు వెల్లడించారు. ఎవరినీ మోసం చేసే ఉద్దేశం తనకు లేదని, అందుకే జీవితానికి ముగింపు పలుకుతున్నానని స్పష్టం చేశారు. 'ఏదో ఒకరోజు తనను అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను. నా ఆస్తులు, అప్పులను మీకు తెలియజేస్తున్నాను. వాటితో ప్రతీఒక్కరి రుణాన్ని తీర్చండి' అని లేఖను ముగించారు. కాగా, ఈ లేఖ ఈ నెల 27న రాసినట్లు తెలుస్తున్నది.

## రూ.6 కోట్ల నుంచి రూ.2,500 కోట్లకు

### 25 ఏండ్ల కాఫీ డే ప్రస్థానంలో సిద్దార్థ కీలక పాత్ర

**కాఫీ** అంటే టక్కున గుర్తొచ్చేది కాఫీ డే. చిన్న స్థాయిగా ప్రారంభమైన కాఫీ డే.. ప్రస్తుతం అంతర్జాతీయ బ్రాండ్లలో ఒకటి. కాఫీ డే గ్లోబల్ బ్రాండ్‌గా మారడానికి వీజీ సిద్ధార్థ కృషి ఎనలేనిది. 140 ఏండ్లుగా కాఫీ పంట పండిస్తున్న కుటుంబంలో జన్మించిన సిద్ధార్థ.. ప్రారంభంలో స్టాక్ ట్రేడింగ్ సంస్థలో పనిచేశారు. ఆ తర్వాతి క్రమంలో కాఫీ వ్యాపారాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదుగుతూ ప్రపంచ స్థాయి బ్రాండ్‌గా తీర్చిదిద్దడంలో ఆయన కీలకపాత్ర పోషించారు. యుక్త వయస్సులో భారత సైన్యంలో చేరాలనుకున్న ఆయన..మంగళూరు యునివర్సిటీలో ఎకనమిక్స్‌లో డిగ్రీ పట్టా పొందిన తర్వాత ముంబైలోని పెట్టుబడుల బ్యాంక్‌లో పనిచేశారు. 1984లో కర్ణాటకలోని చిక్‌మగలూర్ జిల్లాలో కాఫీ తోటలను ఏర్పాటుచేశారు. అప్పటికే ఆయన కుటుంబం కాఫీ తోటల వ్యాపారంలో సేవలు అందిస్తున్నది. ఆ తర్వాతి క్రమంలో 1993లో అమల్గమేటెడ్ బీన్ కంపెనీ(ఏబీసీ) పేరుతో కాఫీ ట్రేడింగ్ కంపెనీని ఏర్పాటు చేశారు. అప్పట్లో వార్షిక టర్నోవర్ రూ.6 కోట్లు కాగా, ప్రస్తుతం ఇది రూ.2,500 కోట్లు దాటింది. మొత్తం కాఫీ డే ఆస్తుల విలువ రూ. 18,000 కోట్లు పైనే. రిటైల్‌గా కాఫీని అందించాలనే ఉద్దేశంతో 1994లో బెంగళూరులోని బ్రిగేడ్ రోడ్డులో తన కేఫ్ కాఫీ డే పేరుతో తన తొలి అవుట్‌లెట్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం ఇది దేశంలో అతిపెద్ద కాఫీ షాప్ కలిగిన సంస్థగాను, 200 నగరాల్లో 1,750 కేఫ్‌లను ఏర్పాటు చేసింది. వీటిలో కౌలాలంపూర్, ఇతర దేశాలకు కూడా విస్తరించింది. 2015లో స్టాక్ మార్కెట్లో లిస్టైంది కూడా. వ్యాపార విస్తరణలో భాగంగా సిద్ధార్థ..ఐటీ రంగంలోకి ప్రవేశించడానికి గ్లోబల్ టెక్నాలజీ వెంచర్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేశారు. అలాగే ఆర్థిక సేవలు అందించడానికి సివాన్ సెక్యూరిటీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను నెలకొల్పారు. 1999లో ఐటీ వెటరన్ అశోక్ సూటా, సుబ్రోటో బాగ్చి, రోస్టో రావనన్, కేకే నటరాజన్‌తో కలిసి మైండ్‌ట్రీని ఏర్పాటు చేశారు. మైండ్‌ట్రీని మాలిక దిగ్గజం ఎల్ అండ్ టీ కొనుగోలు చేయడంతో ఆయన వాటా కింద రూ.3,200 కోట్ల నిధులు వచ్చాయి. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను కాఫీ డే రూ.122.32 కోట్ల ఆదాయంపై రూ.67.71 కోట్ల నష్టాన్ని చవిచూసింది. ఆయనకు భార్య మాళవిక, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరు కూడా కంపెనీ బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.




## టెక్ మహీంద్రా లాభం రూ.959 కోట్లు

**న్యూఢిల్లీ, జూలై 30:** దేశంలో ఐదో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ టెక్ మహీంద్రా ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. జూన్ 30తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.959.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.897.9 కోట్లతో పోలిస్తే 6.8 శాతం వృద్ధిని కనబరిచింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.2 శాతం ఎగబాకి రూ.8,994.30 కోట్లుగా నమోదైంది. గత త్రైమాసికంలో అన్ని రంగాల్లో సంస్థ మెరుగైన వృద్ధిని నమోదు చేసుకున్నదని, ముఖ్యంగా ఎంటర్‌ప్రైజ్, కమ్యూనికేషన్స్ విభాగానికి చెందిన టీసీవీతో కుదుర్చుకున్న ఆఫ్ బిలియన్ డాలర్ల ఒప్పందం వృద్ధిలో కీలకపాత్ర పోషించిందని టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ తెలిపారు. ప్రస్తుతం ఆశావాద పరిస్థితులు నెలకొన్నాయని, పలు ఒప్పందాలు కుదుర్చుకోవడంతో భవిష్యత్తులో రెండంకెల వృద్ధిని నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు.

## యాక్సిస్ బ్యాంక్ ఆశాజనకం


### తొలి త్రైమాసికంలో 95 శాతం పెరిగిన లాభం

**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను యాక్సిస్ బ్యాంక్ రూ.1,370.08 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే సమయంలో నమోదు చేసుకున్న రూ.701.09 కోట్లతో పోలిస్తే 95.4 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. సమీక్షకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.15,702.01 కోట్ల నుంచి రూ. 19,123.71 కోట్లకు చేరుకున్నట్లు బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి బ్యాంక్ నిధుల కేటాయింపులు కొనసాగుతున్నాయని, గత త్రైమాసికంలోనూ రూ. 3,814.58 కోట్లు వెచ్చించినట్లు తెలిపింది. క్రితం ఏడాది ఇది రూ. 3,337.70 కోట్లుగా ఉన్నది. అయినప్పటికీ బ్యాంక్ ఆస్తుల నాణ్యత ప్రమాణాలు మెరుగుపడ్డాయని, ముఖ్యంగా బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 6.52 శాతం నుంచి 5.25 శాతానికి తగ్గా, నికర ఎన్‌పీఏ 2.04 శాతానికి పడిపోయాయి.

# చివరి గంటలో అమ్మకాలు

### 289 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

**ముంబై, జూలై 30:** దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. బ్యాంక్, ఆటో, ఇంధన రంగాలకు చెందిన షేర్లలో క్రయవిక్రయాలు జోరందుకోవడంతో సెన్సెక్స్ వరుసగా రెండోరోజు పతనాన్ని నమోదు చేసుకున్నది. కార్పొరేట్ల నిరుత్సాహక ఫలితాలు, నిధుల లభ్యతపై ఆందోళన వ్యక్తమవడం, వాహన రంగ షేర్లపై మదుపరులు ఆందోళన వ్యక్తంచేయడంతో సూచీల్లో తీవ్ర ఆటుపోటులకు గురయ్యాయి. వడ్డీరేట్ల తగ్గింపుపై అమెరికా ఫెడరల్ రిజర్వు తీసుకోనున్న నిర్ణయం, యూఎస్-చైనా వాణిజ్యంపై జరుగుతున్న చర్చలు కొలిక్కిరానుండటంతో ప్రారంభంలో భారీగా పుంజుకున్న సూచీలకు.. ఆసియా మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలతో చివరిగంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. ఫలితంగా 37,735.54 పాయింట్ల వద్ద ప్రారంభమైన సెన్సెక్స్.. ఒక దశలో 37,950.21 పాయింట్లను తాకి, చివరకు 289.13 పాయింట్ల నష్టంతో 37,397.24 వద్ద ముగిసింది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 104 పాయింట్లు పతనం చెంది ఐదు నెలల కనిష్ఠ స్థాయి 11,085లకు జారుకున్నది. మార్కెట్లో యెస్ బ్యాంక్ అత్యధికంగా 9.13 శాతం నష్టపోయింది. ఇండస్‌ఇండ్ బ్యాంక్ 6.66 శాతం, హీరో మోటోకార్ప్ 6.01 శాతం, సన్ ఫార్మా 4.79 శాతం, ఎస్బీఐ 4.70 శాతంతోపాటు టాటా స్టీల్, వేదాంతా, టాటా మోటర్స్, రిలయన్స్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఆటో, ఓఎన్‌జీసీ, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకుల షేర్లు పతనం చెందాయి. కానీ, భారతీ ఎయిర్‌టెల్ 3.19 శాతం బలపడగా, టీసీఎస్ 2.32 శాతం, హెచ్‌సీఎల్ టెక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, హెచ్‌యూఎల్, ఎల్ అండ్ టీ, పవర్‌గ్రిడ్, ఇన్ఫోసిస్, ఎన్‌టీపీసీలు లాభపడ్డాయి. రంగాలవారీగా చూస్తే మెటల్ 3.25 శాతం పతనమవగా, ఇంధనం 2.42 శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 2.14 శాతం, ఆటో 2.12 శాతం, బ్యాంకెక్స్ 1.86 శాతం పతనమయ్యాయి.



## ఆర్థిక కార్యదర్శిగా రాజీవ్ కుమార్



**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రస్తుతం ఆర్థిక సేవల కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న రాజీవ్ కుమార్‌ను నూతన ఆర్థిక కార్యదర్శిగా నియమిస్తు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన అపాయింట్‌మెంట్ కమిటీ ఆఫ్ ది క్యాబినెట్(ఏసీసీ) సమావేశమై ఈ నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.


## ఆంధ్రా సిమెంట్స్ నష్టం రూ.37 కోట్లు

**న్యూఢిల్లీ, జూలై 30:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికిగాను రూ.36.94 కోట్ల నష్టం వచ్చినట్లు ఆంధ్రా సిమెంట్స్ ప్రకటించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.31.34 కోట్ల నష్టంతో పోలిస్తే స్వల్పంగా పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 55.80 శాతం క్షీణించి రూ.41.21 కోట్లకు పడిపోయింది. నిర్వహణ ఖర్చులు రూ.124.74 కోట్ల నుంచి రూ.78.29 కోట్లకు తగ్గాయి.

## బీఎస్ఎన్ఎల్-ఎంటీఎన్ఎల్ విలీనం!

**న్యూఢిల్లీ, జూలై 30:** ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన ప్రభుత్వరంగ టెలికం సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లను విలీనం చేయడానికి కేంద్రం కసరత్తు చేస్తున్నది. ఇరు సంస్థల పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా విలీనం చేయడమే సరైనదని, తుది నిర్ణయం క్యాబినెట్ తీసుకోనున్నదని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. గడిచిన కొన్ని నెలలుగా మహానగర్ టెలిఫోన్ నిగమ్ లిమిటెడ్(ఎంటీఎన్ఎల్), భారత్ సంచార్ నిగామ్ లిమిటెడ్(బీఎస్ఎన్ఎల్) సరైన సమయంలో ఉద్యోగుల జీతాలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నది. గడిచిన ఆర్థిక సంవత్సరానికిగాను బీఎస్ఎన్ఎల్ రూ.14 వేల కోట్ల నష్టాన్ని, రూ.19,308 కోట్ల ఆదాయాన్ని గడించింది. 2015-16లో రూ.4,858 కోట్లుగా ఉన్న కంపెనీ నష్టం..ఆ తర్వాతి ఏడాది రూ.4,793 కోట్లకు పెరిగాయి.

## జర్మనీకి ఈసీఐఎల్ 'హై-పవర్ కన్వర్టర్లు'



**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** విద్యుత్ పరికరాల సంస్థ ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఈసీఐఎల్).. జర్మనీకి హై-పవర్ కన్వర్టర్లను విక్రయించనుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కింద కోలకతాకు చెందిన బోస్ ఇనిస్టిట్యూట్ సంయుక్త భాగస్వామ్యంతో వీటిని జర్మనీకి సరఫరా చేస్తున్నది. తొమ్మిది మిలియన్ల యూరోల విలువైన 533 హై-పవర్ కన్వర్టర్‌లను సరఫరా చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. వీటిలో భాగంగా మొదటి విడుతలో 67 కన్వర్టర్లను బుధవారం ఈసీఐఎల్ అధికారులు వీటిని సరఫరా చేశారు. 28 రకాలుగా తయారు చేసిన వీటిని జర్మనీలోని డర్మ్‌స్టాట్ ప్రాంతానికి సరఫరా చేయనున్నారు.

# ఆర్.వి. టూర్స్ అండ్ ట్రావెల్స్ ప్రైవేట్ లిమిటెడ్

## పవిత్ర శ్రావణ, కార్తీక మాసాలలో పుణ్య క్షేత్రాల యాత్రలు

### కాశీ యాత్ర
10 రోజులు ₹ 22,500
యాత్ర తేదీలు : 11.08.19 25.09.19 15.10.19 07.11.19 08.11.19
7032666927, 9100090862

### కార్తీక పౌర్ణమి కాశీ యాత్ర
10 రోజులు ₹ 31,500
యాత్ర తేదీలు : 08.11.19 09.11.19
7032666921, 9642481234

### చార్‌ధాం యాత్ర
15 రోజులు ₹ 28,500
యాత్ర తేదీలు : 01.09.19 09.09.19 25.09.19 10.10.19
7032666928, 9121144003

### సిమ్లా-మనాలి యాత్ర
10 రోజులు ₹ 26,900
యాత్ర తేదీలు : 29.09.19
7032666925, 9121143964

### గుజరాత్ యాత్ర
12 రోజులు ₹ 28,500
యాత్ర తేదీలు : 21.08.19 21.09.19 26.10.19 07.12.19
7032666927, 9121143961

### ✈ గుజరాత్ యాత్ర
12 రోజులు ₹ 37,500
యాత్ర తేదీలు: 07.11.19 08.11.19 09.11.19
8106201230, 7032666927

### తమిళనాడు యాత్ర
7 రోజులు ₹ 19,000
యాత్ర తేదీలు : 12.08.19 09.09.19 29.10.19 08.11.19 01.12.19
9100090940, 7032666924

### కేరళ-తమిళనాడు యాత్ర
10 రోజులు ₹ 23,500
యాత్ర తేదీలు : 29.09.19
9121143963, 7032666921

### మహారాష్ట్ర యాత్ర
8 రోజులు ₹ 23,500
యాత్ర తేదీలు : 26.08.19 08.11.19
9100090295, 9100090937

### ముక్తినాథ్ యాత్ర
11 రోజులు ₹ 39,500
యాత్ర తేదీలు : 26.08.19 25.09.19 24.10.19 28.11.19
7032666921, 9100090295

### కర్ణాటక యాత్ర
8 రోజులు ₹ 19,800
యాత్ర తేదీలు : 20.09.19 13.10.19 18.11.19 10.12.19
9121144002, 9100090819

### రాజస్థాన్ యాత్ర
11 రోజులు ₹ 32,750
యాత్ర తేదీలు : 16.08.19 25.09.19 23.10.19 20.11.19
9100090937, 9121143960

### శ్రీలంక టూర్
6 రోజులు ₹ 44,000
యాత్ర తేదీలు : 11.08.19 08.09.19 09.10.19 08.11.19 08.12.19
9642381234, 9121143961

### సింగపూర్-మలేషియా టూర్
6 రోజులు ₹ 73,000
యాత్ర తేదీలు : 11.08.19 18.09.19 18.10.19 23.11.19 17.12.19
9100090873, 9100090819

### దుబాయ్ టూర్
5 రోజులు ₹ 66,000
యాత్ర తేదీలు : 30.09.19 09.10.19 08.11.19 08.12.19 04.01.20 08.01.20 19.01.20
9642381234, 9100090873

### వియత్నాం-కాంబోడియా టూర్
6 రోజులు ₹ 73,000
యాత్ర తేదీలు : 23.09.19 24.10.19 22.11.19
9642381234, 9100090873

### సింగపూర్-మలేషియా-థాయ్‌ల్యాండ్
10 రోజులు ₹ 1,15,000
యాత్ర తేదీ : 18.10.19
9100090819, 9121143965

### బ్యాంకాక్ టూర్
5 రోజులు ₹ 26,500
యాత్ర తేదీ : 05.09.19 (Ex.Vizag)
9121143965, 9121143961

**రాబోయే నవంబర్‌లో బ్రహ్మపుత్రనది పుష్కరాల కొరకు ప్రత్యేక ప్యాకేజీలు కలవు : 7032666921**

**పర్యాటకులకు/వినియోగదారులకు R V Tours and Travels Pvt. Ltd. హృదయపూర్వక స్వాగతం**



**Hyderabad**
12-6-11/4, 3rd Floor, Bhagyanagar Complex,
Opp. BJP Office, Metro Pillar No. 15,
Kukatpally, Hyd-72.
Ph: 7032666929

**Vijayawada**
39- 14- 2, Uttam Towers, 3rd Floor,
Opp: The Gate Way Hotel,
M.G.Road, Vijayawada - 520010.
Ph: 9100090940

**Visakhapatnam**
31- 15- 186/1, 2nd Floor, Opp: Hotel KEYS,
75 Feet Rd, Daba Gardens,
Visakhapatnam - 530020.
Ph: 9121143959

Nellore 9100090295 | Proddatur 9100090935 | Nizamabad 9100090937 | Rajahmundry 9100090946 | Warangal 9100090297

E-mail: rvtoursntravels@gmail.com
www.rvtoursandtravels.net

నమస్తే తెలంగాణ
జిందగీ
బుధవారం 31 జూలై 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi

# పావురాలతో ప్రమాదమా?



గుంపులు గుంపులుగా ఎగురుతూ.. ఎక్కడైనా గింజలు కనిపిస్తే ఏరుకుని తింటూ ఆహ్లాదం కలిగించే పావురాలతో ప్రాణాంతక వ్యాధులు పొంచి ఉన్నాయా? మనుషులకే కాకుండా కొన్ని పక్షి జాతులకు కూడా వీటితో ప్రమాదమని నిపుణులు అంటున్నారు.

- పావురాలు కొలంబీ ఫార్మస్ క్రమంలో కొలంబీడే కుటుంబానికి చెందిన పక్షులు. వీటి జీవిత కాలం 10 నుంచి 12 సంవత్సరాలు. వీటి విసర్జకాలు చాలా ప్రమాదకరమైనవి. వీటికి ప్రత్యేకమైన మూత్ర కోశం ఉండదు. అందువల్ల మల మూత్రాలు కలిసి ఉంటాయి.
- పావురాలు వేసిన రెట్టలు ఎండిన తర్వాత ఇన్ఫెక్షన్ కారక సూక్ష్మక్రిములు గాలిలో కలిసిపోతాయి. మనం ఆ గాలిని పీల్చినప్పుడు చర్మ, ఊపిరితిత్తులు, ఉదరకోశ వ్యాధులు వస్తాయి. ఇష్టంతోనో, సరదాకో సమో పావురాలను దగ్గరకు తీసేవారు అనారోగ్య సమస్యలు ఎదుర్కోక తప్పదని నిపుణులు అంటున్నారు.
- పావురాల రెక్కలపై పలురకాల వైరస్‌లు, బ్యాక్టీరియా ఫంగస్ ఉంటాయి. పావురాలు రెక్కలు విదిలించినప్పుడు వైరస్‌లు, ఫంగస్, బ్యాక్టీరియా గాల్లో కలుస్తుంది. ఆ గాలి పీల్చిన వాళ్లు ఇన్ఫెక్షన్ల బారిన పడుతుంటారు.
- చాలా మంది పావురాలను పట్టుకుని నిమురుతూ ఉంటారు. అయితే వాటి రెక్కలపై సన్నని పేలు ఉంటాయి. గ్లౌజ్‌లు వేసుకోకుండా ముట్టుకున్నా.. పట్టుకున్నాక చేతులు కడుక్కోకపోయినా ఇన్ఫెక్షన్ బారిన పడే అవకాశం ఉంది.

# ఇంగ్లిష్ భాషతో భవితకు బాటలు



**ఇంగ్లిష్.. అంటే కొందరికి దడ. ఏదో చిన్నపాటి స్పెల్లింగ్ చెప్పమంటేనే హడలెత్తిపోతుంటారు. సర్కారు బడుల్లో చదివే పిల్లలైతే ఇంగ్లిష్ అంటే కిలోమీటర్ దూరంలో ఉంటారు. ఎందుకు ఈ భయం? ఇంకా ఇంగ్లిష్ దగ్గరే ఆగిపోతే ఎలా? ఇంగ్లిష్ అందరూ నేర్చుకోవాలి.. అందరూ ఎదగాలి అంటూ అవగాహన కల్పిస్తున్నాడు పెందోటి చంద్రశేఖర్. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు ఇంగ్లిష్‌పై ఇష్టాన్ని ఏర్పరుస్తున్నాడు.**

చంద్రశేఖర్ కూడా అందరిలాగే ఇంగ్లిష్‌లో ఫెయిల్ అయ్యాడు. అంతా హేళన చేశారు. ఇంగ్లిష్‌ను ఒంటబట్టించుకోవడం నీవల్ల కాదు అని అవమానించారు. తప్పుకుందామా? అడుగు ముందుకేద్దామా? అని తర్జనభర్జన పడ్డాడు. నిరాశ చెందితే ఎలా అని ఇంగ్లిష్ భాష అంతు చూడాలనుకున్నాడు. ముందుగా భాషపై ఇష్టం ఏర్పరచుకున్నాడు. ఇంగ్లిష్‌లో పద్యాలు రాస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నాడు.

### పట్టు సాధించి...


ఇంగ్లిష్ ఎందుకు రాదో చెప్పేందుకు చాలామందిది ఒకే కారణం. అదే తెలుగు మీడియం బ్యాక్‌గ్రౌండ్. ఇలా చెప్పుకుంటూ తమని తాము మోసం చేసుకుంటుండటం సాధారణంగా చూస్తుంటాం. కాని పెందోటి చంద్రశేఖర్ ఇందుకు భిన్నం. చిన్ననాటి నుంచి చంద్రశేఖర్‌కు ఇంగ్లిష్ అంటే భయం. దానికి తగ్గట్లుగానే ఇంటర్‌లో ఇంగ్లిష్ సబ్జెక్ట్ ఫెయిల్ అయ్యాడు. ఎలాగైనా ఇంటర్ పూర్తి చేయాలనే లక్ష్యంతో చదివి ఇంగ్లిష్ పాస్ అయి, ఇంటర్ గట్టెక్కాడు. ఇదే ధైర్యంతో డిగ్రీ బీఏ లిటరేచర్ (ఇంగ్లిష్) తీసుకున్నాడు. అప్పుడే చంద్రశేఖర్‌కు ఒక సంఘటన ఎదురైంది. బీఏ లిటరేచర్‌లో చేరిన తర్వాత ఒక మాస్టారు చంద్రశేఖర్‌ను చూసి ..'ఇంటర్‌లో ఇంగ్లిష్‌లో ఫెయిల్ అయ్యావు. నీకెందుకు ఇంగ్లిష్ లిటరేచర్ వేరే ఏదైనా తీసుకో పాస్ అవుతావు' అని చెప్పాడు. ఈ మాటలతో చంద్రశేఖర్ ఎంతో అవమానానికి గురయ్యాడు. అప్పుడే ఇక ఇంగ్లిష్‌పై ఎలాగైనా పట్టు సాధించాలని అనుకున్నాడు. తనను అవమానానికి గురి చేసిన ఇంగ్లిష్‌పై ఎలాగైనా విజయం సాధించాలని సంకల్పించాడు. అప్పటి నుంచి కసిగా ఇంగ్లిష్ నేర్చుకోవటం ప్రారంభించాడు.

### హార్ట్ ఆఫ్ తెలంగాణ

చంద్రశేఖర్ లక్ష్యానికి తోడుగా చక్రధర్ స్వామి సార్ స్ఫూర్తి, సహకారం అందించారు. ఇంగ్లిష్‌పై పట్టు సాధించే యత్నం చేశారు. అప్పటి వరకు భయంగా చదివిన ఇంగ్లిష్‌ను ఇష్టంతో చదవటం ప్రారంభించాడు. మొత్తానికి ఇంగ్లిష్ లిటరేచర్‌లో డిగ్రీ పూర్తి చేసి తన ఉపాధ్యాయుల నోట ప్రశంసలు పొందారు. అలా ప్రారంభించిన ఇంగ్లిష్ లర్నింగ్‌ను చంద్రశేఖర్ అక్కడితో ఆపలేదు. దూరవిద్య ద్వారా పీజీ చదువుతూ ప్రైవేటు పాఠశాలలో చిన్న తరగతి విద్యార్థులకు ఆంగ్లబోధన చేశారు. విద్యార్థులకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పేందుకు పలు ఆంగ్ల పుస్తకాలను పరిశీలించాల్సి వచ్చేది. నోట్స్ తయారు చేసుకొని విద్యార్థులకు చెప్పాల్సి వచ్చేది. పగలు, రాత్రి అదే పనిలో ఉండేవాడు. ఇలా ఒకవైపు నేర్చుకోవటం, మరోవైపు బోధించడం వల్ల చంద్రశేఖర్ ఇంగ్లిష్‌లో మెరుగయ్యాడు. అలా కొద్ది నెలల్లోనే ఆంగ్లంపై పూర్తి పట్టు సాధించాడు. 2008లో డీఎస్సీ రాసినప్పటికీ ఫలితం ఆశించినంతగా రాలేదు. తిరిగి 2012లో నిర్వహించన డీఎస్సీలో జిల్లా స్థాయిలో 12వ ర్యాంకు సాధించాడు. అయినా ఉద్యోగం రాలేదు. అనంతరం మోడల్ స్కూల్ రిక్రూట్‌మెంట్ జరగగా పీజీటీగా ఉద్యోగం సాధించాడు. అలా తన ఊరు నుంచి తొలి ప్రభుత్వ ఉద్యోగం సాధించాడు. ఇదే సమయంలో ఇంగ్లిష్‌లో పద్యాలు రాయడం అలవాటు చేసుకున్నాడు. తెలంగాణ సకల జనుల సమ్మె జరుగుతున్నపుడు 'హార్ట్ ఆఫ్ తెలంగాణ' పద్యం రాసి పలువురి ప్రశంసలు అందుకున్నాడు. ల్యాబ్ అకాడమియా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ సెంటర్ సంబంధించిన 'హోప్ రీబార్న్' అనే పుస్తకంలో ఇమ్మోర్టల్ మిసైల్ పద్యం ప్రచురితమైంది. తెలుగు అకాడమీ పుస్తకాల్లో రాస్తున్నారు. గురుకుల్ మెయిన్స్ లాంగ్వేజ్ లిటరేచర్ నలుగురు ఆథర్స్ ఉండగా అందులో తానూ ఉన్నాడు.

### వాయిసెస్ ఆఫ్ హ్యుమానిటీ

తాను ఇంగ్లిష్‌లో పద్యాలు రాసి రచయితగా ఎదగడమే కాకుండా, విద్యార్థులనూ రచయితలుగా తయారు చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు పెట్టి శిక్షణ ఇస్తున్నారు. చంద్రశేఖర్ నుంచి స్ఫూర్తి పొందిన ఆయన పనిచేసే నందిపేట్ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఆంగ్లంలో కవితలు రాయడం ప్రారంభించారు. మాద రచన క్రియేట్ ఆఫ్ ది వరల్డ్, మూడ్ లావణ్య లైఫ్ వితవుట్ ఫ్రీడమ్ అనే పద్యాలను రాశారు. ఈ పద్యాలు ప్రముఖ ఆంగ్ల ముద్రణ సంస్థ ల్యాబ్ అకాడమియా రీసెర్చ్ అండ్ పబ్లికేషన్- అలాహాబాద్ ఆధ్వర్యంలో విడుదలైన పొయెట్రీ అండ్ యూ పుస్తకంలో ప్రచురితమయ్యాయి. తెలంగాణ పొయెట్రీ ఫీస్ట్‌లో భాగంగా వాయిసెస్ ఆఫ్ హ్యుమానిటీ పేరుతో ఈనెల 26న ప్రత్యేకంగా పుస్తకం విడుదల చేయగా, అందులో చంద్రశేఖర్ రాసిన పద్యాలతో పాటు తన పాఠశాలకు చెందిన ముగ్గురు స్టూడెంట్స్ పద్యాలు ప్రచురితమయ్యాయి. వీరిలో మాద రచనతో పాటు నూనె శ్రీజ, తోకల నిఖిత ఉన్నారు. దీంతో పాటు పలు విద్యాసంస్థల కోరిక మేరకు ఏటా వందల మందికి ఆంగ్లంపై బోధిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిమోడల్ స్కూళ్లను కలుపుకొని జిల్లా స్థాయి ఆంగ్ల పద్యాల పోటీలు నిర్వహించి, సొంత డబ్బులతో బహుమతులు అందస్తున్నారు. సోషల్ మీడియా వేదికగా ఉచితంగా ఇంగ్లిష్ భాష నేర్పించేందుకు కృషి చేస్తున్నారు.




### తెలుగు మీడియం విద్యార్థి..

చంద్రశేఖర్‌ది నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం మల్లాపూర్ అనే మారుమూల గ్రామం. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, ఆగమచారి. పేద కుటుంబం కావటంతో మొదటి నుంచి పీజీ వరకు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లోనే చదువు కొనసాగింది. మూడో తరగతి వరకు మల్లాపూర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదివాడు. పది వరకు రాంపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో చదివిన అతడు భీమ్‌గల్ ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ హెచ్ఈసీ తెలుగు మీడియంలో చేరాడు. అనంతరం నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ ఇంగ్లిష్ లిటరేచర్ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీలో దూర విద్యలో ఎంఏ ఇంగ్లిష్ పూర్తి చేశాడు. బెంగళూరు యూనివర్సిటీలో బీఈడీ చదివాడు. ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్ కావటమే లక్ష్యంగా ఉన్నాడు. చిన్న వైఫల్యాలకే కుంగిపోయి జీవితాలు నాశనం చేసుకునే వారెందరికో చంద్రశేఖర్ మార్గదర్శిగా నిలుస్తున్నాడు.

... సిద్ధార్థ్ బీసగోని
సీఎం ప్రవీణ్‌కుమార్



### సార్ పట్టు: లావణ్య

మొదట్లో ఇంగ్లిష్ అంటే భయంగా ఉండేది. కాని సార్ సులువుగా ఇంగ్లిష్ నేర్చుకోవటం చెప్పారు. 8 వ తరగతి నుంచి రోజుకు 5 కొత్త ఇంగ్లిష్ పదాలు నేర్చుకోమని చెప్పారు. దాన్ని పాటించాం. అలా రెండు సంవత్సరాల్లో ఎంతో ఇంగ్లిష్ నేర్చుకున్నాం. ఇప్పుడు ఇంగ్లిష్‌లో పద్యాలు రాయగలుగుతున్నాం. ఇప్పటి వరకు 10 పద్యాలు రాశాను.



### అందరికీ స్ఫూర్తి: మాద రచన

పోటీ ప్రపంచంలో ఇంగ్లిష్ ఆవశ్యకత గురించి సార్ ఎప్పుడూ చెబుతుంటారు. ఇంగ్లిష్ నేర్చుకోవాలనే నా కోరికకు సార్ తోడుగా నిలిచారు. ఇంగ్లిష్‌లో మాట్లాడటం, రాయడం వల్ల త్వరగా ఇంగ్లిష్ నేర్చుకోగలిగాను. పద్యాలు రాయడం, అవి పుస్తకాల్లో ప్రచురితమవ్వటం చాలా సంతోషంగా ఉంది. మాలాంటి ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఇంగ్లిష్ సార్.

## మహిళల కోసం ఆవిష్కరణ

**వ్యక్తిగతంగా, ఇతర మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పట్ల వాళ్లు ఆవేదనకు గురయ్యారు. దేశంలో చాలామంది అమ్మాయిలు శుభ్రత లేని న్యాప్‌కిన్లను వాడి చనిపోతున్నారనే విషయం వీళ్లను ఆలోచింపజేసింది. అందుకే సానిటరీ న్యాప్‌కిన్ల శుభ్రం చేసే డివైజ్‌ను ఆవిష్కరించారు ఈ ఇంజినీరింగ్ విద్యార్థినులు.**




ఐశ్వర్య అగర్వాల్ ముంబై ఐఐటీలో, దేవయాని మల్దాకర్ గోవా ఐఐటీలో ఇంజినీరింగ్ చదువుతున్నారు. వీరిది మెకానికల్ బ్యాక్‌గ్రౌండ్ అయినా తమలాంటి తోటి మహిళలను వేధిస్తున్న నాప్‌కిన్ల సమస్యకు పరిష్కారం చూపాలనుకున్నారు. 2019 మే లో 'ఇన్‌వెంట్' అనే ప్రాజెక్ట్ ద్వారా పునర్వినియోగించే సానిటరీ నాప్‌కిన్ల కోసం డివైజ్‌ను తయారు చేయడం ప్రారంభించారు. వాడిన నాప్‌కిన్లను వృథా చేయకుండా వాటిని శుభ్రం చేసి అందించే యంత్రాన్ని ఆవిష్కరించారు. దీని కోసం ప్రత్యేక అధ్యయనం చేశారు. దేశంలో చాలామంది అమ్మాయిలు, మహిళలకు శుభ్రమైన నాప్‌కిన్లే తెలియవనీ, అపరిశుభ్రమైన వాటిని వాడుతున్నారని తెలుసుకున్నారు. ఇలా అపరిశుభ్ర నాప్‌కిన్లు వాడడం వల్ల వచ్చే టాక్సిక్ షాక్ సిండ్రోమ్‌కు గురై చనిపోతున్నారని తెలుసుకున్నారు. ఒకసారి వాడి పాడేసిన నాప్‌కిన్ భూమిలో కలిసిపోవడానికి 500–800 ఏండ్లు పడుతుంది. ఇలాంటి వాటికి పరిష్కారంగానే ఈ ఆలోచన వచ్చిందని ఐశ్వర్య అంటున్నది. కరంట్‌తో కాకుండా ఫూట్ పెడల్స్‌తో.. ఈ డివైజ్ పని చేస్తుంది. 'ఇందులోని వాటర్ రూంలో నాప్‌కిన్ పెడితే.. మరకలు తొలగించే దశ ప్రారంభం అవుతుంది. నీటిని మొత్తం పీల్చేసి శుభ్రపరిచి తిరిగి నాప్‌కిన్‌ను అందిస్తుంది' అని దేవయాని చెప్తున్నది. ఈ ఆవిష్కరణ కేవలం ఇంజినీరింగ్ అంశం కాదని, ఇది సమాజాన్ని ప్రభావితం చేసే అవిష్కరణ అని ఈ విద్యార్థులు అంటున్నారు.

### వంటింటి చిట్కాలు



- దోసకాయ చిన్న ముక్కను కిచెన్ మూలలో పెడితే చీమలు రాకుండా ఉంటాయి.
- పిండి వంటలు చేసేటప్పుడు కిచెన్‌లో చీమలు, ఈగలు రాకుండా ఉండాలంటే గచ్చును పసుపు నీటితో క్లీన్ చేసుకోవాలి.
- నెయ్యి స్వచ్ఛమైందా కాదా అని తెలుసుకోవాలంటే కొద్దిగా కాటన్‌ను ముంచి నిప్పు అంటించాలి. అది బాగా మండితే చిటపటమంటే ఆ నెయ్యి స్వచ్ఛమైందని అర్థం చేసుకోవాలి.
- పచ్చిమిరపకాయల తొడిమెలు పూర్తిగా తీసి స్టోర్ చేసుకుంటే ఎక్కువ రోజులు చెడిపోకుండా ఉంటాయి.
- కాకరకాయ కట్ చేసి స్టోర్ చేసుకుంటే ఎక్కువ రోజులు మాగిపోకుండా ఉంటాయి.
- ఉల్లిపాయలు తరిగేటప్పుడు కళ్లు మండకుండా ఉండాలంటే పొట్టు తీయకుండా రెండు ముక్కలుగా కట్ చేసి నీటిలో వేసి కొద్దిసేపు తరువాత కట్ చేసుకోవాలి.
- వంట గదిలో సింక్ క్లీన్ చేయాలంటే ముగ్గుపొడి, బ్లీచింగ్ పౌడర్ వాడాలి.
- చక్కెరకు చీమలు పట్టకుండా ఉండాలంటే 2 లేదా 3 లవంగాలు చక్కెర డబ్బాలో వేసుకోవాలి.

# మొబైల్ శుభ్రత అవసరం



**స్మార్ట్‌ఫోన్‌ను శుభ్రం చేసి ఎంతకాలమైంది. మీ ఫోన్‌ను ఎప్పుడు శుభ్రపరిచారో కనీసం గుర్తుందా.. తరచూ మొబైల్ ఫోన్‌ను శుభ్రపర్చుకునే అలవాటు లేకున్నా. ఇకనుంచి అలవాటు చేసుకోండి. ఫోన్ మీది బ్యాక్టీరియా చెమట, నూనెతో చర్మంతో కాంటాక్ట్ అయ్యి చర్మంపై బ్రేక్ ఔట్స్ ఏర్పడే ప్రమాదముంది. ఫోన్ వెలువరించే రంగుల వల్ల చర్మం ముడతలు పడే అవకాశం ఉంది.**

- మొబైల్ ఫోన్‌ను గంటల తరబడి చర్మానికి దగ్గరగా పెట్టుకొని మాట్లాడడం వల్ల దవడ ఎముకలు, చెవులు, చేతులపై ఉండే చర్మం ఎర్రబడి, వాచిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇంకా ఆయా ప్రదేశాల్లో దురదలు, పొక్కులు వచ్చే అవకాశం ఉంది.
- ఫోన్‌ను చెవికి అంటిపెట్టుకుని ఉండేవారికి ఫోన్ డెర్మటైటిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నికెల్ క్రోమియం వంటి లోహాల కారణంగా ఈ సమస్యలు ఏర్పడతాయి. ఈ లోహాలు దాదాపు ప్రతి మొబైల్ ఫోన్ కేసింగ్స్‌లో ఉంటాయి. హ్యాండ్స్ - ఫ్రీ పరికరాలు వాడితే మంచిది.
- ప్రస్తుతం ముడతలు ఏర్పడడానికి కారణం వయసు మాత్రమే కాదు. 20 ఏండ్ల ప్రాయంలో ఉన్నవారు కూడా క్రో ఫీట్ అనే సమస్యతో బాధపడుతున్నారు. క్రో ఫీట్ అంటే కళ్ల చివరి ప్రదేశంలో ముడతలు ఏర్పడడం. ఈ ముడతలు ఎక్కువ సేపు ఫోన్ స్క్రీన్లను క్షుణ్ణంగా చూడడం వల్ల వస్తాయి. అవసరం మేరకు ఫోన్ వాడడం మంచిది.
- ఫోన్‌లో ఒకవైపే మాట్లాడే అలవాటును మానుకోవాలి. రెండు వైపులా మాట్లాడడానికి ప్రయత్నించాలి. దాంతో చర్మంపై నల్ల మచ్చలు వచ్చే అవకాశాలు చాలా వరకు తగ్గుతాయి. ఫోన్‌ను ప్రతిరోజు యాంటీ బ్యాక్టీరియల్ వైప్‌తో శుభ్రపర్చడానికి ప్రయత్నించండి. ఇతరులకు ఫోన్ ఇచ్చినప్పుడు, ఇతరుల ఫోన్ తీసుకుని వాడినప్పుడు కచ్చితంగా శుభ్రతను పాటించాలి.
- కాల్ చేసినప్పుడు రింగ్ అయ్యే సమయంలో ఎక్కువగా రేడియేషన్ విడుదలవుతుంది. ఆ కారణంగా ముఖం చర్మంపై నల్లటి మచ్చలు ఏర్పడతాయి. అవతలి వ్యక్తి ఫోన్ లిఫ్ట్ చేసేవరకు చెవి దగ్గర పెట్టుకోకపోవడం మంచిది.

### అడుగండి చెబుతా


**మా అబ్బాయి వయసు 25 సంవత్సరాలు. మంచి కబడ్డీ ప్లేయర్ కావాలనేది అతడి ఆలోచన. అందుకోసం రోజూ ప్రాక్టీస్ చేస్తుంటాడు. అయితే తరుచూ కాలు, చేతికి దెబ్బలు తగిలించుకుంటాడు. ఇటీవల కాలికి పెద్దగాయం అయ్యింది. ఎముక విరిగిందా? విరిగిన ఎముక అతుక్కుంటుందా? తెలుపగలరు.**

**- విజయలక్ష్మి, సూర్యాపేట**



# ఎముక అతుక్కుంటుందా?

కండరాలు పట్టడం, బిగుసుకుపోవడం, బెణకడం, ఎముకలు పక్కకు పోవడం, ఎముకలు విరగడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. దీనికి వెంటనే చికిత్స తీసుకుంటే సమస్య పరిష్కారం అవుతుంది. దీనికి ఫిజియోథెరపీ చేయించుకోవాలి. గాయం తగిలిన వెంటనే వాపుగానీ, విపరీతమైన నొప్పిగానీ రాలేదు అంటున్నారు కాబట్టి అది విరిగిపోయి ఉండదు. బెణికి ఉండొచ్చు అనుకుంటున్నా. అయితే గాయం అయిన ప్రాంతంలో ఐస్ పెట్టాలి. చల్లదనం ఏర్పడటం వల్ల నొప్పి, వాపు క్రమంగా తగ్గుతాయి. దీనినే కోల్డ్ థెరపీ అంటారు. తర్వాత నెమ్మదిగా మర్దన చేయాలి. బెణికిన కీళ్లకు క్రేప్ బ్యాండేజ్ వేయడం వల్ల దానికి పటుత్వం చేకూరి ఇంకా ఎక్కువ నష్టం జరగకుండా చూస్తుంది. దీనిని క్రేప్ బ్యాండేజ్ అంటారు. కబడ్డీ, క్రికెట్, ఫుట్‌బాల్ వంటి ఆటలు ఆడేవారికి ఇలాంటి సమస్యలు వస్తుంటాయి. మోకాలులోని మెనిస్కస్, లిగమెంట్స్‌కు గాయాలు అవుతాయి. మీ అబ్బాయికి ఇలాంటి గాయమే అయి ఉండొచ్చు.



డాక్టర్ మనోజ్
కన్సల్టెంట్
ఆర్థోపెడిక్ సర్జన్
కేర్ హాస్పిటల్స్
బంజారాహిల్స్

# అమర్‌నాథ్ యాత్రలో..

**సవాళ్లను ఎదుర్కోవడానికి రక్షణ శాఖ రంగంలోని వారు ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి. ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని, సేవలందించడానికి ఎంబీబీఎస్ వృత్తిని కాదని బీఎస్ఎఫ్‌లోకి అడుగుపెట్టింది ఈ డాక్టర్ అదితి చౌదరి. అమర్‌నాథ్ యాత్రలో 12 వేల ఫీట్ల ఎత్తులో వైద్యసేవలందించేందుకు సాహసం చేసిన అసిస్టెంట్ కమాండెంట్ బీఎస్ఎఫ్ మెడికల్ ఆఫీసర్ ఈమె.**



జూలై 1న ప్రారంభమైన అమర్‌నాథ్ యాత్రలో విధులు నిర్వహించడానికి ఎవరెవరు వెళ్తారో పేర్లు ఇవ్వాలని సీనియర్ కమాండెంట్ పిలుపునిచ్చాడు. 'నేను వెళ్తాను' అదితి చౌదరి ధైర్యంగా చెప్పింది. 'ఇంతవరకూ అక్కడికి ఏ మహిళా ఆఫీసర్ వెళ్లలేదు. అక్కడ అంత క్లిష్ట పరిస్థితులుంటాయి. అలాంటి ప్రాంతానికి నువ్వు వెళ్తావా?'అని ఆశ్చర్యపోయాడా సీనియర్. 'అక్కడ చాలా ఇబ్బందులుంటాయి ఆలోచించుకో' అని సలహా ఇచ్చాడు. అప్పుడు అదితి చౌదరి ధైర్యంగా ముందుకొచ్చి చెప్పిన మాటలివి. 'నా వయస్సు 26. చాలా యాక్టివ్‌గా ఉన్నాను. మీరు భయపడాల్సిన అవసరం లేదు' అని తేల్చిచెప్పింది. దీంతో ఆ కమాండెంట్ అదితి చౌదరి పేరు ఫైనల్ చేసేశాడు. అనుకున్నట్టుగానే 15 మందితో కూడిన బృందం అమర్‌నాథ్ యాత్ర డ్యూటీకి బయల్దేరింది. జూన్ 15న ఆ బృందం కశ్మీర్ సరిహద్దుల్లోకి చేరుకుంది. అందులో అదితి మాత్రమే మహిళా ఆఫీసర్. అమర్‌నాథ్‌లో డ్యూటీ అంటే వరుసగా 45 రోజులూ చేయడానికి ఏ అధికారీ సిద్ధపడలేడు. ఈ పరిస్థితుల్లో అదితి దీన్ని సాహసంగా తీసుకుంది. అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైన తర్వాత అదితి వైద్యసేవలు ప్రారంభించింది. 12వేల అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన క్యాంపులో అదితి విధులు నిర్వహిస్తున్నది. ఇది ఆగస్టు 15 వరకూ కొనసాగుతుంది. అమర్‌నాథ్ యాత్రలో సాహసోపేత బాధ్యతలు నిర్వహించడంతోపాటు బీఎస్ఎఫ్‌లో ఎంతోమంది మహిళలకు స్ఫూర్తి నింపుదన్నది అదితి. ఆమె ఛండీగఢ్‌కు చెందిన మహిళ. పుణేలో ఎంబీబీఎస్ చేసింది. హర్యానాలో 2017 సివిల్ సర్వీస్ ఆఫీసర్‌గా చేరింది. కిందటి ఏడాది సెప్టెంబర్‌లో బీఎస్ఎఫ్‌లోకి వచ్చింది. 138 బెటాలియన్ పంజాబ్‌లోని బిఖ్విండ్‌లో ఉంది. అక్కడే మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ కమాండెంట్‌గా అడుగుపెట్టి, ధైర్య సాహసాలతో ముందుకు సాగుతున్నది.

II.
నమస్తే తెలంగాణ
# యువ
[ కరీంనగర్ ]
బుధవారం 31 జూలై 2019

### నవ్వుకొందాం

సెక్రటరీ జాబ్ కోసం ఇంటర్వ్యూలు జరుగుతున్నాయి. సెలక్ట్ అయిన ఓ యువతితో నీకు జీతం ఎంత కావాలని అడిగింది మేనేజర్ అపర్ణ. నెలకు 20 వేలు కావాలి అని చెప్పిందా యువతి. ఒకే విత్ ప్లెజర్ అని మేనేజర్ సమాధానమిచ్చింది. సారీ.. ప్లెజర్‌తో కలిపి అయితే మరో పదివేలు ఎక్స్‌ట్రా ఇవ్వాల్సి ఉంటుంది అనడిగిందా యువతి.

### ఏం డైలాగ్ గురూ..





డబ్బుకి ప్రేమ అక్కర్లేదు కానీ, ప్రేమకు మాత్రం డబ్బు కావాలి. డబ్బు లేకపోతే ప్రేమ బతకదు. రూపాయి సంపాదించడం చేతకాని వాడికి ఐలవ్ యు చెప్పే అర్హత లేదు.
(నేనింతే సినిమాలో పూరి రాసిన డైలాగ్)

### వాట్సప్ మెసేజ్

మరణం అందరికీ ఉంది. కానీ మరణించాలని ఎవరూ అనుకోరు. భోజనం అందరికీ కావాలి కానీ ఎవరూ వ్యవసాయం చేయాలనుకోరు. నీరు అందరికీ కావాలి కానీ నీటి వనరులను రక్షించడానికి ఎవరూ ప్రయత్నం చేయరు. పాలు అందరికీ కావాలి కానీ ఆవులు, గేదెల్ని పోషించాలని ఎవరూ అనుకోరు. నీడ అందరికీ కావాలి కానీ మొక్కలు నాటాలని, చెట్లను సంరక్షించాలని ఎవరూ అనుకోరు. భార్య అందరికీ కావాలి కానీ ఆడపిల్ల పుట్టాలని ఎంతమంది కోరుకుంటారు?

### మంచిమాట



ఒక దారి మూసుకుపోయినప్పుడు తప్పకుండా మరో దారి తెరిచి ఉంటుంది. దాన్ని గుర్తించగలగడమే విజయానికి మార్గం.
- అలెగ్జాండర్ గ్రాహంబెల్

---

**స్టెతస్కోప్** పట్టుకొని లబ్ డబ్ వింటారు. సమాజ నాడి పట్టుకుని రుగ్మతల్ని తుడిచేయాలని ప్రయత్నిస్తారు. కెమెరా కన్నుతో హక్కుల్ని, బాధ్యతల్ని కళ్లకు కడతారు. నూతనత్వానికి ప్రాణం పోస్తారు. నూతన నట కెరటాలను సమాజానికి పరిచయం చేస్తారు. తడి నిండిన కన్నులతో దీపశిఖ అంచున అక్షరాల్ని ఏరుకుంటూ.. కారం బువ్వ తింటూ కఠోర దీక్ష చేశారు. నాటువైద్యం కోరలు చాస్తుంటే.. వేల ప్రాణాలు బలవుతుంటే.. వాటికి జవాబు అక్షరాస్యతే అని బలంగా నమ్మారు. తండాలోని మట్టిమనుషుల మంచితనాన్ని ఒంట పట్టించుకుని.. తనను తాను తెలుసుకున్నారు. జీవితాన్ని మలుచుకున్నారు. రచయితగా, సృజనాత్మక దర్శకుడిగా, డాక్టర్‌గా ఎన్నో పార్శ్వాలను ఆవిష్కరిస్తున్నారు. అత ఓ డాక్టర్ కం డైరెక్టర్. తండా నుంచి గుండెను తడిమే దర్శకుడిగా మారిన **డాక్టర్ ఇస్లావత్ ఆనంద్‌కుమార్** పరిచయమిది.

# ఆనంద్

## ఓ మంచి వైద్యుడు.. లఘుచిత్ర దర్శకుడు



**2016లో** 'ప్రజాహక్కు' షార్ట్ ఫిలిం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. కూచిపూడి నృత్యం ద్వారా పిల్లల హక్కుల్ని, బాధ్యతల్ని తెలిపిన సినిమాగా ప్రజాహక్కు మంచి పేరు తెచ్చుకుంది. ఆ లఘుచిత్రానికి కథ, దర్శకత్వం వహించింది ఆనంద్‌కుమారే. పూర్తిగా కొత్త కథ, కొత్త నటులను ఎంపిక చేసుకున్నారు ఆనంద్. దీని ద్వారా చైల్డ్ ఆర్టిస్ట్ వందనపు అవంతికను పరిచయం చేశారు. అనంతరం అవంతికకు ప్రేమమ్, బ్రహ్మోత్సవం, రారండోయ్ వేడుక చూద్దాం సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఆనంద్ రెండో లఘుచిత్రం 'అంటరానితనం' సినిమా ద్వారా టాలెంట్‌తో కులానికి సంబంధం లేదనే విషయాన్ని చెప్పారు. ఈసినిమాకు గాను దిల్‌రాజు అవార్డు, శేఖర్ కమ్ముల అవార్డు, డైరెక్టర్ అసోసియేషన్ అవార్డు, ఇన్‌డివుడ్ ఇంటర్నేషనల్ అవార్డు లభించింది. ఇందులోనూ పూర్తిగా కొత్త నటులకు అవకాశం ఇచ్చారు ఆనంద్. ఈ లఘుచిత్రంలో నటించిన తర్వాత చైల్డ్ ఆర్టిస్ట్ హాసిని అన్వికి 'రాజా ది గ్రేట్', చల్‌మోహన్ రంగ, సాక్ష్యం సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. ఆనంద్ లఘు చిత్రాల ద్వారా, వీడియోసాంగ్స్ ద్వారా చిరుతేజ్‌సింగ్, త్రిషూల్ కళాపురం వంటి చిన్నారులకెందరికో వెండితెరమీద కనిపించే అవకాశాలు వస్తున్నాయి. చిరుతేజ్‌సింగ్ చిత్రానికి గాను ఇటీవల సైమా అవార్డు కూడా లభించింది. ప్రత్యేక ప్రశంసలు కూడా అందాయి.



బోడుప్పల్‌లోని దివ్యాంగుల ఆశ్రమంలో వైద్య శిబిరం నిర్వహిస్తూ..

### ఆసక్తి కలిగిందిలా..

బాల్యంలో ఎక్కువగా సినిమాలు చూసేవారు ఆనంద్. ఎలాగైనా సినిమా రంగంలో స్థిరపడాలని అనుకునేవారు. ఈ నేపథ్యంలో బాల్యం నుంచే అన్ని ప్రయత్నాలు చేశారు. పదోతరగతిలో ఉండగా స్కూల్ ఆన్యువల్ డే సమయంలో నాటిక ప్రదర్శించారు. ఆ తర్వాత నటన తనకు సెట్ అవ్వదని గుడ్‌బై చెప్పేశారు. సున్నిత మనస్తత్వం, ప్రతిదీ సూక్ష్మదృష్టితో ఆలోచించడంతో సృజనాత్మకత అలవడింది. అది ప్రత్యేకంగా రాతలో. స్కూల్లో ఏదైనా వ్యాసం రాయమన్నప్పుడు అందరిలా కాకుండా కొత్తగా రాసి ఇచ్చేవారు. తన ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు చిన్నగోపాల్, సుజాత సైతం ప్రోత్సహించారు. పదో తరగతి తర్వాత ఆనంద్‌కు పుస్తకపఠనం, రచనలు ఇవే లోకంగా మారాయి. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వచ్చిన ఆనంద్ అన్నపూర్ణ స్టూడియో సమీపంలో గదిలో ఉండేవారు. వైద్య విద్యనభ్యసిస్తూనే ఖాళీ సమయం దొరికినప్పుడల్లా అన్నపూర్ణ స్టూడియో, ఇతర షూటింగ్‌లకు వెళ్తుండేవారు. కథ రచన, డైరెక్షన్‌లలో అన్నీ గమనిస్తూ ఉండేవారు. అలా దర్శకత్వంపై ఆసక్తి పెరిగింది. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే కావడంతో ముందుగా లైఫ్‌లో స్థిరపడాలనుకున్నారు. వైద్య విద్యను పూర్తి చేశారు.

### డైరెక్షన్‌లో మెళకువలు నేర్చుకుని..

ఆనంద్ ఢిల్లీలోని ఏషియన్ అకాడమీ ఆఫ్ ఫిలిం టెక్నాలజీలో డైరెక్షన్ కోర్సు పూర్తి చేశారు. మెళకువలు నేర్చుకున్న అనంతరం లఘుచిత్రాలు నిర్మిస్తున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా నిర్మిస్తున్న లఘు చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రతిభ ఉన్న కళాకారులను ప్రోత్సహిస్తూ చైతన్యం కోసం లఘు చిత్రాలు నిర్మిస్తూ ఆనంద్ ముందుకెళ్తున్నారు.

### వైద్యుడిగా సమాజ సేవ

డాక్టర్ ఇస్లావత్ ఆనంద్‌కుమార్ (యండీ). వైద్య రంగంలో స్థిరపడితే బోలెడు అవకాశాలు. రెండు చేతులా సంపాదించుకోవచ్చు. కానీ ఆనంద్ సేవకు ప్రాధాన్యం ఇచ్చాడు. సర్టిఫైడ్ వైద్యుడైనప్పటికీ క్లినిక్‌లు పెట్టుకోకుండా నేరుగా ప్రజల వద్దకే వెళ్లి సేవలందిస్తున్నారు. ఇప్పటికీ పల్లెల్లో నాటువైద్యం మీద ఆధారపడే వారే ఎక్కువున్నారు. ఈ నేపథ్యంలో బంజారా మహిళ ఎన్జీవో ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తన భార్య పూర్ణిమ సైతం ఆయుర్వేద డాక్టర్ కావడంతో ఆనంద్‌ను సేవాకార్యక్రమాల్లో ప్రోత్సహిస్తున్నది. మిర్యాలగూడకు చెందిన 'బంజారా మహిళ' ఎన్జీవో ద్వారా సేవా కార్యక్రమాల్ని అందిస్తున్నారు. స్నేహితులు చైతన్య, దీప్తి, దివ్య, హనుమంత్‌నాయక్ సహకారంతో సేవాకార్యక్రమాలకు ఫండ్స్ కలెక్ట్ చేస్తున్నారు. వరంగల్, నల్గొండ, ఆదిలాబాద్ ప్రాంతాల్లో హెల్త్ క్యాంప్స్ పెడుతున్నారు. ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 200కు పైగా హెల్త్ క్యాంపులు నిర్వహించారు. కాగా ఒక్క ఢిల్లీలోనే 50 హెల్త్ క్యాంపులు పెట్టారు. చెన్నై, కేరళ ఎక్కడ వరదలు, విపత్తులు వచ్చినా ఆనంద్ బృందం అక్కడికి వెళ్లి సేవలందిస్తున్నది. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, వ్యకిగత పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు.


రెయిన్‌బో మ్యూజిక్ వీడియో బృందంతో ఆనంద్

### సేవల్ని గుర్తించిన ప్రభుత్వం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆనంద్‌కుమార్ సేవల్ని గుర్తించింది. గతేడాది ఢిల్లీలో తెలంగాణ అచీవర్స్ అవార్డును ఆనంద్‌కు అందజేసింది. ఆయన రాజకీయ ప్రముఖుల చేత ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న సమయంలో వెంకయ్యానాయుడు, తమ్మారెడ్డి భరద్వాజ, మెగాస్టార్ చిరంజీవి, పలువురు దర్శకులు, నిర్మాతలు సైతం ఆనంద్‌ను అభినందించారు. అంబేద్కర్ సేవారత్న అవార్డు కూడా అందుకున్నారు. 'ఆనంద్ ఆలోచనలు' కలం పేరుతో సమాజాన్ని మార్చే దిశగా రచనలు కూడా చేస్తున్నారు.



ఉత్తమ షార్ట్‌ఫిలిం డైరెక్టర్ అవార్డు అందుకుంటూ..

**మహనీయుల స్ఫూర్తితోనే..**

నా ప్రతి సినిమా అంబేద్కర్, పూలే స్ఫూర్తితోనే తీశాను. నేనీరోజు ఈస్థాయిలో ఉన్నానంటే కారణం నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులే. సమాజానికి నావంతుగా సేవ చేస్తూ పోతున్నా. నాలో ఉన్న కళ ద్వారా మరికొంత మంది కళాకారులను సమాజానికి పరిచయం చేస్తున్నా. మూఢనమ్మకాలు రూపుమాపే దిశగా ప్రయత్నిస్తున్నా. తండాలో పుట్టి పెరిగిన పేదల పరిస్థితి నాకు తెలుసు. వారికోసం నావంతుగా సేవ చేస్తూనే ఉంటాను. నేను తీసిన లఘు చిత్రాల ద్వారా కొంతమందికి పెద్ద సినిమాల్లో అవకాశాలు వచ్చాయంటే నాకు సంతోషంగా ఉంది.
– డాక్టర్ ఆనంద్ కుమార్, మిర్యాలగూడ

... పడమటింటి రవికుమార్
గడసంతల శ్రీనివాస్

# కొత్త పరిచయాల వేదిక కో–లివింగ్

**సిటీకి వద్దామనుకుంటున్నారా? చదువు, ఉద్యోగం పనేదైనా కొన్నాళ్లు ఉండిపోవాలనుకుంటున్నారా? 'అక్కడ ఎవరూ తెలియదు. హాస్టల్ తప్ప వేరే ఆప్షన్ లేదు. హాస్టల్ ఫుడ్ పడదు.. బ్యాచిలర్స్‌కేమో గదులు అద్దెకివ్వరు' అనే బాధ ఇప్పడనవసరం. అభిరుచులు, ఆలోచనలకు తగినట్లుగా కొత్త స్నేహితులతో కలిసి ఉండొచ్చు. అదే కో-లివింగ్ విధానం.**




'**బ్యా**చిలర్స్‌కు గదులు అద్దెకు ఇవ్వబడవు' అనే బోర్డు ఒకప్పుడు కొందరు గేటుకు వేలాడదీసేవారు. ప్రస్తుతం పరిస్థితి కొంత మారింది. కో–లివింగ్ పేరిట అభిరుచులు, అలవాట్లు కలిసిన వారంతా ఒకే దగ్గర ఉండొచ్చు. ముంబాయి, ఢిల్లీ, బెంగళూరు వంటి నగరాల్లో ఉండే కల్చర్ ఇప్పుడు హైదరాబాద్‌కు పాకింది. హైదరాబాద్‌లోని కొన్ని సంస్థలు కోలివింగ్ అపార్టుమెంటులు నిర్మించాయి. గచ్చిబౌలి, గౌలిదొడ్డి, మూసాపేట, కొండాపూర్ వంటి ఏరియాల్లో మరికొన్ని అపార్టుమెంట్లు నిర్మిస్తున్నాయి. ఇందులో సకల సౌకర్యాలు సంస్థే కల్పిస్తున్నది. స్విమ్మింగ్‌పూల్, జిమ్, స్టడీ రూమ్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నవి. ఫర్నీచర్‌తో సహా సింగిల్, డబుల్ బెడ్రూంలు అందుబాటులో ఉంటున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా రూమ్ మేట్స్‌ను వెతుక్కొని మరీ ఉండొచ్చు. లేదంటే అపార్టుమెంట్‌ల వద్దనే కొత్త స్నేహితులతో కలిసి కో–లివింగ్ ఎంజాయ్ చేయవచ్చు. ప్రస్తుతం కో–లివింగ్‌కు మంచి డిమాండ్ ఉండడంతో హైదరాబాద్‌లోని అన్ని ప్రాంతాల్లో కో–లివింగ్ అపార్టుమెంట్లు నిర్మించే యోచనలో ఉన్నాయి కొన్ని సంస్థలు.

# ఆభరణాలతో డ్రెస్!



న్యూయార్క్‌లో ఇటీవల ఓ ప్యాషన్‌షో నిర్వహించారు. ఆ దేశంలోని వివిధ నగరాల నుంచి వందమంది మోడళ్లు ఈ షోకు హాజరయ్యారు. ర్యాంప్ వాక్ చేస్తూ అలరించారు. ఇందులో ఆభరణాలతో కూడిన డ్రెస్ ధరించిన మర్చెసా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె వేసుకున్న డ్రెస్ పూర్తిగా వన్‌గ్రాం జ్యువెల్ల రీతో తయారు చేసింది. చాలా మంది యువతులకు ఆ డ్రెస్ నచ్చిందట. ఇటీవల సోషల్ మీడియాలో ఆమె బాగా పాపులర్ అయ్యింది.

# రూ.20 కోట్లు గెలుచుకున్నాడు!



**కంప్యూటర్ గేమ్ 'ఫోర్ట్‌నైట్'లో విజయం సాధించిన ఓ అమెరికా యువకుడు 3 మిలియన్ డాలర్లను (దాదాపు 20 కోట్లు) గెలుచుకున్నాడు. ఆన్‌లైన్ గేముల్లో ఓ వ్యక్తి ఇంత పెద్ద మొత్తంలో నగదు బహుమతి గెలుచుకోవడం ఇదే మొదటిసారి.**

**న్యూ**యార్క్‌లోని ఆర్థర్ ఆషే స్టేడియంలో జరిగిన పోటీల్లో సోలో ఈవెంట్‌లో విజయం సాధించిన 18 ఏండ్ల కైలీ గీర్స్‌డార్ఫ్ భారీ నగదును సొంతం చేసుకున్నాడు. 30కి పైగా దేశాలు పాల్గొన్న ఈ పోటీల్లో అమెరికా నుంచి 70 మంది, ఫ్రాన్స్ నుంచి 14 మంది, యూకే నుంచి 11 మంది పోటీపడ్డారు. వంద మంది ఆటగాళ్లను ఓ దీవిలో వదిలేస్తారు. అక్కడ వారు ఆయుధాలను వెతికి పట్టుకుంటూ, ఒక్కొక్కరినీ ఎలిమినేట్ చేసుకుంటూ ముందుకు సాగాలి. చివరికి మిగిలిన ఒక్కరే విజేత. ఇదే ఫోర్ట్‌నైట్ గేమ్ ఫైనల్. ఈ గేమ్‌కు ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఒక్కొక్కరుగానూ దీన్ని ఆడొచ్చు. నలుగురు లేదా 20 మంది బృందంలో ఒక సభ్యుడిగా ఉంటూ కూడా దీన్ని ఆడొచ్చు. అయితే ఈ గేమ్ ఓ వ్యసనంలా మారుతుందని, దీనిని నిషేధించాలని పలు సంఘాలు కోరుతున్నాయి. ఈ గేమ్‌ను ప్రోత్సహించే విధంగా పోటీలు నిర్వహించడంపై సోషల్ మీడియాలో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# మన యువకులు మంచోళ్లట..

**యువత అంటే నిత్యం పార్టీలు, పబ్‌లు, అర్ధరాత్రి తిరుగుళ్లు ఇలాగే ఉంటారని చాలామంది అభిప్రాయం. కానీ ఇటీవల యువతపై జరిపిన ఓ సర్వేలో భారతీయ యువకులు చాలా మంచి వారని తేలింది. ఇతర దేశాలతో పోలిస్తే భారతీయ యువతలో సేవాభావం ఎక్కువగా ఉంటుందని ఈ సర్వేలో పేర్కొన్నారు. ముఖ్యంగా మద్యం సేవించడానికీ ఓ కారణం ఉందని తేలింది.. యువత ఆలోచనలు, విధానాలు, అభిప్రాయాలు వీటన్నింటిపై సర్వే జరిపి ఆ విషయాలను పుస్తక రూపంలోకి తీసుకు వచ్చారు కొందరు రచయితలు.**



**ఢి**ల్లీకి చెందిన ప్రఖ్యాత రచయితలు పీటర్ రోనాల్డ్ డిసౌజా, సంజయ్ కుమార్, సందీప్‌శాస్త్రీ ఇటీవల ఓ సర్వే నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 5 వేల మంది యువతపై సుదీర్ఘంగా సర్వే చేశారు. ఇందులో 65 శాతం యువకులు మద్యం తమకు ఆమోద యోగ్యం కాదని తెలిపారు. ప్రతి పదిమందిలో ఒకరు మాత్రమే మద్యం తాగుతామని చెప్పారు. సర్వేలో భాగంగా యువత అభిప్రాయాలు, అభిరుచులు, అలవాట్లు, జీవనశైలీ, వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చదువుకున్నా.. చదువుకోకపోయినా భారతదేశ యువతలో సేవాభావం ఎక్కువగా ఉన్నట్లు సర్వేలో వెల్లడించారు. సర్వే కోసం వివిధ రంగాల్లో పనిచేస్తున్న యువతీ యువకుల్ని ఎంపిక చేసుకున్నారు. సుమారు ఆరు నెలల పాటు సాగిన ఈ సర్వేలో ఆసక్తికర విషయాల్ని రాబట్టారు. విస్తృత పరిచయాలు, స్నేహం పెంచుకునేందుకు మాత్రమే మద్యం సేవిస్తున్నట్లు 80 శాతం మంది తమ అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. వీటన్నింటినీ క్రోడీకరించి 'ఇండియన్ యూత్ ఇన్ ఏ ట్రాన్స్‌ఫార్మింగ్ వరల్డ్: అటిట్యూడ్స్ అండ్ పర్‌సెప్షన్స్' అనే పుస్తకాన్ని వెలువరించారు.

## సుడోకు

**డైలీ సుడోకు 107 సమాధానం**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 9 | 8 | 6 | 5 | 1 | 7 | 3 | 4 |
| 7 | 3 | 6 | 4 | 9 | 2 | 8 | 5 | 1 |
| 4 | 1 | 5 | 3 | 8 | 7 | 2 | 6 | 9 |
| 6 | 4 | 9 | 8 | 7 | 3 | 1 | 2 | 5 |
| 5 | 8 | 3 | 2 | 1 | 9 | 6 | 4 | 7 |
| 1 | 2 | 7 | 5 | 4 | 6 | 9 | 8 | 3 |
| 3 | 5 | 1 | 7 | 2 | 8 | 4 | 9 | 6 |
| 9 | 6 | 2 | 1 | 3 | 4 | 5 | 7 | 8 |
| 8 | 7 | 4 | 9 | 6 | 5 | 3 | 1 | 2 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

**డైలీ సుడోకు - 108**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | | 5 | | | | | | 9 |
| | 3 | | 2 | | | | | |
| | 4 | 7 | | 3 | 9 | | | 5 |
| | | 3 | | 7 | 2 | | | |
| | 1 | | | | | | 9 | |
| | | | 3 | 4 | | 5 | | |
| 1 | | | 8 | 9 | | 7 | 5 | |
| | | | | | 5 | | 2 | |
| 7 | | | | | | 9 | | 6 |

## ట్వీట్





**కాజల్ అగర్వాల్** @MsKajalAggarwal

**సూర్యుడి కాంతులు.. సముద్రుడి అలల లయలు నాకెంతో ఆనందాన్ని పంచాయి. 'పిల్లా పిక్చర్ పర్ఫెక్ట్' మేకింగ్ టైమ్‌లో నా ఆనందం వీటితోనే సాగింది!**

కాజల్‌ను ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య ▶ 28,16,101


## కామన్‌మ్యాన్ వాయిస్

సిరి సంపదలను, అందచందాలను కాదు. మనిషిని వారిలోని మంచిని గౌరవించడం నేర్చుకోవాలి!
– Ashok Priyadharshan Pasala

డబ్బుంటే కోరుకున్న సౌకర్యాలన్నీ సమకూర్చుకోవచ్చు. కానీ అభిమానం, ఆప్యాయతలు ఎన్ని డబ్బులు ధారపోసినా లభ్యం కావు. మన సంపద ఏడేడు తరాలకు అందివ్వకపోయినా సద్గుణాలు ఒక్క తరానికైనా అందిస్తే అవి ఏడేడు తరాల దాకా నిలిచి ఉంటాయి!
– Ramesh Kumar Chiliveri

నాడు ప్రశ్నించిన గొంతులే నేడు ప్రశంసిస్తున్నాయి. నాడు దండగ అన్న నోర్లే నేడు కాళేశ్వరం అద్భుత కట్టడం అని గర్జిస్తున్నాయి. తెలంగాణ తెచ్చుకున్నది ఇందుకే కదా?!
– Prashanth Kumar Kondaparthi

## వైరల్ వీడియో





**ప్రస్థానం తెలుగులో చూశారు కదా? అయితే ఇప్పుడు హిందీలో చూడండి. సంజయ్‌దత్, జాకీష్రాఫ్ నటించిన ఈ సినిమా అఫీషియల్ ట్రైలర్ యూట్యూబ్ ట్రెండింగ్‌గా మారింది.**

Prasthanam – Official Teaser | Sanjay Dutt | Jackie Shroff | Deva Katta | 20th September
Total views : 23,04,514+
Published on Jul 29, 2019

III.
నమస్తే తెలంగాణ
# సంకేత
[ కరీంనగర్ ]
బుధవారం 31 జూలై 2019
టెక్నాలెడ్జీ 2.0

యాప్

## అన్ని మెసెంజర్లూ ఒకేచోట..



వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్, స్కైప్, హైక్ వంటి యాప్‌లు ప్రత్యేకంగా చాటింగ్ కోసమే పుట్టుకొచ్చాయి. వాటిలో కొత్త కొత్త ఫీచర్లు రావడంతో దేని ప్రత్యేకత దానికే ఉంది. దీంతో అన్ని యాప్‌లను వాడడం తప్పని సరి అవుతున్నది. కొంద రైతే ఇప్పటికీ ఫేస్‌బుక్ మెసెంజర్, వాట్సాప్, స్కైప్, హైక్, ఇన్‌స్టా గ్రామ్‌ను రోజూ వాడుతుంటారు. అయితే ఇలా మల్టిపుల్ యాప్‌లను ఒకే చోట మేనేజ్ చేయడానికి meetfranz అనే యాప్ ఉంది. దీని ద్వారా చాటింగ్, షేరింగ్ ఈజీగా చేసుకో వచ్చు. మెసెంజర్ యాప్‌లు అన్నీ ఇక్కడే కనిపిస్తాయి. ఈ యాప్ ప్రస్తుతానికి 14 మెసేజింగ్ సర్వీసులను అందిస్తున్నది. వాటిలో ఫేస్‌బుక్, వాట్సాప్, హ్యాంగ్‌ఔట్, స్కైప్ లాంటి ప్రధాన సర్వీసులు ఉన్నాయి.
www.meetfranz.com.

కొత్త గ్యాడ్జెట్



## ఈ ఏసీని తగిలించుకోండి..

**బయటకెళ్లినా, ఇంట్లో ఉన్నా ఏసీని వెంటబెట్టుకొని వెళ్లొచ్చు. అదేంటి ఏసీని పట్టు కొని వెళ్లడం ఏంటీ అనుకుంటున్నారా? అలాంటి దాన్నే జపాన్ కంపెనీ తయారు చేసింది.**

వాతావరణంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నా, తక్కువగా ఉన్నా తట్టుకోవడం కష్టం. వీటి నుంచి ఉపశమనం కోసం ఏసీలు, రూమ్ హీటర్లు వాడుతాం. కానీ బయటకెళ్లే టప్పుడు పరిస్థితి ఏంటి? దీనికి పరిష్కారంగా ధరించడానికి వీలుగా ఉండే ఎయిర్ కండిషనర్ (ఏసీ)ను జపాన్ కంపెనీ ఆవిష్కరించింది. దీన్ని రియన్ పాకెట్‌గా పిలు స్తున్నారు. ఎక్కడికి వెళ్లితే అక్కడికి దీన్ని ధరించి తీసుకెళ్లొచ్చు. స్మార్ట్ ఫోన్ ద్వారా అవసరాలకు అనుగుణంగా ఈ పాకెట్ ఏసీని నియంత్రించవచ్చు. ఇందులోని లిథియం అయాన్ బ్యాటరీని 2 గంటలపాటు చార్జింగ్ పెడితే.. రోజంతా ఏసీని పొందవచ్చు. సోనీ రియాన్ పాకెట్ ధర ఎంతో తెలుసా.. రూ.8,950.

కొత్త మొబైల్

## హువావే నుంచి మరో నోవా



**చైనా మొబైల్ తయారీ కంపెనీ హువావే కొత్త ఫోన్‌ను విడుదల చేసింది. నోవా బ్రాండ్‌తో విడుదల చేస్తున్న 'ఐ' సిరీస్‌కు కొనసాగింపుగా 'నోవా 5ఐ'ని తాజాగా రిలీజ్ చేసింది.**

**నోవా 5ఐ ఫీచర్లు**

**డిస్‌ప్లే :** 6.26 అంగుళాలు, **రిజల్యూషన్:** 1080x2340, **బ్యాటరీ :** 4000 ఎంఏహెచ్, **ప్రాసెసర్ :** హిసిల్కాన్ కిరిన్ 810, **ఆపరేటింగ్ సిస్టమ్ :** ఆండ్రాయిడ్ 9.0, **ర్యామ్:** 6జీబీ, 8 జీబీ వేరియేషన్లు, **స్టోరేజీ :** 128, 256 జీబీ, **రియర్ కెమెరా :** 48ఎంపీ+8ఎంపీ+2+2 ఎంపీ, ఫ్రంట్ కెమెరా 32 ఎంపీ, **రెండు వేరియేషన్ల ధర :** రూ. 22,000, రూ. 28000

టిప్ టాప్

## బ్రౌజర్.. షార్ట్‌కట్స్..



**బ్రౌజర్‌లో కొన్ని మెళకు వలు తెలిస్తే పని సులభం అవుతుంది. వాటి కోసం ఎన్నో చిట్కాలు అందుబాటులో ఉన్నాయి. అందులో కొన్ని.**

- తరచూ ఓపెన్ చేసే వెబ్‌సైట్ ట్యాబ్‌లను బ్రౌజర్లో బుక్‌మార్క్ చేసుకుంటాం. అట్లాగే ఆ సైట్ ట్యాబ్‌లను పిన్ చేసుకోవచ్చు. ట్యాబ్ మీద రైట్ క్లిక్ చేసి పిన్ ట్యాబ్ కొట్టండి. ఎప్పుడూ ఓపెన్ అయి ఉంటుంది.
- హిస్టరీ రికార్డ్ అవకుండా బ్రౌజ్ చేయాలంటే 'ఇన్‌కోగ్నిటో' విండో వాడండి. సెట్టింగ్స్‌లోకి వెళ్లి new incognito tab పై క్లిక్ చేయండి.
- ప్రతిసారీ ఓపెన్ చేసే వెబ్‌సైట్లను హోంపేజీలో షార్ట్‌కట్‌లుగా పెట్టుకోవచ్చు. హోంపేజీలో కనిపించే 'Add shortcut' ద్వారా వీటిని సెట్ చేసుకోవచ్చు.
- ప్రతిసారి మౌస్‌ద్వారా సర్ఫింగ్ చేయలేం. ఈజీగా ఉండడానికి షార్ట్‌కట్ కీస్ ఉపయోగపడతాయి.
- కొత్త ట్యాబ్ ఓపెన్ చేయాలంటే crtl+T, ప్రస్తుత ట్యాబ్‌ను మూసివేయడా నికి crtl+W, ఒక ట్యాబ్ నుంచి మరోదానికి వెళ్లేందుకు crtl+tab, ట్యాబ్‌ను బుక్‌మార్క్ చేయడానికి crtl+D, బ్రౌజర్ మొత్తం ఫుల్ స్క్రీన్‌లోకి మారేం దుకు F11, సెర్చ్‌బార్ సెలెక్ట్ చేయడానికి F6.

కొత్త ఫీచర్

## ఆడియో మెసేజ్‌ను చెక్ చేసుకోవచ్చు




మెసేజింగ్ యాప్ వాట్సాప్.. యూజర్లను ఆకట్టుకునేందుకు ఎప్పుడూ కొత్త కొత్త ఫీచర్లను అందుబాటులోకి తెస్తూనే ఉంటుంది. ఈ నేపథ్యంలో త్వరలో మరో కొత్త ఫీచర్‌ను తీసుకురానుంది. ఇదివరకు వాట్సాప్‌లో మనం వీడియో లేదా మెసేజ్‌ను పంపేముందు ఒకసారి పరిశీలించుకునే అవకాశం ఉంది. అయితే ఆడియో సందేశాలకు మాత్రం ఈ అవకాశం లేదు. మనం రికార్డు చేసినవి పంపితే.. అవి తిరిగి మనం వినే లోపు అవతలి వ్యక్తి వినే అవకాశాలున్నాయి. ఈ ఇబ్బందిని వాట్సాప్ తొలగించాలనుకుంటున్నది. ఆడియో రికార్డింగ్ సందేశం పంపేముందు ఒకసారి దాన్ని సరిచూసుకునేవిధంగా ఫీచర్‌ను తెస్తున్నది. ప్రస్తుతం ఈ ఫీచర్ ఐఓఎస్ బీటాలో అందుబాటులో ఉండగా.. త్వరలో అందరికీ అందుబాటులోకి రానుంది.

**నెల నెలా క్రెడిట్, డెబిట్ అమౌంట్‌కు లెక్క అవసరం. ఖర్చు ఎంత? ఎక్కడ ఎక్కువ ఖర్చు అవుతుంది? దేనికి ఖర్చు పెడుతున్నాం? వీటిపై అంచనా అవసరం. ఈ విషయాలను పొందుపర్చుకోవడానికీ, లిమిట్ దాటితే గుర్తు చేయడానికి కొన్ని యాప్‌లు ఉన్నాయి. రోజు వారి ఖర్చులు, బిల్లులను మేనేజ్ చేయడానికి ఈ యాప్స్ ఉపయోగపడతాయి.**



## బడ్జెట్ కంట్రోల్‌కు
# భలే యాప్స్





**ఆదాయం** తక్కువైనప్పుడు ముందుచూపుతో ఖర్చులను తగ్గించాల్సి ఉంటుంది. దీనికి తగ్గట్టుగానే లెక్కలు రాసుకుంటాం. ఈ పద్ధతినే మొబైల్ యాప్‌లో కూడా అమలు చేసుకోవచ్చు. 'మనీ లవర్' ద్వారా ఇది సాధ్యం అవుతుంది. సేవింగ్స్ మనీ ఆర్గనైజింగ్‌కు ఈ యాప్ ప్రాముఖ్యాన్ని ఇస్తుంది. సరుకులు, పెట్రోలు, పేపరు, పాల బిల్లులు, టీవీ బిల్లులు, సినిమాలు.. వంటివాటికి అయ్యే ఖర్చులన్నీ దీంట్లో ఎంటర్ చేసుకోవచ్చు. ఎప్పటికప్పుడూ మీ బడ్జెట్‌ను స్కాన్ చేస్తూ లిమిట్‌ను బట్టి అలర్ట్ చేస్తుంది. అప్పుడు అనవసరమైన ఖర్చుల్ని తగ్గించుకునేందుకు వీలవుతుంది.

పర్సనల్ ఫైనాన్స్ యాప్‌లో మంచి రేటింగ్ కలిగిన యాప్ ఇది. మిగిలిన యాప్‌లలాగే రోజు వారీ ఖర్చులను మేనేజ్ చేయడం ఎలాగో తెలియజేస్తుంది. ఇందులో ప్రత్యేకత ఏంటంటే మనం రక రకాల పేమెంట్లు చేస్తుంటాం. ఆ సమయానికి గుర్తు లేకపోతే చేయలేం. చేతిలో డబ్బులున్నా కూడా పేమెంట్ డేట్ గుర్తుకు రాకపోవడం వల్ల సకాలంలో చెల్లింపులు జరపలేకపోతాం. అయితే ఈ యాప్‌లో ఒక్కసారి పేమెంట్ల రిమైండర్లను సేవ్ చేసుకోవచ్చు. అదే మనల్ని అలర్ట్ చేస్తుంది.

ఈ యాప్ కూడా పూర్తిగా ఉచితం. మీకు వస్తున్న ఆదాయం ఎంత? మీరు ఖర్చు చేస్తున్నది ఎంత? ఇక ఎంత మొత్తం బ్యాలెన్సింగ్‌గా ఉన్నారు? అన్న విషయాలను ఎప్పటికప్పుడూ ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అందులోనూ డైలీ, వీక్లి, మంత్లీ ఆర్థిక లావాదేవీలను తెలుసుకునే అవకాశం కూడా ఉంది. మీరు కట్టే ప్రతి బిల్లునూ మొబైల్‌లో ఫొటో తీసుకుని ఈ యాప్‌లో దాచుకోవచ్చు. అలా సేవ్ చేసుకున్న బిల్లుల్ని మళ్లీ విభాగాలుగా విభజించి ఎప్పుడు కావాలంటే అప్పుడు డిస్‌ప్లే ఇస్తుంది. ఉదాహరణకు కరెంటు, ఇంటర్నెట్ , మొబైల్ చార్జీలు వంటివన్నీ ఈజీగా మేనేజ్ చేసుకోవచ్చు. ప్రతి రిసిప్టుకు బ్యాకప్ వివరాలు ఉంటాయి. వీటన్నిటితో పాటు యూజర్లు మల్టీ అకౌంట్ల ద్వారా సేవలు పొంద వచ్చు. డాలర్లు, పౌండ్లు, దినార్లలో పర్సనల్ బడ్జెట్‌ను నిర్వహించినా.. అది రూపాయలలోకి కన్వర్ట్ చేసుకునే సదుపాయం ఉంది. ట్యాక్స్ క్యాలుకులేటర్ అదనంగా ఉంది.

అన్ని రకాల లావాదేవీలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. బ్యాంకు అకౌంట్లు, మ్యూచువల్ ఫండ్స్, ఈక్విటీ ఇన్వెస్టిమెంట్లు, ఇన్సూరెన్స్ పాలసీలు, క్రెడిట్, డెబిట్ వివరాలు, లావాదేవీలన్నీ ఈ సైట్ ద్వారా మనకు అందుతాయి. అంటే ఈ యాప్‌లో ఒక్కసారి లాగిన్ అయితే మల్టిపుల్ అకౌంట్ల వివరాలన్నీ తెలుసుకోవచ్చు. అంతేకాకుండా ట్యాక్స్ రిటర్న్స్ కూడా ఈ యాప్ నుంచే సబ్మిట్ చేసుకోవచ్చు. అయితే మిగిలిన యాప్స్ మాదిరి ఇది ఉచితం కాదు. గోల్డ్, ప్రీమియం అనే రెండు వెర్షన్లను అందిస్తున్నదీ సంస్థ. ఏడాదికి అయిదు వందల నుంచి పదిహేను వందల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది.

**జాగ్రత్తలు తప్పనిసరి**



మొబైల్‌లో లావాదేవీలంటే చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. ఇలాంటి పర్సనల్ ఫైనాన్స్ యాప్‌లను జాగ్రత్తగా వాడాలి. యాప్‌లను ఎంచుకొనేటప్పుడు క్రెడిబిలిటీ ఉన్న కంపెనీలు తయారుచేసిన యాప్‌లను మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. యూజర్లు ఇచ్చిన నెగెటివ్, పాజిటివ్ రివ్యూలు చూడండి. బ్యాంకు అకౌంట్స్ వివరాలు, మరీ ముఖ్యంగా క్రెడిట్ – డెబిట్ కార్డుల పిన్‌నంబర్లు సేవ్ చేసుకోకపోవడం మంచింది. కొన్ని యాప్‌లలో బిల్లులు సేవ్ చేసుకునే వెసులుబాటు ఉంది కాబట్టి మరీ విలువైన డాక్యుమెంట్లు పెట్టవద్దు. ఇలాంటి మనీ మేనేజింగ్ యాప్‌లు కేవలం ఇంటిఖర్చులు, నెల నెలా వచ్చే ఆదాయం, ఇతరత్రా ఖర్చుల జమాలెక్కల నిర్వహణకు మాత్రమే వాడుకోవాలి. ఇవి థర్డ్‌పార్టీ యాప్‌లు. ఒక రకంగా పద్దుల పుస్తకాలనే ఇలా.. మొబైల్లో యాప్స్ రూపంలో వాడుకుంటున్నామని అర్థం.

...వినో..

సమ్మింగ్ స్పెషల్



## యాపిల్ కెమెరా ఇంకా కొత్తగా..

**టెక్ దిగ్గజం ఆపిల్ కంపెనీ 2020 ఐఫోన్ మోడల్స్‌లో కొత్త టెక్నాలజీని ఉపయోగించనుంది. కెమెరాకు సంబంధించిన టెక్నాలజీని అప్‌డేట్ చేయనుంది.**

ఇప్పటి వరకూ ఉన్న యాపిల్ ఫోన్ల కెమరాలు వేరే. ఇప్పుడు రాబోతున్న యాపిల్ కెమెరాలు వేరు అని తెలుస్తున్నది. యాపిల్ 2019 లైనప్ ఐఫోన్లలో ToF సెన్సర్ కెమెరా సిస్టమ్ ప్రవేశపెట్టనున్నట్టు వినిపిస్తున్నది. కానీ, ఈ ఏడాదికి సెన్సర్ సిస్టమ్ ఇంకా రెడీ కాలేదని న్యూస్ పోర్టల్ జీఎస్ఎమ్ ఏరినా రిపోర్టులో తెలిపింది. క్యూపర్టినో ఆధారిత కంపెనీ కూడా 2020 ఐఫోన్ లైనప్‌లో వర్టికల్ కేవిటీ సర్ఫేస్–ఎమిటింగ్ లేజర్ (VCSEL) సిస్టమ్ టెక్నాలజీ ప్రవేశపెట్టేందుకు చేస్తున్నది. ఈ టెక్నాలజీ ద్వారా ఐఫోన్ ఫీచర్లలో ఫేస్‌ఐడీ, Animoji, పోర్ట్రెయిట్ మోడ్ సెల్ఫీలకు అద్భుతంగా పనిచేస్తుంది. 2018లో యాపిల్ విశ్లేషకుడు మింగ్–చి క్యూయో మాట్లాడుతూ.. ToF త్రీడీ రియర్ కెమెరాలను ఐఫోన్లకు ముందే 2020 ఐప్యాడ్ లతో ప్రవేశపెడతామని ప్రకటించారు. వచ్చే ఏడాదిలో ఆపిల్ కంపెనీ ప్రత్యేకమైన అప్‌గ్రేడెడ్ స్పెషిఫికేషన్లతో 4 ఐఫోన్ మోడల్స్ లాంచ్ చేయనుంది. రాబోయే కొత్త ఐఫోన్లలో OLED స్క్రీన్లు, డిస్‌ప్లే సైజులు 5.4అంగుళాలు, 6.1అంగుళాలు, 6.7 అంగుళాలతో పాటు 5G కనెక్టివిటీ ఉండనుంది. ఇక నాలుగో ఐఫోన్ ఫీచర్ iPhone–8 డిజైన్ మాదిరిగా 5G కనెక్టివిటీ లేదా OLED ప్యానెల్ ఉండనున్నట్టు కంపెనీ వర్గాలు తెలిపాయి.

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

## మేనేజ్‌లో బిజినెస్ ఎగ్జిక్యూటివ్‌లు

**హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**

- మొత్తం ఖాళీలు–10
- **విభాగాలవారీగా:** బిజినెస్ మేనేజర్–1, మేనేజర్/ఇన్నోవేషన్ మేనేజ్‌మెంట్–1, మేనేజర్, మార్కెటింగ్ అండ్ కమ్యూనికేషన్స్–1, మేనేజర్ (ఫైనాన్స్ ఐసీటీ)–1, కన్సల్టెంట్–2, కంటెంట్ డెవలపర్–1, బిజినెస్ ఎగ్జిక్యూటివ్–3
- **అర్హత:** పీజీ/పీజీడీఎం, పీహెచ్‌డీ (ఎకనామిక్స్), ఎంసీజే, ఎంబీఏ/ఎంసీఏ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 16
- **వెబ్‌సైట్:** www.manage.gov.in

## హెచ్‌సీయూలో ఫ్యాకల్టీలు

**హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం (హెచ్‌సీయూ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- హెచ్‌సీయూను పోస్టు గ్రాడ్యుయేట్‌లోని టీచింగ్ & రిసెర్చ్ రంగంలో మెళకువలను అందించడానికి ప్రాథమిక విద్యా సంస్థగా 1974 అక్టోబర్ 2న ఏర్పాటు చేశారు.
- **మొత్తం ఖాళీలు:** 121 (జనరల్–50, ఈడబ్ల్యూఎస్–2, ఓబీసీ–12, ఎస్సీ–27, ఎస్టీ–18, పీహెచ్‌సీ–12)

**ఫ్యాకల్టీ పోస్టులు–ఖాళీలు**

- ప్రొఫెసర్–36, అసోసియేట్ ప్రొఫెసర్–55, అసిస్టెంట్ ప్రొఫెసర్–30
- **సబ్జెక్టులు:** మ్యాథమెటిక్స్ &స్టాటిస్టిక్స్, కంప్యూటర్ & ఇన్ఫర్మేషన్ సైన్సెస్, ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ సైన్సెస్ & టెక్నాలజీ, ఎర్త్ ఓషియన్ & అట్మాస్ఫిరియక్ సైన్సెస్, కెమిస్ట్రీ, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ సైన్సెస్, యానిమల్ బయాలజీ, సిస్టమ్స్ & కంప్యుటేషనల్ బయాలజీ, ఇంజినీరింగ్ సైన్సెస్ & టెక్నాలజీ, మెడికల్ సైన్సెస్, హెల్త్ సైకాలజీ, ఇంగ్లిష్, ఫిలాసఫీ, తెలుగు, హిందీ, ఉర్దూ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఆంత్రోపాలజీ, ఎడ్యుకేషన్, ఫోక్ కల్చర్ స్టడీస్, ఉమెన్ స్టడీస్, డ్యాన్స్, మ్యూజిక్, మేనేజ్‌మెంట్, సోషల్ ఎక్స్‌క్లూజన్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ తదితర సబ్జెక్టులు
- **విద్యార్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (ఎంఏ/ఎమ్మెస్సీ, ఎంఈ/ఎంటెక్‌తోపాటు పీహెచ్‌డీ ఉండాలి. సీఎస్ఐఆర్/యూజీసీ నెట్, సెట్/స్లెట్ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలి. సంబంధిత రంగంలో అనుభవం ఉండాలి.
- **పేస్కేల్:** ప్రొఫెసర్‌కు రూ. 1,44, 200–2,18, 200/- అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ. 1,31,400–2,17,100/–,
- అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ. 57,700–1,82,400/–
- **ఎంపిక విధానం:** షార్ట్ లిస్టింగ్, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో
**చిరునామా:** అసిస్టెంట్ రిజిస్ట్రార్, రిక్రూట్‌మెంట్ సెల్, అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, గచ్చిబౌలి, హైదరాబాద్–500046
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 26
- **హార్డ్‌కాపీలకు చివరితేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.uohyd.ac.in

## బామర్ లారీలో

**కోల్‌కతాలోని బామర్ లారీ అండ్ కో లిమిటెడ్ ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం పోస్టులు:** 6
- డిప్యూటీ మేనేజర్ (సేల్స్–1, అడ్మినిస్ట్రేటివ్–1, అఫీషియల్ లాంగ్వేజ్ అండ్ అడ్మినిస్ట్రేషన్–1, హెచ్ఎస్ఈ అండ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్–1) అసిస్టెంట్ మేనేజర్ (హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేషన్–1, సీఎస్ఆర్–1)
- **అర్హతలు:** సంస్థ నిబంధనల ప్రకారం
- **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ :** ఆగస్టు 9
- **వెబ్‌సైట్:** www.balmerlawrie.com

## సీపెట్‌లో

**హైదరాబాద్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్టిక్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ఆరునెలల ఉచిత శిక్షణ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.**

- ఈ కోర్సును గెయిల్ (ఇండియా) లిమిటెడ్, సహకారంతో సీపెట్ (హైదరాబాద్) నిర్వహిస్తుంది.
- ప్లాస్టిక్స్ ప్రొడక్ట్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ఆపరేటర్ ప్రోగ్రామ్–40 సీట్లు
- **అర్హత:** 8వ తరగతి/ఎస్ఎస్‌సీ/ఐటీఐ/డిప్లొమా
- **వయస్సు:** 18–28 ఏండ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** అకడమిక్ మార్కులు, ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఈ–మెయిల్/ఆఫ్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఆగస్టు 20
- **ఇంటర్వ్యూ తేదీ:** ఆగస్టు 23
- **వెబ్‌సైట్:** www.cipet.gov.in

## సైంటిస్టు బీ పోస్టులు

**న్యూఢిల్లీలోని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) వివిధ కేంద్రప్రభుత్వ సంస్థల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది**

- **మొత్తం ఖాళీలు –5** (జూనియర్ సైంటిఫిక్ ఆఫీసర్–1, సైంటిస్ట్ బీ–3, అసిస్టెంట్ ఎంప్లాయ్‌మెంట్ ఆఫీసర్–1)
- **అర్హతలు:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత.
- **ఎంపిక:** రాతపరీక్ష/ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 25/– (ఎస్సీ/ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు)
- **చివరితేదీ:** ఆగస్టు 1
- **వెబ్‌సైట్:** www.upsconline.nic.in

## హెచ్‌సీఎల్‌లో

**కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్ ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**



- **మొత్తం ఖాళీలు–26** (అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ (మైనింగ్)–11, మైనింగ్ మేట్ (గ్రేడ్1)–15)
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డు నుంచి పదోతరగతి లేదా మైనింగ్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 35 ఏండ్లకు మించరాదు.
- **పేస్కేల్:** అసిస్టెంట్ ఫోర్‌మ్యాన్ పోస్టులకు రూ. 18480–45,400/–, మైనింగ్ మేట్‌కు రూ. 18,280–38,670/–
- ఎంపిక విధానం, రాత పరీక్ష, ఫీజు తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్. అర్హత గల అభ్యర్థులు నిర్ణీత నమూనాలో దరఖాస్తును నింపి, పోస్ట్ ద్వారా రిక్రూట్‌మెంట్ పర్సనల్ అధికారికి పంపాలి
- **చివరితేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా దరఖాస్తులను పంపాలి.
- **వెబ్‌సైట్:** www.hindustancopper.com

IV.
నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
బుధవారం 31 జులై 2019


'సాహో' చిత్రంలో ప్రభాస్, శ్రద్ధాకపూర్

# నిన్నలు మరిచేలా నిన్ను ప్రేమిస్తాలే..

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. సుజీత్ దర్శకుడు. యు.వి.క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయిక. ఆగస్ట్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలోని 'నిన్నలు మరిచేలా నిన్ను ప్రేమిస్తాలే..నీ కన్నులు అలిసేలా నే కనిపిస్తాలే' అంటూ సాగే ఓ ప్రేమగీతం టీజర్‌ను విడుదల చేశారు. కృష్ణకాంత్ సాహిత్యం అందించిన ఈ పాటను హరిచరణ్‌శేషాద్రి, తులసీకుమార్ ఆలపించారు. గురు రంధ్వా స్వరకర్త. యూట్యూబ్‌లో ఈ గీతానికి చక్కటి ఆదరణ లభిస్తున్నది. యూరప్‌లోని అందమైన లొకేషన్లలో ఈ పాటను తెరకెక్కించారు. దాదాపు 300కోట్ల భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. జాకీ ష్రాఫ్, నీల్‌నితిన్ ముఖేష్, అరుణ్‌విజయ్, లాల్, వెన్నెల కిషోర్, ప్రకాష్ బెల్వాది, ఎవిలిన్‌శర్మ, చుంకిపాండే, మందిరాబేడీ, మహేష్ మంజ్రేకర్, టిను ఆనంద్, శరత్‌లోహితష్వా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మది, ఆర్ట్: సాబుసిరిల్, ఎడిటర్: శ్రీకర్‌ప్రసాద్, నేపథ్య సంగీతం: జిబ్రాన్, రచన-దర్శకత్వం: సుజీత్.


'మన్మథుడు-2' చిత్రంలో రకుల్‌ప్రీత్‌సింగ్

# లెక్కలు వేసుకుంటే అద్భుతాలు జరగవు!


అర్జున్, కార్తీక్, అనఘ, బాలసుబ్రహ్మణ్యం, బోయపాటి శ్రీను, అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి, ప్రవీణ

''ఆర్‌ఎక్స్ 100' బ్లాక్‌బాస్టర్ హిట్ అవుతుందని, హీరోగా నాకు మంచి గుర్తింపును తెచ్చిపెడుతుందని ఊహించలేదు. ఈ అనూహ్య విజయం తర్వాత ఎలా ముందడుగు వేయాలో అర్థం కాలేదు. ఆ కన్‌ఫ్యూజన్‌లోనే ఈ సినిమాను అంగీకరించాను. ఎలాంటి లెక్కలు వేసుకోకుండా ఇందులో నటించాను' అని అన్నారు కార్తికేయ. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'గుణ 369'. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించారు. అనఘ కథానాయిక. ప్రవీణ కడియాల సమర్పణలో అనిల్ కడియాల, తిరుమల్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆగస్ట్ 2న విడుదలకానుంది. సోమవారం హైదరాబాద్‌లో ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ నేపథ్య గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, దర్శకుడు బోయపాటి శ్రీను ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బోయపాటి శ్రీను మాట్లాడుతూ 'నా శిష్యుడు అర్జున్ ఈ సినిమాతో దర్శకుడవ్వడం ఆనందంగా, గర్వంగా ఉంది. ఎంతో అనుభవమున్న దర్శకుడిగా ఈ చిత్రాన్ని రూపొందించాడు. ఉన్నత ప్రమాణాలతో నిర్మాతలు ఈ చిత్రాన్ని రూపొందించారు. కార్తికేయ పరిణితితో కూడిన నటన కనబరిచాడు' అని చెప్పారు. తన చేతుల మీదుగానే ఈసినిమా ప్రారంభమైందని, పెద్ద విజయాన్ని సాధించి అందరికి మంచి పేరు తెచ్చిపెట్టాలని బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అర్జున్ జంధ్యాల మాట్లాడుతూ 'నిత్యజీవితంలో మనకు ఎదురయ్యే భావోద్వేగాలు, బాధల్ని తెరపై చూపించే సినిమా ఇది. ప్రతి ఒక్కరూ ఈ కథతో సహానుభూతి చెందుతారు' అని తెలిపారు. నిర్మాతలు మాట్లాడుతూ 'కామన్‌మెన్ బయోపిక్‌లా ఉంటుంది. చక్కటి కథ, కథనాలతో ఆహ్లాదాన్ని పంచుతుంది' అని చెప్పారు. కార్తికేయ మాట్లాడుతూ 'అద్భుతాలు లెక్కలు వేసుకుంటే జరగవు.. కాకతాళీయంగా జరిగిపోతాయంతే. నన్ను అభిమానించే వారంతా గర్వపడేలా ఈ సినిమా ఉంటుంది. నేనంటే నచ్చని వారిని మెప్పిస్తుంది. ఈ చిత్రంతో మళ్లీ నటుడిగా కొత్తగా ప్రయాణాన్ని మొదలుపెట్టిన అనుభూతి కలిగింది' అని అన్నారు.'ఆర్‌ఎక్స్100' కంటే ఈ చిత్రం పెద్ద విజయాన్ని సాధించాలని దర్శకుడు అనిల్ రావిపూడి ఆకాంక్షించారు. ఈ సినిమాలో గీత అనే మధ్యతరగతి యువతి పాత్రలో నటించానని, కథాబలమున్న మంచి సినిమా ద్వారా తెలుగు చిత్రసీమకు పరిచయం కానుండటం ఆనందంగా ఉందని అనఘ చెప్పింది. ఈ కార్యక్రమంలో చైతన్ భరద్వాజ్, విష్ణు ఇందూరి, జెమిని కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


యష్

# యష్‌తో 'జనగణమన'

'ఇస్మార్ట్‌శంకర్' చిత్రంతో తిరిగి విజయాల బాట పట్టారు పూరి జగన్నాథ్. తాజాగా కన్నడ హీరో యష్‌తో పూరి జగన్నాథ్ ఓ సినిమా చేయబోతున్నట్లు తెలిసింది. 'కేజీఎఫ్'తో జాతీయ స్థాయిలో గుర్తింపును సొంతం చేసుకున్నారు యష్ అతడితో 'జనగణమన' పేరుతో ఓ పాన్ ఇండియన్ సినిమాను పూరి జగన్నాథ్ తెరకెక్కించబోతున్నట్లు తెలిసింది. తొలుత ఇదే టైటిల్‌తో మహేష్ బాబు హీరోగా ఓ సినిమా చేయబోతున్నట్లు పూరి జగన్నాథ్ ప్రకటించారు. అనివార్య కారణాల వల్ల ఈ సినిమా కార్యరూపం దాల్చలేదు. సమకాలీన పరిస్థితులకు తగినట్లుగా స్క్రిప్ట్‌లో మార్పులు చేసిన పూరి జగన్నాథ్ ఇటీవలే కథను యష్‌కు వినిపించినట్లు తెలిసింది. ఇటీవలకాలంలో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న హత్యాచార ఘటనలు, నేరాల నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కనున్నట్లు తెలిసింది. తెలుగు, కన్నడ భాషల్లో ఓ ప్రముఖ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు సమాచారం.


పూరి జగన్నాథ్

# తూనీగ దైవరహస్యం


ప్రేమ్ సుప్రీం, తనికెళ్ల భరణి, రిషి

ప్రేమ్ సుప్రీం దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'తూనీగ' (ఒక దైవరహస్యం). వినీత్, దేవయానీ శర్మ జంటగా నటించారు. ఈ చిత్ర పోస్టర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో సీనియర్ నటుడు, రచయిత తనికెళ్ల భరణి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 'దేవ రహస్యాన్ని తెలుసుకునే క్రమంలో ఉత్కంఠను పంచే కథ ఇది. భారతీయ సంస్కృతిలోని అనేక అంశాలను తీసుకొని ఓ తాత్విక భూమికతో పురాణేతిహాస ప్రధానంగా ఈ సినిమాను తీశారు. విజువల్ ఎఫెక్ట్స్ బాగున్నాయి. కొత్త ఆలోచనలకు చిరునామాగా నిలిచే చిత్రమవుతుంది. పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'గతంలో అనేక లఘు చిత్రాలు తీశాను. క్రౌడ్‌ఫండింగ్ ద్వారా ఈ చిత్రాన్ని నిర్మించాం. ఆసక్తికరమైన కథ, కథనాలతో ప్రయోగాత్మకంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరు, శ్రీకాకుళంలో చిత్రీకరణ జరిపాం. ఆగస్ట్ మొదటివారంలో ఆడియో విడుదల చేస్తాం' అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రిషి, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని, సాహిత్యం: బాలాజీ, విశ్వప్రగడ, కిట్టు.


హేమ

# వాళ్ల ముందు నేను జీరో!

'బిగ్‌బాస్ ఇంటిలో ఉన్న వారం రోజుల్లో నేను ఏ తప్పు చేయలేదు. పూర్తి గేమ్ ఆడి ఉంటే తప్పులు చేసేదాన్ని కావొచ్చు. కానీ ముందే బయటకు వచ్చేశాను' అని చెప్పింది నటి హేమ. నాగార్జున ప్రయోక్తగా వ్యవహరిస్తున్న బిగ్‌బాస్-3లో ఓ కంటెస్టెంట్‌గా పాల్గొన్న హేమ తొలివారంలోనే ఎలిమినేట్ అయ్యారు. బిగ్‌బాస్‌లో తనకు ఎదురైన అనుభవాల్ని మంగళవారం హైదరాబాద్‌లో పాత్రికేయులతో పంచుకున్నారు హేమ. ఆమె మాట్లాడుతూ 'బిగ్‌బాస్‌లో ఉన్న వారం రోజుల్లోనే చాలా నేర్చుకున్నాను. ఎలా నటించాలో తెలుసుకున్నాను. అక్కడ నటించేవాళ్ల ముందు నా ముప్పై ఏళ్ల నట జీవితం వృథా అనిపించింది. వాళ్ల ముందు నేను జీరో. ఈ షోలో నేను నటించలేదు. నాకు నేనులానే ఉన్నాను. ఇతర కంటెస్టెంట్స్ మాదిరిగా నటిస్తే ఇంకొన్నాళ్లు ఇంటిలో ఉండేదాన్ని. మిగతా కంటెస్టెంట్స్ నన్ను సరిగా అర్థం చేసుకోలేదు. అక్కా అని పిలుస్తూనే నన్ను టార్గెట్ చేశారు. బిగ్‌బాస్ వల్ల నా ఇమేజ్‌కు ఎలాంటి నష్టం జరగలేదు. ఓటింగ్ విధానం నా ఎలిమినేషన్‌కు కారణమైంది. నన్ను అభిమానించే గ్రామీణ ప్రాంతాల వారికి హాట్‌స్టార్ యాప్‌లో ఓటింగ్ చేయడం అర్థం కాలేదు. ఇంటి సభ్యుల్లో వితికా, శ్రీముఖి నన్ను చెడుగా చిత్రీకరించాలని ప్రయత్నించారు. ద్వంద్వ వైఖరితో వ్యవహరించారు' అని తెలిపింది. అలాగే 'నేను సినిమాలు మానేస్తానని వస్తున్న వార్తల్లో నిజం లేదు. నా కుమార్తె ప్రస్తుతం బీబీఏ చదువుతున్నది. ఆమె చదువు పూర్తయ్యాక తనకు ఇంటి బాధ్యతల్ని అప్పగించి రాజకీయాల్లోకి వెళతాను' అని తెలిపింది.

# మురళీధరన్ '800'


విజయ్ సేతుపతి

శ్రీలంక క్రికెటర్ ముత్తయ్య మురళీధరన్ జీవిత కథ ఆధారంగా ఓ బయోపిక్ త్వరలో తెరపైకి రాబోతుంది. శ్రీపతి రంగస్వామి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. డీఏఆర్ మోషన్ పిక్చర్స్ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మించడానికి సన్నాహాలు చేస్తోంది. కాగా ఈ చిత్రానికి రానా కూడా ఓ భాగస్వామిగా వ్యవహరించనున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో 800 వికెట్లు తీసి తన స్పిన్ మాయాజాలంతో శ్రీలంక జట్టుకు చిరస్మరణీయమైన విజయాల్ని అందించిన ఆటగాడిగా ముత్తయ్య మురళీధరన్ రికార్డు నెలకొల్పారు. ఆయన పాత్రలో తమిళ నటుడు విజయ్ సేతుపతి నటించనున్నారు. 'మురళీధరన్, చిత్ర నిర్మాతలు ఈ కథకు నేను అయితేనే కరెక్ట్ అని నమ్మినందుకు వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను' అని విజయ్ సేతుపతి తెలిపారు. 'లెజెండ్ కథని లెజెండరీ నటుడు విజయ్ సేతుపతితో చెబుతుండటం దానికి సురేష్ ప్రొడక్షన్స్, నేను డీఏఆర్ ఫిల్మ్స్‌తో అసోసియేట్ కావడం గర్వంగా వుంది' అని రానా ట్విట్టర్ ద్వారా వెల్లడించారు. కాగా ఈ చిత్రానికి '800' అనే పేరును ఖరారు చేసినట్లు తెలిసింది. ఈ ఏడాది చివరలో సెట్స్‌పైకి రానున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది చివరలో తెలుగు, తమిళ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేయాలని చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నాయి.


రష్మిక మందన్న

# 'కత్తి' రీమేక్‌లో..


అక్షయ్‌కుమార్

బాస్, హాలీడే, గబ్బర్‌ఈజ్‌బ్యాక్‌తో పాటు పలు దక్షిణాది సినిమాల్ని హిందీలో రీమేక్ చేసి విజయాల్ని అందుకున్నారు బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్. తాజాగా ఆయన మరో రీమేక్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. విజయ్ కథానాయకుడిగా మురుగదాస్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'కత్తి'. కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా పోరాడే ఓ రౌడీ కథతో రూపొందిన ఈ చిత్రం కమర్షియల్‌గా పెద్ద విజయాన్ని సాధించింది. అక్షయ్‌కుమార్ హీరోగా ఈ చిత్రం బాలీవుడ్‌లో రీమేక్ కాబోతున్నది. అక్షయ్‌తో 'మిషన్ మంగళ్' సినిమాను రూపొందిస్తున్న దర్శకుడు జగన్ శక్తి ఈ రీమేక్‌ను తెరకెక్కించే బాధ్యతల్ని చేపట్టారు. ఈ రీమేక్‌కు 'ఇక్కా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఇందులో అక్షయ్‌కుమార్ ద్విపాత్రాభినయం చేయబోతున్నారు.

# ఫోన్ చేసి మాట్లాడుకుందాం!

చూడటానికి అమాయకంగా కనిపిస్తుంది కానీ..కన్నడ కస్తూరి రష్మికమందన్నతో ఒక్కసారి మాట కలిపితే చాలు ఈ అమ్మడు ఎంత తుంటరి అమ్మాయో అర్థమవుతుంది. ప్రతి మాటలో కాస్త వ్యంగ్యం, కావాల్సినంత లౌక్యం కలబోసి మాట్లాడటం ఈ కూర్గ్ బ్యూటీ స్టైల్. తాజాగా తన ట్విట్టర్ ఖాతాలో అమ్మ సుమన్ మందన్నతో రష్మిక జరిపిన సరదా సంభాషణ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటున్నది. ఇటీవల విడుదలైన 'డియర్ కామ్రేడ్' చిత్రంలో రష్మిక మందన్న లిల్లీ అనే మహిళా క్రికెటర్ పాత్రను పోషించిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో తన కూతురి అభినయానికి ఫిదా అయిన సుమన్ మందన్న ట్విట్టర్ వేదికగా ప్రశంసలు కురిపించింది. 'ఎంచుకున్న రంగంలో నువ్వు వెలిగిపోతున్నావ్ బేబీ. నీ తల్లిదండ్రులు గర్వించేలా చేస్తున్నావు. భవిష్యత్తులో నీకు అంతా శుభం కలగాలి' అంటూ ట్వీట్ చేసింది సుమన్ మందన్న. ఈ ట్వీట్‌కు కృతజ్ఞత తెలిపిన రష్మిక మరోసారి సినిమా చూసి కొత్త వెర్షన్ ఎలా ఉందో చెప్పాలని కోరింది. అయితే ఇందుకు ప్రతిగా 'నువ్వు ఇంకా బాగా కష్టపడాలి. ఇంటికి చిరునవ్వుల్ని తీసుకురావాలి' అంటూ సుమన్ మందన్న ట్వీట్ చేసింది. అమ్మ చేసిన ఈ ట్వీట్‌పై సరదాగా స్పందించింది రష్మిక మందన్న. 'అమ్మ.. మనిద్దరికి ఫోన్ వుందికదా..నువ్వు ఎప్పుడైనా నాతో మాట్లాడే వీలుంది. మరెందుకు ట్విట్టర్‌లో ఈ చర్చ. అందరూ మన మాటల్ని చూస్తున్నారు' అంటూ చమత్కరించింది. వీరిద్దరి సంభాషణ నెటిజన్లను ఆకట్టుకుంటున్నది. తల్లీకూతుళ్లలా కాకుండా ఇద్దరూ చక్కటి స్నేహితుల మాదిరిగా ఉన్నారంటూ పొగడ్తలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో నితిన్, అల్లు అర్జున్, మహేష్‌బాబు సరసన నటిస్తూ బిజీగా ఉంది.